21

# శృంగార సంకీర్తనలు



తాళ్ళపాక పదసాహిత్యం - సంపుటం - 21

# శృంగార సంకీర్తనలు

(తాళ్ళపాక అన్నమాచార్య విరచితములు)

పరిష్కర్త

కీ॥ శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

1998

T.T.D. Religious Series - 553

ప్రథమ ముద్రణ : 1979
ద్వితీయ ముద్రణ : 1998

© తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

PLACED ON THE SHELF
Date........

ప్రతులు : 2,000

వెల : రు. 27-00

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE
Acc. No. 42891
Date........
TIRUPATI.

ప్రచురణ :
శ్రీ M.K.R. వినాయక్, I.A.S.
కార్యనిర్వాహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

ముద్రణ :
త్రివేణి ఆఫ్‌సెట్ ప్రింటర్స్
14/264, ఈడేపల్లి
మచిలీపట్నం - 1
ఆంధ్రప్రదేశ్

# విన్నపము

*ఇందరికి అభయంబు లిచ్చు చేయి*
*కందువగు మంచిబంగారు చేయి ॥*

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని వైభవాన్ని, మాహాత్మ్యాన్ని, తత్త్వాన్ని 32,000 అధ్యాత్మ, శృంగార సంకీర్తనలుగా రచించినవాడు తాళ్లపాక అన్నమాచార్యులు. ఇందులో మనకు సుమారు 13,000 సంకీర్తనలు మాత్రమే లభించాయి. వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు పదకవులే ! తాళ్లపాక కవులు క్రీ॥శ॥ 15-16 శతాబ్దాలకు చెందినవారు. వీరి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాకగ్రామం.

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో వైష్ణవమత ప్రచారం కోసం తిరుమలను కేంద్రంగా చేసుకొని శ్రీ వేంకటేశ్వరాంకితంగా వేలకొలది సంకీర్తనలను, ఇతర సాహిత్య ప్రక్రియలను రచించినవారు తాళ్లపాకకవులు. శ్రీ వేంకటేశ్వరస్వామివారి సేవలో తరించిన ధన్యమూర్తులు.

తాళ్లపాక పదకవిత్రయంగా కీర్తిగడించిన తాళ్లపాక అన్నమాచార్యుల, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్యల సంకీర్తనల రాగిరేకులు తిరుమలలో శ్రీవారి ఆలయంలో 'తాళ్లపాక అర'లో లభించాయి.

తాళ్లపాక కవుల సంకీర్తనల భాండాగారం గూర్చిన మొదటి శాసనం క్రీ॥శ॥ 1530 సంవత్సరంలో కనిపిస్తుంది. తదుపరి క్రీ॥శ॥ 1545, 1547, 1554, 1558 సంవత్సరాల నాటి శాసనాల్లోను సంకీర్తనభాండాగారం గూర్చిన ప్రస్తావన కనిపిస్తుంది. ఇవి తిరుమల తిరుపతి దేవస్థానాల శాసనాలు.

తిరుమల తిరుపతి దేవస్థానములవారు క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి తాళ్లపాక కవుల సంకీర్తనల ముద్రణకు పూనుకొన్నారు. క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి క్రీ॥శ॥ 1992 సంవత్సరం వరకు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాల ముద్రణలో వివిధ దశలు కనిపిస్తాయి.

1922 సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానాలవారు రాగిరేకుల్లోని తాళ్లపాక కవుల సంకీర్తనలను వ్రాతప్రతుల్లో వ్రాయించటానికి పూనుకొన్నారు.

1935-38 సంవత్సరాల్లో తాళ్లపాక లఘుకృతులు, తాళ్లపాక కవుల సంకీర్తనలు సంపుటాలుకొన్ని వెలువడ్డాయి.

1947-65 సంవత్సరాల్లో తాళ్లపాక కవుల అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు కొన్ని సంపుటాలు ముద్రించబడ్డాయి.

1947-1965 సంవత్సరాల మధ్యకాలంలో నిరాఘాటంగా కొనసాగిన తాళ్లపాక పదకవుల సంకీర్తనల ముద్రణ తరువాత ఒక దశాబ్దంపాటు కొనసాగలేదు.

1975-1986 సంవత్సరాల మధ్యకాలంలో తాళ్లపాక పదకవుల సంకీర్తనలు కొన్ని సంపుటాలు వరకు, మరియు అధ్యాత్మ సంకీర్తనలు కొన్ని సంపుటాలు పునర్ముద్రింపబడ్డాయి.

తదుపరి 1992 సంవత్సరంలో ఒక సంపుటం ముద్రింపబడినది.

ఇంతేకాక తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర, తాళ్లపాక కవుల ఇతర సాహిత్య ప్రక్రియలను ఈ దశల్లోనే తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించింది.

ఈ వివిధ దశల్లో తాళ్లపాక పదకవుల సంకీర్తనలను రాగిరేకులనుండి పరిష్కరించిన మహాపండితులు కీ॥శే॥ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, పండిత విజయరాఘవాచార్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పి.టి. జగన్నాథరావు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శ్రీయుతులు ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారలు.

తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించినప్పటినుండి తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనలకు దేశవ్యాప్తంగా విశేషవ్యాప్తి ఏర్పడింది. తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు సాహితీవేత్తలకు, సంగీత విద్వాంసులకు వరకవిత్వ వాణీవీణా నినాదాలైనాయి. ఈ సంకీర్తనలు భక్తులకు మోక్ష మార్గాన్ని తెలిపే విశిష్టరచనలు. పరిశోధకులకు, సాహిత్యచరిత్రకారులకు కొంగుబంగారమై విలసిల్లుతున్నాయి. తాళ్లపాక కవుల సంకీర్తనలకు సంగీత, సాహిత్య, భక్తలోకంలో నేడువున్న ఆదరణ ఎనలేనిది.

ఈ ఆవశ్యకతను గుర్తించి వివిధ దశల్లో పరిష్కరింపబడి, ముద్రించబడిన తాళ్లపాకకవుల సంకీర్తనలను ఒక్కసారిగా సమగ్రరీతిలో ముద్రించడానికి తిరుమల తిరుపతి దేవస్థానాల యాజమాన్యం సంకల్పించింది.

ప్రథమతః తాళ్లపాక కవుల సంకీర్తనలను సమగ్రంగా 29 సంపుటాలుగా లోకానికి అందిస్తున్నాం.

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళిక రూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త) విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందం గారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె. సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యూమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) డా॥ ఆచార్య ఎం. శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరెక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M.A.,Ph.D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు అర్పిస్తున్నాము.

దీని తర్వాత తాళ్లపాక కవుల లఘుకృతులు, ఇతర కావ్యాలు వెలువరించడానికి ప్రణాళిక సిద్ధంచేస్తున్నాం.

ప్రస్తుతం వెలువడుచున్న తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపా కటాక్షంచే భక్తజనామోదం పొందగలవని విశ్వసిస్తున్నాం.

**M.K.R. వినాయక్**

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు

# నివేదిక

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో భక్తి ప్రపత్తి, దేహాత్మైక విచారాదులను తెలిపే ఆధ్యాత్మసంకీర్తనలు; జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్నిచాటే అమలిన దివ్య శృంగార సంకీర్తనలు రచించినవారు తాళ్లపాక కవులు. సకల దేవతా స్వరూపమైన శ్రీ వేంకటేశ్వరస్వామి తత్త్వాన్ని ఎన్నోవేల సంకీర్తనలద్వారా లోకవిదితంచేసి ఆత్మకల్యాణంతోపాటు లోక కల్యాణం సాధించిన వారు తాళ్లపాక అన్నమాచార్యులు, వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు. శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వంగా భావించి ఉభయ విభూతినాయకుడైన ఆ స్వామి కల్యాణగుణాలను ఎన్నోవేల సంకీర్తనల్లో కీర్తించారు. శరణాగతి తత్త్వాన్ని ప్రబోధించారు.

క్రీ॥ శ॥ 15వ శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి నందకాంశ సంభూతుడుగా తాళ్లపాక అన్నమాచార్యులు జన్మించాడు. తన పదహారవయేట శ్రీ వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొంది స్వామి ఆదేశంతో సంకీర్తనరచనకు శ్రీకారం చుట్టి ఆనాటినుండి జీవితాంతంవరకు దినమునకు ఒక్క సంకీర్తనకు తక్కువ కాకుండా సంకీర్తన రచన సాగించాడు. పల్లవి, చరణాలతో కూడిన సంకీర్తన రచనకితడు మార్గదర్శకుడై 'పదకవితాపితామహుడ'ని కీర్తి గడించాడు. అన్నమయ్య పదాలలో సంగీతం, సాహిత్యం, భగవద్భక్తి త్రివేణీ సంగమంలా మేళవించాయి.

శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వమూర్తిగానే కాకుండా వివిధ ఆగమ సంప్రదాయాల్లో వినుతుడైన వైభవమూర్తిగా కూడా అన్నమయ్య కీర్తించాడు. ఆంధ్రవాగ్గేయకారుల్లో అనేక వైష్ణవ క్షేత్రాలను సందర్శించి ఆయాక్షేత్ర మూర్తులపై వివిధ సంకీర్తనలను రచించిన ఘనత తాళ్లపాక అన్నమాచార్యులదే!

అన్నమయ్య భగవత్తత్త్వాన్ని అనేక జానపద గేయరీతుల్లో రచించి సామాన్యులకు అందించే ప్రయత్నంచేశాడు. అన్నమయ్య గ్రాంథిక, శిష్టవ్యావహారిక, వ్యావహారిక భాషాశైలులలో సంస్కృతాంధ్ర సంకీర్తనల్ని రచించాడు. జానపదుల జీవద్భాషను సర్వతంత్ర స్వతంత్రంగా వాడి సంకీర్తనల రచనాశైలిలో తర్వాతి వాగ్గేయకారులకి మార్గదర్శకుడైనాడు.

అన్నమయ్య పదాలు శ్రీ వేంకటేశ్వరముద్రాంకితాలు. వీరి బాటను అనుసరించిన వారు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, తాళ్లపాక చినతిరుమలాచార్యులు.

ఇహపర శ్రేయోదాయకమైన తాళ్లపాక అన్నమాచార్యులు, ఇతర తాళ్లపాకకవుల సంకీర్తనలను భక్తజనానికి అందించాలని తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో సంకల్పించి అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించింది. అప్పటినుండి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే గానంచేయబడిన తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు ఆంధ్ర ప్రదేశ్‌లోనే కాక, ఆంధ్రేతర రాష్ట్రాలలో కూడా బహుళ ప్రచారం, ప్రాచుర్యం పొందాయి.

అన్నమాచార్య ప్రాజెక్ట్ తాళ్లపాక అన్నమాచార్య, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనల ప్రచారం-పరిశోధన -రికార్డింగ్ శాఖల సమన్వయంతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే వేలకొలదిగా సంగీత సభలు, పరిశోధకులచే సాహితీసమావేశాలు నిర్వహించింది. మరియు తాళ్లపాక కవుల సంకీర్తనలను ఆడియో క్యాసెట్లుగా విడుదలచేసి బహుజనామోదం పొందింది.

**తిరుమల తిరుపతి దేవస్థానంచే 1949 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం అన్నమాచార్య వర్ధంతి ఉత్సవాలు, 1978 సంవత్సరం నుండి అన్నమాచార్య జయంతి ఉత్సవాలు జయప్రదంగా నేటికీ నిర్వహింప బడుచున్నవి. మరియు అన్నమాచార్య సంకీర్తనోత్సవాలు కుగ్రామ స్థాయినుండి మహానగరాలస్థాయివరకు జరుగుచున్నాయి. అన్నమాచార్య ప్రాజెక్ట్ వివిధ విశ్వవిద్యాలయాల**

సమన్వయంతో తాళ్లపాక కవుల సాహితీ సదస్సులు నిర్వహిస్తున్నది. తిరుమల తిరుపతి దేవస్థానం 1978సం॥ నుండి తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సాహిత్యంపై వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేసేవారికి ఉపకారవేతనం ఇచ్చి ప్రోత్సహిస్తున్నది. ఈ ప్రణాళిక క్రింద ఇప్పటివరకు దాదాపు 50 సిద్ధాంతవ్యాసాలు సమర్పించబడ్డాయి.

తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలపట్ల నానాటికీ పెరుగుచున్న ప్రజాదరణ, మరియు 1935వ సంవత్సరం నుండి వివిధ దశల్లో ముద్రింపబడిన తాళ్లపాక అన్నమయ్య, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్య సంకీర్తనల సంపుటాలు ఏనాడో చెల్లిపోయిన కారణంగా నేడు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు సమగ్రంగా పునర్ముద్రించవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

పూర్వముద్రణ సంపుటాల్లోని పూర్వపరిష్కర్తల పీఠికలు యథాతథంగా ముద్రింపబడుచున్నాయి. పరిష్కర్తచే పీఠికలో సూచింపబడిన సంపుటాల సంఖ్యలు పూర్వముద్రణకు సంబంధించినవి. తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రితమవుతున్నందువల్ల ముద్రణ, పాఠకుల సౌకర్యార్థం క్రమపద్ధతిలో వుండాలనే వుద్దేశ్యంతో పూర్వముద్రణ సంపుటాల సంఖ్యలు మార్చబడినవి. సంపుటాల సంఖ్యల మార్పులు ప్రత్యేకంగా పట్టికలో చూపబడింది.

తిరుమల తిరుపతి దేవస్థానానికి రాగిరేకుల్లో లభించిన తాళ్లపాక కవుల సంకీర్తనలు మొత్తం నేడు ముద్రించబడుచున్నందువల్ల సమగ్రమనే పదం సూచికంగా వాడబడింది.

భక్తిభావ విలసితాలైన తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలను సమగ్రంగా ముద్రించుటకు ఆమోదించిన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తృత్వమండలి అధ్యక్షులు శ్రీకలిదిండి రామచంద్రరాజుగారికి, మరియు ధర్మకర్తృత్వమండలి సభ్యులకు మా హార్దిక కృతజ్ఞతాంజలి.

ఈ సంపుటాల ముద్రణకు ఆధికారికమైన ఆమోదాన్ని తెలిపిన తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం.కె.ఆర్.వినాయక్ I.A.S. గారికి కృతజ్ఞతాంజలి.

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళికరూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు గారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త), విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందంగారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె. సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యూమానిటీస్ & ఎక్స్టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) ఆచార్య ఎం. శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M.A., Ph.D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) మా హార్దిక కృతజ్ఞతాంజలులు.

ఈ సంపుటాల ముద్రణలో సాంకేతికపరమైన సహకారాన్ని అందించిన తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాధికారి శ్రీ ఎం. లక్ష్మణరావుగారికి, వారి సిబ్బందికి, తి.తి.దే పౌరసంబంధ శాఖాధికారి శ్రీ పి. సుభాష్‌గౌడ్ గారికి కృతజ్ఞతాంజలులు.

డా॥ మేడసాని మోహన్ M.A., Ph.D
డైరక్టర్
అన్నమాచార్య ప్రాజెక్ట్
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

తేది : 10-2-98

# తాళ్లపాక పదకవుల సంకీర్తనల సంపుటాలు

## సంఖ్యా వివరణ పట్టిక - 1998

| సంపుటాలు | మునుపటి సంఖ్య | ఇప్పటి సంఖ్య | సంకీర్తనాచార్యుని పేరు |
|---|---|---|---|
| అధ్యాత్మ సంకీర్తనలు | 1 | 1 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 2 | 2 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 3 | 3 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 10+11(1,2భాగాలు) | 4 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 12 | 5 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 4 | 6 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 13 | 7 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 14 | 8 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 15 | 9 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు | 16 | 10 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 17 | 11 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 18 | 12 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 19 | 13 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 20 | 14 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 21 | 15 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 22 | 16 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 23 | 17 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 24 | 18 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 25 | 19 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 26 | 20 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 27 | 21 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 28 | 22 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 29 | 23 | తాళ్లపాక అన్నమాచార్యులు |

| | | | |
|---|---|---|---|
| శృంగార సంకీర్తనలు | 30 | 24 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 31 | 25 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 32 | 26 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 33 | 27 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 34 | 28 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 35 | 29 | తాళ్లపాక అన్నమాచార్యులు |

* తాళ్లపాక పదసాహిత్యం మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రణచేయబడుచున్నది. ఈ సందర్భంగా సంకీర్తనల సంపుటాల సంఖ్యలు క్రమపద్ధతిలో ఉండాలనే వుద్దేశ్యంతో మార్పులు చేయబడి, పై పట్టికలో చూపబడినవి. పై పట్టికలోని మునుపటి సంఖ్య వరుసలో సూచింపబడిన 33, 34, 35 సంపుటాలు ఇంతవరకు ముద్రింపబడలేదు. ఇప్పుడు ప్రథమంగా ప్రచురింపబడుతున్నాయి. అయినప్పటికి ప్రస్తుతం 1998 సం॥లో క్రొత్తగా 1వ సంపుటం నుండి ఇవ్వబడిన క్రమ సంఖ్యలు ఈ ప్రథమ ముద్రణ సంపుటాలకు చేర్చబడినది. ఈ మార్పును సహృదయ పాఠకులు గమనించగలరు.

# పీఠిక

శృంగారాపాంగమాలాభిః వశీకృతవృషేశ్వరం।
విరక్తస్యంస్య మాత్మేభ్యాకామశాస్త్రం నమామి తమ్॥

1101 నుండి 1200 వరకుగల 100 రేకులలోని పాటలు గలది ఈసంపుటము.

ఈవందలో 1105 వ రేక, 1151 నుండి 1160 వరకుగల 10 రేకులు, వెరసి 11 రేకులు లేవు.

ఈ తాళ్లపాకకవులవాఙ్మయము భక్తిపీఠమైనట్లే భాషామర్మములకు కూడ పీఠమే. భారతకవులను, శివకవులను వదలినచో భాషావిషయమున తాళ్లపాకకవులను తాకగల, దాటగలమొనగాండ్లు లేరన్నచో అతిశయోక్తికాదు. ఈ తాళ్లపాకకవుల భాషాసాగరమున మథింపవలసిన దెంతయో గలదు. మథించువారు ఎందరో ముందుకు రావలసియున్నది. రాగలరు.

అపనికి ఉడుతసేవగా నాయీపీఠికలు పనికిరావచ్చునని ఒకప్రత్యాశ. అందులకే యీప్రయత్నము.

ఇంతకుముందుగ్రాంథికవ్యావహారికములు ఇత్యాదిగా ఆయాసంపుటములలో కొన్నిఅంశములగూర్చి యథామతి సంగ్రహముగ చర్చించితిని. దీనిలో

## సమాసములు :-

మనప్రాచ్యభాషలలో భాషాంగముగ సమాసములు, ఒక లెక్కకెక్కిన స్థానమును ఆక్రమించుకొన్నవి. కొందరు మహాకవులు

దీర్ఘదీర్ఘసంస్కృతసమాసములతో ధారాశుద్ధికి, ధారాసిద్ధికి పేరు గాంచినారు. వారిలో నన్నయ, శ్రీనాథాదులు గురుపీఠ మలంకరించి-నారు. తిక్కనాదులు కొందరు తునుకతునుకపదములతో కవిత్వమల్లి ఆపద్ధతికి ఒకవన్నె చేకూర్చినారు.

తాళ్లపాకకవులరచనలలో పొందిపొందిన తెలుగు మాటలకున్న-బిగువు గొప్పది. ఈపద్ధతికి తిక్కన మూలపురుషుడు. వీరి కాతడే ఆదర్శము. అయినను శయ్యాసౌభాగ్యము సంతరించుటలో సమాస-ములకున్న విలువను ఎవ్వరును త్రోయలేరు. ప్రాచ్యభాషలకన్నింటికి మాతృభాషయగుసంస్కృతమున ఈసమాసవిధి మంచికట్టుదిట్టము-లతో ఏర్పాటైనది. సంస్కృతిపై యాకరణులు చూపినత్రోవనే తక్కిన-ప్రాచ్యభాషలవారు ఆయాభాషల కనుగుణమగుఅలతియలతిమార్పు-లతో బాటనేర్పరచుకొని సమాసరచనలు సాగించినారు.

## సమాససంగ్రహచరిత్ర

విడివిడిగ ప్రయోగింపబడిన ప్రసిద్ధార్థములగుపదములు ఆకాంక్ష, యోగ్యత, సన్నిధులబలములతో ఒకదానితోనొకటి కలిసి విడివిడిపదములఅర్థము (కర్తృకర్మాదిభావముతో) ఏకమై వాక్యార్థముగ మారుచున్నది. విడివిడిపదములఅర్థమును తెలుపుటకు అభిధావృత్తి చెల్లుచుండగా, ఆపదముల సమూహార్థ-మును తెలుపుటకు వ్యపేక్షాసామర్థ్యము అనునది సాధకమగు-చున్నది. దీనివలన భిన్నభిన్న పదములు సంఘటితార్థములై వాక్యార్థముగా మారును. ఇట్లే కొన్ని పదములు ఒకపదముగా కలిసి అవి తమఅంతరితసమును కోల్పోయి సమస్తపదమను-పేరుతో రెండు,అంతకు మించినపదములు ఒకే అర్థమును (విశేషణ విశేష్యాదులతో) బోధించుట సమాసమని చెప్పిరి. 'సమ్ + అసః = సమాసః' అని దీని వ్యుత్పత్తి. చక్కగా పదములను క్రుచ్చుట అని.

సంగ్రహముగ పదములను క్రుచ్చుట అనీ, సమర్థములైన పదములను క్రుచ్చుట అనీ దీనియర్థము కావచ్చు. చక్కగా క్రుచ్చుటచే శ్రుతిరంజనము, సంగ్రహముగా క్రుచ్చుటచే పదలాఘవము, సమర్థములను క్రుచ్చుటచే ఏకార్థీభావము సిద్ధించుచున్నది. ఈ మూడర్థములు సమాసవిధిలో ప్రధానములే. ఈ మూడును ప్రయోజనములే. ఇక్కడ ఒకపద మింకొకపదముతో కలిసి సమస్తపదమై పరస్పరసంగతార్థమై ఒకేఅర్థమును బోధించుటకు ఏకార్థీభావసామర్థ్యము సాధకమగుచున్నది. 'సంగతః అర్థః సమర్థః' లేక, 'సంసృష్టః అర్థః సమర్థః' అను వ్యుత్పత్తులతో సమర్థశబ్ద మేర్పడగా 'తస్యభావః' అను వ్యుత్పత్తితో'సామర్థ్యమ్' అగుచున్నది.

పై పేర్కొన్నవ్యపేక్షాసామర్థ్యము మనకిపుడు చర్చనీయము కాదు. ఏకార్థీభావసామర్థ్యమే మనకు ప్రధానము.

ఈ సామర్థ్యము ఒకశబ్దశక్తియే. ఈ శబ్దశక్తిని ఆధారముగా చేసికొని సమాసవృత్తి, తద్ధితవృత్తి, ఏకశేషవృత్తి, కృద్వృత్తి, సనాద్యంతధాతువృత్తి అని ఐదువృత్తులను వైయాకరణులు పేర్కొన్నారు. సనాద్యంతధాతువృత్తితప్ప తక్కిన నాలుగు తెనుగునకును సమానములే. వృత్తి అనగా శబ్దవ్యాపారము. ఇది విడి విడి పదములను పరస్పరాన్వయముతో కలిపి ఏకార్థీభావమును సంఘటించును. పై పేర్కొన్ననాలుగువృత్తులయందును సమాసాదికార్యములచే లోపించినవిభక్తులయొక్కయు, పదములయొక్కయు అర్థములను స్ఫురింపజేయుచు ఏకార్థీభావమును నిర్దేశించుచున్నది.

ఈ సమాసమును విప్పిచెప్పితే విగ్రహవాక్యము విశేషగ్రహము(విశేషజ్ఞానము)ను కలిగించునదికావున దానికాపేరు. 'రాజపురుషః' ఇత్యాది సమాసములందు 'రాజాచాసౌపురుషః అనియా? 'రాజ్ఞః పురుషః' అనియా? మనకు కలిగెడిసందేహములను ప్రకరణ-

మును బట్టి ఈ విగ్రహవాక్యము నివారించుచున్నది. సమర్థములైనపదములు అన్నప్పుడు అవి విడివిడిగ ప్రసిద్ధార్థములై యుండుటయేగాక, అవి ఒకదానితో నొకటి కలియుటకు అనువుపడి ఏకార్థీభావమును ప్రతిపాదింపవలెను. 'పద్మనేత్రా' అన్నప్పుడు 'పద్మే ఇవ నేత్రే' అను విగ్రహములో పద్మములు ఉపమానములుగా, నేత్రములు ఉపమేయములుగా కవిసంప్రదాయప్రహతమైనయోగ్యత ఉండుటచే అది శిష్టసమాసము. 'కమలమధ్యా' అన్నప్పుడు "కమలమ్ ఇవ మధ్యమ్ యస్యాః" అని విగ్రహించినచో కమలమునకు మధ్యమునకు ఏవిధమైనసాదృశ్యాదిసంబంధము లేకుండుటచే పైసమాసము దుష్టమగుచున్నది. కావున సమాసవిధిలో యోగ్యత కూడ ఒక ప్రధానభాగమే. ఈ సంగ్రహచరిత్రకు ఫలము పైపై చర్చింపబోవుసమాసములలో గమనింపగలరు.

## తెలుగులో సమాసము

ఇన్ని నియమములతోగూడినఈ సమాసరచన తెలుగులో భాషాసంబంధముగ నాలుగుతెరగులై వాఙ్మయమున చెల్లుబడియగుచున్నది. అవి 'సిద్ధ, సాధ్య, అచ్ఛిక, మిశ్రమములు' అని. ఇవికాక అర్థభేదములతో తత్పురుష- బహువ్రీహి, ద్వంద్వ, అవ్యయీభావములని ప్రధానముగ నాలుగువిధములుగా విభజింపబడియున్నవి. ఈ తత్పురుషాదులకు లక్షణము సాధారణముగ సంస్కృతశాస్త్రపరిధిలోనిదే. ఈ పేరొన్న అన్ని విభాగములు సుప్రసిద్ధములేకావున నేను మరల వివరింపను.

## తెలుగులో అవ్యయీభావము

తెలుగులో అవ్యయీభావసమాసము లేదని కొందరివాదము. సుబంతములు అవ్యయములతో సమసించి సమస్తపదము అవ్యయ-

ముగ మారుటయేగదా దీని ప్రధానలక్షణము. సంస్కృతములో కొన్ని-అర్థవిశేషములందు కొన్ని అవ్యయములు సుబంతములకు పూర్వో-త్తరపదములుగా కూడి సమస్తములై అవ్యయీభావసమాసము అను-పేరుతో చలామణియగుచున్నవి. ఉదాహరణము: 'సూపస్య లేశః సూపప్రతి;' 'దిశయోర్మధ్యే అపదిశమ్' ఇత్యాదులు. "క్లీబావ్యయం త్వపదిశం దిశోర్మధ్యే" అని అమరము. తెలుగులో అవ్యయములు సుబంతములతో సమసించి కర్మధారయముగనో, షష్ఠీతత్పురుష-ముగనో, ఇంకొకవిధముగనో చలామణియగుచున్నవి. ఆ సమస్త పదము అవ్యయముగా నుండుటచే దీనిని అవ్యయీభావమన్నచో తప్పేమి? 'వచ్చునపుడు;' 'నారాయణునట్లు', 'సవితృనట్లు'; 'వానివలె' ఇత్యాదులు అవ్యయములుకాక మరేమగుచున్నవి? ఇవి సమాసములు కావనుటకు వీలులేదుకదా? 'వచ్చుచున్నట్టి అపుడు' 'నారాయణునియొక్క అట్లు' 'సవితృనియొక్క అట్లు' వానియొక్క వలె' లేక 'వానిన్వలె' ఇత్యాదులు, సమస్తములుకాకపోయినచో 'వచ్చు' ధాతువిశేషణమునకు అనుప్రయుక్తతచ్ఛబ్దము దేనితో లోపించినట్లు? 'వచ్చుచున్నట్టి అపుడు,' 'నారాయణునట్లు,' 'సవితృనట్లు' అనునపుడు నగాగమము సమాసవిధిచేతనేగదా. 'వానివలె' అనునపుడు 'యొక్క' లోపింపకుండినచో 'వాని' శబ్దమున కర్థమెట్లు? కావున ఈ విషయమును పండితులు పరిశోధింపగలరు.

## అన్వయక్రమము

వ్యస్తపదముయొక్క అర్థముగాని, సమస్తపదముయొక్క అర్థముగాని, మరియొకసమస్తపదముయొక్క అర్థముతో అన్వ-యింపవలసినప్పుడు, ఆసమస్తపదముయొక్క సమగ్రార్థముతో అన్వయించునేకాని సమస్తపదముయొక్క ఏకదేశముతో అన్వయింపదు. "పదార్థః పదార్థాంతరేణాన్వేతి న తు పదార్థైకదేశేన" అని నియమము.

'రామః కోదండపాణిః' అన్నపుడు వ్యస్తమైనరామశబ్దార్థము 'కోదండమును పాణియందుగలవాడు' అనుదానితో అన్వయింప - వలెనేకాని, 'కోదండపాణి' యను సమస్తపదము యొక్క ఏకదేశమైన- 'కోదండ' శబ్దముతో అన్వయింపరాదు. ఇట్లే 'నీలమేఘశ్యామః' 'కోదండపాణిః' అన్న సమస్తపదములందుగూడ. ఇంతగా నిషేధింపబడిన ఈ ఏకదేశాన్వయము సంస్కృతమునందుగూడ నిత్య సాపేక్షములైన శబ్దములవిషయమున తప్పనిసరి.

> ''సంబంధిశబ్దః సాపేక్షో నిత్యం సర్వః సమస్యతే
> వాక్యవత్సా వ్యపేక్షాహి వృత్తావపి నహీయతే
> సముదాయేన సంబంధో యేషాం గురుకులాదినా
> సంస్పృశ్యావయవాం స్తేతు యుజ్యంతే తద్వతా సహ"

అని వైయాకరుణులు వాకొన్నారు. 'దేవదత్తస్య గురుకులమ్' అన్నపుడు 'దేవదత్తస్య' అను వ్యస్తపదము, 'గురుకులమ్' అనుసమాసము- నందు ఏకదేశమైన 'గురు' శబ్దముతో అన్వయించక తప్పదు. 'గురువు' అన్నప్పుడు 'ఎవనిగురువు?' అని ఆకాంక్ష విధిగా కలుగుచున్నది. దానికి 'దేవదత్తస్య' అనునదియే సమాధానము.

## తెలుగులో ఏక దేశాన్వయము

కాని, ఈ ఏకదేశాన్వయము తెనుగునందు చాల వింతగ మారినది.

> చ॥ పరువడి నగ్నిహోత్రములు బంధులు శిష్యులుఁ దోడరా మహీ-
> సురవరులెల్లఁ బాండునృపసూనులయొద్దకుఁ బ్రీతి నేఁగుదె -
> ంచిరి బహువేదఘోషములఁజేసి విరక్తనమస్తకిల్బిషో-
> త్కరులగుచున్నధన్యులు జగత్పరిపూజ్యులు బ్రహ్మసన్మునుల్

—భార, అరణ్య, 1–11.

ఉ॥ గాంచిరి విజ్ఞరేశ్వరు లఖండితరూపవిలాససంపదన్
వంచితపంచబాణుఁ డగువాని సమంచితసారధీరతం-
గాంచన భూధరంబువకుఁ గాదిలిసెచ్చెలియైన వాని ని-
ర్వంచితదానశక్తి సురరత్నముఁ బోలెడువాని నైషధున్

—శృంగారనైషధము, 3-40

ఉ॥ అగ్రజువాక్యముల్ దలఁచి యర్జునుఁ డప్పుడు వారితోడన-
త్యుగ్రత చక్కి యెంతయుఁ బ్రియోక్తుల నిట్లను: మీకు మాయెడన్
విగ్రహమేల నెయ్యమున విద్యుఁడు కౌరవరాజుఁ బార్థివ
ప్రాగ్రసరుండు ధర్మసుతుప న్పిది మీకు వలంప్య మిత్తఱిన్

—భార. అరణ్య. 5—416

పై పద్యములలో క్రీగీటులుగలవి.

మొదటిదానిలో 'నిరస్త' అను క్తప్రత్యయాంతమునకు 'బహువేవ... ....జేసి' అనునది హేతువుగ అన్వయింపవలసియున్నది. అట్లే 'వంచిత' అను సమాసైకదేశమునందు "అఖండిత.......దన్" అనుపదము హేతువుగా అన్వయింపవలసియున్నది 'పార్థి....రుండు' అనునది 'ధర్మసుతు' అనుసమాసైకదేశమునందు విశేషణముగ అన్వయింపవలసియున్నది. ఇట్టి పద్ధతి సంస్కృతమునందు అప్రసిద్ధము. ఈమాత్రపుప్రాచీన ప్రయోగములను ఆధారముగ-చేసికొని మనఅన్నమయ్య స్వేచ్ఛగ ఈ ఏకదేశసమాసములను పండించినాడు.

1. " చిగిరించేనాలోనిసిగ్గులకుఁగాక " (సంపు. 24—పాట 231)

తగిలి నీవు చూడఁగాఁ దలపంచేదాననా
వాగి నీతో గర్వమని వుందానఁగాక
పగటున నవ్వఁగాను పరాకయ్యేదాననా
చిగిరించేనాలోనిసిగులకుఁగాక ॥ నీవు ॥

ఇక్కడ చిగిరించునవి సిగ్గులు. ఆసిగ్గులకు ఆధారము నాలోపలి భాగము. న్యాయముగా 'నాలోచిగిరించేసిగ్గులు' అని చెప్పవలసి యుండగా, అన్నమయ్య పై విధముగా ప్రయోగించినాడు, దీనికి 'నాలోనిసిగ్గులు' అని ముందుగా విగ్రహవాక్యము చేసుకొని, చిగిరించెడి నాలోనిసిగ్గులు అని తరువాత విగ్రహవాక్యము చేసుకొని సమసింపవలసియున్నది. ఇది శివభాగవతాది సమాసకోటికి చేరినట్లైనది. ఇట్టివి తెలుగులోకూడ అపురూపమైనవే. ధాతుజ విశేషణములు తమవిశేష్యముతో సమసించుట సహజము. కాని అన్నమయ్యస్వాతంత్ర్యము ఈశాస్త్రమును లెక్కపెట్టదు. ఇట్లే,

2. "రేయిఁబగలును నీరేపల్లెలోచేఁతలు" (సంపు-28 - పా 515)

రేయిఁబగలును నీరేపల్లెలోచేఁతలు
ఆయాలు మోవఁగా నిన్ను నాడెఁగా చెలి
యీయెడనైతే నేము యింతేసికి నోపము
పాయపువాఁడవు మాటఁబడ నోపుదువుగా ॥అందు॥

ఇది మరీవింత, 'రేపల్లెలో' యనునది వ్యస్తపదము. నీ శబ్దమునకు 'చేఁతలు' శబ్దమునకు పరస్పరము దగ్గరసంబంధము. 'రేపల్లెలోని నీచేఁతలు' అనుట సహజముగాని, 'నీ చేఁతలు' అను సమాసమధ్యమున 'రేపల్లెలో' అనుపదమును ఇరికించుట అన్నమయ్యభాషాస్వాతంత్ర్యమునకు లేదా దొడ్డ సాహసమునకో గురుతు. రేపల్లెలోచేఁతలు అలుక్సమాస మనుకొనెనేమో ?అట్లైనా ఏకదేశాన్వయదోషము త్రోయరానిదే. ఇట్టి సమాసములు తిక్కనాదులలో ఉన్నట్లు అనుకొనవచ్చుగాని, నిదానముగ యోచించినచో వారికింత తెగువ లేదనియే చెప్పవలెను.

ఉ॥ ఎత్తినవేడ్కఁ గంధరము లెత్తి మొగంబులు సాఁచి చూడ్కులం
జిత్తములున్ విగిడ్చి తమచెందెడునిక్కలు రోసి యింపు ద-
క్కొత్తఁగ నొక్కచో నొకటి నొక్కటి గాంచి యెలర్చు కాయ్యలం
జిత్తజుకేళిఁ దేలె విలసిల్లుచు జక్కవదోయి వేకువన్

.. భార-ఉద్యోగ2-109

ఈ పద్యములో "తమచెందెడునిక్కలు" అని తిక్కన ప్రయోగించి నట్లు చూపవచ్చుగాని, ఆయనమెలకువలను గమనింపవలసియున్నది. ప్రాతఃకాలవర్ణనలోనిపద్య మిది. రాత్రియంతయు విడివడినచక్రవాకములు వేకువన తమచెందెడునిక్కలు వెదకి చిత్తజకేళి తేలినవి. ఇక్కడ 'తమఇక్కలు' కాదు. "తాము చేరెడుఇక్కలు" కావున 'తమ' శబ్దమునకు 'ఇక్కల'తో ప్రత్యక్షసంబంధము కానరాదు. కావున ఇట్టివాటితో ముడివెట్టి అన్నమయ్యను స్వాతంత్ర్యములేనివానినిగా చేయరాదు.

ఇక్కడ మరియొకవిషయము చర్చింపవలసియున్నది. కర్మాదికారకములు ప్రధానములుగ వివక్షింవబడి ధాతుజవిశేషణములతో సమసించునపుడు ప్రాచీనప్రయోగములందు అది షష్ఠీతత్పురుషము గనే చెల్లినది ఉదాహరణములు:

1. వ॥ అనిన వల్లెని యందఱము వానిపోయినవలనం బోవుదమని
యెప్పటియట్ల ర్థాక్షపబలసమన్వితులై గగనగతి వరిగి
సౌగంధికతీరంబున

(భార-అరణ్య 3-374)

2 వ॥ అట ధర్మరాజు భీమసేనుపోయినవలను ద్రౌపదిచే నెఱింగి....
యార్ష్టిషేణుండనుమునివరునాశ్రమంబున

(భార-అరణ్య-4-22)

3 ఉ॥ ప్రల్లదుఁడైన యొక్కకులపాంసను చేసినదానఁ దత్కులం-
బెల్లను దూషితంబగుట యేమియపూర్వము; గావునన్ మహీ-
వల్లభ తక్షకాధమునెపంబున సర్పములెల్ల నగ్నిలోఁ
ద్రెళ్ళఁగ సర్పయాగ మతిధీయుత చేయుము విప్రసన్నిధిన్.

...భార-ఆది-1-126

4 చ॥ అమితజగద్భయంకరవిషాగ్నియు నప్రతిహన్యమానవీ-
ర్యముఁ గలయట్టిసర్పముల కాజనమేజయుచేయు సర్పయా-
గమున నుదగ్రపావకశిఖాహతులం దొలఁగంగఁ గారణం-
బగులచరిత్ర యేమి చెప్పుమయ్య వినం గడువేడ్క యయ్యెడున్

...భార-ఆది-1-128

5 తే॥ నీవు మాచుట్టమవపోలె నెమ్మితోడ-
నసహితుండవై మాపల్కు లాదరించి -
తాజరత్కారుఁగని చెప్పవయ్య వాని
నెఱుఁగుదేని మాపడియెడునీయువస

....భార-ఆది-2-145

6 క॥ వివి భీష్ముఁ డవియె మీ కి-
ట్లని యానతి యీఁగఁదగునె యమ్మెయి నాప-
ల్కిన పల్కును మఱి నాతా-
ల్చిన వ్రతమును జెఱుప నంత చిఱుతనె చెప్పుఁడా.

— భార-ఆది-4-223

పై పద్యములలో క్రీగీతలు గలవి యిత్యాదులు. 'వానియొక్కపోయిన వలను', 'భీమసేనునియొక్క పోయినవలను' ఇత్యాదిగా విగ్రహవాక్యము. కాని, ఇది కాలాంతరమున కర్మాదులయందు ఆరోపింపబడిన కర్తృత్వప్రాధాన్యమునుబట్టి వానికి ప్రథమావిభక్తికూడా వచ్చినది. ఉదాహరణము:—

తే॥ నీవు చెప్పినమాటలు నిర్మలములు, నిపుణసమ్మతములు రాజనీతిమార్గ-
బోధకంబులు నైనను బుద్ధి విడువనోప 'ధర్మోజయతి' యని యుండువాఁడ.
— భార-ఉద్యో-2-90

ఇత్యాదిగా 'నీచే చెప్పబడిన మాటలు' అను అర్థమున ప్రయోగింప
బడినది. దీనినే

"కర్మాదేః కర్తృత్వం ప్రథమాచ నవర్ణకశ్చ తద్వత్స్యాత్"
అని సమర్థించినది. (ఆంధ్రశబ్దచింతామణి—హలంతపరిచ్ఛేదము 39)

శా॥ వేదవ్యాసవిశేషపూతరసనావిర్భూతభూరిస్తవా-
పాదబ్రహ్మముఖౌఘవిఘ్నితనవస్వర్గక్రియాకేళిచే-
నాఁ గాధితనూజుచే నగముసేయంబడ్డమిన్నేఁబ్రా-
సాదస్వచ్ఛదుకూలకైతవమునం జాలంగ నొప్పుం బురిన్.
— శృంగారనైషధము-2-41

ఇత్యాదిపద్యములలో క్రీగీతలుగలస్థలములు సహజములైనవిభ-
క్తులతోనే కూడినవని చెప్పనక్కఱలేదు.

పై చింతామణినే అథర్వణుడు,

"స్యాత్కర్మధారయాభాసః కర్తృత్వే కారకాశ్రితే"
(అథర్వణకారికలు—హలంత-17)

అని సమర్థించినాడు. దానినే చిన్నయసూరిగూడ "కర్మాదులకుఁ
బ్రాధాన్యవివక్షయందు ధాతుజవిశేషణంబులు కర్తతోడంబోలె వాని-
తోడ సమసించు"
(బాలవ్యాక—సమాసపరిచ్ఛేదము-సూత్రము—26)

అని సూత్రించినాడు. ముందు పేర్కొనిన షష్ఠీసమాసముగ
చెల్లుబడియైనవానియందు (వానిపోయినవలనను, ఇత్యాదులందు)

అది సమస్త పదముగ వ్యవహరించుటకు అవకాశమున్నది గాని, 'నీవు చెప్పినమాటలు' ఇత్యాదులు సమస్తములనుటకు వీలుకాదు. అథర్వణునివాక్యమును ఆధారముగ తీసికొన్నచో 'నీవు చెప్పిన మాటలు', 'రాముఁడు నెడలినవనము' ఇత్యాదులు కర్మధారయాభాసములై చెల్లవలసియున్నవి. ఈ యవకాశమును చూచుకొని "నా యొనర్పంబూనినయిమ్మహాప్రబంధమునకు" ఇత్యాదులుకూడ సమాసాభాసములుగ చెల్లవలసినట్లు తోచుచున్నవి. లేకున్నచో "నా యొనర్ప....మునకు" నందు 'నా' శబ్దమునకు 'పూనిన' ధాతుజ విశేషణముతో ప్రత్యక్షసంబంధము కలదు గాని 'ఒనర్పన్' అను అన్నంతము సమాసమధ్యపతితమై అన్వయమునకు ఇబ్బంది కలిగించు-చున్నది. కావున 'ఒనర్పన్' అను అన్నంతము 'పూనిన' అను-ధాతుజవిశేషణమునకు ఒకక్రియను నిర్దేశించుచు 'ఒనర్పంబూనిన' కలిసి సమాసాభాసధాతుజవిశేషణమై 'నా' శబ్దముతో అన్వయింప-వలసియున్నవి. ఇటువంటిఅవ్యయములు సమాసమధ్యపతితములై వాటితోకూడినఆపదమంతయు సమస్తపదముగనే వ్యవహరింప-వలసియున్నట్లు తోచుచున్నది. ఈ పద్ధతి సంస్కృతమున అక్క-డక్కడ కానవచ్చుచున్నది.

1. "అపహృత్య దివోఽపి యౌవతైర్నసహాధీతవతీమిమామహం
కతమస్తు విధాతురాశయే పతిరస్యా వసతీత్యచింతయమ్"

—నైష-2-41

2. భ్రూవల్లికంపనికుంచిత మింగితం సా లింగం చకార తదనాదరణ
స్య విజ్ఞా।
రాజ్ఞోఽపి తస్య త[illegible]లాభజ[illegible]తివహ్నిశ్చపీ[illegible] మ[illegible]నచ్ఛ
[illegible] మధూమః॥

(నైష -11-83)

3 వృత్తానుపూర్వే చ న చాతిదీర్ఘే జంఘే శుభే సృష్టవత స్తదీయే।
శేషాంగనిర్మాణ విధౌ విధాతుః లావణ్య ఉత్పాద్య ఇవాసయత్నః॥
(కుమా–1–35)

నక్రోధో నచ మాత్సర్యం నలోభో నాశుభా మతిః।
భవంతి కృతపుణ్యానాం భక్తానాం పురుషోత్తమే॥
(విష్ణుసహస్ర–133)

. అభ్యాసోహి కర్మణా కౌశల మావహతి. నహి సకృన్నిపాత మాత్రేణ ఉదబిందురపి గ్రావణి నిమ్నతామాదధాతి
(వామనాలంకారసూత్రోదాహృతము)

శ్రీగీతయుగల 1, 2 స్థలములందు, సమాసమధ్యపతితావ్యయము లను సమాసమును మల్లినాథుడు చూపినాడు. 2 వ దానియందు మాత్రము 'నైషధీయప్రకాశ' వ్యాఖ్యాతయగు నారాయణుడు 'భ్రూవల్లి వేల్లిత మథాకృతిభంగిమైషా'' అని పాఠాంతరము చూపినాడు. * 3, 4, 5 పదములందు సమాస అసమాసపక్షములు పరామర్శించినవా రున్నారు.

ఇటివాని నాదరముగ జేసికొనియే మనతెలుగుకవులు విచిత్ర మైన సంఘటనలను కావించినారు. తిక్కన రచనలో:–

"తే॥ ఒకటి యడిగెదఁ గృప చిగురొత్తఁ జెప్పు-
మలయ మీరు మాయింటికి వచ్చి యొక్క-
ప్రక్క క్రిందుగ నిరువదియైదు దివము-
లనఘ విడిదించి తుదిమోఁదైవ నీదు''

—భార–అనుశా–2–329

"కII చరితం బద్భుతము మునీ-
శ్వర దీనికిఁ గారణము విచారంమున కగో-
చర మెఱిఁగింపు మనుఁడు నా-
ధరణీవల్లభునితో నతండిట్లనియెన్,

(వావిళ్లప్రెస్ 1948–భార–అనుశా–2–330)

* చూః 'సందర్భశుద్ధిః' శ్రీమాన్ N. C. V. నరసింహాచార్యులు, 'ప్రసూనాంజలిః, (Magazine) 1976-77, S. V. Oriental College, Tirupati

ఇక్కడ పూర్వపద్యాంతమైన 'నీదు' శబ్దము, ఉత్తరపద్యాదియందున్న 'చరిత' శబ్దము కలిసి సమస్తపదమే కదా. దీనిని రెండుపద్యములలో విభజించి వ్రాయుటయెట్లు? కావ్యమంతయు మహావాక్యముగ తీసికొని చేసినరచనకాబోలు, కావున ఇట్టి సన్నివేశములను ఎన్నింటినో తరచిచూచి, చదువువానికి అర్థము కావలెనేకాని సమాసములందు ఏపదము ఎక్కడున్న నేమాయను? అని నిశ్చయించుకొని మా అన్నమయ్య గ్రాంథిక-వ్యావహారిక భాషలతో సంకీర్ణమైన తనరచనయందు మరికొన్నిసమాసములను ప్రవేశపెట్టినాడా? అని తోచుచున్నది,

## అన్నమయ్యలోని సమాస విశేషములు

1. ఘనురాలు : (సంపు 25 -పాట 26)

"ఎంతైనా నాతఁడు నీకు నెక్కుడుగాదా
కాంతుఁడు మన్నించఁగానే ఘనురాలవైతివి ॥పల్లవి॥

'ఘన' శబ్దముపై 'ఆలు' శబ్దమును (స్త్రీవాచకము) జోడించి 'ధీరురాలు'వలె సమసించినారు. ఇదేమంత పెద్ద సాహసము కాదు.

2 నీయాపెసంది :- (సంపు 24 -పాట 126)

"చిత్తగించి చూడవయ్య చిరునవ్వు నవ్వీ నాపె
ఉత్తల నీయాపెసఁ(సం?)ది నెంతవనికో
కొత్తకొత్తచెమటలు గోర నీపైఁ జిమ్మీని
తత్తరాన నది యెట్టితపఁబాటులో ॥కాన॥

'నీవు + ఆపె' అని ఈ రెండింటికి మొదల ద్వంద్వము. దానిపై "నీయాపెల యొక్కసంది" అని తత్పురుషము " ద్వంద్వాంతే

శ్రూయమాణః శబ్దః ప్రత్యేకమభిసంబధ్యతే" అను నియమముతో పై ద్వంద్వమునకు 'సంది' శబ్దముతో అన్వయము. బహువచన 'ల' గూడ ఎగిరి పోయింది. ఇట్టివానికి

"క॥ చెలిమియు సంభాషణమును
బలిమివివాదంబుఁ ద్రోపుఁ బాడియు దమయం-
తలవారితోన ఁగు నధి-
కులహీనులతోడనైనఁ గొఱగా దధిపా
....భార-ఉద్యోగ-2-48

అధికులతోడ హీనులతోడ అనిగదా అన్వయము.

శ్రీగీతలు గల కవులప్రయోగములవంటివి కారణములు కావచ్చు.

3. తననాకింతే : (సంపు 25 - పాట 362)

"కూడి తనచేఁతలకుఁ గోపగింతునో యేమో
యీడనుండి మొక్కితి నాకింతేచాలు
వోడక నాఁ రెకు రాఁగా నొగరౌనో తీపౌనో
యేడకేడ తననాకింతే చాలు ॥ఏల॥"

ఇక్కడ 'తనయొక్క నాకు' అని విగ్రహించుటకు అవకాశ మున్నది. కాని 'తనకు నాకు' అని చెప్పినచో ప్రకరణార్థము పొందు పడినట్లుండునని భావన.

4. తుమ్మిదలు (ల?) బెదరని తోరపుగుంపు: (సంపు 24-పాట ...)

"తమ్మివిరి నీలాలు తళుకు మెఱుఁగులు
తుమ్మిదలు (ల?) బెదరనితోరపుగుంపు
ఇమ్ముల శ్రీవేంకటేశ యిదె నీపురముమీఁద
నెమ్మదిఁ దావుకొని నిండెను యాసిరులు ॥అన్ని॥

'తుమ్మిదలు' అని వ్యస్తముగ విరిచినచో అన్వయము సులభము కాదేమో? 'ఱ' స్థానమున 'ల' పెట్టుకొన్నచో 'తుమ్మిదల-బెదరనితోరపు గుంపు' అని కావచ్చు. కాని దీనికి సమాసమెట్లు? విగ్రహవాక్యమెట్లు? బెదరనితోరమైనగుంపు అని ముందు సమసించు-కొని, "తుమ్మిదల" షష్ఠితో తరువాత సమాసము కూర్పవలసియున్నది. 'బెదరనితుమ్మిదలతోరపుగుంపు' అన్నచో సులభముగా తోచును. కాని ఆయన, భక్తిపారవశ్యములో-ఆ రచనావేగములో-ఆ భాషాస్వాతం-త్ర్యములో యతిప్రాసలనిర్బంధముతో ఇట్టిచిల్లరమార్పు లెన్నియైన చేయవలసియున్నది.

5. నీయింతైనవెనకనె: (సం పు 24 -పాట 257)

"యీయలమేలుమంగ నిన్నెనసినవెనకనె
పాయము వచ్చి యీరీతి బరగినది
చాయల శ్రీవేంకటేశ నీయింతైనవెనకనె
కాయపువిలాసాలగని యెనది ॥ పిన్న॥

'ఇంతైనటువంటి వెనక' బాగానే వుంది. నీ శబ్దమునకెట్లు? 'నీకు లేక నీవలన ఇంతైన వెనకనే' అని చేసికొనవలెకాబోలు.

6. తైకొన్నవాగిసంచకారు: (సంపు 26 -పాట 583)

"వుంకువిచ్చి తైకొన్నవాగిసంచకారు సుమ్మీ
అంకెల నీకొనవేళ అవుంగరము
పొంకాన నే మెన్నడు పూచి యిచ్చినది లేదు
లంకె బెట్టుకొంటివి పల్లదా లేలాదేవు ॥ ఐతే ॥

'తైకొన్న' ధాతుజ విశేషణము 'సంచకారు' తో అన్వయింప-వలసిన అవసరమెంతైన గలదు. కాని మధ్యలో 'ఒగి' కేమిసంబం-ధము? క్రమము మొదలైన అర్థములలో ఒగి శబ్దము ప్రసిద్ధము. కొన్నిపట్టులందువలె ఇక్కడ వాక్యాలంకారముగ ప్రయోగింపబడిన-దేమో?

7. చేతినీవుంగరము: (సంపు 25 - పాట 496)

"సీత నీకుఁ జెప్పి పంపి శిరోమణి నీకిచ్చె
నాతల నే మెఱఁగము అదేమాట
చేతినీవుంగరమును శిరసున నెత్తుకొనె
యేతలఁపు లెట్లానో ఇదిగో మాట

'నీచేతివుంగరము' అనుట సబబు. ఇక్కడ ఉంగరమునకు నీశబ్దసంబంధము అత్యావశ్యకమైనను 'నీచేతివుంగరము' అనుటతో ఆయర్థము దెబ్బతినదు. కాని ముందు చెప్పినట్లు రచనావేగములోని యతిప్రాసలనిర్బంధము ఇట్టివానికి కారణము.

8. సిగ్గుతోఁ బెట్టినయట్టిచెలినీచెక్కిటిచేయి: (సంపు 25-పాట 583)

"సిగ్గుతోఁ బెట్టినయట్టిచెలినీచెక్కిటిచేయి
వెగ్గళపుఁజింతలంటా వెరచితిమే
బగ్గన నీవుయ్యాలపై నూఁగేపయ్యదజారు
విగ్గుల విరహామంటా నివ్వెరగందితిమే"

ఈ 'అట్టి' అను సాదృశ్యవాచకానుసంధానపదము (అట్టిరాముడు, ఇట్టిరాముడు, ఇట్టివాడు, అట్టివాడు ఇత్యాదియందువలె) ఏదో ఒక విశేష్యమును కోరుచునే యుండును దీనిని 'చెలి' శబ్దముతో చేర్చినచో అక్కడికి పదము పూర్తియగును. ఈ 'చెలి' శబ్దము ఇంకొకదానితో అన్వయించుటకు వీలులేదు. గతిలేక "నీచెక్కిటిచేయి" లోని 'నీ' శబ్దముతోనే సమసింపవలసియున్నది.

మరికొన్నివింతలు. సమాసమధ్యములో క్రియాపదమిమిడి-యుండును. ఆ సమాసమధ్యము నుండి క్రియాపదమును ఏరుకొనవలెగాబోలు.

9. జీడిపంటిగింజవంటి చెంగియుండె నీగుణము :

(సంపు 25–పా 427)

"గోడఁ బూసినసున్నము కూడపెట్టనేరనోప
ఆడుకోలుమాటదప్పెనని యెంచేనా
జీడిపంటిగింజవంటిచెంగియుండె నీగుణము
కోడెమారుని కత్తికి గురిసేసేనా"

ఇక్కడ 'వంటి' అనునది నీగుణముతో కలియవలసినది. మధ్యలో 'చెంగియుండె' అనుధాతువు. ఈ ప్రవాహ వేగమును అడ్డు పెట్టగల వైయాకరణు డెవ్వడు? లేక చెంగియుండే, అని ధాతుజ విశేషణముగ భావింపవలెనేమో. అయినా 'వఁటికి' ఇబ్బందే. 'వలె' కావలసిందే.

10. అనేకపంతగాఁడవు : (సంపు 24—పాట 136)

"అనేకపంతగాఁడవు అందగాఁడవు
మునుకొన్నమావెంగేలు ముంచుకొనీనా ॥ పల్లవి ॥

దీనిని చూడగనే

"ప్రాయేణ వైయాకరణాః పిశాచాః
ప్రయోగమంత్రేణ నివారణీయాః"

అన్నదిజ్ఞాపకమువచ్చి, 'దినవెచ్చము' 'గర్భగుడి' వంటివాని ప్రక్కన దీనికి సింహాసన మివ్వవలసినదే, 'జీవగఱ్ఱ' 'ప్రాణగొడ్డము' ప్రమాణమైతే "అనేకపంతగాఁడవు" తప్పుచేసెనా?

11. ఒబ్బుద్ధితో: సంపు 24-పాట 529

"ఉండవయ్య ఇఁక నీవు వొబ్బుద్ధితోను
నిండుకొనె నవ్వులెల్లా నేఁడు నా నెలవుల ॥ పల్లవి ॥

ఒక + బుద్ధితో, ఇక్కడ "ఒక" శబ్దమునకు "ఓ" ఆదేశము. దానికి, శాస్త్రములో లేకపోయినా త్రికసంధి వచ్చి 'ఒబ్బుద్ధి' కావలెను కాబోలు. అస్తే,

12 నియ్యెడ : (సంపు 26-పాట 200)

నగితిఁ జాలదా నీతో నాలోఁ గోపించుకొనక
మగుడిఁ గమ్మటి నీవే మమ్ము దూరేవు
మొగమోడితిఁ జాలదా మొక్కలీఁడ నియ్యెడకు
వొగరులాడ వచ్చేవు వోపము నే మిందుకు ॥ వద్ద ॥

13. వియ్యాన : (సంపు 25-పాట

"నీకునీకే యాడుకోకు వియ్యాన
కైకొని నేనే నీపై గడియించేఁగాని" ॥ పల్లవి ॥

14. వియ్యిచ్చల : (సంపు 25-పాట 192)

"కొయ్యతనాన వన్నుఁ గూడితి పానుపుపై నీ-
నెయ్యమెల్లాఁ గంటిమి నేఁడే నేము
యియ్యెడ శ్రీవేంకటేశ యిన్నియు నియ్యకొంటిమి
నియ్యిచ్చల మోవిపయి నింతురా గుఱుతులు ॥ ఏమి ॥

ఇత్యాదులందు క్రీగీతలు గలవి. 'నీ' శబ్దములోని 'ఈ' కారముతో త్రికసంధి సాగించినాడు. ఈ ప్రయోగములు కోకొల్లలుగ గలవు. 'ఆ. ఈ, ఏ' లు సర్వనామములే, నీ శబ్దముకూడ సర్వనామమే.

"ఇదమదనేతద్యత్తచ్ఛబ్దా శ్శబ్దాంతరాన్వయే బహుళమ్
హ్రస్వం ప్రపద్య దీర్ఘాద్విత్వ ముపర్యక్షరస్య జనయంతి"

... చింతామణి—హలంతపరి 9

ఇత్యాదిశాస్త్రము ఉపలక్షణము మాత్రమేనని మాఅన్నమయ్య భావవ కాబోలు. 'కట్టకడ' శబ్దమును 'కట్టఁగడగ' వ్రాయుట వీరిపరిపాటి

15. ఎవ్వతోచేఁతలు : (సంపు 25 -పాట 333)

"మొగమిచ్చి సారెసారె మోహము చల్లుచు నాతో
నగఁగా నేనూ నట్టె నవ్వేఁగాని
యొగసక్కెలకు నీమై నెవ్వతోచేఁతలు చూచి
నగమై లోలో నిట్టె జడిసీ నాదేహము" ॥ నీకు ॥

ఎవ్వతెయొక్క చేఁతన్ అను విగ్రహవాక్యముతో 'ఎవ్వతె చేఁతన్' అనుదానిపై సందేహార్థకమైన 'ఓ' స్వరముచేరి 'ఏవ్వతె చేఁతనో' కావలసియుండగా 'ఎవ్వతోచేఁతను' లోని సమాసపదముల మధ్య సందేహార్థకస్వరమును జోడించినాడు.

"ఆంధ్రం షడ్వర్ణ పర్యంతం పదం స్యాత్కర్మధారయే"
(అథర్వణ—హలంతము-24)

ఇత్యాదినియమములుకూడ మాఅన్నమయ్యదోవ కడ్డమురాలేవు. అట్లే,

16. కలకంటి : (సంపు 12 -పాట 302)

"కలికితనములపోగు కమ్మఁదావులవేఁగు
వలపుతమకములపరవశముపెనుజాగు
కలకంటిబాగు వేంకటపతికిఁ జెలరేఁగు
చెలియ సమరతుల మించినవింతబాగు ॥ మోహం ॥

17. సొన్నాటంకాలు : (సంపు 12 -పాట 304)

"ముదితనడపులలోని మురిపెమే వెయినేసు
కొదమగుబ్బలతీరు కోటివేలు నేను
సుదతి బిత్తరిచూపు సొన్నాటంకాలే నేసు
అదరబింబముతీరు ఆరువేలు నేను ॥ చూడ ॥

18. నేఁతి (చేఁము) కుత్తికవాఁడు. (సంపు 12 – పాట 367)

> "నేఁతి కుత్తికవాఁడు సెలకుండ దాఁచిన-
> పాఁతపెద్దపిల్లి బలువున
> నాఁతికొరకు వచ్చి నడిమికి విఱిచిన
> శేఁతలాఁడుగదె శివకాటి ॥ జిగరు ॥

ఇత్యాదులు (క్రీగీతలు గలవి) పండితు లూహింపవచ్చు.

ఇంతవరకు సమాసవృత్తినిగూర్చి ఏదోకొంత చర్చ సాగించితిని. తత్పురుషాదుల లక్షణములను గూర్చి మన వైయాకరణులు చెప్పిన-దానికంటె చెప్పదగిన దేమీలేదు. ఇకపోతే 'ఏకశేషవృత్తి' అన్ని ప్రాచ్యభాషలకు సాధారణమే. జాత్యేకవచనములు, నిత్యబహు-వచనములు ఆయాభాషలకు వాటివాటిసంప్రదాయములతో సుప్రసిద్ధములే.

తద్ధితవృత్తియం దెక్కువగ, కృద్వృత్తియందు పరిమితముగ అన్నమయ్య స్వతంత్రించినాడు. తెలుగునకు అసలే వ్యాకరణము అసమగ్రము. ముందు పేరొన్న సమాసాదినాలుగువృత్తులందు దాని-బలము మరీ పరిమితము. ఈ పట్టులందు కవులస్వాతంత్ర్యమునకు పరిమితము లేదు 1. నుమ్మోచ్చతః (చింతా-సంధి-70) 2. పరుషే సరశేచ్చైవ సమాసే నుముతో భవేత్, అద్రుతాత్సరకాత్ (అథ-సంధి-23) సూత్రములతో జరుగుసమాససంధులవిషయమున అన్నమయ్య చాలస్వాతంత్ర్యమును ప్రయోగములతో చూపినాడు. ఔపవిభక్తిక-ప్రత్యయములవిషయమున, అసమాసములవిషయమునా అంతే. ప్రవాహభాషలందు ఈ పద్ధతి తొలగింపరానిది.

కృత్తద్ధితములకు సంబంధించి కొన్నిపదములను ఆయా పాటలక్రిందనే ప్రకృతిప్రత్యయములను విరిచి చూపినాము. కొన్ని గడుసరి ప్రయోగములను ఆయా సంపుటములకు సంబంధించిన

'సందిగ్ధ పద సమీక్ష' లో పరామర్శించినాను. పండితులు పరిశీలించి తప్పొప్పులు తెల్పినచో వారికి కృతజ్ఞుడనై సవరించుకొనగలను. 'అపరితోషాద్విదుషాం న సాధు మన్యే ప్రయోగవిజ్ఞానమ్' అని గదా పెద్దలమాట.

కీ॥ శే॥ పూజ్యపాదులు రాళ్లపల్లి - అనంతకృష్ణశర్మగారన్నట్లు, 'ఇదం బ్రాహ్మ్య మిదం క్షాత్ర' మన్నట్లు గ్రాంథికవ్యవహారికములను రెంటిని సవ్యాపసవ్యముగ వాడి, తెలుగువాఙ్మయానికీ, సంకీర్తన సంప్రదాయానికీ వన్నెవాసులు సంతరించిన తాళ్లపాకకవులవాఙ్మయ-మున జరుగవలసిన పరిశోధన మెంతోగలదు.

ఈ వాఙ్మయసేవకు కావలసిన సౌకర్యములను సమకూర్చు టలో ముందువెనకలు చూడక, అర్థమును, ఆదరమునూ చూపుచున్న తి. తి. దేవస్థానముల కమిటీ ఛేర్మన్ శ్రీయుతులు N. రమేశన్ ఐ. ఏ. ఎస్. గారికీ, తి. తి. దేవస్థానముల శ్రీకార్యనిర్వాహకులు శ్రీయుతులు P. V. R. K. ప్రసాద్ ఐ. ఏ. ఎస్. గారికినీ నాయభి-వాదములు. దేవుడిచ్చినవరాన్ని పూజారి ఇబ్బడి ముమ్మడిగ పండించి నట్లు, పై యధికారులు చూపినఆదరమును, తన కార్యదీక్షతో ముందుకు నడుపుచున్న తి. తి. దే. ప్రెస్ మేనేజర్, శ్రీ M. విజయ కుమారరెడ్డిగారికి, మా యీపరిష్కరణకార్యములో అడుగడుగున వలసినవానిని సమకూర్చుచు తోడ్పడుచున్న 'సప్తగిరి' సంపాదకులు శ్రీ K. సుబ్బారావు ఎం. ఏ. గారికినీ నాధన్యవాదములు. ఈ అన్ని పనులపైన పూతమెరుగులుదిద్దేఅధికారము దొడ్డగ నిర్వహించుచున్న P. R. O. శ్రీరావుల సూర్యనారాయణమూర్తి ఎం.ఏ. గారికి నాకృతజ్ఞతలు. ఈ వ్రాతపనిలో నాకు సహాయుడుగ నియమింపబడి, ఈ సంపుటము 68 వ రేకు నుండి కొన్ని సంపుటముల వరకు నాకు యథామతి సహాక రించిన S. V. O. కాలేజి ఆంధ్రోపన్యాసకులు చి॥ K. రామచంద్రరాజు

గారికి, ప్రకృతాంగ్లసంవత్సరమునుండి ఈ పరిష్కరణకార్యమున నాకు వ్రాతపనిలో సహాయుడుగ నియమింపబడి, శ్రద్ధాసక్తులకు వెలితిలేకుండ వినయసంపదతో అన్నివిధములైన పనులకు తోడ్పడుచున్న చిరంజీవి జె. బాలసుబ్రహ్మణ్యం ఎం. ఏ. గారికినీ నా మంగళాశాసనములు. వింతగ మకోర్చి సాధ్యమైనంతవరకు తప్పులు లేకుండునట్లు తమపని నేరవేర్చిన అచ్చుకూర్పరులను మనసార దీవించుట తప్ప వారికి నేనేమి చేయగలను

ఈ సంపుటముముద్రణకార్యము దాదాపు రెండున్నరనెలలో ముగిసినది. ఈ వేగము చెడకుండ అచ్చుపని సాగినచో సంవత్సరమునకు నాలుగు, లేక కనీసము మూడు సంపుటములనైన తప్పక వెలువరించి, అధికారులయభిమానఋణమును దించుకొనవలెనని ఆశ. ఎంత మెలకువగ పనిచేసినను తప్పులు తప్పకుండుట మానవత్వ లక్షణము. ఆ తప్పుల నెత్తిచూపి మా యజ్ఞానాంధకారమునకు వెలుగు-చూపగలపండితమిత్రులకు స్వాగతము.

సంగీతమపి సాహిత్యం యస్య నేత్రే ఇవాసతుః।
ఉన్మేషనిమిషాజీవే తం వందే కృష్ణదేశికమ్ ।

ఇట్లు
బుధ విధేయుడు
గౌరిపెద్ది రామసుబ్బశర్మ,
స్పెషల్ ఆఫీసరు,
తాళ్లపాకవాఙ్మయ పరిష్కరణశాఖ
అన్నమాచార్య ప్రాజెక్టు.
తి. తి. దేవస్థానములు.

తిరుపతి
సిద్ధార్థ శ్రావణ కృష్ణజన్మాష్టమి
14-8-79

శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు

స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహనశకవరుషంబులు ౧౩౪౬ అగు-నేఁటి క్రోధిసంవత్సరమందు, తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించినపదారు-యేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను, అదిమొదలుగాను శాలివాహన-శకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటిదుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ౧౨ * విరుధానకు తిరువేంగళనాథునిమీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమా-చార్యులు విన్నపముచేసినశృంగారసంకీర్తనలు.

రేకు 1101 భైరవి

ఇంకనేల బొంకనూ ఇద్దరముఁ గూడితిమి
పొంకముగ నానతిమ్మా పూఁచి నవ్వే నేను ॥ పల్లవి ॥

ఆసలు రేఁచుక పోయి ఆకెమీఁద వేడుకతో
నేసలువెట్టితివా చెలరేఁగి
వేసరక నమ్మించి వేగినంతాఁ దమకించి
బాసలు నేసితివా పలుమారును ॥ ఇంక ॥

---

* ఈశబ్దము 'విరోధ' 'విరుద్ధ' శబ్దములకు వ్యావహారికరూపముగా గావచ్చు చున్నది. అర్థగింపు, అవధి అని యర్థము. అనాఁడు కడపటిదినమని తాత్పర్యము. కీ॥ శే॥ ప్రభాకరశాస్త్రిగారూహించిన "సరియగు" అనునర్థము తాత్పర్యార్థము గావచ్చును. 'అవధి' అను నర్థములో "ఈ విరుద్ధమునకుఁ గుశలంబు మాకు" అను తరిగొండ వెంగమాంబగారిప్రయోగము దీనికి సహాయపడుచున్నది. సాహిత్య అకాడమివారి 'విష్ణుపారిజాతము' 55 పుట. నే నీప్రయోగమివ్వగా శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణ-శర్మగారు, "విఱుత్తం" అనుఅరవపదముకూడ 'విఱువు' అను నర్థములో దీనికి సహాయపడునవిరి.

చిక్కసివవ్వులతోడ సిగ్గులెల్లాఁ బెడఁబాయ
చెక్కులు నొక్కితివా సేదలుదేర
లక్కవలెఁ గరఁగఁగ లలనతో దూరుతాను
మొక్కులు మొక్కితివా ముచ్చట దీరఁగను ॥ ఇంక ॥

వలపులు చల్లిచల్లి వంతులు వానులెంచక
అలుకదేర్చితివా ఆపెను నీవు
యెలమి శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
అలరి యీసుద్దు లాడ నాడుకొంటివా ॥ ఇంక ॥ 1

పాడి

గుట్టుతోడి నీవు వన్ను గొరబుసేయకువయ్య
వుట్టిపడి నాతో నవ్వనోపుదువా ॥ పల్లవి ॥

ఆయములునోఁక నీతో నాడుకొనఁజాలఁగాక
పాయపునీయాలఁగానా పరాకేఁటికి
చేయిచాఁచ కిటు నీతో సిగ్గువడి వుందానఁగా—
కోయి నీవు నాతో సంతకోపుదువా ॥ గుట్టు ॥

కన్నుల జంకించి నిన్ను కక్కసించఁజాలఁగాక
మన్నించేదానఁగాన మాయలేఁటికి
చన్నుల నే నొత్తి నీతో సరసములాడఁగాక
వున్నపమల కఁతేపి కోపుదువా ॥ గుట్టు ॥

తేనెగారేమోవి ఇచ్చి తిట్టు దిట్టఁజాలఁగాక
మేవదానఁగానా నాతో మేకులేఁటికి
యీనెపాన శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
వూనినవారతులకు వోపుదువా ॥ గుట్టు ॥ 2

శ్రీరాగం

చెలులాల సీయకునిచిత్తము గాక
తలఁపించేనా దాసఁా తనతో నేను ॥ పల్లవి ॥

జగములేలేవాఁడు జవ్వనమదమువాఁడు
నగితే నే సరిగాను నవ్వఁగలనా
పగటుఁ జుట్టుఁగైదువపట్టినచేతివాఁడు
తగవులాడఁగలనా తనతో నేను ॥ చెలు ॥

వేవేలుసతులవాఁడు వెన్నెలచూపులవాఁడు
వావులు చెప్పి వరుసపంతడిగేనా
కోవరపురాకాసులఁ గొట్టినవీరటువాఁడు
తావళించి వీరసేనా తనతో నేను ॥ చెలు ॥

నాలుగుచేతులవాఁడు నాగళయనపువాఁడు
తేలుఁదనముస సరిపెనఁగేనా
యీలీల శ్రీవేంకటేశుఁ డిటు తానే నన్నుఁ గూడె
దైలతో [1]నేఁ గొసరేనా తనతో [2]నేను ॥ చెలు ॥ 3

మాళవిగౌళ

అప్పటి కప్పుదే కాక అంతయేఁటికి
యెప్పుడూ మనకుఁబోదు ఇందవయ్య విడెము ॥ పల్లవి ॥

తక్కి మాఁటుననున్నంతతడవు నిను దూరితి
నిక్కి చూడఁబోతేను నీవే నేను
కక్కసించ నిఁక నిన్ను కడు[3] నానవెట్ట కిఁక
యిక్కువలు గరఁగేను ఇందవయ్య విడెము ॥ అప్ప ॥

1. 2. ఇట్టి పునరుక్తు లక్కడక్కడ గలవు. 3. కడున్ + ఆనవెట్టకు

గుట్టుతో నూరకుండఁగా గుణము వెరవులాయ
నెట్టుకొని మాటాడితే నీవే నేను
పెట్టను రట్ల నిన్ను పెనఁగకుమిఁక నీవు
ఇట్టె నీమాఁటలు వింటి నిందవయ్య విడెము ॥ అప్ప ॥

ఆరయ దూరకున్నందు కటు నిట్టు బిగిసితి
నేరిచి పొందుసేసితే నీవే నేను
కోరి శ్రీవేంకటేశుఁడ కూడితి మిద్దరమును
యీరీతిఁ బాయకుందము ఇఁదవయ్య విడెము ॥ అప్ప ॥ 4

ఆహిరి

నమ్మిక లియ్యవచ్చేవు నాకా నీవు
తమ్ములపునోర నిఁకఁ దడవకు పనులు ॥ పల్లవి ॥

చెక్కుటిచేఁతలమీఁద సెలవినవ్వులమీఁద
మొక్కినమొక్కులమీఁద మోచె నీమాట
యెక్కువతక్కువలేల ఇంకా సాకిరులేల
దక్కె నీవేడుకలెల్లా తడవకు పనులు ॥ నమ్మి ॥

వొట్టినచెమటమీఁద వొరగుఁదురుముమీఁద
నిట్టూరుపులమీఁద నిండె నీమాట
వట్టియాన లిఁకనేల వలవనిముచ్చటేల
దట్టమాయ నేరుపెల్లఁ దడవకు పనులు ॥ నమ్మి ॥

కన్నులచూపులమీఁద కాయపుకళలమీఁద
మున్నిటిరతులమీఁద ముంచె నీమాట
యెన్నిక శ్రీవేంకటేశ ఇద్దరముఁ గూడితిమి
తన్నుఁదానె పైకమాయఁ దడవకు పనులు ॥ నమ్మి ॥ 5

బౌళి

ఎక్కువతక్కువమాట లిఁకనేల
మిక్కిలి నీలోఁగలమేలు చూపవలెఁబో ॥ పల్లవి ॥

పంతమాడినట్లానే పనికి రావలెఁగాని
యెఁ(యెం?) తైననేతులు నెమ్మె లెవ్వరాదరు
మంతనాన నున్నారము మచ్చిక నిద్దరమును
చెంతల నీచేఁతలెల్లాఁ జేసి చూపవలెఁబో ॥ ఎక్కు ॥

నన్ను నవ్వినట్లానే ననుపు గావలెఁగాని
ఇన్నేసివేసాలబీరా లెంతలేదు
కన్నులయెదుట నిదె కానవచ్చి మనగుట్టు
పన్నినరతిమర్మాలు పచరించవలెఁబో ॥ ఎక్కు ॥

కొంగువట్టినట్లానే కూడిచూపవలెఁగాని
యెంగిలివట్టిసరసా లేమిటాఁతి
చెంగటఁ గూడితిమిదె శ్రీవేంకటేశ మనము
పొంగేటియాసోదాల భోగించవలెఁబో ॥ ఎక్కు ॥ 6

రేకు 1102 సామంతం

వలచినదాని కెందు వాదు చెల్లదు
బలువులే చూపవయ్య బాపదప్ప దిఁకను ॥ పల్లవి ॥

వేడుకకు వెలలేదు వెన్నెల కెంగిలిలేదు
ఆడిక నీచేఁతలకు నడ్డము లేదు
పీడె మిందవయ్య నీవిద్యలెల్ల లోఁగొంటి
వోడ కిట్టె నవ్వవయ్య వొరయ నిన్నిఁకను ॥ వల ॥

మరునికి వేళలేదు మాయలకు గురిలేదు
వరుస నీకూటాలకు వావిలేదు
సరుగ మో విందవయ్య చనవెల్లఁ జేకొంటి
తెరలోనికి రావయ్య తెగ నీకు నీఁతను ॥ వల ॥

చిగురుకు చేఁగలేదు సిగ్గులకు తప్పులేదు
జగు నీయాసోదానకు తనివిలేదు
నిగిడి శ్రీవేంకటేశ నీవు నేనూఁ గూడితిమి
మొగమెత్తి చూడవయ్య మొక్కే నేనీఁకను ॥ వల ॥ 7

## దేసాళం

వట్టినవ్వు లంత యాల వావాతను
నెట్టుకొనఁ జొక్కించితే నిన్నుఁ బొగడేము ॥ పల్లవి ॥

వేడుక నీమాఁటలకు వెలలేదు। అట్టె
కూడినకూటములకు గుఱిలేదు
యేడ నుద్దులు దడవే వింకా నీవు। నన్ను
సూడిదెగా మన్నించితే చుట్టాలమయ్యేము ॥ వట్టి ॥

కొంగువట్టితే వలపు కుప్పవడదూ। నీ —
వుంగిటిమెచ్చులనే వుట్టిపడదు
జంగిలికేల తెచ్చేవు సారెకు నీవూ। మా —
ముంగిటికి వచ్చితేనే మొక్కులు మొక్కేము ॥ వట్టి ॥

కన్నులఁ జూచినంతలో కాఁకదేరదూ। లోలో
సన్నలు సేసినంతలో సదిదేరదు
ఇన్నిటా శ్రీవేంకటేశ ఇటు గూడితి। మా —
విన్నపములు వింటేను విందులు వెట్టేము ॥ వట్టి ॥ 8

పాడి

నేరుపరి ననుకోను నెరజాణ ననుకోను
యీరీతి నాహావభావా లింతెఱఁగఁడా ॥ పల్లవి ॥

మఱసి తనతో నేను మాటలాడనని దూరి
సెలవుల నవ్వితేనే నేనమాటలే
పిలిపించనని తాను బిగువులు నెరపీని
తలుపు దెరచితేనే తగుసన్నగాదా ॥ నేరు ॥

దగ్గరఁ గూచుండనంటా తమకించినంతలోనె
సిగ్గువడి వుండితేనే చేరివుండుటే
వొగ్గి తన్నుఁజూడనంటా వొరట్లు వట్టీని
అగ్గమై యెదుటనుండే అన్నియునుగాదా ॥ నేరు ॥

ముందు కాఁగిలించనంటా మొనలెల్లఁ జూపీని
ఇందమని విడెమిచ్చు టిదియే అది
అందపు శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నేను
పొందితి మిద్దర మివి పోదులెల్లాఁగావా ॥ నేరు ॥ 9

వరాళి

కామిని యప్పటనుండి కాచుకున్నది
దోమటివలపులకు దోసమున్నదా ॥ పల్లవి ॥

మంతనమాడఁగరాదా మలసి యప్పటనుండి
యింతి విన్నుఁబిలిచీని యేకతానకు
వింతవా రుండితే నేఁడు వెఱపేల వచ్చె నీకు
దొంతరవలపులకు దోసమున్నదా ॥ కామి ॥

పమ్మి చేయిచాఁచఁగరాదా పందెమువేసేనంటా
యెమ్మెలకే పెనఁగీని యీాపె నీతోను
చిమ్ముచు నామోము చూచి సిగ్గేల వచ్చె నీకు
దొమ్మివలపుల కింత దోసమున్నదా ॥ కామి ॥

గద్దమువట్టఁగరాదా కాఁగిలించుకొనేనంటా
వొద్దిక వున్నవి చన్ను లువిదకును
అద్దమై శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
దొడ్డివలపులకును దోసమున్నదా ॥ కామి ॥ 10

సాళంగం

వద్దు వద్దు మాతోను వట్టిసటలిఁకను
యిద్దరుఁ గూడేటివేళ యెవ్వరున్నా రపుడు ॥ పల్లవి ॥

పొంచి నిన్నాపె వేసినపువ్వులచెండే గుఱుతు
కొంచక జారిననీకొప్పే గుఱుతు
యెంచఁగ నప్పుడు సాక్షి యెవ్వరు వచ్చుండేరు
ఇంచుకంతలోనే నీవేల బొంకే విపుడు ॥ వద్దు ॥

వువిదకంకణములవొత్తు లవిగో గుఱుతు
జవళి నీపెంజెమటజాతే గుఱుతు
పవళించి మీరుండఁగా పైకొని రానైతిఁగాని
ఇవల విందుకుఁగాను యేలబొంకే విపుడు ॥ వద్దు ॥

చెలి నీమోవి వించిన[1]చిలుకవోటే గుఱుతు
సెలవుల నీకుఁదోఁచేసిగ్గు గుఱుతు
బలిమి శ్రీవేంకటేశ పైకొని నన్నుఁ గూడితి-
విలపై విందె నీసుద్దులేల బొంకేవిపుడు ॥ వద్దు ॥ 11

1. చిలుక + వోటు.

పాడి

నిన్నేమనేము నేము నీకేఁటిఆచారము
కన్నచోట్లను మోటు గాలికి వెఱచునా ॥ పల్లవి ॥

సరసము లేమాదేవు సతులపయ్యదల
మరిగేవాఁడవు నీకు మాటలునేల
దరిచేరినవియెల్ల తలపోయ గుల్లలని
ధరలోన ననేమాట తగ నీయందున్నది ॥ నిన్నే ॥

తొడికేవు నిజముల తొయ్యలులచూపుల
[1]బడిసెవాటవు నీకు బాసలునేల
నుడుగులు దప్పినాను నోముఫలము దప్పదు
అదరఁగ ననుమాట అది నీయందున్నది ॥ నిన్నే ॥

వేసరక నవ్వేవు వెలఁదులరతులకు
ఆసోదకాఁడవు నీకు [2]నంతేశాల
నేసపెండ్లి కొడుకవు శ్రీవేంకటేశ కూడితి
[3]తాను పయిఁడంతతూకము తగ నీయందున్నది ॥ నిన్నే ॥ 12

రేకు 1103 వరాళి

కొలువువా రివి గంటే కొల్లున నవ్వేదురు
తిలకించి చూచుకొంటే తిద్దుకొందువు ॥ పల్లవి ॥

నీమేనివింతచేఁతలు నీడచూచుకోవయ్యా
కామినిచెక్కులే నీకు కంచుటద్దాలు
వేమారు నేమనఁబోతే వెంగెమై తోఁచు నీకు
దీమసాన నీవై తే తిద్దుకొందువు ॥ కొలు ॥

1. బడిపెవాటు=దిష్టిపోటుటయా? 2. అంతేసి+ఏల. 3. 'తానువయిఁడంత తూకము' అన్నది, విచారింపవలసియున్నది.

వెలఁదిడినజవ్వాది వేరేపూవు గట్టవయ్య
పొలఁతిగుబ్బలే నీకు పూవుగుత్తులు
యెలమి నేమేమనిన యెగసక్కేమై తోఁచు
తెలుసుక నీకునీకే తిద్దుకొందువు ॥కొలు॥

[1]యెయ్యేడో ఆఁకలి నీవు యీడఁ దీరుచుకోవయ్య
తొయ్యలిమోవే నీకు దొంతిబోనము
నెయ్యపుశ్రీవేంకటేశ నేనంటే నన్నుఁ గూడితి
తియ్యక వెనకవెల్ల తిద్దుకొందువు ॥కొలు॥ 13

ముఖారి

ఔనౌ మరి ఆఁడువార మంత కోపము
ఆనతిమ్మా నీకు నితవైనట్టే నేనేను ॥పల్లవి॥

సారె సారె నీతోను సణఁగులు చూపఁగాను
భారము గాదుగదా పంతగాఁడవు
కూరిమి గలిగి నేను గొణఁగుచుఁ దిట్టఁగాను
వైరముగాదుగదా వాసికాఁడవు ॥ఔనౌ॥

కప్పినట్టి నీమోవిగంట్లెట్టె రేఁచఁగాను
నొప్పులు గావుగదా నుడికారివి
చిప్పిల వింటికి నీవు చేయివట్టి తియ్యఁగాను
దప్పులు గొనవుగదా తమకపుదొరవు ॥ఔనౌ॥

కాలుమీఁదఁ గాలువేసి కరఁగించి కూడఁగాను
నాలితో మొక్కవుగదా నాఁటకీఁడవు
యీలీల శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
వేళలు గావవుగదా వేడుకకాఁడవు ॥ఔనౌ॥ 14

1. ఏడ + ఏడో.

రామక్రియ

ఏది [1]వాటి నీగుణాన కేమి చెప్పేము
పోదిగొన్నవద్దివారిపుణ్యము నీచేతిది ॥ పల్లవి ॥

సలిగెలు రేఁచుకొని సణఁగులురాలిచేటి-
చెలులకే నీవు కడుఁజిక్కుదువు
వలచి పైకొనియేటివనితలఁ గంటేను
పెలుచుఁదనాన నట్టె బిగుతువు ॥ ఏది ॥

చనవులు నేసుకొని సారెసారెఁ దిట్టేటి-
వనితలకే నీవు వలతువు
పెనఁగి ప్రియముచెప్పేప్రియురాండ్లఁ గంటేను
కొనగొనలనే నీవు గుట్టునేసుకొందువు ॥ ఏది ॥

తరితీపునేసుకొని తమకాలు రేఁచేటి-
తరుణులనే నీవు దగ్గరుదువు
అరుదై శ్రీవేంకటేశ అంతలో నన్నుఁ గూడితి-
విరవై అంతటిలోనే యిందరి మన్నింతువు ॥ ఏది ॥ 15

గౌళ

ఇంతకంటెఁ జెలులాల యేమిచెప్పే రతనికి
మంతుకెక్కె తన్నుఁదానె మంచిదయ్యీఁగాక ॥ పల్లవి ॥

బుద్ధులు నేఁ జెప్పనా పొందులు నేఁ జూపనా
బద్దులకాంతల నట్టె పాయఁడుగాక
గద్దించి నేఁ జూడనా కన్నుల జంకించనా
పెద్దరికపువారితోఁ బెనఁగీఁగాక ॥ ఇంత ॥

1. ఏది + పాటి.

పొంకానకు దిద్దుకోనా పొంచి పరాకు సేయనా
మంకుఁజీఁకటితప్పులు మానఁడుగాక
అంకెసేసుక వుండనా లావులెల్లఁ జూపనా
బింకపువారిమాటలు ప్రియపడీఁగాక ॥ ఇంత ॥

కందువ నేఁ గూడనా కాఁగిలించుకొననా
చెంది వారిగుణా లిడఁ జెప్పీఁగాక
అందపుశ్రీవేంకటేశుఁ డాతఁడే నేఁ గానా
మందెమేళాలేలో తొట్టి మరిగీఁగాక ॥ ఇంత ॥ 16

లలిత

వనిత లిట్టయితేను వలచివత్తురు నీకు
ఘనుఁడవు మేలు మేలః కంటిమిగా గుణము ॥ పల్లవి ॥

వంచినశిరసుతోడ వాలినట్టితురుముతో
కుంచె నీకు విసరేటికోమలిఁ జూచి
మంచముమీఁదికిఁ దీసి మన్నించితి వన్నిటాను
అంచె నాఁటదానిగోడు ఆలించితిగా ॥ వని ॥

కమ్మర నాసలతోడ కారేటిచెమటతోను
చమ్మాళిగెలు వట్టినసతిఁ జూచి
కమ్మి పచ్చడము గప్పి కరుణించితి వన్నిటా
నెమ్మి నింతులపయ్యెద నీకుఁ గద్దుగా ॥ వని ॥

వాలుకచూపులతోడ వడి నిట్టూరుపులతో
కాళాఁజి వట్టినసతిఁ గలసితివి
మేలిమి శ్రీవేంకటేశ మించ నన్నుఁ గూడితివి
యీలీల సతులవలపియ్యకొంటిగా ॥ వని ॥ 17

బౌళి

ఓపనన్నవారినేల వాదివట్టేవు నీపై
చూపునాటించినవారిఁ జూడరాదా ॥ పల్లవి ॥

తలవంచుకుండఁగాను తగ పంతమియ్యఁగాను
వొలిసి నన్నేల నీవు నొడివట్టేవు
చెలఁగి నీమేననున్న చేఁత సేసినయాపెతో
నొలసి నీబలిమెల్లాఁ జూపరాదా ॥ ఓప ॥

చెక్కుచేత నుండఁగాను చేరి నీకు మొక్కఁగాను
వొక్కటొక్కటాడి యేల వాదివట్టేవు
నిక్కినిక్కి తామెరల నిన్ను వేసినవారితో
పెక్కుచందముల నీవు పెనఁగరాదా ॥ ఓప ॥

వొద్దఁ గాచుకుండఁగాను వూడిగాలు సేయఁగాను
వుద్దండానఁ గూడి యేల వాదివట్టేవు
చద్దికిని వేఁడికిని జమళినుండినవారి
అద్దుక శ్రీవేంకటేశ అలమరాదా ॥ ఓప ॥ 18

రేకు 1104 కేదారగౌళ

పూవకపూచె వీరికి పొదిగొని వలపులు
చేవదేర మాతోనే చెప్పేరు ంా సుద్దులు ॥ పల్లవి ॥

చన్నుల నొత్తితేఁ దనజంటమేను గం
కన్నులచూపులే ఆపెఁ గాఁదెనట
యెన్ని వేసాలు సేసేరు యేమిచెప్పేమమ్మ నీతో
విన్నప్పటనుండి మాకు వెరగయ్యీ సుద్దులు ॥ పూవ ॥

మోవి సోఁకితే నాతని మొనలెల్లా రాఁగెనట
 కావిజంకెన లాపెఁ గదిమెనట
 యేవంక చూచిన వీరియెమ్మెలే వెగ్గళమాయ
 నూవుగింజ నానదిదె నోటిలో నీసుద్దులు ॥ పూవ ॥

చేయిచాఁచితె ననిచె శ్రీవేంకటేశ్వరుకట
 కాయము చెమరించె నాకాంతకునట
 యీయెద నన్నిటు గూడె యెవ్వరి నేమనవచ్చు
 బాయిలిపందిలులాయ పంతపుయీసుద్దులు ॥ పూవ ॥ 19

నేననఁగ నెంతదాన నీపాలికి
 చేనిపంట కొయ్యేలే చెప్పీ చెప్పవయ్య బుద్దులు ॥ పల్లవి ॥

మచ్చిక నేఁ జల్లఁగానే మాటలాడ వచ్చేవు
 ఇచ్చకుఁడ ఇందాఁక నెందువోతివి
 తచ్చనకాఁడవు నీవు తగులువిరులాడేవు
 నచ్చులగొల్లెత లెట్టు నమ్మిరయ్య నిన్నును ॥ నేననఁ ॥

పైకొని నేఁ బిలువఁగ పలుకఁగ వచ్చేవు
 చాకలవాఁడవు ముంచవద్దా నీవు (?)
 కాకరివాఁడవు మాతో గాలి ముడియగట్టేవు
 చేకొవి నీచెలిమెట్టు చేసిరయ్య సతులు ॥ నేన ॥

మించి నేఁ గూడఁగానే మెచ్చులెల్లా మెచ్చేవు
 మంచముపై నుండి యేల మరచుంటివి
 చంచల శ్రీవేంకటేశ సందుసుడి మెలఁగేవు
 యెంచ నిన్నెట్టు గెలిచి రిన్నాళ్ల నింతులు ॥ నేన ॥ 20

## పాడి

కలమాఁట చెప్పే నీతో కల్లలాడ నేరఁగాని
చెలఁగి కడపలోన చిత్తగించవయ్యా ॥పల్లవి॥

కపట మించుకలేదు కాఁతాళమే వుండీఁగాని
వుపమల నన్నేల వొరసేవయ్యా
నెపములు వేయ నీపై నిందలే మోచీఁగాని
చపలచిత్తము మాని చక్కవినవయ్యా ॥కల॥

జగడ మింతాఁ దీరె చనవే మెరసేఁగాని
నగుతానే నన్నేల నమ్మించేవయ్యా
పగటులు చూప నీతో పంతమే నెరపేఁగావి
మొగమః చూతువుగాని ముందట నుండవయ్యా ॥కల॥

కోపములెల్లాఁ బాసె కొనగోరే నాఁటేఁగాని
తీపులు నీవేఁటికి సాదించేవయ్యా
యేపున నిన్ను శ్రీవేంకటేశ నేఁ గూడితిఁగాని
చేపట్టితి విదె నీవు సిగ్గువడవయ్యా ॥కల॥ 21

## కురంజి

అతఁడిదె నీవిదె అన్నిటాను జాణలు
యేతుల నింకానేలే యెదమాఁటలు ॥పల్లవి॥

అంకెకు రానేరిచితే అలుకలైనా సుఖమే
మంకుఁదనాలుడిగినమానినులకు
సంకెదీరితే మరునిశరములెల్లా విరులే
యింకనైనా మామాఁట లియ్యకొనరే ॥అతఁ॥

విననేరిచినఁజాలు విరహమైనా సుఖమే
మనసుదెలిసినట్టిమగువలకు
చెనకి లాలించితేను చిలుకలు మాఁటలాడు
[1]చలములు మాని యిఁక నమ్మతించరే ॥ ఆత ॥

సరసము నేరిచితే జంకెనలైనా సుఖమే
తరితీపులెరిఁగినతరుణులకు
యిరవై శ్రీవేంకటేశుఁ డిదివో నిన్నిటు గూడె
యెరవులు మరియేల యెనసుండరే ॥ ఆత ॥ 22

ముఖారి

సంకెలెల్లాఁ దీరె చనవు లీడేరెను
వంక లొత్తకువే మాఁట వాఁటమయ్యీ సిగ్గులు ॥ పల్లవి ॥

నగినదాఁకా నింతే నాతీ నీనిష్టూరమెల్ల
తెగనాడి ఇంతలోనే తిట్టనేఁటికే
మొగము చూచినప్పుడే ముచ్చటలు తుదకెక్కె
పగదాటకువే నీపయ్యద జారీని ॥ సంకె ॥

దగ్గరుదాఁకా నింతే తలపోఁతలన్నియును
కగ్గి ఇందుకుఁగా వట్టికపటాలేలే
బగ్గనఁ బిలికితేనే పంతమెల్లా నీడేరె
నిగ్గులఁ బెనఁగకువే నిండీఁ జెమటలు ॥ సంకె ॥

పొందినదాఁకా నింతే పొరపొచ్చెములెల్లాను
సందుసుడి నీకేలే జంకెనలు
ముందే శ్రీవేంకటేశుఁడ మొక్కఁగానే కూడితివి
పందెములు వేయకువే పచ్చిఁ(చ్చి?)దోఁచీఁ బనులు ॥ సంకె ॥ 23

1. ప్రాసభంగము, అక్కడక్కడ 'వ–బ' ప్రాస కానవచ్చుచున్నది.

రామక్రియ

ఒద్దనే నే నున్నదాన వున్నది నీవెఱఁగవు
గద్దించి చూడవైతివి కామాంధకారానను ॥ పల్లవి ॥

హత్తి నీతోఁ బొందునేసి ఆయములు గరఁగించి
బిత్తరిమాటలాడెఁగా ప్రియురాలు
లత్తుకరసాలతోడిలలితంపుఁగొనగోర -
నొత్తి నిన్ను సన్ననేసి వొరసెఁగా అపుడు ॥ ఒద్ద ॥

పెనఁగి కాఁకలు చల్లి బిరుదులెల్లా నెరపి
చనవు మెరసెఁగా జవరాలు
తనివోనిముచ్చటల తమకము రేఁచిరేఁచి
పనిగొనెఁగా ఆపె పంతమున నపుడు ॥ ఒద్ద ॥

గక్కనఁ గాఁగిలించి కన్నులు దేలగింపుచు
మొక్కి వూరకె వుండెఁగా ముద్దరాలు
అక్కడ శ్రీవేంకటేశ ఆవేళ నన్నుఁ గూడితి
తెక్కులనీతమకము తెలిసెఁగా అపుడు ॥ ఒద్ద ॥ 24

# 1105-వ రేకు లేదు.

రేకు 1106 గౌళ

ఇంతవాఁడవు నీబలి మిందుమీఁదనా
పంతపునీమనసెల్లఁ బట్టి తెచ్చీనా ॥ పల్లవి ॥

పిక్కటిల్లఁ దమకానఁ బెరిగెనింతె చన్నులు
కిక్కిరియ నీవు పెనఁగేపాటివా
వెక్కుమారు లింతయేల పిసికేవు ఇవి నిన్ను
జక్కవపులుగు లిట్టె సాదించీనా ॥ ఇంత ॥

నిండినకోరికలచే నిక్కెనింతె యీతురుము
బండుబండుగా నీవు పట్టేపాటిదా
చండినేయక విడువు సమయమునేసీ నీపై
గండు(దుమ్మిదలు ఇవి ఘాతనేసీనా ॥ ఇంత ॥

అట్టె చూడ(గా వెలసె అడుగులనడపులు
పట్టేవేల కూడుమంటా బలిమా యిది
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
జట్టిగొన్నహంస లివి చండినేసీనా ॥ ఇంత ॥ 25

సాళంగనాట

కన్నవే అన్నియును నీఘనతలెల్లా
నిన్న మొన్న నివియెల్లా నేరుచుకవచ్చేవా ॥ పల్లవి ॥

చూపులోనే కానరాదా సూటియైననీవలపు
ఆపొద్దుననుండి పెట్టేఆనలేలా
చేపట్టితి వల్లనా(డే చేరి నీవారమైతిమి
తీపులు పై(బూనేవు దీనికి( గడమలా ॥ కన్న ॥

మాటలోనే కానరాదా మనసులో మర్మాలు
యే(టికి మాతో( జెప్పే వెందా(కను
మే(టి( జేసితివి నన్ను మేనదాన నే నీకు
యే(టికి వే(దుకానేవు యిదిగొంత వలెనా ॥ కన్న ॥

కూడినందే కానరాదా గుణములు నీవెల్లా
ఆడుకొననేమిటికి అంత మాతోను
యీడులేక శ్రీవేంకటేశ నన్ను( గూడితివి
వేడుకపడేవు నీవిధము లెఱి(గనా ॥ కన్న ॥ 26

ఆహిరి

అతఁ డీడనే వున్నాఁడు అడుగరే
సీతితోడ నన్నునేల నేరమెంచేరే ॥ పల్లవి ॥

మొగము చూచినఁగాక మోహమెట్టు గానవచ్చు
నగినఁగా కెటు లామన్నన దెలుసు
తగులనాడినఁగాక దగ్గర నెట్లవచ్చు
నిగుడి మీరేల నన్ను నేరమెంచేరే ॥ అతఁ ॥

మచ్చిక చల్లినఁగాక మాఁటలెట్లా నాడవచ్చు
ముచ్చటలాడక యెట్లు మొక్కవచ్చును
మెచ్చకతొలుతనే మేలమెట్లా నాడవచ్చు
నెచ్చెలు లిందరునేల నేరమెంచేరే ॥ అతఁ ॥

చెలిమి నేసినఁగాక చెనకఁగ నెట్టువచ్చు
పిలువకతొల్లే యెట్టు పెనఁగవచ్చు
అలమి శ్రీవేంకటేశుఁ డంతలోనే నన్నుఁ గూడె
నెలకొని యిప్పుడేల నేరమెంచేరే ॥ అతఁ ॥ 27

దేసాళం

నీయంతవారమా నీవార మింతేకాక
నాయమాదేవారమా నమ్మేవారముగాక ॥ పల్లవి ॥

మారుకొని నేము నీతో మాటలాడేవారమా
వైరములేకుండఁ దిట్టేవారముగాక
చేరి నీమేను నొవ్వ చెనకేటివారమా
నారుకొన గోరుసోఁక నవ్వేవారముగాక ॥ నీయం ॥

సరికిబేసికి నీతో జగడాలవారమా
వరుసెరిఁగి జంకించేవారముగాక
పరిపరివిధముల పగచాటేవారమా
గొరబుగా కొంగువట్టుకొనేవారముగాక ॥ నీయం ॥

బలిమిఁ గాఁగిట నన్నుఁ బట్టుకొనేవారమా
వలపించి లోలోఁ గూడేవారముగాక
కలసితి వీడ శ్రీవేంకటేశ్వరుఁడ నన్ను
పిలిచేటివారమా ప్రేమవారముగాక ॥ నీయం ॥ 28

## పాడి

చెప్పక నేమెఱఁగము చిత్తము నీదెట్లానో
చెప్పి సేయించుకోవయ్య చేరి వూడిగాలు ॥ పల్లవి ॥

గుఱితాఁకులవలపు కొమ్మచూపుల నున్నది
చిఱునవ్వులవలపు చెక్కుల నదె
తఱచయినవలపు తగ మోవినున్నది
నెఱయ నేవలపులు నేరిచితివో ॥ చెప్ప ॥

చలమతివలపులు చనుమొనల నున్నవి
కులుకువలపు గోరికొన నదె
పెలుచువలపులెల్ల పిరుఁదుననే వున్నవి
యెలమి నీ కేవలపు యితవయ్యీఁ ॥ చెప్ప ॥

తమకపువలపెల్ల తగుకాఁగిట నున్నవి
గుమురువలపు పెద్దకొప్పున నదె
చెమటతోఁ గూడితివి శ్రీవేంకటేశ్వర చెలి
అమరిన దేవలపు అంటినో నీకు ॥ చెప్ప ॥ 29

సామంతం

నేరుపరివాదు వన్నిటా నీవు
ఈరీతి మమ్ముఁజూచి నీవేల నవ్వేవయ్యా ॥ పల్లవి ॥

మచ్చికసేసిననీమాటలకు లోనై
రచ్చలకు నెక్కితిమి రవ్వయితిమి
పచ్చిసిసతులచేతిపలుకులకు లోనైతి –
మిచ్చల మమ్ముఁజూచి నీవేల నవ్వేవయ్యా ॥ నేరు ॥

సోగకన్నులఁజూచేనీచూపులకు లోఁగి లోఁగి
జాగులకు లోనైతిమి సరియైతిమి
బాగులైననీవద్దిపడఁతులఁ జూచితిమి
యీగతి నీవింతలోనేల నవ్వేవయ్యా ॥ నేరు ॥

చేవలుదేరిననీచేఁతలకుఁ జొక్కి చొక్కి
వావులు దెలుపుకొంటి వనితనైతి
దేవ శ్రీవేంకటేశ నీదేవి నలమేల్మంగను
యీవేళఁ గూడితివి నీవేల నవ్వేవయ్యా ॥ నేరు ॥ 30

రేకు 1107 దేశాక్షి

కాంతమీఁద విష్టారము కట్టకువయ్యా
వింతలేదఁ జేసీని విచ్చారించవయ్యా

తలఁపు నీమీదఁనే తలవంచుకున్నదింతే
అలుకేడ నున్నదో అంగనకును
వలపు నీమీఁదిదే వాడుదేరీ నింతే మోము
చలము లేదనున్నవి సటలు వద్దయ్యా ॥ కాంత ॥

42894

తగులు నీమీఁదిదే తక్కీ సిగ్గువడీ నింతే
యెగసక్కేమేడనుండో ఇందులోనను
నగవు నీమీఁదిదే నావఁబెట్టీ నిదె యింతే
పగటు లెక్కడఁ జూపె పచారించవయ్యా ॥ కాంత ॥

చేతులు నీమీఁదిదే(వే?) చిత్తము తెలిసీ నింతే
ఘాత యాడనున్నదో కలది యిది
యీతల శ్రీ వేంకటేశ యింతి నిట్టె కూడితివి
నీతి యెక్కడ నున్నది నీవు జాణవయ్యా ॥ కాంత ॥ 31

## తోండి

నీవు నేనుఁ జాలదా నేరుపులే కలితేను
వేవేలుగ వలపులు వెదచల్లేటందుకు ॥ పల్లవి ॥

నగవులేమిటికి నాలినేసి నీవు నన్ను
పొగరులఁ గాఁగిలించి పొందేయందుకు
తగవులేమిటికి తరుణులఁ గూడపెట్టి
మొగిఁ గంకణదారము ముంచి కట్టేయందుకు ॥ నీవు ॥

వెనకులేమిటికి చేసన్నలకు లోనై
తనివంద నీవు నాకు దక్కేయందుకు
ననుపులేమిటికి నమ్మించి నీవు నాపై
పెనఁగి విందునేసలు పెట్టేయందుకు ॥ నీవు ॥

పంతములేమిటికి పైపై నిందరిలోన
యింతేసిచనవు నాకిచ్చేయందుకు
కాంతుఁడ శ్రీవేంకటేశ గక్కునఁ గూడితి నన్ను
బంతివానలేమిటికి బతికించేయందుకు ॥ నీవు ॥ 32

శుద్ధవసంతం

వెలుపలఁబెట్టి మాతో వేసాలేల నేనేవు
కలపితే కదుపునఁ గలసి యిట్టుండుఁగా ॥ పల్లవి ॥

యింతలో నీవాపెను యింటికి తెచ్చుకొంటేను
వంతులకు వాసులకు వచ్చుఁగా మాతో
చింతదీర నొక్కచోఁటే నేసవెట్టి పెండ్లాడితే
పంతములు మీరక మాపనులకు వచ్చుఁగా ॥ వెలు ॥

చలివాపి ఆపెను మా సవతిఁగా జేసితేను
నిలువుఁగొలువులను నిలుచుండుఁగా
కొలము తెలిపి మాతో కూటికి లోనుచేసితే
నెలకొని మావలె నిన్ను సంతోసించుఁగా ॥ వెలు ॥

గద్దెపీఁటమీఁద నాపెఁ గడఁ గూచుండఁబెట్టితే
సుద్దులెల్లఁ జెప్పుతాను సుకియించుఁగా
వొద్దిక నాపెను మమ్ము నొక్కటిగాఁ గూడితివి
వద్దనే శ్రీవేంకటేశా వాదులెల్లాఁ దీర్చుఁగా ॥ వెలు ॥ 33

కుంతలవరాళి

ఎన్నాళ్లకెన్నాళ్లు [1]యిదేమే నీవు
విన్నపము లాలకించి విచారించేవు ॥ పల్లవి ॥

యిన్నిటాను నీవు నన్ను నేలవలె ననుచును
నిన్ను నొడఁబరచుట నేఁడా నేను
కన్నెలు పదారువేలు కలరంటానుండి వచ్చి
చన్నులంటే విధి లెస్ససరవాయఁగా ॥ ఎన్నా ॥

---

1. ఇక్కడ, 'యిదేమే' యనుట చనవుతోడిమాట. ప్రశ్నద్యోతకము గాదు. తువర్ధతి వ్యవహారములో పేటికివి గలదు.

చేచేత నాచెప్పినట్టు సేయవలె ననుచును
నీచేత బాస గొంట నేఁడా నేను
యేచి నీవు వేగిలేచి యెనమంద్రఁ జక్కఁబెట్టి
కూచుండేవు నావద్ద గుఱుతాయఁగా ॥ ఎన్నా ॥

కైకొని నీవు నాతో కాఁపిరము సేతువంటా
నీకుఁ జేతులు చాఁచుట నేఁడా నేను
యీకడ శ్రీవేంకటేశ యిందరినీఁ బొందివచ్చి
మేకొని నన్నుఁ గూడితి మెచ్చాయఁగా ॥ ఎన్నా ॥ 34

రామక్రియ

ఆపె మెచ్చవలె నీవు అట్టే మెచ్చఁగవలె
వోపిక గలిగి యిట్టే వుండవయ్య యిపుడు ॥ పల్లవి ॥

అంగన నీతోఁ జెప్పఁగ నట్టె నీవు మాటలాడే-
వెంగిలిమాఁటల[1] మాఁటలేల మాకు
పొంగుచు నేనే మీఁదువోనిమాఁట లాడించేము
వుంగిటి గొనక యిట్టే వుండవయ్య ఇపుడు ॥ ఆపె ॥

అప్పుడే విన్నింతి నవ్వుమనఁగా నవ్వే-
నప్పుణనవ్వులు నవ్వు టవేల మాకు
ముప్పిరి నేనే నిన్ను మోసులుగా నవ్వించే
వొప్పుగొని నావొద్ద నుండవయ్య యిపుడు ॥ ఆపె ॥

రవ్వగా నింతి చెప్పఁగా రతి నన్నుఁ గూడితివి
యెవ్వరివంగెనకూటాలేల మాకు
నవ్వపుశ్రీవేంకటేశ మరి నే నిన్నుఁ గూడితి
వువ్విళ్లూరుచు నిట్టే వుండవయ్య ఇపుడు ॥ ఆపె ॥ 35

1. ఎంగిలిమాటలవారిమాటలు?

సాళంగనాట

మమ్మే మడిగేవు నీమతకములు
నెమ్మది నుండేవారము నెపాలు నేరుతుమా ॥ పల్లవి ॥

నీచిత్త మాపె యెఱుఁగు నీవెఱుఁగుదువు గాక
యేచి నీదేవరహస్యా లెవ్వఁ డెఱుఁగు
వాచవులకు నేము వద్దనుండి మాటలాడి
చూచేవార మింతేకాక సోదించఁగలమా ॥ మమ్మే ॥

నీతో నాపె నవ్వఁ జెల్లు నీకుఁజెల్లు నింతేకాక
యేతుల మీవీడుదోళ్ల యెవ్వఁ డెఱుఁగు
చేతులార నేము నీకు సేవలేమయినాఁ జేసి
పోతరించే మింతేకాక బుద్ధిచెప్పఁగలమా ॥ మమ్మే ॥

కోరినట్టే నిన్నుఁ గూడె కొమ్మఁ గూడితివి నీవు
యీరీతి మీ వూహాపోహ లెవ్వఁ డెఱుఁగు
చేరి నన్నుఁ గలసితి శ్రీవేంకటేశ్వర నేఁడు
నేరుపుమిమ్మెంతుఁగాక నీటు చూపఁగలమా ॥ మమ్మే ॥ 36

రేకు 1108 ధన్నాసి

చెప్పిన ట్టిద్దరముఁ జేసేమయ్యా
ఇప్పుడు గాఁగిలించే మియ్యకొంటిమయ్యా ॥ పల్లవి ॥

వరుసఇచ్చేవాఁడవు వాదు మాన్పనేరవా
వెరసి యిద్దరిమాట వినవయ్యా
తెరలోనున్నవాఁడవు తెలియదా నీకిన్నియు
అరసి వెనకముందు లడుగనేలయ్యా ॥ చెప్పి ॥

తగవు దిద్దేవాఁడవు తప్పు దీర్చనేరవా
 సొగిసి నేమున్న జాడ చూడవయ్యా
నగినవాఁడవు నీకు నయములు నేరిపేమా
 మొగమిచ్చలను నీవే మొక్కించవయ్యా ॥ చెప్పి ॥

ఇద్దరిఁ గూడినవాఁడ వెక్కుడు సేయనేరవా
 చద్దికి వేఁడికి మోవి చవిగోవయ్యా
గద్దరిశ్రీవేంకటేశ కలిగితివి మాపాల
 పొద్దువొద్దున నిట్టె భోగించవయ్యా ॥ చెప్పి ॥ 37

బౌళి

బాపుబాపు మెచ్చితినే బలుదానవు
 యేపుతోడ నుండేవార మింతేసి కోసర(కోప?)మే ॥పల్లవి॥

వాసనకస్తూరి వూసి వలపుచవులు చూప
 వేసరవుగదే నీవు విభునితోను
మూసినముత్తెమువలె ముంగిటనే నిలుచుండి
 ఆసపడేవారము నే మంతేసి కోపమే ॥బాపు॥

మోవితేనె లంచమిచ్చి మొకమోడింపించుకొన
 దేవరవుగదే నీవు దేవునితోను
హావభావములతోడ ఆయమంటి మన్ననలే
 ఆవటించుకొనేవార మందు కొడిగట్టము ॥బాపు॥

గందవొడి మీఁదఁజల్లి కాఁగిలించి కూడికూడి
 విందవై తిగదే శ్రీవేంకటేశుతో
అందమై అతఁడే కూడె అలమేలుమంగనేను
 చందమైనవార మింత సాదించనెఱఁగము ॥ బాపు ॥ 38

1. ఈపాటలో త్రికగీతగం విభక్తి-వచనములతో తక్కినవి పోలునా.

## రామక్రియ

ఇంకనేలే మాటలు యెఱుఁగుదు నేనన్నియు
కంకిగా నీతోఁ దారుకాణించితిఁ జాలదా ॥ పల్లవి ॥

నెలవి నీవు నవ్వఁగా సిగ్గువడి ఇంతి నిన్ను
కలువపూవున వేసెఁ గద్దో లేదో
నిలువుటద్దములో నీ నీడ నీవు చూచుకోఁగా
కలికి కాఁగిటఁబట్టె కద్దో లేదో ॥ ఇంక ॥

అందముగా నీవు దన్ను ఆయములు చెనకఁగా
గందము నీపైఁ బూసె కద్దో లేదో
సందడిఁ గొలువులోన సరిఁ బరాకై యుండఁగా
కందువలు నిన్ను నంటెఁ గద్దో లేదో ॥ ఇంక ॥

నిక్కి నీవు చూడఁగాను నిన్నుఁజేయివట్టి తీసి
గక్కున రతులఁ గూడె కద్దో లేదో
యిక్కడ శ్రీవేంకటేశ యిటు వన్నుఁ గూడితివి
కక్కసించి జంకించెఁ గద్దో లేదో ॥ ఇంక ॥ 39

## లలిత

సోబానఁ బాడేము మేము సుదతులము
యీబుద్ధులు మీకుఁ జెల్లు నిద్దరికి నయ్యా ॥ పల్లవి ॥

చూపులనే వుంకువలు సుదతికిఁ బెట్టితివి
పూపనవ్వులుమించేకప్పురవిడేలు
యేపుమీరి నవ్వులనే యెదురుతెర వేసితి -
వీపొద్దే పెండ్లాయను మీకిద్దరికినయ్యా ॥ సోదా ॥

తరితీపుమాటలనే తలఁబాలు వోసితి
గరిమ సరసములే కంకణాలు
గౌరబై నవలపుల కొంగులు ముళ్లువేసితి -
విరవాయ వేడుకలు ఇద్దరికినయ్యా ॥ సోబా ॥

పొంచినకెమ్మోవినే బువ్వపువిందు వెట్టితి
మంచముపై కాఁగిలే మంచిచవికె
అంచల శ్రీవేంకటేశ అలమేలుమంగ నీవు
యెంచి కూడితిరి తగు నిద్దరికినయ్యా ॥ సోబా ॥ 40

ఆహిరి

ఇన్నియు నీవే నేరుతు వికఁ నెన్నఁడు
పన్ని నసటలెల్లాఁ జేసి పాలార్చవయ్యా ॥ పల్లవి ॥

కాంతకు నీబుజమురేకలు చూచినంతనుండి
చింతతోడ చెక్కులెల్లాఁ జెమరించెను
మంతనానకుఁ బిలిచి మనసుమర్మము సోఁక
పొంతనే నీవానవెట్టి బొంకఁగదవయ్యా ॥ ఇన్ని ॥

కొమ్మ నీతురుము చూచి కొత్తపూవులెల్లాఁ జూచి
తమి మోము వంచుకొని తడఁబడీని
నెమ్మనమలర నీవు నేరుపులెల్లా మెరసి
సమ్మతించేయట్టుగాను సత్యాలు చూపవయ్యా ॥ ఇన్ని ॥

అలమేలుమంగ నీవాదేటిప్రియాలు చూచి
కలసి మోవిచ్చె శ్రీవేంకటేశ్వరుఁడా
వెలయ నింకా నీవు వేవేలుచందముల
పలుసాకిరులు చెప్పి భ్రమయించవయ్యా ॥ ఇన్ని ॥ 41

భైరవి

ఏల నన్ను సోదించే వెందాఁకాను
నీలాగులు నాలాగులు నీకే తెలుసును ॥పల్లవి॥

తక్కించి నీవు నన్నుఁ దప్పులువట్టేవుగాక
యెక్కువనామనసు నీవెఱఁగనిదా
చెక్కు చేతఁబట్టుకొని సిగ్గువడి వున్నదాన
నిక్క నావిన్నపాలెల్లా నీకే తెలుసును ॥ఏల॥

మంతనాన నాతోను మాఁటలు దీసేవుగాక
యింతట నాగుణము నీవెఱఁగనిదా
బంతి నిందరిలో మానాపతినై నేనున్నదాన
దొంతులనాయాస నీకు తొల్లే తెలుసును ॥ఏల॥

నవ్వుతానే నీవు నన్ను నంటునఁ గూడితిగాక
యివ్వల నానేరుపు నీవెఱఁగనిదా
జవ్వనపుశ్రీవేంకటేశ్వర యలమేల్మంగను
పువ్వువంటిపొందు నీకుఁ బూఁచితేఁ దెలుసును ॥ఏల॥ 42

ప 1109 నట్టనారాయణి

ఏల సాకిరి గోరేవు యింతలో నన్ను
ఆలరిసతులకు నీ కమరుఁగాక ॥పల్లవి॥

నిగ్గులమాట లాడ నీతో నే నేరుతునా
సిగ్గువడియుండేటిచెలి నేను
కగ్గి నీవలెనే నేను కల్లలాడ నేరుతునా
మొగ్గలేనియటువంటిముద్దరాల నేను ॥ఏల॥

నీవునేరనిచేఁతలు నే నేరుపఁగలనా
వావితో లోనుండేరాణివాసమ నేను
వోవరిలో నీసుద్దులు వూఁకొన నేఁ గలనా
కోవిలకూఁతకుత్తికకోమలిని నేను ॥ ఏల ॥

జంకించి కాఁగిటఁగూడేచలమరిదాననా
వంకలాడ నేరిచినవనిత నేను
అంకెల శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
పొంకమై కలసితివి పొందనేర్తు నేను ॥ ఏల ॥ 43

పళవంజరం

ఎంత కెంత మన్నించేవు యేమయ్యా నీవు
అంతలోనే మెచ్చేవు నీయంతదాననా ॥ పల్లవి ॥

చెక్కులు నే నొక్కఁగాను చేతుల మొక్కవచ్చేవు
వొక్కటఁ బతికిపతి వుపకారమా
మొక్కలపుదాన నేను ముందెంచేవాఁడవు నీవు
చక్కఁగ చేయివట్టేవు సరిదాననా ॥ ఎంత ॥

కందువ నే నవ్వితేను కడుసరసమాడేవు
వొందిలి నందుకునిందు కుపకారమా
మందెమేళపుదానను మంచినేర్పరివి నీవు
పందేలువేసేవు నీపాటిదాననా ॥ ఎంత ॥

చేరి కాఁగిలించుకొంటే సిగ్గులు చేతఁబట్టేవు
వూరట మారుకుమారు వుపకారమా
ఆరీతి శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
మేరలుమీరేవు నిన్ను మించేదాననా ॥ ఎంత ॥ 44

వరాళి

తీరుచవయ్యా తగవు దీనికి నీవు
నేరుపరితనమెల్లా నీచేత నున్నది

పందేలువేసి నీతోఁబలుమారు జూజమాఁట
దిందుపడ నుంగరము దీసుకొన్నది
అందుకుఁగా వేరొకతె అది దనసొమ్మనుచు
అంది తలపిడివట్టి అడుగుతానున్నది ॥ తీరు ॥

సరి బేసి వట్టి యొక్కసతి నిన్ను నోడించి
గొరబుగా నచ్చుతా(వా?)నె కోకకొంగున
సిరుల నీదట్టి తనచీరంటా వేరొకతె
అరసి పట్టి (ట్టె?) యందుకు నాపె మారుకొనెను ॥ తీరు ॥

వానగుంటలాడి వొకవనిత నీచేయి వట్టి(ట్టె)
ఆనవెట్టి వేలొకతె ఆచేయిఁ బట్టె
ఆనుక శ్రీ వేంకటేశ అలమేల్మంగ నే వచ్చి
మేనంటి వురమెక్కితే మెచ్చిరి యిందరును ॥ తీరు ॥ 45

గౌళ

వద్దనుండేచెనులతో వట్టిబీరము లేఁటికి
వొద్దువోనిజంకెనలు బొమ్మలలో నున్నవి ॥ పల్లవి ॥

మొనలుచూపకువే ముంచిననీచన్నులు
కొనలుసాగి యాతనిగోరు వాఁడి
పెనఁగితే మీరిద్దరు బిరుదుల దొడ్డవారు
తనువులు సోఁకితేనే తారుకాణ వచ్చునే ॥ వద్ద ॥

కాటుకకన్నులనేల కారములు చల్లేవే
తేటమాటల నాతనితిట్లున్నవి
యీటులో నీసరసాన నిద్దరును దొడ్డవారే
కూటములలోనే మీగురుతులయ్యీనే ॥ వద్ద ॥

కందువకాఁగిటనేల ఘాతలెల్లాఁ జూపేవే
అందుకు శ్రీవేంకటేశుఁ డాణికాఁడు
పొందితిరి మీరిద్దరు భోగముల దొడ్డవారే
సందడి జాణతనాల చవిపుట్టీనే ॥ వద్ద ॥ 46

శంకరాభరణం

కొలువుఁ జేయించుకొనీ గోవిందరాజు
చెలులము యీడనుండే చేరి మొక్కరే ॥ పల్లవి ॥

పవళించి వున్నవాఁడు పాదాలు చాఁచుకున్నాఁడు
జవళిఁ దసయిద్దరుసతులమీఁద
రవళి గోవిందరాజు రవ్వగా నవ్వులు నవ్వీ
తివిరి యీభావము తెలుసుకోరే ॥ కొలు ॥

చేయిచాఁచుకున్నవాఁడు శిరసెత్తుకున్నాఁడు
చాయల గోవిందరాజు సన్నసేసీని
ఆయములు సోఁకించి అంగనలఁ గరఁగించీ
కాయపుటిచ్చల నూడిగము సేయరే ॥ కొలు ॥

సంకుఁజక్రములవాఁడు చల్లుచున్నాఁడు వలపు
కొంకక శ్రీవేంకటాద్రి గోవిందరాజు
వుంకువగా లోలోనే వువిదలఁ గూడినాఁడు
సంకెలేక వారిలో ముచ్చట వినరే ॥ కొలు ॥ 47

భైరవి

గుట్టు చేకొందువుగాక కోమలితోను
పట్టి పెనఁగఁగఁబోతే పంతమెక్కీ సుమ్మీ ॥ పల్లవి ॥

చెక్కులనే పీడ చూచి సిగ్గుల నీరెండ గాసె(సి?)
చిక్కుదీసీ నీనెరులు చెలియ
మొక్కఁ దనకాలు దాఁకి మోసమున నంటాను
వక్కణ లడుగఁబోతే వాదువచ్చీ సుమ్మీ ॥ గుట్టు ॥

కన్నుల. నివాళ్లిచ్చి కాఁకలనే చొప్పులెత్తి
చన్నులఁ గానుక చూపీ జలజాక్షి
మన్ననల వేఁడుకొని మాటదప్పి వచ్చెనంటా
సన్నలు సేయఁగఁబోతే చలమెక్కీ సుమ్మీ ॥ గుట్టు ॥

మోవినే విందుచెప్పి మోహమున విడెమిచ్చి
తైవసమై నినుఁ గూడె కలికి
శ్రీ వేంకటేశ్వర నవ్వీ చేఁతనేసితి నిన్నంటా
వావాతఁ గొసరఁబోతే వాసులెక్కీ సుమ్మీ ॥ గుట్టు ॥ 48

రేకు 1110 మధ్యమావతి

ఏమోయి మాతోనే యేల [1]గోరాదిగానేవు
దీముపలె నున్నవారి దీకొనేవు ॥ పల్లవి ॥

మాట మఱఁగుసేసుక మౌనముతో నుండితేను
గాఁటమున నన్నేల గర్వమనేవు
కాటుకకన్నులు గాఁగా కడుఁదలవంచుకొంటే
గోటారించి నన్నేల కోపమనేవు ॥ ఏమో ॥

1. గోరు + అదిగానేవు (గోళ్లకొంతలు తివిశొనుట?)

పిగ్గుతెర వేసుకొని చెక్కుచేత నుందితేను
యెగ్గులువట్టితినంటా యేల లోఁచేవు
దగ్గరనోపక నేను తలుపుమాటున నుంటే
బిగ్గన లోనికి వచ్చి పైకొనేవు ॥ఏమో॥

మానాన మణఁగి నేను మంచముపై నుందితేను
కానుకగా మోము చూచి కాఁగిలించేవు
పూని శ్రీవేంకటేశుఁడ పొదిగి నిన్నుఁ గూడితే
సానఁబట్టినగోరేల జళిపించేవు ॥ఏమో॥ 49

సామవరాళి

మానరాదా యిఁకనేల మతకములు
నాని నాని నవ్వులెల్లా నయములు వచ్చెను ॥పల్లవి॥

విన్ను నేఁ గొసరఁగాను నీవు నాతోఁ బెనఁగేవు
యెన్నిక లింకేమున్నవి యేడ సుద్దులు
సన్నల మనమంకులు సరికి బేసికి నాయ
నున్ననిచెమట లివె నొసళ్లెల్లా నిండెను ॥మాన॥

పంతాలు నే నాడఁగాను పై పై నురము దట్టేవు
యెంతకెంత నేనేవు యేడ సుద్దులు
మంతనపుమాటలెల్లా మారులు మలయఁబొచ్చె
చెంతల పులకలెల్ల చెక్కులెల్లా నిండెను ॥మాన॥

కొంగు నేనే పట్టఁగాను కుచ్చి కాఁగిలించేవు
యెంగిలాయ మోవులెల్లా నేడ సుద్దులు
కంగక శ్రీవేంకటేశ కలసితి మిద్దరము
సంగడి మనమేనుల సంతోసాలు నిండెను ॥మాన॥ 50

బౌళి

నెట్టనఁ బాపపుణ్యాలు నీచేతివి ? నీ—
వొట్టి చనవియ్యఁగాను వొల్లనంటినా ॥ పల్లవి ॥

చలమేల మాతోను సాదించేవు । నీ—
పలుకులకు లోనై నపడఁతులము
వలపు లేమిటి కింత వడిఁబెట్టేవు । నీ—
వలసినట్టు సేయఁగా వద్దంటినా ॥ నెట్ట ॥

కడునిష్ఠూరములేల కట్టవచ్చేవు
విడువరానినీవెలఁదులము
జడిగొన్న మననేల చంది సేసేవు । నీ—
వొడివట్టఁగా నీతో వోపనంటినా ॥ నెట్ట ॥

బెట్టుగాఁగిటనేల బిగియించేవు
జట్టిగొన్న నీమోహంపుజవరాలను
గుట్టున శ్రీవేంకటేశ కూడితి నిన్ను
యిట్టె నావొద్దనుంటే యిచ్చగించనా ॥ నెట్ట ॥ 51

శ్రీరాగం

పొంచిననీమన్ననకు పొగడుచుండుదుఁగాక
కంచములోనమృతము కడకుఁ బోఁదోతునా ॥ పల్లవి ॥

నీవు సేసేచేఁతలలో నే నేరము లెంచేనా
కైవసమై అన్నియునుఁ గైకొందుఁగాక
పూవులపుప్పొడిలోన పూఁదేనె చిందితేను
వేవేలై నా నందుకు వింతలుగాఁ జూతురా ॥ పొంచి ॥

అడివనీమాటలలో అందములు వెదకేనా
వేడుకతో మంచివేకా విందుఁగాక
పీడెములోఁ గప్పురము వింతలుగాఁ గలసితే
పీడుపడీనా యందుకు వేరులుగాఁ జూతురా ॥ పొంచి ॥

పొందిననీరతులలో పొరపొచ్చా లరసేనా
కందువలు మొరయుఁ బొగడుదుఁ గాక
గందములోపల మంచికస్తూరి గలసితే
విందుల శ్రీవేంకటేశ వెగటుగాఁ జూతురా ॥ పొంచి ॥ 52

లలిత

ఇంకా మరి యాసోద మెంత నీకు
సంకెదీర నన్నిటాను చవులు చూచితివి ॥ పల్లవి ॥

నన్ను నీవు పిలిచేది నవ్వులకో నిజాలకో
కన్నెలు పదారువేలు గలరు నీకు
కన్నుల నీవు చూచేవు కాఁకలకో మేకులకో
మున్నె గొల్లెతలయంగములు చూడవా ॥ ఇంకా ॥

దగ్గరఁ గూచుండేవు తప్పులకో వొప్పులకో
యెగ్గులేనియెనమండ్రు ఇంతులు నీకు
సిగ్గుదీర నవ్వేవు చింతలకో వంతులకో
విగ్గులగొల్లెతలతో నీవు నాఁడే నవ్వవా ॥ ఇంకా ॥

కలసితి విటు నన్ను ఘాతలకో యేతులకో
యెలమి నిరువంకలా ఇద్దరు నీకు
అలరి శ్రీవేంకటేశ అన్నిటా మన్నించితివి
మెలఁగి లోకమువారి మిక్కిలి మన్నించవా ॥ ఇంకా ॥ 53

ఆందోళి

రమ్మనవే ఇఁకను నీరమణునిని
పమ్మి వలపులు చల్లీఁ [1]బదిమారులు ॥ పల్లవి ॥

నెలకొ నప్పటనుండి నిన్నే తప్పకచూచీ
తలపోసి తలపోసి తడఁబడీని
మొలకనవ్వులతోడ మూతులు గిరిపీనదె
నలువంక పొంచి పొంచి నవ్వులు నవ్వీని ॥ రమ్మ ॥

పెనఁగుచుఁ బలుమారు పెచ్చుపెరిగీఁ దాను
గునిసి పరులమీఁద కోపగించీని
వెనుకొని నీజాడలే వెదకీ నితఁడు నేఁడు
మనసుమర్మాలు చూడ మచ్చికసేసీని ॥ రమ్మ ॥

పొరుగుపొంతలనుండి బుద్ధులుచెప్పీనదె
గరిమల మించీఁ గలికితనమునను
యిరవై శ్రీవేంకటేశుఁ డిన్నిటా నిన్నుఁ గలసె
సరసములాడుతానే చనవు చూపీని ॥ రమ్మ ॥ 54

రేకు 1111 మంగళకౌసిక

చేవట్టితే రానిది చిక్కి సన్నకు వచ్చీనా
వావి దిరుగవేసితే వలపు చేమున్నది ॥ పల్లవి ॥

మన్నించి నీవు నాతో మాటలాడితివిగాక
నిన్నుఁ బలికించేనంటే నే నెంతదాన
చన్నులు గిలిగించితే సరి నవ్వవచ్చుఁగాక
కిన్నెరకాయలు గిలిగించితే నేమున్నది ॥ చేవ ॥

1. ఇందు దశావతారసమన్వయ మున్నది. (క్రీగీతలు గలవి చిలుమూరివవి.

దయవుట్టి నీవు నాదండకు వచ్చితిగాక
నయమున నేఁ బిలువ నావశములా
ప్రియమునఁ జౌలెఱఁగ పెద్దనాలికనేకాక
క్రియ యెఱఁగఁ జేతిలో కీలు మరేమున్నది ॥చేవ॥

కందువతో నీవు నన్నుఁ గాఁగిలించితివిగాక
అంది బలిమిసేయఁగ నంతదాననా
పొంది శ్రీవేంకటేశ నీభోగమందే వుందిగాక
అందుకోలు జాణతనా లందులో నేమున్నది ॥చేవ॥ 55

నాట

ఏల. సాకిరులువెట్టీ నేమి మీతోఁ జెప్పని
జాలిలేక తానే చక్కఁజాద నెంధరాదా ॥పల్లవి॥

ఆఱడిగా కేకతాన అలుమగఁ డుండఁ గాను
వేఱొకతె వచ్చితేనే వీరిడి గాదా
జాఱక తమలోనను జాణతనాలాడఁగాను
తూటి తాను నవ్వఁబోతే దొమ్మిసేయకుండురా ॥ఏల॥

పడఁతియుఁ బురుషుఁడు పైకొని ఘాటలాడఁగ
యెడచొచ్చి మాటలాడే దెడ్డగాదా
అడియాలముగ వారు ఆయములు చెనకఁగా
కడనుండి తా నంటితే కడుఁగూళ గాదా ॥ఏల॥

శ్రీవేంకటేశుఁడు నన్ను చేకొని కూడుండఁగ
భావించి వింతది చూడఁ బాడియవునా
పూవువలెఁ దొల్లి తాను పొందుగలదిగనక
ఆవేళఁ దా నొరసితే నంగవించకుందురా ॥ఏల॥ 56

---

* త్రిగీతలుగలవి చిలుమూరివవి.

సామంతం

రమణునికడ కిటు రావమ్మా
జమళిముచ్చటలు చవులై నిలిచె ॥ పల్లవి ॥

కొత్తకోరికలు కొనలుసాగఁగా
చిత్తము నిండెను సిగ్గెల్లా
వొత్తులవలపులు వోగువోయఁగా
హత్తినపులకలు అంగము నిండె ॥ రమ ॥

తొక్కినతమకము దొంతుల నుండఁగ
ముక్కున నూర్పులు ముసరుకొనె
చిక్కినినవ్వులు నెలవులఁ దొలఁకఁగ
చొక్కపుచెమటలు సోనలు గురిసె ॥ రమ ॥

కందువైనరతి కాఁగిట నుండఁగ
విందులనెమ్మోము వికసించె
యిందె శ్రీవేంకటేశుఁడు గలసెను
అంది మోవితేనియలు దయివారె ॥ రమ ॥ 57

శుద్ధవసంతం

ఎన్ని లేవు నేరము లిఁకనేల
నన్ను నిన్ను నెంచుకొని నవ్వఁగదవయ్యా ॥ పల్లవి ॥

ఆసపడినయప్పుడు అన్నియును చవులౌను
వేసరుకొన్నప్పుడైతే విసుపౌను
రాసికెక్కినవలపు రంటికి వచ్చు నిప్పుడు
యీసులెల్లఁ దీరె నిఁక యింటికి రావయ్యా ॥ ఎన్ని ॥

---

* క్రీగీతలు గలవి చిలుమూరినందున నే నూహించినవి.

దగ్గరి యేకతమైతే తమకించు నెందుకైనా
పెగ్గువడి ఇందరిలో చింతవుట్టును
విగ్గులవయోమదము నీడా నెండావలె నుండు
యెగ్గు లెంచఁబనిలేదు ఇంటికి రావయ్యా ॥ ఎన్ని ॥

కూడఁగఁ గూడఁగ నట్టె కోరికలు కొనసాగు
వీడనాడఁబోతేను వింతవుట్టును
యీడనే నన్ను శ్రీవేంకటేశ కాఁగిలించితివి
యేడకు [1]నేఁటికిని మాఇంటికి రావయ్యా ॥ ఎన్ని ॥ 58

బౌళి

ఎంగిలిపొందులు నీకు నింతప్రియమా
ఇంగిలివలపులేల సానఁబెట్టేవే ॥ పల్లవి ॥

మంతనమునను నేము మాటలాడుకొనఁగాను
వింతదానవు నీవేల వినవచ్చేవే
బంతి నాతఁడును నేను పాంకూళ్లారగించఁగా
అంతట నుండి నీవేం అట్టె చూచేవే ॥ ఎంగి ॥

సారెకు నేమిద్దరము సన్నలు నేసుకొనఁగ
తారుకాణ నీవేల అర్థాలు చెప్పేవే
నారువోసినట్టు నేము నవ్వు లిట్టె నవ్వుకోఁగా
దూరుగాను నీవేఁటికి తోడు నవ్వేవే ॥ ఎంగి ॥

ఇక్కువల శ్రీవేంకటేశుఁడు నేఁ గూడఁగాను
గక్కన వాకిట నేల కాచుకుండేవే
వెక్కమై నే మిద్దరము విన్నెరగుతో నుండఁగ
వొక్కటై కూడితివి నీవును మాతోనే ॥ ఎంగి ॥ 59

1. ఏడకున్ + ఏఁటికిని.

పాడి

అప్పుడు మనసువచ్చు నన్నిటా నీకు
చెప్పరానిమాటలకు చెవియొగ్గేనయ్యా ॥ పల్లవి ॥

యేతులకు నీవు నన్ను ఇటు నటుఁ జెనకఁగా
కాతరాన నే విన్నుఁ గాదందునా
వాతులు మోవఁగ నీకు వలపులు పొంగఁగాను
పోతరించి ఇచ్చకాల పూపుగట్టేనయ్యా ॥ అప్పు ॥

నవ్వులకు నీవు నన్ను నయములఁ దిట్టఁగాను
రవ్వలుగా నే నప్పటి రాఁపునేతునా
మువ్వంక జవ్వనము మొలకలువెళ్లఁగాను
నివ్వటిల్లఁ జెమటల నీరుగట్టేనయ్యా ॥ అప్పు ॥

చనవు చేసుక నన్ను సమ్మతించఁ (సమ్మతిఁ?) గూడగాను
గునిసి వేరే విన్నుఁ గొసరుదునా
తనివి శ్రీవేంకటేశ తమకపువిందులకు
చనవులనే వుపచారము చెప్పేనయ్యా ॥ అప్పు ॥ 60

రే 1112 ధన్నాసి

ఇప్పుడిట్టె వింటిమి నీవేల నవ్వేవు
చెప్పితేను దోసమా సిగ్గువడనేఁటికి ॥ పల్లవి ॥

అంగన విచ్చేసి నేఁడు ఆయమైననీమోవి
యెంగిలిసేసినదట ఇది నిజమా
కుంగకుండేయటువంటికుచములకొనలను
అంగవించి వొత్తెనట అది నిజమా ॥ ఇప్పు ॥

వాక్కుమంచముపై నుండి వాదుఁబడఁజెప్పి నీ -
యిక్కువ లంటినదట యిది నిజమా
చక్కవితనపాదాలు సారె నీమై సోఁకించి
అక్కర దీరిచెనట అది నిజమా ॥ ఇప్పు ॥

నీవు నేనుఁ గూడుండఁగా నెమ్మది శ్రీవేంకటేశ
యీవేళఁ దా నున్నదట యిది నిజమా
వోవరిలో మిగిలినపూడిగాలెల్లాఁ జేసి
ఆవటించి మొక్కెనట అది నిజమా ॥ ఇప్పు ॥ 61

దేశాక్షి

నీవేల నన్ను నింత నేరమెంచేవు
మోవితేనియలు చూచి ముందే భ్రమసితి ॥ పల్లవి ॥

యేమి నేతు నను నీవు యేల యెగ్గువట్టేవు
నామేను చెమరించీ నవ్వఁబోతేను
కోమలపుమేనిదాన కొండుకపాయపుదాన
నీమీఁదిమోహమున నేనింత అలసితి ॥ నీవే ॥

నావంక గడమ యేది నన్నేల లోఁచి చూచేవు
చేవఁ బరవశమయ్యీ చెనకితేను
పూవువంటిమతిదాన భోగపురతులదాన
కావరించి నీకుఁగానే కాఁకలురేఁగితివి ॥ నీవే ॥

నేనెంత నీవెంత నేఁడేల వేఁడుకొనేవు
కానుకగాఁ బులకించి గదిసితేను
ఆనుక శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
తానకమై నీకొరకు తమకమందితివి ॥ నీవే ॥ 62

ఆహిరి

మనలో నెక్కుడి వింత మంకుఁదనాలు
చనవులుగలవారు చలపట్టరు ॥ పల్లవి ॥

వొలిసినవారు తమవోరుపే నెరపుదురు
యెలమి నేమిసేసినా యెగ్గుపట్టరు
కలసినవారు లోలో కరఁగుదురు చిత్తాలు
కొలఁదిమీరివచ్చిన కోపగించరు ॥ మన ॥

కూడినట్టివారు మంచిగుణములే నింతురు
వీడ నెంత ఆడినాను వేసారరు
వేడుకగలుగువారు వీడుదోడు లాడుదురు
పాడి దప్పి యించుకంతా పంతమాడరు ॥ మన ॥

ననుపులుగలవారు నవ్వులే నవ్వుదురు
తనువులు సోఁకినాను తమకించరు
యెనసితిమి శ్రీవేంకటేశ మనమిద్దరము
ఘనులయినవారిట్టా గతి గూడుకొందురు ॥ మన ॥ 63

వరాళి

అందుకేమి దోసమా ఆతనికి నీకు వేరా
సందడి నాతనిరతి సమ్మతించవే ॥ పల్లవి ॥

మోహముగలుగువారు ముందువెనక లెంచరు
యీహల మొక్కెనంటా నీవేల లోఁగేవే
సాహసములూఁ జేతురు చనవులూఁ జెల్లింతురు
పోహణించి వలపుల భోగించవే ॥ అందు ॥

తమిగలిగినవారు దండనుండి పాయరు
కామరెనంటానేల కొంకఁజూచేవే
జమళిఁ జొక్కుదురు ఇచ్చల నవ్వుదురు తాము
చెమటచిత్తడితోడ చెలరేఁగవే ॥ అందు ॥

ఆయమెరిఁగినవారు అట్టె కాఁగిలింతురు
చేయివట్టెనంటానేల సిగ్గువడేవే
యీయెడ శ్రీవేంకటేశుఁ డిదె నిన్నుఁ గూడె నేఁడు
చాయలుసేసుక ఇట్టె చనవియ్యవే ॥ అందు ॥ 64

### భైరవి

నమ్మితిమి నిన్నును నానారీతుల మేము
నెమ్మనపు మన్ననలు నీచేతి దిఁకను ॥ పల్లవి ॥

మొక్కితిఁగా అల్లనాఁడే మోపులకొలఁదులు
మిక్కిలి యెంచుకో నీమీఁద నున్నవి
నిక్కి చూచితి నిందాఁకా నీకు నెదురై నేను
చిక్కినపుణ్యములు నీచేతిదే ఇఁకను ॥ నమ్మి ॥

పంపితిఁగా కానికలు బండులకొలఁదులు
ముంపున బండారించి ముదుపైనది
సంపదల నీపేరు జపియించుకొంటా నుంటి
ఇంపులఁ గీర్తులు నీ కెక్కినవే ఇఁకను ॥ నమ్మి ॥

చెప్పితిఁగా ప్రియములు నేనానేనలు నేఁడు
కుప్పలుగా నీయందు గొనకొన్నవి
చిప్పలఁ గూడితి విదె శ్రీవేంకటేశ్వర నిన్ను
చెప్పరానిమెచ్చులెల్లా చెల్లు నీకు నిఁకను ॥ నమ్మి ॥ 65

శ్రీరాగం

ఏఁటికి అనుమానము లిద్దరును నిలుచుండి
కూటములు గూడితే మీగుణమే సుఖము ॥ పల్లవి ॥

నేరుపు గలిగితేను నెపము లెంచకుండితే
ఆరితేరకుండినా మోహము సుఖము
బీరములు నెరపక ప్రియములే ఆడితేను
వారించరానియట్టివయసే సుఖము ॥ ఏఁటి ॥

యెరవులులేక మరి యియ్యకోళ్లే కలితేను
గొరబుగానియట్టిసిగ్గులే సుఖము
కరఁగినమనసులై కై వశము లయితేను
సిరులమించినయట్టి చెనకులే సుఖము ॥ ఏఁటి ॥

చనవులు మెరసితే ఁగడాలు దీరితేను
తవివోనిరతులే సంతతసుఖము
యెనసితిరి శ్రీవేంకటేశ మీరిద్దరును
ననుపులతోడిమీలో సగవులే సుఖము ॥ ఏఁటి ॥ ౬౮

రేకు 1113 పాడి

[1]అత్తఁగారు వచ్చుదాఁకా నణఁగుంటిని
యెత్తినకోపముతోడ యేమందునే ॥ పల్లవి ॥

యేకతమాడినదాఁకా నిద్దరివేళ గాచుక
వాకునిష్ఠూర మాడక వాకిట నుంటి
మేకులన్నియును( జూచి మెచ్చులు మెచ్చుతా నుంటి
యీకడ మంచితనము లెందాఁకనే ॥ అత్తఁ ॥

1. అత్తఁగారు,లో అరసున్న విచార్యము 'అయ్యంగా'రుతో భ్రమించియుండవచ్చు.

నవ్వు ముగిసినదాఁకా నసుపు నేసుక వుంటి
పవ్వళించుండఁగా నెగ్గుపట్టక వుంటి
పువ్వులు లోసి కంపితి భోగించుమని యంటి
యెవ్వరిబుద్దులు వినే దెందాఁకనే ॥ అత్త ॥

తానే విచ్చేసినదాఁకా తప్పులు నెంచకుండితి
ఆనెలఁత మొక్కఁగాను అవునంటిని
పూని శ్రీవేంకటేశుఁడు పొందె నింతలో నన్ను
యేనేరమి లేము చల మెందాఁకనే ॥ అత్త ॥ 67

బౌళి

చాలుఁజాలు నీఁకనేల సాదింపులు
మీలోనిదాన నేను మీరే నేను ॥ పల్లవి ॥

కతలు నేరుచుఁ దాను కపటాలెఱుఁగుఁ దాను
ఆతనితో నే మాటలాడఁగలనా
ఇతవరులైనవారు ఇచ్చకాలాడరే మీరు
మితిమీరితేఁజాలు మీరే నేను ॥ చాలుఁ ॥

తప్పులు లేవు దనకు తగవరిన్నిటాఁ దాను
చెప్పరమై తనతోను దీకొనేనా
చెప్పరానిచుట్టాలు సేవలు సేయరే మీరు
మెప్పించితేఁ జాలు మీరే నేను ॥ చాలుఁ ॥

అన్నిటా జాణఁడు దాను అందాలకు వచ్చుఁ దాను
చన్నుల నొత్తితి నీఁక చలపట్టేనా
వున్నతి శ్రీవేంకటేశు నొనగూర్చితిరి మీరు
మిన్నక నవ్వఁగఁ దేరె మీరే నేను ॥ చాలుఁ ॥ 68

గౌళ

మేలే జాణతనాలు మిక్కిలి లాబగాఁడౌను
కీలు చెప్పఁబోతే నాపై కేలు చాఁచీనే ॥ పల్లవి ॥

తగవులు చెప్పఁబోతే తమలోవిమాటలకు
తగులనాడె నన్నుఁ దగునే తాను
మొగములు చూచి నేను మొక్కులు మొక్కఁగఁబోతే
చిగురుఁజేతులు వట్టి చెనకులు నించీనే ॥ మేలే ॥

ఇతవులు సేయఁబోతే ఇద్దరునుఁ గూచుండి
రతులకుఁ బెనఁగీనే రాజసానను
మితిమీరి మెచ్చితేను మేనరికములు చూపి
తతి నేకతములకు దగ్గరఁ దీసీనే ॥ మేలే ॥

తోడు గాచుకుందితేను తొడిఁబడఁ గాఁగిలించి
వేడుకఁ గూడెను శ్రీవేంకటేశుఁడు
పాడిపంతములతోడ పలుమారు నవ్వితేను
జాడ మమ్మిద్దరిని జంటలు సేసీనే ॥ మేలే ॥ 69

ముఖారి

నాతో నేమి చెప్పేవు నమ్మించినవిభుఁడవు
చేతికి లోనయి పంపుసేయవలెఁగాక ॥ పల్లవి ॥

చలముగల మగువ సాదించకేల మాను
అలిగినది దిట్టక అదేల మాను
పిలిపించుకొన్నయాపె బిగియక యేల మాను
చెలరేఁగి చనవెల్లాఁ జెల్లింతువుగాక ॥ నాతో ॥

కన్నులు గలిగినాపె కడుఁజూడకేల మాను
 అన్నిటా [1]మించిన దాఁగ కదేల మాను
 చన్నులుగట్టైనయాపె చలపట్టకేల మాను
 యిన్నిటా నాపెకు లోనై [2]యెనతువుగాక ॥ నాతో ॥

కందువఁ గూడినయాపె కరఁగించకేల మాను
 అందినాపె గోరంటించ కదేల మాను
 ముందె శ్రీవేంకటేశ మొక్కక ఆపేల మాను
 విందువలె మోవిచ్చి [3]వెలతువుగాక ॥ నాతో ॥ 70

## వరాళి

తరుణి, నీతో వీఁడు తానేమనీనే
 గెరసు దాఁటక మరి కిందుపడు టరుదా ॥ పల్లవి ॥

నేరుపే వలెఁగాని నెలఁతకు, విభుఁడు
 యేరీతి నీవు చెప్పినట్టెల్లాఁ జేయఁడా
 గారవించవలెఁగాని. కనుసన్నలనె వారి-
 తీరుకు దిద్దుకు లోనై తిరమవు టరుదా ॥ తరు ॥

అండ నుండవలెఁగాని ఆఁడుజాతికి; విభుఁడు
 వుండనుండ యెందుకైనా వొడిఁగట్టఁడా
 మెండుకొనవలెఁ గాని, మించి వారివలలకు
 తండుమోఁడై చిక్కికొని తలవంచు టరుదా ॥ తరు ॥

చేయి చాఁచవలెఁగాని శ్రీ వేంకటేశుఁడు,నాకు
 పాయపురతులఁ గూడి పంతమియ్యఁడా
 యీయెడ నన్ను నేలె యింతేసి కావలెఁగాని
 దాయిదండై నాపాలిదై వమౌటరుదా ॥ తరు ॥ 71

1. మించినది + అఁగక 2. 'ఎనయు' ధాతువు 3. 'వెలయు' ధాతువు

ఆహిరి

ఆరమణి వుండఁగాను అంతేకాదా
బారలు దాఁచే వప్పటి పఇకొసరా నేను ॥పల్లవి॥

నీసతివెంట వచ్చిననెలఁతనంటానా
ఆసపడి జాణతనాలాడేవు నీవు
సేసవెట్టి పెండ్లాడినచెలియనుఁ గూడితివి
బాసయిచ్చి చెనకేవు పయికొసరా నేను ॥ఆర॥

నీ కాపెమాట చెప్పిననేస్తకత్తెనంటానా
కైకొని నాకు సన్నలు గావించేవు
లోకమెల్లా నెఱఁగఁగా లోనఁబెట్టుకొంటి వాపెఁ
బైకొని నాతో నవ్వేవు పఇకొసరా నేను ॥ఆర॥

ప్రియురాలివొద్ది తోడఁబెండ్లికూఁతురనంటానా
నయమై శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితి
దయతో నాపె నేలి మంతనమాడితి విందాఁకా
భయము దీర్చితి విట్టె పయికొసరా నేను ॥ఆర॥ 72

రేకు 1114 సౌరాష్ట్రం

మంచిదాయ దానికేమి మాటలు పోట్లయ్యీనా
పెంచి యెంతసేసినా నీపెద్దరిక మింతేకా ॥పల్లవి॥

మెల్లనే నే మాటాడితే మించి ఇందరితోడాను
తెల్లమిగా నాదేపు తిట్టితినంటా
బల్లిదుఁడ వౌదువయ్య పని ఇందే కానవచ్చె
కల్లలాడేవా నీవు కలుగఁగఁదోలును ॥మంచి॥

పూవులచెం డిచ్చితేను పూఁచి ఇందరితోఁడాను
వేవేలుగాఁ జెప్పేవు వేసితినంటా
దేవరవుగావా నీవు తెలిసె నిన్నియు మాకు
నీవల్ల నేరమున్నదా నిజము గాఁబోలును ॥ మంచి ॥

పాదాలు సేవసేసితే పైపై నిందరితోఁడాను
[1]గోదానఁ జెప్పేవు బెట్టి గుద్దితినంటా
యీదెస శ్రీవేంకటేశ యెనసితి విఁక మీర
సాదవుగావా ఇవే చవులు గాఁబోలును ॥ మంచి ॥ 73

ఆరిబి

ఆ పెఱఁగదా నీయంతరంగము
చూపి మోపి అంతేసి చొప్పులెత్తవలెనా ॥ పల్లవి ॥

సిగ్గువడ్డభావానకు చిఱునవ్వులే యెఱుక
యెగ్గులెంచనియందుకు ఇంపు లెఱుక
వొగ్గినరతులకును వూరకుండుటే యెఱుక
అగ్గలమై విచ్చి విచ్చి ఆనతియ్యవలెనా ॥ ఆపె ॥

చెప్పరాని మాటలకు చేసన్నలే యెఱుక
ముప్పిరిపలపులకు మొక్కు లెఱుక
అప్పసమై ఆసలకు ఆయములంటు టెఱుక
అప్పటిని పేరుకొని ఆనతియ్యవలెనా ॥ ఆపె ॥

చేతికి లోనై నందుకు చెలరేఁగుటే యెఱుక
కాతరముగలందులకు ఘాత లెఱుక
యేతులశ్రీవేంకటేశ ఇద్దరునుఁ గూడితిరి
ఆతలీతలిమాకెల్లా నానతియ్యవలెనా ॥ ఆపె ॥ 74

1. 'కోదాన' క్రోధశబ్దభవమా? కేవల'మ'వర్ణముపై వకారాదేశము వీరిలో అపురూపము. పూర్వపాదాంత'ను' వర్ణముప్రక్క బిందువు ప్రమాదమున తొలగెనా?

గౌళ

ఎప్పుడయ్యా ఆమేలు యెఱిఁగే నేను
కొప్పు దువ్వి నిన్నుఁ జేకొనదా యింకా ॥ పల్లవి ॥

కాలమెల్ల నాపె నీతో కన్నులారుచనే పట్టి
నాలి మాని కొఁ(కొంః)తైనా నవ్వదా యింకా
వేలఁ జూపి మగఁడంటా విఱ్ఱవీఁగనే పట్టె
చేలకొంగు గప్పి బుద్ధిచెప్పదా యింకా ॥ ఎప్పు ॥

కొలువు సేయుచు నిన్నుఁ గూరిమి గొసరఁబట్టె
చలివాయ వలపులు చల్లదా యింకా
కలిమిమెఱసి నీకుఁ గానుక లియ్యనే పట్టె
ములువాఁడికొనగోర(దుః) మోపదా యింకా ॥ ఎప్పు ॥

చనవుమెరసి నీకు చవులుచూపనె పట్టె
చెనకి రతుల సేవసేయదా యింకా
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
మొనసి మరీ నెలయించదా యింకా ॥ ఎప్పు ॥ 75

లలిత

నీ వొక్కటొక్కటే సేసి నెరసు పెంచేవుగాక
వోపలేనిఆపె మంచివోజదే కాదా ॥ పల్లవి ॥

చిప్పిలుమాఁట లాడఁగా సిగ్గువడీఁగాక
కప్పి నీ కెప్పుడు సూదిగము సేయదా
దప్పికి మోపడుగఁగాఁ దలపించుకొనీఁగాక
ముప్పిర నిందాఁక నీమోము చూడదా ॥ నీవొ ॥

42894

పచ్చిగాఁ జెనకఁగా నప్పటి నొద్దుకొనెఁగాక
కచ్చుపెట్టి నీపై బత్తికలదే కాదా
రచ్చలోఁ బిలువఁగాను రమణి జంకించెఁగాక
యిచ్చకురాలు నీకు నెప్పుడుఁ గాదా ॥నీవా॥

చేయివట్టి తియ్యఁగాను చెక్కు నిన్ను నొత్తెఁగాక
ఆయాలు నీవెఱిఁగినఆపే కాదా
యీయెడ శ్రీవేంకటేశ యెనసితి వింతలోనె
పాయరానివేడుకలపాలిదే కాదా ॥నీవా॥ 76

శ్రీరాగం

నమ్మఁగలవార మింతే నాకు నీవిచ్చినబాస
యిమ్ములఁ జెలులు నీకు యేమిచెప్పే రిఁకను ॥పల్లవి॥

నిలువెల్లా నిజమే నీవాళ్లిదే తగవు
తెలిసె నీగుణాలెల్ల తేటతెల్లమి
కలిగినసాజమే కల్లలాడేవా నీవు
బలువుఁడవు నీతోడిపంతములవారమా ॥నమ్మఁ॥

నీ వాడినదే మాఁట నెరసు నీయందు లేదు
దేవరవనేరు నిన్ను దేవుళ్లెల్లా
చేవదేరేనడకలు చెల్లు నీకు నన్నియును
వేవేలు వచ్చెను నీతో విరసాలవారమా ॥నమ్మఁ॥

నిన్నుఁ గాదన రెవ్వరు నీ వటువంటివాఁడవా
విన్నకన్నవే నీవిద్యలెల్లాను
యిన్నిటా శ్రీవేంకటేశ యిదె నన్ను నేలితివి
మన్నించనేర్తువు నీతో మండాడేవారమా ॥నమ్మఁ॥ 77

నాదరామక్రియ

నీకు నంకెవచ్చితే నీవు మానేవా
  యేకడఁజూచినసరే యిద్దరికి నెపుడు ॥పల్లవి॥

పతుల మోహింపించేది పంతములు మెరసేది
  సతుల కెప్పుడు నివి సహజములే
  రతికిఁ బెనఁగుదురు రాకుండితే జంకింతురు
  హితవై చేకొంటగాక యేలయ్య కోపము ॥నీకు॥

చలివాసి నవ్వేది సరసములాడేది
  కలికికాంతలకుఁ గలగుణమే
  పిలుతురు బిగుతురు ప్రియములు చెప్పుదురు
  నెలకొని యిందుకుఁగా నీకేల చలము ॥నీకు॥

మొక్కి మొక్కి కూడేది మోవి గంటిసేసేది
  చక్కనిసతుల కివి చందములే
  యెక్కువ శ్రీవేంకటేశ యిటు నీవే కూడితివి
  మక్కళించి మక్కళించి మఱి యాల కొసరు ॥నీకు॥ 78

రేకు 1115 కాంబోది

ఏఁటికిఁ బొట్లఁబడే వేమె నీవు
  కూటసాక్షులకే నీవు గురియైతివో ॥పల్లవి॥

పొద్దునుం దాలనికిఁగా పొలపక్షమాచేవు
  గద్దించేవు నీకుఁ గొంత గలదో పొందు
  అద్దుక సన్నలుసేసి ఆనసచే మొక్కించేవు
  బుద్ధితో వలపులపొత్తు నీకు నబ్బెనో ॥ఏఁటి॥

వూరకై నాఁ బతిమిఁగా వోడఁబరచవచ్చేవు
నేరము లేమైనాను నిన్ను సోఁకెనో
తీరిచి ఆనేరములు తిద్ది తిద్ది చెప్పేవు
పోరచితనాన నీకు పూఁటలంటెనో ॥ ఏఁటి ॥

గక్కన శ్రీవేంకటేశుఁ గాఁగిలింపించేవు నన్ను
చక్కనిరతులు నీకుఁ జవిపుట్టెనో
చొక్కేవు ఆకుమడిచి సోఁక నీవు అందిచ్చి
వికి వికి సంతోసాలు నీమీఁద జారెనో ॥ ఏఁటి ॥ 79

శ్రీరాగం

నావల నింతేశాయ నాథుఁడ నీవంకఁ గాదు
చేవలుదేరి తేరి చిగురాయను ॥ పల్లవి ॥

తెగనాడఁజాలక తేరి యిచ్చలాడఁగాను
పగటునీవోజలెల్లాఁ బలచనాయ
నగి నగి నీతోను సనుపు నటించఁగాను
అగడై కరుకుపడె అదిగో నీచిత్తము ॥ నావ ॥

వూరకే మొగమోట నొదిగి నే నుండఁగాను
కూరిమినవ్వులు పైకొనరాయను
నీరువంకతుంగవలె నిన్ను విట్టె భోగించఁగా
సారపుతరితీపులు చప్పనాయను ॥ నావ ॥

కందుపకాఁగిట నిన్ను కడుదిద్దకుండఁగాను
విందులవంటిసిరతులు వింతలాయను
అందపుశ్రీవేంకటేశ అంతలో నన్నుఁ గూడితి
ముందువెనకలెలాను ముదమాయను ॥ నావ ॥ 80

దేసాళం

ఇంతేసిమతకాలు నే నెఱఁగనివా
పొంతనుండి నవ్వేవు పొద్దువోదా నీకు ॥ పల్లవి ॥

తారుకాణ లంతేనేల తగవు నడపరాదా
గారాపునీవెఱఁగనికల్ల వున్నదా
కూరిమిసతులమూఁక కూరిచి తలవంచేవు
పోరులేల పెట్టేవు పొద్దువోదా నీకు ॥ ఇంతే ॥

వొడఁబరచఁగనేల వూరకే వుండఁగరాదా
తడవితిమా నీ వింతయు నేరవా
కడగడ లటు దొక్కి కమ్మి నన్ను వేఁడుకొంటాఁ
బుడికేవు నన్ను నీవు పొద్దువోదా నీకు ॥ ఇంతే ॥

విన్నెరగందఁగనేల నిచ్చలాన నుండరాదా
జవ్వనపునాచేఁత నీసలిగె కాదా
యివ్వల శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
పువ్వులనేల వేసేవు పొద్దువోదా నీకు ॥ ఇంతే ॥ 81

సామంతం

ఎంగరు లేరు నీకు నెగసక్కాలు వేయఁగ
మందలిఁచే ఆడనుండే మన్నించవయ్యా ॥ పల్లవి ॥

మొక్కలపుచేఁతలకు మొదలివాఁడవు నీవు
తక్కరివిద్యలకెల్లా దాఁపిరమవు
నెక్కొని చయ్యాటాలకు నేమా నీకు నెదురు
మక్కళించి మొక్కేము మన్నించవయ్యా ॥ ఎంగ ॥

తీపులు వుట్టించి పొందు దేవర విన్నిటాను
రాఁపుచేసి నవ్వు నవ్వ రాజవు నీపు
యీపనులకెల్లా నీతో నియ్యకొనఁగలమా
మాపు రేపు సేవసేసే మన్నించవయ్యా ॥ఎంద॥

వట్టివలపులు రేఁచ వగకాఁడ వన్నిటాను
పట్టినచలములకు బలువాఁడవు
ఇట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మట్టులేనివేసాలేల మన్నించవయ్యా ॥ఎంద॥ 82

లలిత

నీవే ఇంత సేయఁగాను నేఁ డిదిగో బాలకృష్ణ
వావులు యెవ్వరికైనా వాడలోన నున్నవా ॥పల్లవి॥

చలివాసె గొల్లెతలు సారె నిన్ను నెత్తుకోఁగా
ములుగులువారె మోహ మూఁచి పాడఁగా
పలుకులకొంకు దీరె పక్కున నిన్నుఁ దిట్టఁగా
బలుమొగలకు నాండ్లు పంపు సేతురా ॥నీవే॥

వింత దీరెఁ గోమలెలు వీధుల నిన్నాడించఁగా
సంతలాయ నిండ్లు నీసంగాతాలను
పంతలైరి లోలోనే సారె నిన్ను ముద్దాడఁగా
కొంతయినా నతలకు కోడలాటు సేతురా ॥నీవే॥

సిగ్గెడఁ గన్నెలు నీచే సమ్ములు గొనఁగాను
సిగ్గులఁ గళలు మించె నీతో నవ్వఁగా
అగ్గమై శ్రీవేంకటాద్రి నలవాసిఁ గూడితివి
నొగ్గి చట్టాలలోనెల్లా వోజలు నేడు సేతురా ॥నీవే॥ 83

గౌళ

ఆతఁడే నన్నుందుకుఁగా అట్టె కూరిమి గొసరీ (రె?)
యీతలనాతల నీవే యెదమాఁట లాడేవా ॥పల్లవి॥

మాట మాటగా విభుని మంతనాన నాడుకొంటే
చీటికిమాటికిఁ బోయి చెప్పుదురటే
నీటున నాతనికి నే నీవంటిదాననేకానా
యేఁటికే నీవొకతెవే యితపరివటవే ॥ఆతఁ॥

అక్కవంటా నీతో నాతనిగుట్టు చెప్పితే
కక్కసించి నీవు తారుకాణింతురా
చక్కనిఇద్దరమును సరివారమే కామా
వెక్కసాన నాకంటె విశ్వాసివా ॥ఆతఁ॥

నిగ్గుల శ్రీవేంకటేశునేరుపు నీతో మెచ్చితే
సిగ్గువడ నెఱుకలు నేసుకొందురా
అగ్గమై నిన్నుఁ గూడినట్టె నన్నుఁ గూడితేను
వెగ్గళించేవు నీవంటివేడుకే నాకును ॥ఆతఁ॥ 84

రేకు 1116 అమరసింధు

చలువకు వేఁడికి సంగతయ్యీనా
నెలఁతెఁ గంటే విట్టే నీ వేమిసేతువు ॥పల్లవి॥

పెక్కుమారులు నేనైతే ప్రియములు చెప్పఁగాను
పక్కన నీ వాదేవు పాడిపంతాలు
వక్కణలో వేఁడుకొనేవారిఁ గంటే బిగుతుగ
నిక్కనవారిసాజాలు నీ వేమిసేతువు ॥చలు॥

నసుపుగా నే నీతో నవ్వు లిట్టే నవ్వఁగాను
చనవిచ్చి నీపై తే జంకింతువు
పోనరినవారిఁ గంటే పొత్తుకొత్తుక పత్తురు
నినుపై లోకుఁజాడే నీ వేమిసేతువు ॥ చలు ॥

కందువ నే నిన్నుఁ గూడి కాఁగిలించుకోఁగాను
చెంది నీవు మోవి గంటి సేయఁజూచేవు
ముందే శ్రీవేంకటేశ్వర మొక్కితే దీవింతురు
నిందలేనివారినేర్పు నీ వేమిసేతువు ॥ చలు ॥ 85

వరాళి

కూచుండవే ఇంకా వట్టిగుట్టు లేఁటికి
వాచవులు మరిగిన పలవులు మానీనా ॥ పల్లవి ॥

చనుఁగవ గప్పకువే చిలుకియా । మన-
మనసులలోనికి(నిఁక?) మఱఁగున్నదా
తనిసి నీనవ్వేల దాఁచేవే
కనుఁగొన నెమ్మోముకళలు దాఁగీనా ॥ కూచుం ॥

మాటలేల మొఱఁగేవే మగువా । మన-
మూఁటలలసలలోన మొఱఁగున్నదా
చీటికిమాఁటికినేల చేయి దీసేవే
కూటపుఁగతిఁ జేయి దీసుకొనవచ్చునటవే ॥ కూచుం ॥

కూడితివేల నించేవే గుఱుతులు । మన-
కోడెవయసులకును గుఱియున్నదా
యీడుగల శ్రీవేంకటేశుఁడఁ గదే
యీడుజోడు మనకంతే నిఁక మఱి వున్నదా ॥ కూచుం ॥ 86

### మాళవి గౌళ

ఇంతులు నీకు బాఁతా యెంత సేసేవు
దొంతిఁ బెట్టేవు ప్రియము[1] దొడ్డికట్టుదానవా ॥ పల్లవి ॥

నెట్టుకొన్నలకిమమ్మ నీవురముపై నుండఁగా
పట్టేవు మాచన్నులు పైకొసరా
అట్టడితనాన మీఱక నీతో రానన్నాను
పెట్టేవు నీసొమ్మెల్లా పెట్టైవంటిదానవా ॥ ఇంతు ॥

చింతదీరఁ దొళళమ్మ శిరసుపై నుండఁగాను
వంతుకు నన్నలమేవు వడ్డిబేరమా
వింతలుగ నిన్నంత వేసరించఁజాలనన్నా
పంతానఁ దమ్మ వెట్టేవు పడిగెపుదానవా ॥ ఇంతు ॥

బూమిదేవులమ్మ నీబుజముపై నుండఁగాను
వేమారు నాతో నవ్వేవు వింతొకచవే
ఆమని శ్రీవేంకటేశ ఆయాలు సోఁకీనన్నా
కామించి కూడితివి నీకాఁపురపుదానవా ॥ ఇంతు ॥ 87

### రామక్రియ

ఎదిరి నెఱఁగవు నీయితవే చూచేవుగాని
యెదఁబెట్టుకున్నారము యేము(మ?)·నేము నేము ॥పల్లవి॥

గడుసునిన్నుఁ జూచితే కాఁకరేఁగీ నాకైతే
నడుమ నీ వూరకే నవ్వేవు గాని
వుడికినందుమీఁదట వుప్పులు చల్లినట్టాయ
యెడనెడ నీచేఁతల కేమనేము నేము ॥ ఎది ॥

---

1. 'దొడ్డికట్టుదానవా' దొడ్డిలో కట్టివేయునట్టిదానవా?

కుచ్చితిపునిన్నుఁ జేరుకొనఁ గొలుపదు నాకు
అచ్చువలె నీవు మాటలాడేవుగాని
ముచ్చటదీర నీవేళ మోము గప్పినట్లాయ
హెచ్చిననీసుద్దులకు నేమనేము నేము ॥ ఎది ॥

దిమ్మరిని న్నంటుకొన సమ్మతించదు నాకైతే
లెమ్మని నీవే కాఁగిలించేవుగాని
చిమ్ముచు శ్రీవేంకటేశ చేఁదే తీపైనట్లాయ
యెమ్మెలనీమన్ననకు యేమనేము నేము ॥ ఎది ॥ 88

## గుజ్జరి

ఎక్కినంతలోననే యేనిగ గుజ్జా
అక్కరై మాయింటికి రా కాతఁ డట్టె వుండీనా ॥ పల్లవి ॥

ఆతనిచనవు పట్టు కట్టె విఱ్ఱవీఁగేవు
యేతులకు వాఁడికత్తులేల మింగేవే
కాతరాన నీకింత కపటాలు నెరపితే
ఆతల నీకేకాక అ[illegible]రి కేమే ॥ ఎక్కి ॥

రమణుఁడు నవ్వేనంటా రవ్వళాయ వచ్చేవు
తిమిరి యిసుక మీఁదై తిరుగకువే
భ్రమసి నీకాతఁడు బాస రెంత ఇచ్చినాను
అమర బతుకవే నే మాండ్లము గామా ॥ ఎక్కి ॥

శ్రీవేంకటేశుఁడు విన్నుఁ జెందెనని మెరసేవు
దోవఁ బెసరు విత్తితే తుదకెక్కీనా
కావరించాతనిమేను కాఁగిటఁ జిక్కితే
యీవల మారతిఁ దొల్లి బెంగిలేకదే ॥ ఎక్కి ॥ 89

తెలుఁగుఁ గాంబోది

చాలునయ్య వేయిటిపై జవ్వాదికొమ్మ
యేలిననీపై నుండనియ్యవయ్యా మాఁట ॥ పల్లవి ॥

కూరిమి చూపి నిన్నుఁ గొసరఁగఁగొసరఁగ
యేరీతి నుండునో చిత్త మేవేళను
బీరపువారము నేము బిరుదువాఁడవు నీవు
తారుకాణించఁగఁబోతే దైలువారుఁ గోపము ॥ చాలు ॥

ప్రేమముతోడుత నిన్నుఁ బిలువఁగఁబిలువఁగ
యేమని వేసరుదువో యేవేళను
నేమపువారము నేము నీయిచ్చవాఁడవు నీవు
చేముట్టి పెనఁగఁబోతే చిమ్మిరేఁగుఁ జలము ॥ చాలు ॥

తతిగొని నిన్ను రతిఁ దగులఁగఁదగులఁగ
యితవై వుండునో కాదో యేవేళను
సతి నేను శ్రీవేంకటపతివి నాకు నీవు
సతమై యిట్టె కూడితే చక్కనౌను పనులు ॥ చాలు ॥ 90

రేకు 1117 హిందోళం

పెద్దలు మీ రంతేసి పెనఁగనేల
వుద్దండపునీచేఁతలు వుట్టిఁబెట్టవయ్యా ॥ పల్లవి ॥

మోవిపండు గానుకిచ్చి మొక్కె నీకుఁ జేతులను
నేవ లింకానేమి యాపె నేసునయ్యా
కావిరించి దగ్గరితే కాలు దాఁకుఁ జేయి దాఁకు
నేవరవంటినీ కంతేసి తగదయ్యా ॥ పెద్ద ॥

గోరంటపూ వందిఇచ్చె కొలువున నిలుచుండె
పేరి యిచ్చకము లేమి పెంచునయ్యా
వేరెమాట లాడఁబోతే వెంగెమౌనో వెగటౌనో
ఆరీతిదొరవు నీ కవి చెల్లపయ్యా ॥ పెద్ద ॥

ఆరతిచ్చె నానాంగాల నన్నిటికి సమ్మతించె
కూరిమి నిన్నెట్లాను కొసరునయ్యా
యీరీతి శ్రీవేంకటేశ యింపు లేదో సొంపు లేదో
ఆరితేరినట్టినీకు ఆస మానదయ్యా ॥ పెద్ద ॥ 91

హిజ్జిజి

మాపుదాఁకా రేపకాడ మాటకు మాటాడఁగాను
యేపునఁ దెగనిపనికేల పెట్టే వాన ॥ పల్లవి ॥

నవ్వి నవ్వి మానేవు నడుమ నడుమ నీవు
జవ్వని యెవ్వతేమైనా సన్న సేసెనా
వువ్విళ్లూర నీనిజము వొరసి చూచే నింతే
యెవ్వ రిందుకు గురయ్యే రేల పెట్టే వాన ॥ మాపు ॥

చెప్పి చెప్పి కొంకేవు సిగ్గులువడుతా నీవు
వుప్పటించ నీడ నెవ్వరున్నారు నీకు
రెప్పలెత్తి చూచి విన్ను రేఁచి వెదకే నింతే
యెప్పటివాఁడవే నీవు యేల పెట్టే వాన ॥ మాపు ॥

ముట్టి ముట్టి చూచేవు మొఱఁగి నాతుచములు
యిట్టె యెవ్వతెనైనా యీడువచ్చెనా
నెట్టన శ్రీవేంకటేశ నిరతి మెచ్చితి నింతే
యెట్టకేల కైనపనికేల పెట్టే వాన ॥ మాపు ॥ 92

రామక్రియ

భామలతోఁ బోరఁగాను ఫలమేమి నీకు వచ్చె
యేమిటికిఁ గాతరించే వింతలోనే నీవు ॥పల్లవి॥

సిగ్గులే మూలధనము చెలులకెల్లా నీవు
బగ్గనేల పట్టేవు పయ్యదకొంగు
నిగ్గులమోనములే ని(నిం?)దురా-్యపదవులు
అగ్గలమై యాల మాటలాడించేవు నీవు ॥భామ॥

పంతమే పెట్టనికోట పడఁతులకెల్లాను
వంతుకునేల తీసేవు వారియిండ్లకు
చెంతల గుట్టునవ్వులే సేయనిసింగారాలు
చెంతసుండి యేల గసిసించేవు నీవు ॥భామ॥

చలమే ముందరిపౌఁజు సతులకునెల్లాను
చెలఁగి యేల ప్రియముచెప్పేవు నీవు
బలిమి శ్రీవేంకటేశ బాసయిచ్చి కూడితివి
పెలుచుఁగుచములేల పిసికేవు నీవు ॥భామ॥ 93

సామంతం

ఏకతాన [1] నీవు నీవూ నెరిఁగినపను లివి
యీకడ మాతోనేల యెరుక నేసేవు ॥పల్లవి॥

ప్రేమమున నాపె నిన్నుఁ బేరుకొని తిట్టితేను
నామోము చూచి యేల నవ్వేవు నీవు
చేముంచి యాపె నిన్నుఁ జెనకి పైకొంటేను
దీమసాన నేఁటి కానతిచ్చేవు నీవు ॥ఏక॥

[1] 'నీవు నీవూ' ఎత్తిపొడుపు కావచ్చు.

చనవున నాపె నిన్ను సారెకు జంకించితేను
    పెనఁగి సాకిరి యేల పెట్టేవు నన్ను
    మనసిచ్చి యాపె నీతో మందటలాడితేను
    చొవిపి నన్నేల నీవు చుట్టుకొనేవు ॥ ఏక ॥

గారవించి యాపె నిన్నుఁ గాఁగిలించుకొంటేను
    చేరి నే నుందాననంటా సిగ్గువడేవు
    యీరీతి శ్రీవేంకటేశ యాపె నిన్నుఁ గూడె నేఁడు
    మీరతులు నాతోనేల మెచ్చవచ్చేవు ॥ ఏక ॥ 94

సాళంగం

అందరిని యీమాఁటే అడుగవయ్యా
    కందువలు నీకునీకే కానరాదుగానీ ॥ పల్లవి ॥

వనిత యిప్పుడు నీవద్దికి రాఁగానే
    మనసు నీ కొక్కటాయ మాఁటలేఁటికి
    చెనకి నే మిందాఁకాఁ జేసినచేఁతలకెల్లా
    వొనరి యిటువలెనే వుండుగా నీమొగము ॥ అంద ॥

చాఁచి చాఁచి నీ కాపె సారె విడెమియ్యఁగానే
    పూఁచినపూఁపు లీదేరె బొంకులేఁటికి
    తూఁచి వలపు నేమెల్లా తోదగద్దెము వేయఁగా
    పాఁచి సంతోసాలిట్లాఁ బ్రబలెనా నీకు ॥ అంద ॥

గక్కన నీదేవు లిట్టె కాఁగిలించుకొనఁగానే
    చక్కనాయఁ బనులెల్లా పటలేఁటికి
యిక్కువ శ్రీవేంకటేశ యిద్దరూఁ గూడఁగాఁగాక
    చిక్కినినవ్వు లిట్లాఁ జేకూడెనా ॥ అంద ॥ 95

శంకరాభరణం

ఇద్దరునుఁ గూడితిరి యిఁక నెన్నఁడు
సుద్దుల మామొగమేమి చూచేరయ్యా ॥ పల్లవి ॥

సరి చెమటకాఁగిలే వక్కానికేళాకూళి
యితవైనవలపులే [1]యీఁతా మోఁతా
మతకరిసిగ్గులే మంచినీటిచల్లులాట
తతిగొని మీరు వంసతములాడరయ్యా ॥ ఇద్ద ॥

చెలిగోరిచెనుకులే చిమ్మనఁగోవిచిమ్ములు
కులుకునవ్వులే తలకొన్న తెప్పలు
పిలుపులమాఁటలే పెట్టినట్టివొలలు
కిలకిల నవ్వి జలకేలి సేయరయ్యా ॥ ఇద్ద ॥

ముగుదచన్నులు తమ్మిమొగ్గలవేట్లు నీకు
తగినకూటములే వంతపుముంపులు
అగడై శ్రీవేంకటేశ ఆయాలంటి కూడితిరి
నిగిడినపెండ్లితోడ నీల్లాడరయ్యా ॥ ఇద్ద ॥ 96

రేకు 1118 నాగవరాళి

చెల్లదా ఆతనికేమి సేసినంతాను
వెల్లవిరై నపనికి వెంగె మింత వలెనా ॥ పల్లవి ॥

నగనేలే నీకును నాయ మాతఁడు చెప్పితే
తగవులో నేమైనాఁ దప్పులుండెనా
మగువ లవ్విఁతేఁజాలు మానలేఁ డింతేకాక
పొగరుఁబదారువేలపూఁతకోక గాఁడా ॥ చెల్లి ॥

---

1. 'ఈఁతా–మోఁతా' ఈదునంతగ, మోయునంతగ అని అర్థముగలయీ పదములు. 'ఎక్కువగ, అనుతాత్పర్యార్థమున నేటికిని వ్యవహారమున గలవు.

తప్పకచూడనేలే తానే సాకిరి చెప్పఁగా
అప్పటి నొలపతము లందుండెనా
కప్పురగందులెడల కర్పూరితిపడుఁగాక
కప్పి గొల్లెతలరొంపికంబము దాఁ గాఁడా ॥ చెల్ల ॥

వెరవుతో విన్నను శ్రీవేంకటేశుఁడు గూడఁగా
సరవు లందేమైనాఁ జాలకుండెనా
తరుణులై తేఁజాలు తగులు మానఁగలేఁడు
ఇరవై మధురలోఁ బెక్కండ్లవిందు గాఁడా ॥ చెల్ల ॥ 97

పాడి

మఱి ఇంతేకదవయ్యా మవలో మాట
తఱితో సరివచ్చె మీతగవులు చూచి ॥ పల్లవి ॥

కలసెఁగా ఆపె నిన్ను కాఁగిటిరతులనెల్లా
తెలిసెఁగా నీమహిమ తెల్లమిగాను
వలసినట్లనయ్యా వారివారిభాగ్యాలు
చలివాసె మాకైతే మీసరితలు చూచి ॥ మఱి ॥

మెచ్చెగా ఆపె నీమేలము లన్నిటికిని
యిచ్చితివిగా చనవు యిందరిలోన
విచ్చనవిడాయ నీఁక వెలఁదులవలపులు
ముచ్చట వాసె మాకు నీ(మీ?)మోహములు చూచి ॥ మఱి ॥

పండెఁగా ఆపెతపము పక్కన నీకూటమిని
విండెఁగా సంతోసాలు నీమతిలోన
అండగా శ్రీవేంకటేశ అందరి కివే వాళ్ల
[1]దండేయ మాకు మీలోపితరితీపు చూచి ॥ మఱి ॥ 98

1. దండి + అయ.

బౌళి

ఒక్కమనసున నీవొద్ద నిట్టె వున్నారము
నిక్కము మాసేవలెల్లా నీమీఁద నుండఁగా ॥పల్లవి॥

తత్తరము నేమిటికి తాలిమీ నేమిటికి
హత్తినకూరిమిగలఆఁడువారికి
బత్తి చెప్పుకోనేల పాసి కోపగించనేల
నిత్తమై మాభారమెల్లా నీమీఁద నుండఁగా ॥ఒక్క॥

చేరి పైకొన నేఁటికి సిగ్గువడనేమిటికి
వూరకే యిచ్చకురాండ్లై వుండేవారికి
కోరి కొంగువట్టనేల కొంచి కొంచి అలయనేల
నేరుపులమాచేఁతలు నీమీఁద నుండఁగా ॥ఒక్క॥

మెచ్చు మెచ్చ నేమిటికి మేలమాడ నేమిటికి
హెచ్చి నిన్నుఁ గూడినట్టి ఇంటివారికి
రచ్చల శ్రీవేంకటేశ రంతులేల రాఁపులేల
నిచ్చ నీవిచ్చినబాస నీమీఁద నుండఁగా ॥ఒక్క॥ 99

సాళంగనాట

ఎక్కడ నున్నా నీకు నేమాయను
పక్కన నవే యిందు భావించుకోవయ్యా ॥పల్లవి॥

అతివలుండినచోటు అదె నీకు రేపల్లె
అతిశయపువలపు యమునానది
రతులకాఁగిళ్లే రాసక్రీడలు నీకు
తతి వచ్చె విందు నవి తలఁచుకోవయ్యా ॥ఎక్క॥

కొమ్మలపోఁకముడులు కొలనిదరికోకలు
కుమ్మరించుమోవితేనె గొల్లదోమటి
పమ్మి వారితో నవ్వులు పాలుఁబెరుగువుట్లు
తమ్మిచూపులే రేతిరి తలఁచుకోవయ్యా ॥ ఎక్క ॥

చెలులజవ్వనమెల్లా చేరువబృందావనము
కులుకుఁజన్నులు పెక్కుగోవర్ధనాలు
కలసితి మాచెలిని గక్కన శ్రీవేంకటేశ
తలఁపున నిఁకనిన్నిఁ దలఁచుకోవయ్యా ॥ ఎక్క ॥ 100

## ముఖారి

చవి చార మెఱఁగవా జాణనందువు
యివి యెల్ల నాపెకు నీవిచ్చినచనవులే ॥ పల్లవి ॥

చెప్పరానిమాటలకు చెవులొగ్గే వేమయ్యా
వొప్పులెల్లా చెలినగవుల నున్నవి
కప్పురపునోఁటిమాఁట కమ్మి బరణిఁ బెట్టేవు
యెప్పు డాపె యేమనిన నేమాయ నీకు ॥ చవి ॥

సేయరానిచేఁతలకు సిగ్గువడే వేమయ్య
తోయరాదు అంగనచేతుల నున్నవి
పాయపుఁగళలకును బారలు చాఁచేవు నీవు
యీయెడ నేమినేసిన నేమాయ నీకు ॥ చవి ॥

పట్టరానివయసులు పచ్చినేసే వేమయ్యా
నెట్టనఁ గాఁగిట నింతి నిన్నుఁ గూడెను
ముట్టితే శ్రీవేంకటేశ మోవితేనెఁ గొలిచేవు
యిట్టివి; మీసరసాల కేమాయ నీకు ॥ చవి ॥ 101

సౌరాష్ట్రం

ఏమనేము నిన్ను నిఁక నింతా మేలే
వేమారుఁ జవిగొంటేను వేమే తీపు ॥ పల్లవి ॥

యెమ్మెలకు నిజమేది యెదమాట గురియేది
ముమ్మారు నూఁకొంటే ములుకే వంగ
సమ్మతించుకొంటి నేను చనవిచ్చితివి నీవు
పమ్మి పేరఁబెట్టితేను పాలే పెరుగు ॥ ఏమ ॥

ఆసలకుఁ దనివేది అనలకు మితియేది
వేసర కదుగిడితే వెనకే ముందు
నేసవెట్టితిని నేను చేతికి లోనైతివి
చేసూటి ముదిరితేను చిగురే చేఁగ ॥ ఏమ ॥

కూటమికి అడ్డమేది కొసరులకు లెక్కేది
గాఁటమై గోర గీరితే కాలువే యేరు
యీటువెట్టి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
నీటునఁ దెలుసుకొంటే నీవే నేను ॥ ఏమ ॥ 102

రే 1119 రీతిగౌళ

విచ్చి చెప్పరాదు వింతలు యీ భావాలు
రచ్చలకెక్కేను అంత రవ్వసేయనేఁటికి ॥ పల్లవి ॥

వలపులలోనివే వడిగొన్న యాసలెల్ల
సెలవులలోనివే సిగ్గులెల్లాను
పిలుపులలోనివే ప్రియములుగలవెల్లా
కులికి కులికి యేలే కొసరేవు పతిని ॥ విచ్చి ॥

చనవులలోనివే సరసములెల్లాను
నినుపులలోనివే నయములెల్లా
మనసులలోనివే మచ్చికలుగలవెల్లా
వొనర నింకానేలే వొరసేవు పతిని ॥ విచ్చి ॥

నమ్మికలలోనివే నానాఁటివొదఁబాటు (ట్లు?)
వుమ్మడివయసులోనే వొద్దికలెల్లా
నెమ్మదిఁ గూడె నతఁడు నిన్ను నిట్టె బుజ్జగించి
చిమ్మకువే గోళ్లను శ్రీవేంకటపతిని ॥ విచ్చి ॥ 103

గుండక్రియ

నేరుపరి వొదువే నెలఁత నీ విన్నిటాను
యీరీతుల రమణుని నెంతసేసేవే ॥ పల్లవి ॥

పనిలేనిమాటలను బయలు పందిలివెట్టి
మనసేమి సోదించేవే మగనిని
తవివోనిచూపులను తగులువిరులు వేసి
యెనసి పందేలాడేది యెందాఁకనే ॥ నేరు ॥

వాడికనవ్వులు చల్లి వలపువలువ దీసి
యేడదాఁకా మోసపుచ్చే వింత యేఁటికే
కోదెవయసుగరిడిఁ గొంకుదీర సాముసేసి
మేదెపురతుల నెంత మీరేవే యిపుడు ॥ నేరు ॥

వాములైనప్రియములవడగండ్ల గుళ్లు గట్టి
గోమున శ్రీవేంకటేశుఁ గూడితి వవునే
దోమటిపేఁతలనే దొమ్మిసేసి మొక్కులాడి
దీములొద్ది వేఁటలాడి తిరమైతివే ॥ నేరు ॥ 104

సౌరాష్ట్రం

ఇంతటిమీఁదటిపను లెఱఁగమయ్యా
సంతకూటములే కడుఁజవులాయనయ్యా ॥ పల్లవి ॥

వాడఁబాటుమాటలు వుప్పనౌనో చప్పనౌనో
వెడఁగునీమాటలు వినేమయ్యా
తడఁబడి నీసుద్దులు దైలువారిఁ జెవులను
అడఁచరావినవ్వులు అగ్గువాయనయ్యా ॥ ఇంత ॥

సంగడి మాచెనకులు చల్లనవునో వేఁడౌనో
వుంగిటినీచెనకుల కోరిచేమయ్యా
చెంగటినీనేరుపులు చిత్తములోఁ బేరుకొనె
ఖంగవినివ్వెరగులు కోటికొండలయ్యా ॥ ఇంత ॥

మచ్చికమావూడిగాలు మఱపౌనో తలఁపౌనో
కుచ్చి నీమన్నన లియ్యకొనేమయ్యా
తచ్చి శ్రీవేంకటేశ్వర తగ నన్నుఁ గూడితివి
లచ్చిన నీగుఱుతులు లాగవేగాలయ్యా ॥ ఇంత ॥ 105

పాడి

ఏఁటిమాట లాడీనే యెందాఁకా వీఁడు
నటన నేఁ దన కంత నేరుపేటిదానవా ॥ పల్లవి ॥

కలయనికాఁకలను కడునెంత పొరలినా
వలపు వెంచవచ్చునా వనితలకు
విలువునఁ దమకము విందుక యెంతవుండినా
వెలినున్నసిగ్గులెల్లా విడువఁగవచ్చునా ॥ ఏఁటి ॥

రాయడిపడక యంతరాణివాసమై వుండినా
పాయము దాఁచవచ్చునా పడఁతులకు
యేయడఁ దనకు వాసు లెంతగలిగివుండినా
కాయముపైఁ గళలెల్లాఁ గప్పఁగవచ్చునా ॥ ఏఁటి ॥

అనిశము మీఁద మీఁద నతిరాజసమై వుండినా
మనసీకుండవచ్చునా మగువలకు
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేఁడు
వెనకముందులు మరి వేరే యెంచవచ్చునా ॥ ఏఁటి ॥ 106

లలిత

కొమ్మలకు మనోభావకుఁ డందురు
సమ్మతించ మాకు దిష్టము చూపరాదా ॥ పల్లవి ॥

మగువ కోరికలనే మనసునఁ బాలు దాగె
జిగి నీవెన్నేని లెక్కచెప్పవయ్యా
నగవులకప్పురము నంటున బేరాలాడె
వెగటులేక నీవు వెల దీర్చరాదా ॥ కొమ్మ ॥

జలజాక్షి జవ్వనము చన్నులఁ గుప్పలు వోసె
యెలమిఁ గోరుపా లందునేమయ్యా
కలికి కన్నులనే కలువలఁ బూజసేసె
ఫల మెంత యిచ్చేవు పచరించరాదా ॥ కొమ్మ ॥

మానిని సిగ్గులనే మర్మములు విన్నదిగి(గెః)
ఆనతిచ్చి మెచ్చులు నీవందవయ్యా
పూవిక శ్రీవేంకటేశ పొందులు మీకిచ్చె అబ్బె
తేనెలమోవిమఱపు తెలియఁగరాదా ॥ కొమ్మ ॥ 107

మాళవిశ్రీ

కోరినట్టె వున్నవారు కొమ్మలు ముయ్యాడువారు
గారవపుగొల్లజాతి కలిగెఁగా నీ కిందుకే ॥ పల్లవి ॥

మెరవడికత్తెలైనమెలఁతలే నీకు బాఁతి
కరకరిఁబెట్టేటిక్షాంతలే బాఁతి
సరి నిన్నుఁబవిగొనేజారకాంతలే బాఁతి
గరిమ రేపల్లెనుఁ గలరుగా యిందుకే ॥ కోరి ॥

జిడ్డువలె నంటుకొనేచెలులే నీకుఁ బ్రియము
వొడ్డారపుసతులే నీ కొగిఁ బ్రియము
యొడ్డతనపుమాటలఇంతులే నీకుఁ బ్రియము
దొడ్డిమంద లిందుకే దొరకెఁగా నీకును ॥ కోరి ॥

తామే తేరకువచ్చినతరుణులు నీకు నింపు
కామించి సిగ్గులేనికాంత లింపు
యీమేర శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
ఆమని రాసక్రీడ లబ్బెఁగా నీకును ॥ కోరి ॥ 108

రేకు 1120 కేదారగౌళ

మాపుదాఁకానేల జోలి మంచివాఁడవే నీవు
రాఁపుసేయకుండరాదా రామ గలసీని ॥ పల్లవి ॥

నేరుపుల కెంతలేదు నీవు మాటాలాడేనంటే
మారుకొని వూఁకొనఁగ మాతరములా
మేరతోడివాఁడ వౌదు మెచ్చితిమి నిన్నుఁ దొల్లె
రారాదా యెందాఁక రమణి దిట్టీని ॥ మాపు ॥

వనుపులకుఁ గడమా నవ్వు నీవు నవ్వేవంటే
ఘనము మరి పెంచఁగలమా నేము
ఘనుఁడవు నీ వౌదువు కడమ నీయం దెంచము
యెనయరాదా ఇంతి యెగ్గులువట్టీని ॥ మాపు ॥

వేడుకలకు వెలితా వియ్యములందేనంటే
జాడతోడఁ గొసరేమా సారెకు నేము
కూడితివి వనితలను గొబ్బున శ్రీవేంకటేశ
తోడనే మోవియ్యరాదా తొయ్యలి వేఁడీని ॥ మాపు ॥ 109

బౌళి

అందరిముందరా నింతఆగడాలు సేతురా
విందువంటినీరాకకు వేసరుకొనేనా ॥ పల్లవి ॥

పెనఁగ నీతో నంతపెద్దరికమా నాకు
చెనకితే చెలులకు సిగ్గులు రావా
పనిమాలినపని బలుములు సేతురా
ఘనుఁడ యేకతమైతేఁ గాదనేనా ॥ అంద ॥

బిగియ నీతో నాకు బిరుదులపంతమా
మగువలు నవ్వితేను మాటకు రారా
తగవెంచి చూచుకోక తమకింతురా నీవు
మొగము చూచితే నీకు మొక్కకుంటినా ॥ అంద ॥

జంకించ నీమెదకు సారె సారె సూదుఁ బాడా
మంకు గలిగించితే మారుకొనరా
అంకెల శ్రీవేంకటేశ ఆయమంటి కూడితివి
సుంకులనీరతులకు చొక్కకుంటినా ॥ అంద ॥ 110

## తోండి

ఇదియే వేళవచ్చె నెచ్చరించితిమి నీకు
 వుదుటుఁగోపాననేల పూరకున్నదానవే ॥ పల్లవి ॥

వన్నెలెల్లా నీసొమ్ము వాసులెల్లా నీఇరవు
 సన్నలు సేయఁజెల్లునే సరసునితో
 చన్నులు నీకు గొప్పలు చనవు నీకే కలదు
 యెన్నినేఁతలు చేసినా యియ్యకోలే పతికి ॥ ఇది ॥

చక్కఁదనము నీరూపు జవ్వనము నీకు దాపు
 అక్కరతో నవ్వఁజెల్లు నన్నిటా నేఁడు
 చిక్కనిమాటలు నీవి చిమ్ముఁజూపు నీధనము
 ఇక్కువ లెంతంటినాను ఇయ్యకోలే పతికి ॥ ఇది ॥

పంతమే నీకు గుణము భావమే నీకు బలువు
 చెంతల శ్రీవేంకటేశుసేవ సేయవే
 యింతలో నాతఁడే నిన్ను నెనసె నీవు జాణవు
 యెంతకెంత చొక్కించినాను యియ్యకోలే పతికి ॥ ఇది ॥ 111

## సాళంగం

బలిమిసేయఁగఁబో తే పాటివట్ట రెవ్వరును
 తలఁపు సరివచ్చితే దగ్గరి రారాదా ॥ పల్లవి ॥

నను పందరికి సరే నాకు నీకే పాలు గాదు
 మనసు లెనపి మరి మరఁగేఁటికి
 అనుమానము గలిగితే నందరి నడుగవయ్యా
 వనితలమాట విని వద్దికి రావయ్యా ॥ బలి ॥

తమి యిందరికిఁ గద్దు తగ మనలోనే కాదు
అమరఁ బైకొని మరి అడ్డమేఁటికి
భ్రమసితేఁగన పద్దిపడఁతుల విచారించు
క్రమమై వుంటేఁగాన పొంకానకు రావయ్యా ॥ బలి ॥

కూట మిందరికిఁ గద్దు గురుతు ఇద్దరికే కాదు
వాఁటముగాఁ గలసియు వరుసేఁటికి
గాఁటపుశ్రీవేంకటేశ కాంతలకు సమ్మతమే
యీటుదొరకుండితేను ఇంకా రావయ్యా ॥ బలి ॥ 112

గౌళ

ఏమందుము నే మిందుకు యెదురుమాట
ఆమతకమెల్లా నాకు నానతియ్యవయ్యా ॥ పల్లవి ॥

ఒకమాట మీఁదఁబెట్టి వొకమాట లాడేవు
వెకలివై కొంతగొంత వేరే నవ్వేవు
మొకము చూచితేనే మోహములు చల్లేవు
యెకసక్కేలో నిజమో యెఱఁగరాదయ్యా ॥ ఏమం ॥

కొంత పరాకులుసేసి కొంగువట్టి తీసేవు
చెంతల దగ్గరి నీవే సిగ్గుపడేవు
దొంతిఁబెట్టి వలపులు దోమట్లు దొడికేవు
పంతానకో భక్తి గద్దో భావించరాదయ్యా ॥ ఏమం ॥

నయగారములు చూపి నన్ను నిట్టె కూడేవు
ప్రియములు చెప్పి రతిఁ బెరరేఁచేవు
నియతి శ్రీవేంకటేశ నీవే నన్ను మెచ్చేవు
దయనో తరితీపులకో తలఁచరాదయ్యా ॥ ఏమం ॥ 113

సావేరి

ఇంతే నేమెఱుఁగుదు మిద్దరికి సాకిరి
చెంతల మీకే తెలుసు చిత్తములో సుద్దులు ॥ పల్లవి ॥

సింగారపుఁగొప్పు వంగి చిమ్మిరేఁగెఁ దమకము
సంగతిగా నీవు చేయి చాఁచఁగాను
వుంగిటిగోని చెక్కుల నుమ్మగిలెఁ బులకలు
చుంగుల కొనగోళ్లు సోఁకఁగాను ॥ ఇంతే ॥

కప్పురపుమోవి వాడి కసరెత్తెఁ దేనెలు
దప్పిదేర మాటలాడి తగులఁగాను
కుప్పళించఁ జెమరించి గురిగాఁడెఁ జూపులు
వొప్పుగ నొకరొకరు వొకచోనే వుండఁగా ॥ ఇంతే ॥

జవ్వనపుమే నుబ్బి చలిదీరె సిగ్గులు
రవ్వలుగాఁ గూడఁగామ రతివేళను
యివ్వల శ్రీవేంకటేశ యింతిరో (తో?) మీ రెనయఁగా
నవ్వులు మామోములను ననిచీ మీయెదుట ॥ ఇంతే ॥ 114

రేకు 1121 ఆహిరి

నీ వెందరికి నౌదువు నీపాపము
వావులఁ గూడవేయఁగా వాములాయ వలపు ॥ పల్లవి ॥

వంతులకు నొకమాట వాసులకు నొకమాట
కొంతగొంత గొసరేరు కొమ్మలు నిన్ను
బంతివిందులు చెప్పేరు పాలిండ్లు చూపి చూపి
సంతకూటములలోనిచవులాయ వలపు ॥ నీ వెం ॥

కలువల నొకవాటు కప్పురాన నొకవాటు
చలములు సాదించేరు సతులు నిన్ను
వెలలు నీకుఁ బెట్టేరు వేడుకల మోవులకు
కలగూరగంపలై గరువాయ వలపు ॥నీ వెం॥

కాతరాన నొకరతి కాఁకలనే వొకరతి
పైతరవు వెట్టేరు భామలు నిన్ను
నీతితో శ్రీవేంకటేశ నీవు మమ్ము్మట్టె కూడఁగ
రేతిరిఁ బగలు పెరరేఁపులాయ వలపు ॥నీ వెం॥ 115

సామంతం

వేడుక మదనునివిద్యలివి
వాదలఁ గతలివి వాఁటములాయె ॥పల్లవి॥

చలములు సతితో సాదించరాఁగా
వలపులు రేఁగెను వడిఁబడెను
చెలువుఁడ మఱియును చెక్కులు నొక్కఁగ
అలరినయాసలు అవుఁదునఁ జిక్కె ॥వేడు॥

కాయపుమదములు కాఁకలఁ బెనఁగఁగ
పాయపుటురు లివి పైఁదవిలె
వోయయ్య తమకపుటోడ లాడఁగా
ఆయపుకుచములు అడిబర(రు?)వాయె ॥వేడు॥

కక్కసించి యిటు కాఁగిటఁ బెనఁగఁగ
లక్కవంటిమతి లలిఁ గరఁగె
యిక్కువ శ్రీవేంకటేశ కూడితివి
వెక్కస మీపెకు వెల్లవిరాయె ॥వేడు॥ 116

హిందోళవసంతం

ఏల కరఁగఁడే మన పిందాఁకాను
యేలికకంటాఁ జూచితినే యిందాఁకాను ॥పల్లవి॥

వచ్చినట్టే వచ్చితివి వాదవారి మెప్పించితి
యిచ్చకమాడితిఁ దన కిందాఁకాను
మచ్చరించనైతి తొంటిమాఁటలు నొప్పగించితి
యెచ్చరికలే సేసితి విందాఁకాను ॥ఏల॥

సన్నలకు లోనైతి చవులెల్లాఁ జూపితివి
యిన్నిటాఁ జుట్టమనైతి నిందాఁకాను
తన్ను నేమీఁ గోపగించ తప్పులువట్టను నేను
యెన్నుకొని మొక్కితిని ఇందాఁకాను ॥ఏల॥

అదను గాచుకుండితి వట్టే కాఁగిటఁ గూడితి
ఇదివో శ్రీవేంకటేశ ఇందాఁకాను
పదరఁ డీతఁడే చేపట్టి నన్ను మన్నించె
యెదుట నవ్వులు నవ్వె యిందాఁకాను ॥ఏల॥ 117

వరాళి

వివరించి చెప్పరాదు వేరే నీకు దాఁచరాదు
జవకట్టి వున్నవి మీఁజాణతనాలు ॥పల్లవి॥

చిదుముడి మాటలలోఁ జిందీ విన్నమొన్నటి—
కడువిరహములోనికాఁతాళాలు
గుడిగొన్నవిట్టూర్పులఁ గుమ్మరించీ నీమీఁద
తడఁబడ్డతనలోనితలపోఁతలు ॥వివ॥

సొలపుఁజూపులవెంట జొబ్బిలీని యేకతపు-
టలుకలఁ గొసరేటియందచందాలు
కులికి చెమటనీటఁ గురిసీ నీయెదుటను
చలివేఁడివలపులఁజడివానలు ॥వివ॥

మొలకనవ్వులలోనే ముంచీ నీవు గూడిన-
పలురతులలోపలిభావభేదాలు
యెలమి శ్రీవేంకటేశ యేలిననీకే తెలుసు
తలకొన్నజవ్వనపుతమకములు ॥వివ॥ 118

కాంబోది

మరిగి మరిగి తాను మగనాలివలెనే
సరవి దెలిసి లోలో సన్నసేయరే ॥పల్లవి॥

మెలుపునఁ బిలువఁగ మెత్తఁగానే పలికీని
వెలి నెవ్వరైనా నది వినేరంటానో
చెలులు వొద్దనుండఁగా సిగ్గులు రేఁగఁగఁబోలు
తలఁపు దెలిసి యేకతానఁ జెప్పరే ॥మరి॥

కానుక చేతికివ్వఁగా కానకుండా నందుకొనీ
కావీలేవే యెవ్వరైనాఁ గనేరంటానో
తానెవ్వతెకైనా మాట తగులఁగ వియ్యఁబోలు
యేనెపములైనాఁ జూపి యింటికిఁ దేరే ॥మరి॥

పలుమారు మొక్కఁగాను పరాకువలెనే వచ్చె
బలిమి గుట్టు బయటఁబడీనంటానో
యెలమి శ్రీవేంకటేశుఁ డీదగాఁగా నన్నుఁ గూడె
వలపుకొలఁదినే రవ్వలు సేయరే ॥మరి॥ 119

నాగగాంధారి

తగులాయ నీకనేలే తడఁబాట్లు
మొగిగొనె వలపుల మొగమోఁటలు ॥ పల్లవి ॥

పెనఁగేరమణునిఁ బియమే సేతువుగాక
కనుచూపులలో నేలే కనుఁగాట్లు
ననిచినవేళను నవ్వు నవ్వుదువుగాక
మొనచేతలలో నేలే ములువాండ్లు ॥ తగు ॥

మక్కువ మగనితోడ మంచిమాటాడుదువుగాక
చక్కెరమోవి నేలే చప్పుచారులు
చెక్కులు నీకు నొక్కఁగా సేదదేరుదువుగాక
ముక్కుల చన్నులనేలే మొనపోట్లు ॥ తగు ॥

కలసి శ్రీవేంకటేశుఁ గాఁగిలించుకొందుగాక
నిలుగులమేవనేలే నిండుసిగ్గులు
తలకొన్నరతులలోఁ దమితో నుండువుగాక
అలవి మీరి యేలే అసురుసురు ॥ తగు ॥ 120

రేకు 1122. ధన్నాసి

నీ కేల భయము నీకునీకే అలికేవు
చేకొన్న నీచేఁతలందుఁ జెరిగున్నవా ॥ పల్లవి ॥

చనవు నేమక ఆపె సారె నీమోము చూచితే
చెనకఁజాలక యేల సిగ్గువడేవు
కనుఁగొనఁబోతే నందు కళ లింతే వుండీ వవి
వెనుకొని కాఁతలెల్లా వేలు¹ కాదేరా ॥ నీకే ॥

---

1- వేలుక + అదేరా. (వేలాదేరా అని యర్థము.

మచ్చికచేసుక ఆపె మాటలు విన్నాడించితే
కొచ్చి కొచ్చి నీవేల కొంకఁజూచేవు
కచ్చుపెట్టి తోఁచేవి కల్లనిజములేకాక
అచ్చమై పొందినసతు లంటుకున్నారా ॥ నీకే ॥

చుట్టము సేసుక యింతి సొరిది విన్నుఁ గూడితే
యిట్టె శ్రీ వేంకటేశ నీవేల మొక్కేవు
గుట్టువను కొనగోళ్ల గురుతు లుండీఁగాక
మట్టిన కాంతలు మేన మూఁగుకున్నారా ॥ నీకే ॥ 121

కన్నడగౌళ

సేయవయ్య నీవు నేనేచేఁతలెల్లాను మా-
పాయపువయసేపో భ్రమయిఁ చేది ॥ పల్లవి ॥

పక్కన నీవు మాతో బలిమి చూపిన మా-
జక్కపకుచములేపో సాదించేవి
చక్కఁగా నీవెంతేసి సాములు సేసి వచ్చినా
వెక్కసపుమాఁటలేపో వేటువేసేవి ॥ సేయ ॥

చెలరేఁగి నీవు మాపై చేతు లెంత చాఁచినాను
సొలపుఁజూపులేపో సూదువట్టేవి
తొలఁగక సరసాన దొమ్మి యెంత సేసినా మా-
మొలకనవ్వులేపో ముంచుకొనేవి ॥ సేయ ॥

చిత్తగించి కాఁగిటను చేపట్టులకుఁ గొచ్చితే
తత్తరపుసిగ్గులే పంతముగొనేవి
యిత్తల శ్రీవేంకటేశ యెనసితి విట్లానే
లత్తుగోరివన్నెలే లావుచూపేవి ॥ సేయ ॥ 122

నాగవరాళి

తానే సిగ్గువడఁగ తప్పు లెందుఁ బట్టుదునే
కానీవే అన్నిటా వారుకాణకు గురెవ్వరే ॥ పల్లవి ॥

చిక్కవినవ్వులతోడ శిరసు దా వంచఁగాను
యెక్కవమదనముద్ర లెందువోవునే
ముక్కుమీఁది వేలితోడ మోనముతో నుండఁగాను
మక్కువ నామాఁటకు మాటాదేవా రెవ్వరే ॥ తానే ॥

చిగురుఁగెమ్మోవితోడ చెక్కునఁ జేయిదుకోఁగా
అగడుగా నాతోఁ బెండ్లాడే దెప్పుదే
మొగము చూచి తాను మొక్కులు దా మొక్కఁగాను
మొగమోట తీర్పెల్ల మోఁచే దెక్కడనే ॥ తానే ॥

నంటు నేసుకొని తాను నన్నుఁ గాఁగిలించుకోఁగా
వుంటవింట మరువా ట్లాడ్డేదెపుదే
దంట శ్రీవేంకటేశుఁడు తానే వచ్చి నన్నుఁ గూడె
బంట(టు?)పంతములెల్లానుఁ బదరించే దెప్పుదే ॥ తానే ॥ 123

పళవంజరం

వలపించఁబోయి నీవే వలచితి వతనికి
వలు(లి?)కించేనంటా నీవే పలికేవే కరఁగి ॥ పల్లవి ॥

కన్నుల నీవు చూచితే కాంతుఁడు గుటియౌఁగాక
చన్నుమీఁదిపయ్యెద జారనేఁటికే
వన్నెలు నీవు నేసితే సమ్మతించుఁగా కతఁడు
చిన్ని చెమటలు నీమెయిఁ జిందనేఁటికే ॥ వల ॥

నీవు చేయి చాఁచితే నీవిభుఁడు లోనౌఁగాక
వేవేలకు నీకొప్పు వీడనేఁటికే
మోవి నీవు చూపితేను మొక్కి తాఁ జేకొనుఁగాక
ఆవేళను నీవు వెరగందనేఁటికే ॥ వల ॥

అంటితే శ్రీవేంకటేశుఁ డట్టె నిన్నుఁ గూడుఁగాక
పెంటపులకలు నీకుఁ బెరుగనేలే
జంటయై కూడితిరి నీచన వాతఁ దిచ్చుఁగాక
వెంటవెంట వచ్చివచ్చి వేఁడుకొననేఁటికే ॥ వల ॥ 124

సాళంగం

ఎంతమాయకాఁడవో యేమని చెప్పుదు నిను
పొంతల నవ్వేవేల [1]బూమెటపలెను ॥ పల్లవి ॥

చెప్పఁగానే నూ(నో?)రూరీ చిన్ననాఁటివలపు
కప్పము(?) వట్టినచింత కాయవలెను
దప్పి నాఁకలీఁ దీరీని తగ నీమోవి చూచితే
విప్పుచును పెక్కుండ్లవిందువలెను ॥ ఎంత ॥

వింటే మేను గరుపారీ వినోదపుసుద్దులు
ముంటివాఁడిజాజినన మొగ్గలవలె
చంటికొనలజవ్వనమే జడిసీ నీవద్దనుంటే
పంటవండినరాసుఁ భాగ్యములవలెను ॥ ఎంత ॥

కూడఁగానే ఆసలెక్కి కోరిననీరతులను
వాడికెఁ గూడివచ్చినవడ్డివలెను
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నీడలనిలిచిననానిధానమువలెను ॥ ఎంత ॥ 125

1. 'బూమెట' భూమిశాకలిపమా ?

రీతిగౌళ

ఆయనాయ నూరకుండు ఆసోదమా నాకు
ఆయమై నీనేసపాలు అఱచేత నున్నవి ॥పల్లవి॥

అంతేసి నాతో నీవు ఆనవెట్టుకోనేలయ్య
దొంతిఁ బెట్టుకుందాన నీతొల్లిటిబాస
వింతగా వేరె నాకు విదె మియ్యవలెనా
పొంత నీతమ్మల మిదె పుక్కిటిలో నున్నది ॥ఆయ॥

వెడ్డువెట్టి యింత నన్ను వేఁడుకొననేలయ్య
దొడ్డిఁ బెట్టుకుందాన నీతొంటిమొక్కులు
వొడ్డుకోఁగా నప్పటిఁ బూవుల వేయవలెనా
వొడ్డినసీకొప్పువిరు లొడి నిండి వున్నవి ॥ఆయ॥

ఆసచూపి జవ్వాదివం(?) కట్టె నాకీనేలయ్య
దోసిటఁ బట్టుకుందాన తొంటికానికె
వాసి నలమేల్మంగను వడి శ్రీవేంకటేశుఁడ-
వీసుదీరఁ గూడితివి యింతబలు వున్నదా ॥ఆయ॥ 126

రేకు 1123 ముఖారి

కాకుండితే రమణుఁడ కాఁతాళములు రేఁగు
పైకొన్నమాటలోడ పంతమెల్లా దక్కెను ॥పల్లవి॥

వుల్లసముగా నాడినవొడ్డారపునీమాట
చల్లనినవ్వుమాటతో శాంతమాయను
కల్లలగా నాడినకారపువెంగెపుమాట
తెల్లమై ఆసమాటతో తియ్యనాయను ॥కాకుం॥

వూరకె నీవాడిన వుప్పనైననీమాట
సారపుముద్దుమాటతో చవి వుట్టెను
జారువడ నాడినట్టిచప్పనైననీమాట
పేరుకొన్నమాటతోఁ బ్రియమాయను ॥కాకుం॥

కప్పురపువెసురుకాఁగిటిలో తిట్టుమాఁట
వొప్పినసమ్మతిమాఁట నొచ్చెము దీరె
యిప్పుడే శ్రీవేంకటేశ యెనసినపచ్చిమాఁట
తప్పనినీమాఁటతోఁద తనివి నాకాయను ॥కాకుం॥ 127

వరాళి

కొంకనేల నీవింత కోరి సిగ్గువడనేల
సంకెదీరె నీతోఁద చలము లేదయ్యా ॥పల్లవి॥

మనసొక్కటైతేఁ జాలు మాఁటలు వేరే తోఁచవు
అనుమానమేల మాతో నానతీవయ్యా
యెనయికలు గలిగితే నెరవు లించుకా లేవు
కొనమొద లెంచనేల కూచుండవయ్యా ॥కొంక॥

యితవులైన చోట నెగ్గులుసిగ్గు లుండవు
చతురతల వలపు చల్లవయ్యా
పతి తారుకాణలై తే పట్టినదెల్లా నిజము
రతికెక్కెఁ బనులెల్లా రావయ్యా లోనికి ॥కొంక॥

సమ్మతించినందుకెల్లా సరసములే మించు
వమ్మించితి విట్టే మాతో నవ్వవయ్యా
యిమ్ముల శ్రీవేంకటేశ యేలితివి నన్ను విట్టె
యెమ్మెలేల పీమోవి యియ్యవయ్యా ॥కొంక॥ 128

## దేశాక్షి

వెట్టిచెలులము నేము వేరుకేకాదా
నట్టుకొని నీవింతేసి నవ్వవద్దా నేఁడు ॥ పల్లవి ॥

రాతిరెల్లాఁ బాదాలు రాసి గుద్దించుకొంటివి
నాతోడిపొందు నీకు నయమేకాదా
యేతులకు నాకుమడిచిప్పించుకొంటి విందాఁకా
లాతుగా నిది గొంతలాభమేకాదా ॥ వెట్టి ॥

కొంగుపట్టు కిందాఁకా కొప్పు దూవించుకొంటివి
చెంగట నీగజరుకు సెలవేకాదా
వుంగరాలవే ళ్లిందాఁకా వూరకే పిసికించితి
వెంగలిమావూడిగాలు వినోదాలుగావా ॥ వెట్టి ॥

కూరిమి గొసరుకొంటా కుంచవేయించుకొంటివి
సారెకుఁ గరఁగ నీకు చవులేకావా
ఆరయ శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
దారకుఁద వింతసేయఁ దగవేకాదా ॥ వెట్టి ॥ 129

## సాళంగనాట

ఎఁ(ఎం?)తైనా నీయలవాట్లెల మానేవు
వింతలు నేయవుగా వెలఁదులయెడను ॥ పల్లవి ॥

వానికిఁ గొంగువట్టేవు వడి నీవు గొల్లెతల
నేసినట్టెల్లా ముందు చెల్లెవఁటాను
ఆసలఁ జేయిచాఁచేవు అల్లనాఁడు రుక్మిణివి
వేసుకొంటి విఁకలేదు వేసరంటాను ॥ ఎంతై ॥

యింటికి రప్పించుకొంటి విట్లాఁ బదారువేల
యింటఁ బెట్టుకొంటి రతికెక్కెనంటాను
జంట సాము నెరపేవు సత్యభామకు విల్లిచ్చి
వెంటఁబెట్టుకొన్నసుద్ది వెలసెనంటాను ॥ఎంతై॥

శిరసువంచి మొక్కేవు శ్రీవేంకటేశ నీ-
శిరసుపైఁ దొళశమ్మ చేరెనంటాను
యిరవై నన్ను నేలితి విందిరను భూసతిని
యీ మేలా నిడుకొని యేలితినంటాను ॥ఎంతై॥ 130

## భైరవి

వినవే నా మాఁటలు వివేకించుకొనవే
పనులేమి గలిగినా పతిఁ గొసరుదమే ॥పల్లవి॥

మగువలెల్లా నొక్కటి మనలో విరహమేలే
తగుసవతులమైతే తప్పు వచ్చెనా
మగనికాఁగిలే గతి మఱి యెంత చుట్టినాను
పగలు రేతిరి నొక్కటియటనే కూడినే ॥విన॥

అక్కయేమే చెల్లెలేమే అందులో భేదమున్నదా
నిక్క మేరాండ్లమైతే నేరమాయనా
చిక్కేటి దాతనిమోవే చేరి యిద్దరినోళ్లకు
చక్కలూఁ జంద్రుఁడూ నొక్కచూపులోనే కూడునే ॥విన॥

నీవు నేనూ సమమే నేరిచి నడచితేను
దేవుళ్ల మిద్దరమైతే తెలివిలేదా
శ్రీవేంకటేశుఁడు గూడె చెలఁగి నిన్నును నన్ను
పూవులెల్లా వనమువఁ జూచేవేకదవే ॥విన॥ 131

కన్నడగౌళ

కాఁగిలించుకొనవే గక్కన నీరమణుని
కాఁగి కరఁగినమేలు [1]గట్టాయఁ జాలదా ॥పల్లవి॥

బిగువు నీచన్నులందు బెరసీని చాలదా
బిగియఁగావలెనా ప్రియునితోడ
వొగరు చిగురుమోవి నుట్టిపడీఁ జాలదా
వొగరుమాఁటలు వేరె వొలుకఁగవలెనా కాఁగి॥

పెనగొని నీనెరులు పెక్కులయ్యీఁ జాలదా
పెనఁగఁగవలెనా పిలువఁగానే
మొనసెఁ బులకలు కమ్మిక మేనఁ జాలదా
మొనలగోళ్ళఁ జూపి మోప నింకా వలెనా ॥కాఁగి॥

నాఁటుకొనె నీప్రియము నగవులఁ జాలదా
నాఁటఁజూడవలెనా నయములనె
మీఁదే వలమేల్మంగవు మీఁదఁ గప్ర మిట్టె కూడి
మీఁదె వేలు [2]శ్రీవేంకటమేఁటి నీపైఁ జాలదా ॥కాఁగి॥ 132

రేకు 1124 ఆహిరి

విన్నవించితిమి నీకు వేడుకవేళ
కన్నెను నీవు దయఁ గాచేటివేళ ॥పల్లవి॥

మచ్చికలు దయివారె మనసెల్ల తైవారె
వచ్చె జవ్వనానకు వసంతవేళ
చొచ్చి నిన్నుఁ బాసి తాపసూర్యుఁ డెండగాయఁగా
విచ్చనవిడిగాఁ దోఁచె వేసగివేళ ॥విన్న॥

---

1. గట్టి + అయ 2. 'వేంకట' శబ్దము నామవాచకమగుటచే సంస్కృత–దేశ్యరూపముగా గ్రహించి సమసించిరి గాఁబోలు. రేక, అతత్సమితసంస్కృతశబ్దములకు దేశ్యములతో దండిగసమాసములఁ గూర్చినయలవాటునవియైనా కావచ్చు.

సిగ్గులు మొలవఁజొచ్చె చెమటలేరులు హెచ్చె
కగ్గులేక మించె వానకాలపువేళ
వెగ్గళించి నెలవుల వెన్నెలలు చూపట్టి(ట్టె?)
వొగ్గి శరత్కాలము వొదిగె నీవేళ ॥ విన్న ॥

తత్తరపుచలి పొంచె తలపోఁతమంచు మించె
యెత్తి యలమేల్మంగకు హేమంతవేళ
బత్తితో శ్రీవేంకటేశ పైకొని కూడితి విట్టె
చిత్తజుకాఁకలు దేరె సిసి(శిశి?)రవేళ ॥ విన్న ॥ 133

నాదరామక్రియ

నీకే పంపునేసుఁగాక నేమేమన్నాఁ గైకొనీనా
యేకడా నీమఱఁగున నిటుండేవారము ॥ పల్లవి ॥

చెలియ నీచెప్పినట్టు సేసుఁగాక అతఁడు
మలసి మాకెల్లాను మట్టుపడీనా
పిలిచిననీపిలుపే ప్రియములై వుండుఁగాక
బలిమి నేము రమ్మంటేఁ బలికీనా అతఁడు ॥ నీకే ॥

వినవే నీకన్నులకే వెఱచుఁగా కాతఁడు
చెనకి నేము చెప్పితే చెవులొగ్గీనా
చనవిచ్చి నీమొక్కులే చవులై యుండుఁగాక
యెనసి మావినయాల కింటికి వచ్చీనా ॥ నీకే ॥

పైపై నీకూటమికే భ్రమసుఁగా కాతఁడు
తీపులు నేము చూపితే తెమలీనా
యేపున నీయప్పణను యిటు మమ్మే నేలెఁగాక
వోపి శ్రీవేంకటేశుఁడు వొడఁబడీనా ॥ నీకే ॥ 134

బౌళి

చేఁతకుఁ జేత నేసెను చెల్లఁగదవే
[1]ఝాఁతా మోఁతా నొక్కటాయ విఁకనేమనేరే ॥పల్లవి॥

కన్నుల మొక్కేరు మీరు కాఁకలు చల్లేరు మీరు
యెన్నఁగ రెండూ నడపేరేమే [2]వొక్కంటే
కిన్నెరకాయచన్నుల కేరినవ్వేటిచెక్కుల
సన్నపుగోర నొత్తెమ సరసుఁడే అతఁడు ॥చేఁత॥

చేతులుచాఁచేరు మీరు సిగ్గులూఁ బడేరు మీరు
యేతులకు రెఁడూ నడపే రిదె మీయందే
ఘాతలఁ గొప్పువిరులు కప్పినపయ్యదకొంగు
రీతి నొక్కమాఁటే జారించెఁగదే ఘనుఁడు ॥చేఁత॥

కందువఁ గూడేరు మీరు కడుఁబ్రమనేరు మీరు
అందాలు రెండూఁ జూపే రంగాలందునే
ముందే శ్రీవేంకటేశుఁడు మోవి ఇచ్చి మెచ్చటాడె
విందులుగా మొహింపించె వేడుకకాఁడే ॥చేఁత॥ 135

గౌళ

ఇందుకేకా విభుఁడు నీయింట నెలకొన్నాఁడు
కందు వెఱుఁగుదువు యీకత నీవే నేర్తువే ॥పల్లవి॥

నయమెంత గలిగినా ననుపులకే మేలు
ప్రియమెంత గలిగినా పెనపులకే మేలు
జయమెంత గలిగినా చనవులకే మేలు
క్రియ లెఱుఁగుదువు యీకీలు నీవే నేర్తువే ॥ఇందు॥

1. చూః — 98 పాట. ఈడుటయు. మోయుటయు అని ఇక్కడ. వీటిక్రమ ప్రవృత్తువు అని తాత్పర్యము. 2. ఒక + కంటె. ఒకకంటనే అని భావము.

మొగమెంత చూచినా మోహానకే మూలము
తగవెంత నెరపినా తగులుకే మూలము
నగవెంత గలిగినాను నమ్మికలకు మూలము
పగ తెరుఁగుదువు యీపాటి నీవే నేర్తువే ॥ ఇందు ॥

వూడిగ మెంతసేసినా వొద్దికలకే దాపు
వేడు కెంతసిలిపినా వెల్లివిఁగుటకే దాపు
కూడితి విన్నిచందాల కోరిక శ్రీ వేంకటేశ
జాడెఱుఁగుదువు సరసము సరసము నీవే నేర్తువు ॥ఇందు॥ 136

సామంతం

చూడఁ జిన్నగాని సుద్దులు పెద్దలు
కూడి పట్టఁబట్టఁ గొట్టీ గోవిందుఁడు ॥ పల్లవి ॥

వాలవుట్టెఁ గొట్టి పరువునఁ బోయి
వేలాడఁగాఁ గొట్టె వెన్నవుట్టి
కేలు చాఁచి కొట్టె కిందితేనెవుట్టి
యేలాగు దాఁతమే యేమందమే ॥ చూడఁ ॥

చక్కెలాలవుట్టి పరుగనఁ గొట్టి
నిక్కి నిక్కి కొట్టె నేతివుట్టి
పక్కదిక్కు గొట్టె పంచదారవుట్టి
యెక్కడ దాఁతమే యేమందమే ॥ చూడఁ ॥

వారవట్టి కొట్టె వంచి పెరుగువుట్టి
చారపప్పువుట్టి జారఁగొట్టె
కోరి శ్రీవేంకటగోవిందకృష్ణుని
కేరీతి దాఁతమే యేమందమే ॥ చూడఁ ॥ 137

బౌళి

ఆయలేవే యేమి చెప్పే వాతనిపొందులు
పాయములకొలఁదివే పైకొనెడియాసలు ॥పల్లవి॥

పిలుపులకొలఁదివే బిగువులు
బలిమికొలఁదివే పంతాలు
చలముకొలఁదివే సాదింపులు
కలసినకొలఁదివే కరఁగులు ॥ఆయ॥

చనవులకొలఁదివే సరసాలు
నమపుకొలఁదివే నగవులు
వినికికొలఁదివే విన్నపాలు
తనిసినకొలఁదివే తమకములు ॥ఆయ॥

వేడుకకొలఁదివే వేసాలు
వాడికకొలఁదివే వలపులు
యీడనె శ్రీవేంకటేశుఁ డెనసె నిన్ను । యీ-
కూడినకొలఁదివే గుఱుతులు ॥ఆయ॥ 138

రామక్రియ

సారెనేలే జగడము సారెనేలే సణఁగులు
సారెనేలే పతితోఁ బంతము సారెనేలే ॥పల్లవి॥

పెదవుల గొణఁగుచు బీరములాడుచు
కొదలుఁదిట్లనే కొసరుచును ॥సారె॥

సెలవుల నవ్వేవు చేతులు చాఁచేవు
సళుపుఁజూపులనె చల్లేవు ॥సారె॥

చిదుముడిపడకువె శ్రీవేంకటపతి
కదపరాయఁడయి కయికొనెను ॥సారె॥ 139

1125 రేకు కాంబోది

ఇటమీఁద నీచిత్తము యెఱుఁగగలవాఁడవు
తటుకన నింకా నేమి దండము వెట్టేను ॥ పల్లవి ॥

కోరినకోరిక నీవు గుఱి నీచక్కఁదనము
వేరే నీకు నిఁకనేమి విన్నవించేను
జారె నాపయ్యద నీకు చన్నులివి కానుకాయ
గారవాన నిఁకనేమి కప్పమిచ్చేను ॥ ఇట ॥

అంగము నీవద్దనుంది ఆయము నీ చేతిది
అంగవించి యెందాఁకాఁ బ్రియము చెప్పేను
ముంగిట వెరగందితి ముట్టితివి నీవు నన్ను
యెంగిలిమోవివిందు లేమిచెప్పేను ॥ ఇట ॥

గక్కనఁ గూడితి నిన్ను కాఁగిలి నీసొమ్మాయ
చిక్కించు కెంతతడవు నేసవెట్టేను
అక్కున శ్రీవేంకటేశ అలమ నీవు పతివి
పక్కన మరేమి నిన్ను బాసగొనేను ॥ ఇట ॥ 140

బౌళి

ఈకె యెంతచనవరో యేకతాన వింతసేసె
లోకులుగా వారు నవ్వి ఎలి నొక్కసైరి ॥ పల్లవి ॥

అలిగి వొక్కరొక్కరు అటుమోములై వుండఁగా
వెలయఁజెప్పె బుద్దులు పినకుండఁగా
చెలివలువలు దీసి సిగ్గునఁ దలుపులు మూసి
వెలి విలుచుండితేను వింటశిట్టు దిట్టిరి ॥ ఈకె ॥

వాగాలు నోళ్ల(బోసి బలిమి నాకు మడిచి
అగలి విడీ నప్పటి నట్టె వుండఁగా
చేఁగదేరఁ గాఁగిళ్లకు చేతులు చక్కఁగా దొల్సి
వాగుగఁ దెరవేసితేఁ బచ్చితట్టు దిట్టిరి ॥ ఈకె ॥

శ్రీవేంకటేశ్వరు వింతిఁ జేరి మర్మా లంటించి
అవేళవారివలువ లట్టె కప్పఁగా
దేవుఁడు దేవులుఁ గూడి తెలివను మెచ్చి మెచ్చి
వేవేలిచ్చి మన్నించి వేరేతిట్టు దిట్టిరి ॥ ఈకె ॥ 141

లలిత

ఎవ్వరెవ్వరిపంతాలు యెటు వచ్చునో
ఇవ్వల వీరివేరుపు లేమి చెప్పేమే ॥ పల్లవి ॥

మాటలాడమని లోలో మరి వొట్టువెట్టుకొని
యీటువఁ గొంతవ దూర కిద్దరు నుండి
పాటించి ఇంతిచెల్లెలిఁ బట్టితెచ్చి నాయకుఁడు
గోటారించి భంగించఁగా కొమ్మ వేఁడుకొనెను ॥ ఎవ్వ ॥

మోములు చూడమనుచు మించి వొట్లువెట్టక
వోముచుఁ గొంతవడి తామూరకే వుండి
నేమమున నద్దములో నీడలు దెచ్చి విభుఁడు
భామినికిఁ జూపి తేను పై పై బంకించెను ॥ ఎవ్వ ॥

కూడమంటాఁ గోపమువఁ గోరి వొట్టువెట్టుకొని
వోదక కొంతవడిదాఁ కూరకే వుండి
వేడుకొపెకాతాఁ శ్రీవేంకటేశుఁ డంటఁబోఁగా
గా[1]థల వద్దంటా నతి కాఁగిలించి పట్టెను ॥ ఎవ్వ ॥ 142

1. ప్రావతంగము.

మంగళకౌశిక

మించి ఇన్నిటికి మీఱుమీరే జోడు
మంచముపై రతులకు మంతనాలే జోడు ॥ పల్లవి ॥

తీరనియాసలకు తియ్యనిమోవులు జోడు
మేరమీరేచిత్తాలకు మేనులే జోడు
ఆరనికాఁకలకును అంటినకాఁగిళ్లు జోడు
నేరిచిననేర్పులకు నెయ్యమే జోడు ॥ మించి ॥

చెనకుల కన్నిటికి చిమ్ముఁదమకము జోడు
ననుపులకును లేఁతనగవే జోడు
చనువుమనవులకు సన్నలు చాయలు జోడు
ఘానగూడి వుండుటకు వోరుపులే జోడు ॥ మించి ॥

కలయికలకు సారెఁ గనుఁగొను టే జోడు
అలపులకును మాఁటలాడు టే జోడు
అలమేల్మంగ శ్రీవేంకటాద్రీశ విన్నుఁ గూడె
తలపోఁతలకు మీమీతారుకాణే జోడు ॥ మించి ॥ 143

హిందోళం

ఆతఁ డాడుమనఁగానే ఆడితి నే నీమాట
కాతరాన లోన వాఁడే కై కొనఁగరాదా ॥ పల్లవి ॥

పయ్యదేల మూసేవే పడఁతి నీచన్ను లవి
వొయ్యన జక్కవలంత వుబ్బ కోర్చునా
వుయ్యాలమంచముమీఁద వొరసేనీనాయకుని
కొయ్యారతుల కాఁగిటిగూఁటఁ బెట్టరాదా ॥ ఆతఁ ॥

రెప్పలేల వేసేవే రేసుల నీకనుచూపు-
ముప్పిరిచకోరాలు మూలనుండునా
కప్పురపుమేడలోనఁ గదిసేనీరమణుని-
దెప్పరపుమేననే దండెన వేయరాదా ॥ అత ॥

తురుమేల ముడిచేవే తుమ్మిదలఁ బిసికితే
మరుగునా యలమేలుమంగవు నీవు
పరపుపై శ్రీవేంకటపతిఁ గాఁగిటఁ గూడితి-
వరయఁగ నాతనిపై నాట నేర్పరాదా ॥ అత ॥ 144

శంకరాభరణం

అందరిముందరనైతే నవ్వు రాదు
కందువకు నీవు రమ్మా కత చెప్పేను ॥ పల్లవి ॥

చనవు లోకతె కిచ్చి చలమురేఁచే వాకతె
వనితకు వనితలు వట్టిపెట్టేరా
ఘనుఁడవు నీకింత గలితే తోవికి రమ్మా
వానర నీమనసురా నొప్పఁజెప్పేను ॥ అంద ॥

నవ్వే వాపెతో నీకె నమ్మించి దీకొలిపేవు
జవ్వనికి జవ్వని సరిదూఁగదా
అవ్వల నీకింత ప్రియమైతే దగ్గరిరమ్మా
దివ్వన నీవేడుకలు చెల్లించేను ॥ అంద ॥

రతిసేసి చెలియను రమణిఁ బిరికొల్పేవు
అతివపై నతివ రా నాస మానీనా
తతి నలమేల్మంగను తగు శ్రీవేంకటాచలా(ల-?)
పతి కూడితివి రమ్మా బాగులు వేసేను ॥ అంద ॥ 145

రేకు 1126 దేసాళం

జాము వోయ విం కాను సటలేఁటికే
సీమతక మింతయు నే మెఱఁగమా ॥ పల్లవి ॥

సిగ్గు లెందాఁకానే చెఱఁగు వట్టెను పతి
యెగ్గు లెందాఁకానే యిదె మొక్కీవి
విగ్గఁజల మెందాఁకానే ని న్నాతఁడు వేఁడుకొనీ
వొగ్గి విడె మిమ్మంటే వోపనందురా ॥ జాము ॥

పెనఁగు లెందాఁకానే ప్రియపడీ రమణుఁడు
కినుక లెందాఁకానే కిందుపడీవి
. నుగు లెందాఁకానే చోటిచ్చీఁ గూడుమంటా
వినుఁ గుంచ వేయుమంటే నేరవందురా ॥ జాము ॥

విఱునవ్వం(వ్వా?) లెందాఁకానే శ్రీవేంకటేశుఁడు గూడె
నెఱి నలమేల్మంగవు విన్ను విప్పుడే
వెఱగు లెందాఁకానే విచ్చనవిళ్లాయ నీకు
మఱియుఁ గొసరితేమ మచ్చరింతురా ॥ జాము ॥ 146

పాడి

ఇద్దరిమీఁతలపోఁత లెఱఁగఁగాక
కొద్దిమీరితే నగవే కోటి కొండగాదా ॥ పల్లవి ॥

వాదికెవిభువితోడ వాదైతే నెఱఁగఁగాక
చూడనేరిచితే చూపే సూదిదెగాదా
పాడిపంతాలకు నెగ్గుపట్టితే నెఱఁగఁగాక
ఆడనేరిచితే మాట అమృతముగాదా ॥ ఇద్ద ॥

సవతిపో రితనిపైఁ జల్లితే నెఱఁగఁగాక
చవిగొంటే వలపులే చక్కెర గాదా
తివిరి చలములే సాధించితే నెఱఁగఁగాక
వివేకించితే మనసే వింతసొమ్ముగాదా ॥ ఇద్ద ॥

మతకపుసిగ్గుల నేమఱితే నెఱఁగఁగాక
రతిసేసితేఁ గాఁగిలే రాజ్యముగాదా
తతి నలమేల్మంగవు దక్కె శ్రీవేంకటేశుఁడు
సతమైనచనవులే సంపదలుగావా ॥ ఇద్ద ॥ 147

౬
## శుద్ధవసంతం

[1] ఏమిసేసినా నీయిచ్చకొలఁదే కాక
కామినులము నిన్నెట్లు కాదనఁగవచ్చును ॥ పల్లవి ॥

తటుకునఁ బొలసేవు తలయెత్తి చూచేవు
చలపట్టితే వలపు చప్పరించేవు
చెలి దగ్గరివచ్చితే చేతికి లోనయ్యేవు
బలిమి నీమనసెట్టు పట్టేమనవచ్చును ॥ ఏమి ॥

కడుఁబెచ్చుపెరిగేవు గక్కున సూడువట్టేవు
విడువలేక సతివి వెంటఁ దిప్పేవు
వాడివట్టి తీసేవు వూరివారినెల్లాను
చిడుముడి నిన్ను నెట్టు చెనకఁగవచ్చును ॥ ఏమి ॥

కమ్మి సిగ్గువడవు తొక్కనిచోట్లు తొక్కేవు
పమ్మి యలమేల్మంగకుఁ బతివి నీవు
చిమ్మచు మేకులకే శ్రీవేంకటేశ మొక్కితి
నెమ్మది నిన్నిఁక నెట్టు నేరమెంచవచ్చును ॥ ఏమి ॥ 148

1. ఇందు దశావతారసమన్వయము కలదు.

రామక్రియ

వట్టిపంతములు మాతో వద్దు వద్దయ్యా
పట్టపుదేవులకును భ్రమయఁగవలదా ॥ పల్లవి ॥

ఆయాలునొఁకినమాట ఆపె నీతో నాడఁగాను
యీయెడ నీవు గరఁగ కెట్టు మానేవు
పాయపుఁజెలియ నీకు బత్తులెల్లాఁ జేయఁగాను
సోయగాన నీవెట్లఁ జొక్కకుండేవు ॥ వట్టి ॥

మించి యాపె నీకు చనుమొనలు చూపఁగాను
యెంచి యిట్టే పంపునేయ కేల మానేవు
పొంచి నీరమణి నిన్నుఁ బొత్తుకుఁ బిలువఁగాను
కొంచించి నిలిచి ఇట్టె గుండె వట్టేవు ॥ వట్టి ॥

అలమేలుమంగ పురమందు నీకు నెక్కఁగాను
యెలమి నానందించ కెట్టు మానేవు
అలరి శ్రీవేంకటేశ ఆపె సరసమాడఁగ
వెలుచవై నీవెట్టు వెనఁగాదేవు ॥ వట్టి ॥ 149

వరాళి

ఏమను నీతోడిపొందు లిటువంటివి
దోమటి దొడికితేను తొడిఁబడ నెట్లో ॥ పల్లవి ॥

నవ్వఁగానే నీతోను నాటుకొనెఁ బ్రియములు
దవ్వులనుండి చూచితేఁ దగిలె మతి
మువ్వంకల మొక్కఁగానే ముదిరె మిక్కిలియాస
యివ్వలఁ జేయంటితేను యిఁక నెంతేకానో ॥ ఏమ ॥

మాట లూరకే యాడితే మర్మములు గదురేఁగె
పాటించి కానుకియ్యఁగా పట్టెను తమి
చాటువ మొగమోటు సమ్మతులాయ నవ్విఁయు
యీటు సరసాఁడితే వీఁక నెంతేశానో ॥ఏమ॥

యేకాంతము జరపఁగా విట్టె మేను చెమరించె
దీకొని పెనఁగఁగాను తేరెఁ బనులు
చేకొనె నలమేల్మంగ శ్రీవేంకటేశ్వర విన్ను
యీకదఁ గాఁగిలించెను ఇఁక నెంతేశానో ॥ఏమ॥ 150

ముఖారి

ఇన్నిటికి నోపుదు విటువంటినీకును
యెన్నఁగ వలచివచ్చే దేమిబాఁతి సతులు ॥పల్లవి॥

చుట్టపువరసకుఁగాఁ జొచ్చి బండి రొప్పితివి
గుట్టున గొల్లలకుఁగా కొండ యెత్తితి
బిట్టువాగెలఁ బెండ్లిపేరటము వోతివి
యిట్టిపూసగొందివి నీకేమిబాఁతి సతులు ॥ఇన్ని॥

మామవంత వేఁడుకొని మవికిత్తై వున్నాఁడవు-
చూ: పాతల వింటఁ జముటఁ గాచితి
దోమతి [illegible] నారింయింద్లను
[illegible] కేమిబాఁతి సతులు ॥ఇన్ని॥

అంకెల యజ్ఞపత్నుల నడిగి తెంపేసితివి
కంకిగాఁ గోకలు మోచి కాచుకుంటివి
వుంకువ నలమేల్మంగ నురమెక్కించుకొంటివి
యింక శ్రీవేంకటేశ నీకేమిబాఁతి సతులు ॥ఇన్ని॥ 151

రేకు 1127 సాళంగనాట

పట్టము గట్టితి వింత బ్రతుకరయ్యా
చిట్టకాలు లేవు మీకు శ్రీవేంకటేశుఁడా ॥ పల్లవి ॥

అలమేలుమంగకు సింహ్వ(హా?)సనము నీవురము
కలితహారములే సింగారపుదండలు
తొలఁకునీహస్తములే తోరణగంభములు
చెలిరాజ్యమే నీవు శ్రీవేంకటేశుఁడా ॥ పట్ట ॥

పరగుతులసిదండ పచ్చతోరణ మాపెకు
మెరుఁగుఁగౌస్తుభమణి మించుటద్దము
గరిమ నీసొబగులు కప్పములుఁ గానికలు
సిరులు నీకూరిమలు శ్రీవేంకటేశుఁడా ॥ పట్ట ॥

సంతతమైనవిందులు సారె నీమోవితేనెలు
వింతరతిభోగములు వినోదాలు
కొంత [1]నియ్యారుమ బొడ్డు కుంచెయుఁ గాళాఁజి
చెంతల నన్ని నమరె శ్రీవేంకటేశుఁడా ॥ పట్ట ॥ 152

పాడి

వేళగాదు సిగ్గులకు విచ్చనవిడింతే కాని
గోలతన మిపుడేలే కొంగువట్టీ నతఁడు ॥ పల్లవి ॥

తమకించినపుడే తతియాయ రతులకు
సుముఖుఁడైనపుడే సూటి మాటకు
చెమరించినపుడే చేఁతలకెల్లా లోను
కామరెవేల లోఁగేవే కొంగువట్టీ నతఁడు ॥ వేళ ॥

1. ఏ + అరుమ = వియ్యారుమ. వింత ప్రతికనంది

అంటఁజూచినపుడే అద వట్టే నవ్వులకు
వెంటవచ్చినపుడే విందు మోవికి
నంటుసేసుకొన్నపుడే నయము కోరికలకు
దంటవు యేల కొంకేవే దక్కఁగొనీ నతఁడు ॥ వేళ ॥

ఆయములంటినప్పుడే అనువు నీపంతాలకు
చాయసేసుకొన్నపుడే చవి కాఁగిలి
యీయెడ నలమేల్మంగ ఇదిగో శ్రీవేంకటేశు-
నోయమ్మ కూడితివి నీవాడివట్టె నతఁడు ॥ వెళ ॥ 153

బౌళి

ఏల యింతచలము యింతిని నేను
తాలిమితో నుండఁగాను తమకించేవా ॥ పల్లవి ॥

మునుప నే నీకును మొక్కితి నే ననఁగానే
చెనకి చెనకి మరిఁ జేయివట్టేవా
పనివడి యిప్పుడిట్టె పంతమిచ్చితి ననఁగా
పెనఁగి చెలులచేతఁ బిలిపించేవా ॥ ఏల ॥

ఇదివో నే నీకుమ ఇచ్చకములాడఁగానే
పదరి నావాడివట్టి వచ్చినేసేవా
సదరాన నవ్విటికి సమ్మతించి వుండఁగానే
వెదకి నవ్విందరిలో వింతసేసేవా ॥ ఏల ॥

తలవంచుకొని నీదగ్గర నే నుండఁగానే
వలివలిగా నమ్ము నవ్వించేవా
కలసి నే నుండఁగానే గక్కన శ్రీవేంకటేశ
తమకుఁజూపునన్నుల తమి రేఁచేవా ॥ ఏల ॥ 154

ఆహిరి

ఊరకుండుమనవే వువిదలాల విభుని
వేరనివాఁడా తాను నేనే యెఱుఁగుదునే ॥పల్లవి॥

చిగురుఁజేతులఁ గావా చేవకొనగోళ్లున్నవి
మొగిచి యందులకేల మొక్కీనే నాకు
మొగమోటమునఁ గాదా ముసుకొనె వలపులు
నగవులు నగి యేల నయాలు చూపీనే ॥ఊర॥

మాఁటలలోనే కావా మర్మములెల్లా నుండేవి
మాఁటపట్టు సారె నేల మరీ నిచ్చీనే
గాఁటపుఁజూపులఁ గావా కంతునివాఁడిములెల్లా
ఆఁటదాన నాపై నేల అల్లార్చి చూచీనే ॥ఊర॥

చిక్కనిసిగ్గులే కావా చిత్తములఁ గరఁచేవి
పెక్కుమారు లవియేల పెదరేఁచీనే
ఇక్కువ శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్నుఁ గూడె
వక్కణతో నివి యేల వర్ణించీనే ॥ఊర॥ 155

మాళవి

కాంతలమొనమమునోవి కలవు వాసె
అంతటా జవ్వనమువేళమవికాలమున ॥పల్లవి॥

వేపేలు గొల్లెతలపై వెదవెట్టి వలపులు
పీవు లూడ్చి కొలనిలో పీరుగట్టెను
వేవేలుదొల్లకాడ వెలుఁగులు వెట్టి పెట్టి
కేవల మితవికి నాఁగేలా వాకచే ॥కాంత॥

దుండగపుగోళ్లను దోమటిఁ గలుపుదీసి
బండిగట్టి రుకుమిణిభామపెండ్లికి
కొండలంతలుచన్నులఁ గొటారుకుప్పలు వేసె
పందెఁ గట్టుకొమ్మనవే పైఁడి చీర వరచి ॥ కాంత ॥

పచ్చిమోవికణఁజాల బండారించి ముద్రవెట్టి
రచ్చలఁ గాఁగిళ్లఁ గాఁపురాలు సేసెను
యిచ్చట శ్రీవేంకటేశుఁ డిన్నిటాసు నేరుపరి
కుచ్చి కుచ్చి రతిసేయఁ గొండవేలూ నాయను ॥కాంత॥ 156

## హిందోళం

ఏఁటికి దోసాలుగట్టే వింతలో మాకు
పాటించి నాకుఁగా నేలో భ్రమసేవుగాక ॥ పల్లవి ॥

నచ్చి నీమాటలకెల్ల నాఁడే నే లోఁగాన(నా?)
ముచ్చట దీరక నీవే మొక్కేవుగాక
యచ్చకురాలనై నీకు నే నేమయినాఁ జేయనా
పచ్చిగా వలచి వొదఁబరచేవుగాక ॥ ఏఁటి ॥

కన్నులఁ జూచినప్పుడే కరఁగదా నామనసు
చన్నులంటి చొక్కుఁజూపు చల్లేవుగాక
సన్న సేసినంతలోనే వరసములాడనా
చిన్నికొనగోరు నాపైఁ జిమ్మేవుగాక ॥ ఏఁటి ॥

కందువకు రాఁగానే కాఁగిలించనా నిన్ను
చెంది ప్రియా లప్పటివిఁ జెప్పేవుగాక
విందువలె వన్నిటా శ్రీవేంకటేశ కూడితివి
మందెమేళాలు మీరేనా మన్నించేవుగాక ॥ ఏఁటి ॥ 157

రేకు 1128 లలిత

సిగ్గువడి యుందాఁకా చెలువుఁడు నన్ను దూరె
బగ్గన మమ్మింతేసి పచ్చిసేతురా ॥ పల్లవి ॥

అలవోకగా నీతో నాడుకొన్నమాటలెల్ల
వెలయఁగ నాతనితో విన్నవింతురా
చెలివంటా నాతనిచేఁత లిటువంటివంటే
చలపట్టి యంతలోనే సాదింతురా ॥ సిగ్గు ॥

నగుతా నాతవిరచవలు నే సందేహించితే
సొగసి యాలనిమేను సోదింతురా
పగటున నావేళ పంతాలు నే మెరసితే
తగవు విడిచి మీరు తమకింతురా ॥ సిగ్గు ॥

వద్దనుండి నే నాతనిపలపులు వొగడితే
కొద్దిమీరి వెంగెములు కొనవేతురా
వొద్దికై శ్రీవేంకటేశుఁ డున్నతి నన్నుఁ గూడె
సుద్దులు తొల్లిటి వింతే సూడువట్టుదురా ॥ సిగ్గు ॥ 158

భైరవి

ఎవ్వరు నేమి చెప్పేరు ఇంటికి రావయ్యా నీవు
పువ్వనఁబిందెయువలె పొసఁగివున్నారము ॥ పల్లవి ॥

మనసునఁబట్టితే మరి దేహము గరఁగు
తనువు సోఁకితేనే చిత్తము గరఁగు
వొనరి తలఁచుకొంటే వొకటొకటికి లంకె
మనలోన నట్లానేకా మరిగివున్నారము ॥ ఎవ్వ ॥

మొగము చూచితేనే మొలకనవ్వులు వుట్టు
వగవుఁజూపులనే మొగమోడును
తగి యారెంటికి సరిదాఁకి యుండునట్లానే
బిగువుఁగాఁగిళ్ల విట్టె బెరసివున్నారము ॥ ఎవ్వ ॥

నేసచేయి చాఁచితేనే చిమ్మిరేఁగుఁ దమకము
ఆసఁ దమకము చేతికందిచ్చు రతి
తాసువంటి వివి రెండు దక్కెను శ్రీవేంకటేశ
వాసితోఁ గూడితి మింత వలచివున్నారము ॥ ఎవ్వ ॥ 159

## ఆహిరి

ఎప్పుడునుఁ దమవార మేడనున్నాను
తప్పులు వట్టక మమ్ము దయఁజూచుమనవే ॥ పల్లవి ॥

పేటలై వగొల్లెతలు పిప్పి సేసి కొసరిన-
నాటివాఁడే కాఁడా తననవ్వు లేఁటివే
పాటించి యెనమండ్రువట్టపుదేవుళ్లకింది-
మాటువాఁడు తానాదేమాట లేఁటివే ॥ ఎప్పు ॥

ఎంగిలి పదారువేలఁ జప్పుచారు సేసినట్టి-
యెంగిలిపొత్తులవాఁడు యేమి చూచీనే
అంగడి గందపుసతి అమభవించి వేసిన -
సింగారము తానేమి చేయివట్టీనే ॥ ఎప్పు ॥

చయ్యన మధురలో విసతులచన్నులమీఁది-
పయ్యద తా మమునేల భ్రమఇంచీనే
వొయ్యనె శ్రీవేంకటేశుఁ దుర మెక్కించుక నాకు-
వియ్యరానిచన విచ్చె నెదురేడదే ॥ ఎప్పు ॥ 160

దేసాళం

ఊరకున్న వారితోడ వూరు నోప దెఱఁగవా
చేరి నాతో సుద్దులెల్లాఁ జెప్పేవుగాక ॥పల్లవి॥

వద్దని నీతో నేను వాదులాడిచేనా
గద్దించి యప్పటి నిన్నుఁ గాదనేనా
తిద్ది నీగుణాలు నేఁడు తీరుచవచ్చేనా
వొద్దనే నీ వెట్టుండినా నుంటివిగాక ॥ఊర॥

చలపట్టి నిను నేను సాదించవచ్చేనా
కలవి లేనివి తారుకాణించేనా
నిలువుకునిలువే నిన్ను నేరాలెంచేనా
వెలి నెంతనవ్వినా నవ్వితివిగాక ॥ఊర॥

పంతమాడి సారెసారెఁ బంగించదొరకొనేనా
వంతులకు నంతేసి వాసిపట్టేనా
యింతలో శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
యెంత చనవిచ్చినాను ఇచ్చేవుగాక ॥ఊర॥ 16

రామక్రియ

కన్నదే కంటి గురుతుగాఁ గైకొనేవు
యిన్నిటాఁ గలపుకోలు ఇది నీకే కలదు ॥పల్లవి

పొరుగాపె నీతోను పోరచి మాటాడితేను
పరగ నంతలోఁ గొంగువట్టేవు నీవు
సరుగ వేరొకసతి సాకిరి చెప్పవచ్చితే
సరసమాడుతా నాపెచన్ను లంటేవు ॥కన్న

వాడవనిత నీతోను వట్టినవ్వు నవ్వితేను
జీడివలె నంటుకొని చేయివట్టేవు
ఆడనుండి వేరొక్కతె పాడి దిద్దవచ్చితేను
మేడెపుఁగాఁగిట నించి మెచ్చు మెచ్చేవు ॥ కన్ను ॥

అంగడినున్నకాంత అట్టె నిన్నుఁ జూచితేను
యెంగిలిసేసి మోవి యెలయించేవు
చెంగట నుండి నేను శ్రీవేంకటేశ్వర నీది
సంగతి గాదంటేను సరిగాఁ గూడి మొక్కేవు ॥ కన్ను ॥ 162

నాదరామక్రియ

నే మేమిసేతుమే నీవలనే యింతేశాయ
దోమటి వే సింగారాలు దొమ్మిసేసెఁ గదవే ॥ పల్లవి ॥

కూరిమిగొసరఁబోతే కొప్పు గడువెడజారె
సారెఁ గొప్పు వెట్టఁబోతే చన్నులు గానఁగవచ్చె
కోరి పయ్యదిదఁబోతే కుచ్చుల వదలె నిదె
దారదప్పి జవ్వనమే తడఁబడీఁగదవే ॥ నేమే ॥

సిగ్గులువడఁగఁబోతే నెలవినవ్వులు రేఁగె
సిగ్గులనవ్వు దాఁచితే నిట్టూర్పు రేఁగె
అగ్గపుటూర్పు లాఁగితే అలపులు గడునిండె
తగ్గక నీవలపులే తడఁబడీఁగదవే ॥ నేమే ॥

చేయి చాఁచఁబోతేను శ్రీవేంకటేశ్వరుఁ దాఁకె
కాయమంటి కాఁగిటనే కళలు రేఁగె
తోయపుటాకళలకు దొరకొనె వేడుకలు
చాయల నీచెనకులే సందడించీఁగదవే ॥ నేమే ॥ 163

రేకు 1129 గౌళ

తెలిసినదే నేము తేటతెల్లమిగా నిది
అలవాటు సేసేవు అందుకేమిలేవయ్యా ॥ పల్లవి ॥

మంతనాన నతులకు మాయింటికాదనే
బంతిఁబెట్టి వలపులు పంచిపెట్టేవు
యింతకోపినాఁటదైతే యియ్యకొనీఁగాక మమ్ము
అంత యేల లోఁచేవు అందుకేమిలేవయ్యా ॥ తెలి ॥

యిక్కువ నాపానుపుపై యేదవారిఁ దెచ్చి పెట్టి
వెక్కసపుటాసలెల్ల వెదవెట్టేవు
అక్కరగలదియైతే నందుకొనీ యీచేఁత
అక్కుమీఁదికిఁ దీసే వందుకేమిలేవయ్యా ॥ తెలి ॥

వాసులనీకాఁగిటిలో వారివీరిరతులెల్లా
బేసబెల్లితనానను పేరుకొనేవు
వేసరక నన్నిట్టె శ్రీవేంకటేశ కూడితివి
అసుద్దులే యీసుద్దులు అందుకేమిలేవయ్యా ॥ తెలి ॥ 164

లలిత

నన్ను నేల సొలసేవు నగితి వింతే యిందుకు
అన్నిటా పీలాగులకు నడ్డము రాఁగలనా ॥ పల్లవి ॥

కంచముమోవిపొత్తులకాంతలే యిందరు నీకు
మంచముపై కెక్కినట్టు మందెమేళాలు
యెంచి నేఁడు మానుమంటే యేల మాను విఁక విన్ను
వంచుక యేమిసేసినా వారివారిపుణ్యము ॥ నన్ను ॥

పిడికిటి సేసతోడి పేరంటాండ్లే ఇందరును
వొడలుసోఁకినయట్టివుద్దంతములు
జడియ నీమొగమోట సారె నీకు నేల మాను
వడిఁబెట్టి విన్నుఁబొందే వారివారిపుణ్యము ॥ నన్ను ॥

చలములరతికేలిసవతులే ఇందరును
ములుగోరిసరసాలమొగమోటాలు
యెలమి శ్రీవేంకటేశ యెనసితి విదె నన్ను
వలపించి చొక్కించినవారివారిపుణ్యము ॥ నన్ను ॥ 165

నాట

ఇందుకేపో నీపైఁ గోప మేఁదనుండైనా వచ్చు
యెందుండి విచ్చేసితి వేమోయి నీవు ॥ పల్లవి ॥

చెంత మోము చూడఁగానే చేయివట్టి తీసేవు
యెంతదయలేనివాఁడ వేమోయి నీవు
చింతతో నే నుండఁగాను చిమ్మేవు నీవేడుకలు
యెంతకకుర్తికాఁడ వేమోయి నీవు ॥ ఇందు ॥

ముంచి కన్నీరు జాఱఁగ ముట్టేవు నాచనుదోయి
ఇచుంత తగవెఱఁగ వేమోయి నీవు
మించె నాకైతేఁ జలము మెరసీ నీకైతే నవ్వు
యెంచవు కూళతనము యేమోయి నీవు ॥ ఇందు ॥

అవ్వలిమోమై వుండఁగా అట్టె కాఁగిటఁ గూడేవు
యెవ్వతె నీకు నేర్పె నేమోయి నీవు
రవ్వగా శ్రీవేంకటేశ రతి నన్నుఁ జొక్కించి
యివ్వలిమోము సేసితి వేమోయి నీవు ॥ ఇందు ॥ 166

### దేసాళం

కోరి నిన్ని దెలుఁగక కోపగించుకొంటిఁగాక
నేరు పెంతలేకుండితే నీవు నన్నంటుదువా ॥పల్లవి॥

అంది వాదులకు రావు ఆఱడిఁబెట్టుకొనవు
యెందుకైనా నొదువు ఇది మేలయ్యా
అందగాఁడ విటువంటిఅతఁడవుగాకుండితే
చెంది మున్ను సేసినట్టిచేఁతలెల్లఁ జెల్లునా ॥కోరి॥

వోపనన వేమిటికి వొద్ద నెవ్వరుండినాను
యేపనైనాఁ జేసేవు ఇది మేలయ్యా
[1]వైపరివి ఇటువంటివాఁడవు గాకుండితేను
రాఁపుల నిన్నిందరును రసికుఁడవందురా ॥కోరి॥

వట్టిసిగ్గులు వడవు వాసులెంచవు నాయెడ
యిట్టె కాఁగిటఁ గూడితి విది మేలయ్యా
ముట్టి శ్రీవేంకటేశుఁడ మోహ మింత లేకుండితే
జట్టిగొని నీమేలు సతులెల్ల మెత్తురా ॥కోరి॥ 167

### పాడి

ఎప్పుడు నీవారమే యేడనుండినా
నెప్పునఁగట్టినపుత్తె నీకుఁగానే కాదా ॥పల్లవి॥

పిప్పిగట్టి నీవేల ప్రియములు చెప్పేవు
అప్పుడే నేఁ [2]జెప్పెంపవా ఆకెతోను
చిప్పిల నీవంతయేల చేయివట్టి పెనఁగేవు
చప్పనాయ వలపులు చాలునని యనవా ॥ఎప్పు॥

---

1. వైపు+అరివి. వైపు తెలిసినవాడవు. శబ్దికాంతము కావచ్చు. 2. చెప్పి+అంపవా.

బిడ్డుదేర నీవేల చేతులు పైఁజాఁచేవు
గడ్డెము వొద్దని నీకుఁ గమ్మ లంపనా
వొద్దుకోఁగా నీవేల వూరకే కాఁగిలించేవు
జిడ్డుపడెఁ ధమకము సటలేఁటికనా ॥ఎప్పు॥

పచ్చిగా నీవింత యేల పైపై నన్నుఁ గూడితివి
కచ్చుపెట్టి వుంకువ వుంగర మంపనా
మెచ్చి శ్రీవేంకటేశుఁడ మీరి నన్నుఁ బొగడేవు
ఇచ్చినవిడాయ నీకు వెలిపేఁటికనా ॥ఎప్పు॥ 168

## హిందోళవసంతం

వద్దువద్దు అంతేసిపై తాళాలు
వుద్దండాలు సేయఁబోతే వుట్టిలేక వూఁగవా ॥పల్లవి॥

సిగ్గువడి నే నీచేతికి లోనై తినంటా
వెగ్గళించి యెమ్మెలేల వెదచల్లేవు
అగ్గలమై నే నిన్ను అందుకు మీఱఁజూచితే
బెగ్గలి మచ్చరములే పెరుగుతానుండవా ॥వద్దు॥

మొగమోటతోడ నే నీముందర నుందానవంటా
నగుతా నీసుద్దులేల నారువోసేవు
మగటిమి నే నీకు మారుకు మారు సేసితే
చిగిరించి పంతములే చిమ్మిరేఁగవా ॥వద్దు॥

ఆసపడి నేను నీయాలనై వుందాననంటా
వాసులకు నన్నునేల వలఁబెట్టేవు
వేసరక నేనే శ్రీవేంకటేశ కూడితివి
తానువంటివలపులు తారుమారు గావా ॥వద్దు॥ 169

రేకు 1130 సామంతం

మీరే నేరుతురు మీఁద మిక్కిలి గలితే
వారివీరి నడిగితే వంకలొత్తేరా ॥పల్లవి॥

చెప్పరావిచేఁతకు మీచిత్తములే గురిగాక
ఇప్పుడు మాకేల పెట్టి(ట్టేః) రింతేశానలు
తప్పులు దిద్దేమా మిమ్ము దండనుండేచెలులము
ముప్పిరి వేఁడుకొంటానే మొక్కేవారము ॥మీరే॥

గుట్టుతో మీపంతాలకు కొనగోళ్లే గురిగాక
బెట్టి మమ్మేల తోడుగాఁ బిలిచేరు
రట్టునేసేమా మిమ్ము రచ్చల నిచ్చకులము
చుట్టపువరుసలే చూపేవారము ॥మీరే॥

విందుమీకాఁగిళ్లకు నేరుపులే గురిగాక
దండివూడిగేలమాతోఁ దలపోఁతురా
కొండలశ్రీవేంకటేశ కోమలిఁ గూడితి విట్టె
మెందుతీసేమా మిమ్ము మెచ్చేవారము ॥మీరే॥ 17(

భైరవి

ఏఁటికి నెగ్గులువట్టే విందుకు నీవు
కూటముగలుగుచోట గుటు మేలుగాదా ॥పల్లవి॥

తెగనాడరాదుగాక తెలిసినపనులకు
నగరాదా విమ్మఁజూచి నాకుఁ గొఁ(గొంః)తైనా
జగడించవద్దుగాక చనవుగలుగుచోట
సగముచూపులు చూచి సాదించరాదా ॥ఏఁటి॥

పదరఁగరాదుగాక పాయరానిచోటికి
వాదిగి నివ్వెరగుతో నుండఁగరాదా
అదలించవద్దుగాక ఆనలెల్లఁ బెట్టుకోఁగ
వదలక అంతేశాల వద్దనఁగరాదా ॥ ఏఁటి ॥

గుటిసేయరాదుగాక కూడినకూటములకు
చెఱఁగువట్టి బలిమి సేయఁగరాదా
యెటిఁగి శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
తటి దూరవద్దుగాక తలపించరాదా ॥ ఏఁటి ॥ 171

## ముఖారి

ఆయనాయఁ బదపద అట్టె తన్ను రమ్మనవే
దాయగాఁ డైతైన నాడు తనకేమి యనవే ॥ పల్లవి ॥

పదఁతులనెల్లఁ గూడి బమ్మచారి ననుకొనె
జడియక తాను సత్యసందుఁడుగదె
బడి బడి మాతోను బాసలు సేయక(సేసి?) తాను
విడిచినా అటువంటివియేకాదా ఇఁకను ॥ ఆయ ॥

పసులన్నిటిఁ గాచి పట్టపురాజాయ తాను
దెసల సీపసులకు దేవరగదే
యెసఁగి మమ్మెల్ల నిట్టె యేలక తా మానీనా
కొసరితే ఇక్కడా[1] నాగుణమేకదే ॥ ఆయ ॥

వెన్నలెల్లా దొంగిలి శ్రీవేంకటేశుఁడైనాఁడు
వున్నతిఁ దనకుఁ గలవోజేకదే
మన్నించి నన్నిట్టె కూడె మనసు తాఁ బట్టెనా
మెన్నికలు మాయెడకు యిట్టివేకదవే ॥ ఆయ ॥ 172

---

1. ఇక్కడాన్ + అగుణమే.

## కాంబోది

కానీవయ్య అందుకేమి కనుకొనే మన్ననయును
తేనెలమా మోవితీపు దిమ్ము రేఁచును ॥ పల్లవి ॥

నగినట్లనె వుండు నాతోడిపొందులు
చిగురించఁ జిగురించ చేఁగలెక్కును
యెగసక్యాలై యుండు ఇప్పుడు నేనన్నమాట
తెగరానిఆసలతో తీగెసాగును ॥ కానీ ॥

దక్కినట్లనే వుండు తతి నాతో చేఁతలెల్ల
చిక్కినప్పుడు చేతికి జిడ్డుదేరును
లెక్కసేయనట్లుండ్లు లేఁతమాఁరసాలు
వక్కణతో వలపు పూవక పూచును ॥ కానీ ॥

పట్టినట్లనే వుండు పైపై మాతో(లో?) పంతములు
మట్టుపెట్టి ముయికి ముయి మళ్లించును
ఇట్టె శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
పట్టినచలములెల్లా పంటవండును ॥ కానీ ॥ 173

## కేదారగౌళ

అన్నియుఁ జక్కనయ్యీని అందుకేమిలేవయ్య
మన్ననివలపే కాదా నూఁగుతెక్కెఁగాక ॥ పల్లవి ॥

సారె నీవాదేవెల్లా చల్లనిమాటలే కావా
వేరేసతులఁ గూడఁగ వేఁడాయఁగాక
మేరతో నవ్వేదెల్లా మించువెన్నెలలే కావా
యీరసపువారివల్ల యెండలాయఁగాక ॥ అన్ని ॥

మక్కువ నీనిలువెల్లా మంచితనమే కాదా
వెక్కసానఁ దిరుగఁగ వెట్టాయఁగాక
పక్కన నీమోవెల్లాఁ బచ్చితేనెలే కావా
వుక్కుపలుసోఁకులను వొగరాయఁగాక ॥ అన్ని ॥

కందువ నీకాఁగిలెల్లా కామనిధానమే కాదా
అందునిందు వంటుముట్లు లాయఁగాక
విందువలె నన్నును శ్రీవేంకటేశ కూడితివి
సందడి నన్నిటివల్లాఁ జవులాయఁగాక ॥ అన్ని ॥ 174

దేశి

ఆఁబడిఁ బెట్టక మాతో నానతీవయ్యా
మీఁబరాదు ఇచ్చకపుమీవారమే నేము ॥ పల్లవి ॥

చుట్టరికము నేసుక సుద్దులెల్లఁ జెప్పేవు
నెట్టన నీరచనలు నిజమా యిది
చెట్టాపట్టాలు వట్టుక సిగ్గులు విడిపించేవు
నట్టనడుమ నివెల్లా నమ్మవచ్చునా ॥ ఆఁబ ॥

సారెసారె వియ్యరావిచనవులెల్లా విచ్చేవు
కోరి యివెల్లా వియ్యకోలవునా
పేరడిగా నమపులే పెనఁచేవు నాతోను
సారెకు నిటువలెనే సతములయ్యేనా ॥ ఆఁబ ॥

పరపుపైఁ బవళించి బాసలెల్లాఁ జేసేవు
అరసే వింకొక్కమాఁటు అవునా యిది
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
మరిపెముతోడుతను మొక్కుదునా యిందుకు ॥ ఆఁబ ॥ 175

రేకు 1131. శ్రీరాగం

ఇంకనేల రావయ్య ఇన్నియుఁ జెల్లెను నీకు
సుంకునీమతకములు చూపి చెప్పఁగలనా ॥ పల్లవి ॥

గొందినున్న నీమేనిగురుతులు చూచేనంటే
గందము వూసినమీఁదఁ గానరాదుగా
కందువ నీమోములోనికళలు దెలిసేనంటే
సందడినవ్వులలోన చక్కఁగా నణఁగెఁగా ॥ ఇంక ॥

నిట్టూరుపులోనైన నిన్ను నేర్పరచేసంటే
జట్టిగొని నాముందర సాము నేసేవు
చిట్టకపుఁబులకలు చెక్కుల నరసేనంటే
గట్టిగా నన్నిట్టె బిగ్గఁ గాఁగిలించుకొంటివి ॥ ఇంక ॥

దిట్టనై నీకనుచూపుతేటలు దెలిసేనంటే
గుట్టున నన్ను రతులఁ గూడితి విట్టె
నెట్టన శ్రీవేంకటేశ నిన్ను నే నడిగేనంటే
రట్టడితనాల నింత రచ్చలకెక్కితివి ॥ ఇంక ॥ 176

ముఖారి

ఇందుకుఁగా నీవేల యెమ్మెలాడేవు
అందరిముందర నాపె నాఁడిఁబెట్టెదరా ॥ పల్లవి ॥

పడఁతికి వయసనేబలుగర్వ మదొకటి
కడుఁజక్కఁదనములగర్వ మొకటి
బెడిదంపునిన్ను వలపించినగర్వ మొకటి
జడియఁగ నీతో రాజసము చూపఁదగదా ॥ ఇందు ॥

సరిఁ గొండలంతేపిచన్నులసంప దొకటి
 సరవిఁ గళలువిండుసంప దొకటి
 గరిమతో మేనిసింగారపుసంప దొకటి
 దొరతనమే నీవద్ద తోడుచూపఁదగదా ॥ ఇందు ॥

[1] చనవునీవిచ్చినట్టిసామ్రాజ్య మొకటి
 మనికై నమదనసామ్రాజ్య మొకటి
 యెనసితివి శ్రీవేంకటేశ యింతి వింతలోనె
 వెనుకొని నీవలెనే విఱ్ఱవీఁగఁదగదా ॥ ఇందు ॥ 177

సామవరాళి

ఎట్టున్నదో నీమనసు యెఱఁగ నేను
 వెట్టికొనరులు నీపై వేయఁగవచ్చేనా ॥ పల్లవి ॥

అప్పుడు నీవాడినట్టిఆమాఁటపట్టుకే, మోవి
 పిప్పిగట్ట సారె సారెఁ బెనఁగేఁగాక
 వుప్పతించి వొలపియునొల్లనివల పెప్పుడు
 చప్పనేకాదా నిన్ను సాదించవచ్చేనా ॥ ఎట్టు ॥

మచ్చిక నీవు మొదలమన్నించినమన్ననకు
 చెచ్చెర నీకొలువు సేసేఁగాక
 ముచ్చటదీరఁగ నీకు మొగచాటైనమాఁటలు
 తుచ్ఛములే కావా నీపై దొరలించేనా ॥ ఎట్టు ॥

గక్కన నన్నుఁ గాఁగిట కాఁగిలించినందుకే
 లక్కవలె నిన్ను నేఁ గలసితిఁగాక
 యిక్కువ శ్రీవేంకటేశ యింతేసి సేసినందుకు
 చొక్కపుమేలే యింకా సోదించేనా ॥ ఎట్టు ॥ 178

1. 'నీవిచ్చినచనవుసామ్రాజ్యము' అనుట సహజము.

మంగళకౌసిక

ఏలయ్య మా కంతేసియెమ్మెలు నీతో
నాలావుకలిములు నన్ను నీవెఱఁగవా ॥ పల్లవి ॥

పంతము నీతోనాడేపలుకులవారమా
వంతుకు నీసేవసేసేవారముగాక
జంతలవలెను నిన్ను సాదించేవారమా
దొంతిఁ గొంగువట్టితేను తోసేవారముగాక ॥ ఏల ॥

అచ్చలాన నీతోడ నలిగేటివారమా
వచ్చి తలవంచుకుండేవారముగాక
కొచ్చి కొచ్చి నీతోడ కోపగించేవారమా
తుచ్చపుగోర నూఁదితే దూరేవారముగాక ॥ ఏల ॥

చేరి నన్నుఁ గూడఁగాను చేయివట్టేవారమా
వారించి సిగ్గులువడేవారముగాక
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నేరమివట్టేవారమా నీవారముగాక ॥ ఏల ॥ 179

బౌళి

ఊరకే కోపగించకు వోహో నీవు
కారణములేనివాదు కాంతకు లేదు ॥ పల్లవి ॥

నెపములేక నిన్ను నెలఁత మాటాడీనా
వుపమించుకొనలేక వునురనేవు
నిపుణతఁ దలఁచుకొని నీవు మఱచితివేమో
కపటము లేదాపె కలలాడదు ॥ ఊర ॥

నీవు సేయనిపనులు నీఁద నీపై మోపీనా
భావించలేక యెగ్గులుపట్టనేఁటికి
చెవదేఁ బరాకుసేసితివేమో నీవు
వేవేలకు నాపె కవివేకము లేదు ॥ ఊర ॥

చవులు నీవు చూపక చనవులుమెరసీనా
యివల నెలవినవ్వు యేల దాఁచేవు
రవళి శ్రీవేంకటేశ రతి సిగ్గువడేవేమో
కవగూడ నాపె నిన్నేగతిఁ బాయదు ॥ ఊర ॥ 180

నాదరామక్రియ

ఎటువలెఁ జేసితివో యెఱఁగ మెన్నఁడును
ఘటియించవయ్య మాతో కందము నీసుద్దులు ॥ పల్లవి ॥

పూసినకస్తూరిపూఁత పొంచినట్టినడురేయి
వోసరించి మాయధర మొట్టిపై పాలు
ఆసపడి గొల్లయిండ్ల నల్లనాఁడు నేసినట్లు
నేసి చూపవయ్య మాకు చిత్రము నీసుద్దులు ॥ ఎటు ॥

అదె మానెలవినవ్వు యమునలోనివెన్నెల
చదురుసరసాలు రాసక్రీడలు
తుదిముట్ట గొల్లెతల తొల్లి నీవు నేసినట్లు
యిదె మాతోఁ జేయవయ్య యెట్టివో నీసుద్దులు ॥ ఎటు ॥

ఇక్కువబృందావనము ఇచ్చట మాజవ్వనము
చక్కనిసతులపొందుసరి నాపొందు
చిక్కి శ్రీవేంకటేశ్వర చిన్ననాఁడు గొల్లెతల
చొక్కించినట్టె చొక్కించు చూతము నీసుద్దులు ॥ ఎటు ॥ 181

రేకు 1132 దేశాక్షి

దేవుఁడు దేవియు వారే తెరవేసితిమి మన-
మీవల నుందము మరి యేమీ ననవలదు ॥పల్లవి॥

మంతనములే సుమ్మీ మనసులలోపలి-
వింతలై నసిగ్గులెల్లా విడిపించేవి
దొంతులై నకోరికలే తోడఁదోడ దిరిగాడి
సంతతపువెలుపుల చలివాపేవి ॥దేవుఁ॥

పాయపుమదాలే సుమ్మీ పలుకులు వొనగూర్చి
బాయిటనుండే వోడఁబాటు నేసేవి
చాయలసరసములే నందులు గొందులు దూరి
కాయము కాయము నంటఁ గాఁగిలింపించేవి ॥దేవుఁ॥

చూపులఁ జూపులే సుమ్మీ సూడువట్టి మర్మములు
రాపులఁ దలఁచినట్టు రతులిచ్చేవి
యేపుల శ్రీవేంకటేశుఁ డీకెయుఁ గూడి రిద్దరు
దాపులై నవలపులే తమిరేఁచేవి ॥దేవుఁ॥ 182

ధన్నాసి

వలచుటే దోసమా వనిత నీ కాతఁడు
నలువంక మరి యేఁటినవ్వులు నవ్వేవే ॥పల్లవి॥

పంతమెల్ల నీమాటపట్టులోననే వున్నది
చింతలెల్ల నీచెక్కుచేత నున్నవి
వింతలిన్నియును నీనివ్వెరగులలో నున్నవి
యెంతకెంత పతి నింకా యేఁటికి దూరేవే ॥వల॥

బిగువెల్ల నిపుడు నీపెదవులపై నున్నది
తెగువలు నీకన్నులతేట నున్నవి
అగడింతా నీపొలయలుకలలో నున్నది
యెగసక్కె లాతవి నేఁటికి నాదేవే ॥వల॥

గబ్బితనమెల్లాను నీకాఁగిటిలోనే వున్నది
నిబ్బరము నీవుండేటినీటులో నున్నది
అబ్బురమై శ్రీవేంకటాధీశుఁడు నిన్నుఁ గూడె
వుబ్బున నీతనికెంత వొరటులు చూపేవే ॥వల॥ 183

కాంబోది

ఏమిసేతు నమ్మలాల యిదివో నాకాఁపిరము
కామించి వలపు పతికాఁగిలే కోరీని ॥పల్లవి॥

కాయమే కాఁకలఁ బొందీఁగానీ రమణునిఁ బాసి
పాయమే చిగురించీఁ బైపైనే
చేయి చెక్కుటిమీఁదఁ జింతలు రేఁచీఁగానీ
యేయెడఁ గనుచూపులు యెదురే చూచీని ॥ఏమి॥

పనివూని పయ్యదే పైపై జారీఁగానీ
ఘనమైన చన్నులై తే గట్టులయ్యీని
గొనకొన్నవిరహము కోపము వుట్టించీఁగానీ
నసుపుల సెలవులు నవ్వింపించీని ॥ఏమి॥

గారవపునాకాఁగిలి కారాలు వుట్టించీఁగానీ
వూరేటిమోవితేనెలు వుట్టిపడీని
యీరీతి శ్రీవేంకటేశుఁ డింతలో నన్నుఁ గలసె
తేరేటిమోముకళలు తెలివిసేసీని ॥ఏమి॥ 184

వరాళి

నీకే తెలుసునయ్యా నీవుసేసినచేఁతలు
  కూకులువత్తులు నేసె గుట్టుతోనే సిగ్గులు ॥పల్లవి॥

పంతాలు నీతో నెరపి పదఁతి నిన్నిందరిలో
  యింతేసిమాట లాడీ నెంతచనవో
  వంతువరునలవారు వాకిటఁ గాచుకుండఁగా
  దొంతివెట్టీ నవ్వులెల్లా దొరతన మెట్టిదో ॥నీకే॥

అయాలంటి చదురంగ మాడుదువు రమ్మంటా
  యీయెడ నీచేయివట్టీ నెంతపగటో
  దాయిటఁ జెలులతోడ పచారించి నీతోడ
  దాయిగాఁగఁ బవళించీఁ దన కెంత చెల్లునో ॥నీకే॥

విచ్చనవిడిని మొక్కి పీదెము వేసుకొమ్మంటా
  యిచ్చకముసేసీ నీకు నెంతనేరుపో
  ఇచ్చట శ్రీవేంకటేశ ఇ చరిఁ గూడినయట్టె
  యెచ్చి కూడితివి తన కెంతమేలు చేరెనో ॥నీకే॥ 185

కాంభోది

నీ విన్నిటా ఘనుఁడవు నే నెఱఁగనా
  యీవల నావల సుద్దులెల్ల నాకుఁ జెప్పేవు ॥పల్లవి॥

మంతనాన నేను నీమనసెల్లఁ గనుఁగొంటి
  వింతలై నీమాటలెల్ల వేలుచుకొంటి
  వంతులువెట్టుక నీవలపెల్లఁ దెలిసితి
  యెంతకెంత నీగుణము యేల మాకుఁ జెప్పేవు ॥నీవి॥

కదల నీవిద్యలు ఇక్కడనే విచారించితి
బడి నుండి నీలాగు భావించితి
వుడుగక నీతో నవ్వే వోరుపు విచారించితి
యెడలేక నీనేరుపు లేల నాకుఁ జెప్పేవు ॥నీవి॥

ఒన్నుఁ గాఁగిటనే కూడి నెయ్యమెల్లాఁ జేకొంటి
చన్నుల నొత్తి నీమోవి చవిగొంటిని
యిన్నిటా శ్రీవేంకటేశ ఇచ్చకములు మెచ్చితి
యెన్నటి కిది గుఱుతు యేల నాకుఁ జెప్పేవు ॥నీవి॥ 186

గౌళ

ఏల భేదాలు సేసేవు యేమి గట్టుకొంటివి
రేలునుఁ బగళ్లు యిద్దరికిఁ గొత్తు గాదా ॥పల్లవి॥

వావియల్లా నొకటే వరుస తెంచిచూచితే
నీవు మేనభావవు నే మఱఁదల
యీవల వలపునూ ఇద్దరి కొక్కటే నీవు
ఆవటించి మొగవాఁడ వాఁటదాన నేను ॥ఏల॥

మనసెల్లా నొక్కటే మదనకేలిలోన
వినయము నాది రతివెరగు నీది
నను పెల్లా నొక్కటే నగవులలోపలి-
చెనకులు నీచేతివి సిగ్గులు నామేనివి ॥ఏల॥

కాఁగిలియు నొక్కటే కమ్మనభోగములోన
పాఁగినది నీమోవి ఆపసలు నావి
వీఁగక యిద్దరము శ్రీవేంకటేశ కూడితిమి
రాఁగినతమకములరచన లిద(ద్ద?)రివి ॥ఏల॥ 187

రేకు 1133 భూపాళం

కన్నులనే దీపావళి కడుఁజన్నుల యుగాది
యెన్నికలు నీకుఁ జేసె యియ్యకొనవయ్యా ॥పల్లవి॥

అంగన మోముకళల నట్టె పచ్చఁగా వలికి
ముంగిట నవ్వులనే ముద్దులు వెట్టి
ఇంగితపుచూపువనే [1]య(యో?)దురుకొనెఁ బందుగ
సంగడిఁ గూచుండవయ్య చక్కెరమోవి విందు ॥కన్ను॥

కప్పినసిగ్గులనెల్లఁ గలవడములు గట్టి
ఇప్పుడె సరసముల నిచ్చె విడేలు
చిప్పిలుఁజెమటలనే శిరసు మజ్జన[2]మార్చె
కప్పెఁ బయ్యద కట్నాలు గైకొనవయ్య నీవును ॥కన్ను॥

అట్టె కాఁగిటఁ గావించె అంగరంగవైభవాలు
ముట్టినమీచెనకులు మునికి ముయి
ఇట్టె శ్రీవేంకటేశ ఇంతి నిన్ను నిట్టె కూడె
గట్టిగాఁ జేకొనవయ్య కందువనోంబనాలు ॥కన్ను॥ 188

దేశాక్షి

ఊరకుండే నెఱఁగవు వొకటొకటాడేవు
నేరుపులమాటిరాలు నీవే యెఱుఁగవా ॥పల్లవి॥

చలము సాదించఁగాక చక్కెరనీమోవియెల్ల
వులివచ్చి సేయనా వొక్కమాఁటే
బలిమి చూపఁగాక పంతపునీమేనెల్ల
కులికి నాకుచముల కుమ్మెలుగాఁ జేయనా ॥ఊర॥

1. యతిభంగము. 2. అర్చె = అడించె.

బతిమి చెరుచఁగాక భ్రమయించి నీమనసు
వ్రతమువట్టించనా వలపులను
మితిమీఱఁగాక నీమిక్కుటపురతులలో
తతిగొవి పాదమునఁ దాటించి నవ్వించనా ॥ ఊర ॥

సంగించఁగాక నిన్ను పైకొని కూడి ఇప్పుడు
యెంగిలిగాఁ జేయనా ఇన్నిటా నేఁడు
అంగవించి శ్రీవేంకటాధిప నన్నేలితివి
సంగతి నాచెమటల జలకమాడించనా ॥ ఊర ॥ 189

ఆహిరి

ఏల పిల్పితిపదేవు; యేమి సేసేది; నీవు
యేలిక విందరికైతే ఇంతలోనే తప్పెనా ॥ పల్లవి ॥

చెనకి నీమదిలోనిసిగ్గులు వాపేకొరకే
ననుపుసేసుక నీతో నవ్వితి నేను
మనసు రంజిల్లఁజేసి మాటలాడేకొరకే
చనవుసేసుకొని సరుసఁ గూర్చుంటిని ॥ ఏల ॥

ముంచిననీమొగమోటములు దీరిచేకొరకే
వంచనతో నీయింటికి వచ్చితి నేను
కొంచిననీమేనియళుకులు మానిపేకొరకే
అంచెలఁ బైకొంటి నీకంటె ముందు నేను ॥ ఏల ॥

చేసిననీచేతఁలెల్లాఁ జెల్లఁబెట్టేటికొరకే
మూసి దించి కాఁగిలించి మొక్కితి నీకు
వాసులశ్రీవేంకటేశ వలపుఁ రేఁచేకొరకే
రాసికెక్క నీకిచ్చకురాల నైతి నేమ ॥ ఏల ॥ 190

శుద్ధవసంతం

నీపాలిటికి నాపె నిధియు విధానము
చేపట్టి నేఁ డింతగాఁగ నేవనేనె నీకును ॥పల్లవి॥

ఇంతేసి వెంగములాడ నెవ్వతైనా నేర్చునా
పంతమాడి నీకొంగు పట్టనేర్చునా
వంత విన్ను వలపించి వంచుకొననేర్చునా
ఇంత నేసి యాపెగాఁగా నీదేరించె విన్నును ॥నీపా॥

పచ్చిగా విన్నెవ్వతైనా భ్రమయించనేర్చునా
రచ్చవేసి ఇందరిలో రవ్వ నేసునా
ముచ్చటాడి నీచేతుల మొక్కించుకోనేరుచునా
యెచ్చి యాపెగాఁగా యీదేరించె విన్నును ॥నీపా॥

కలసి విన్నెవ్వతైనా కళలురేఁచనోపునా
చలివాసి(పి?) నవ్వింపించి జాణఁ జేమునా
యెలమి శ్రీవేంకటేశ ఇంతలోనే విన్నుఁ గూడె
ఖలిమి వి న్నాపెగాఁగా పవిగొనె నిన్నును ॥నీపా॥ 191

వేళావళి

మిక్కిలి విచ్చి చెప్పితే మేడిపంటిబోన మిది
తొక్కుమెట్టుసందదెల్ల తోదోపులే కావా ॥పల్లవి॥

చాయలకే మాటలాడి చనవులుమెఱవేవు
యీయెడఁ దెలుసునే మీయిద్దరికివి
నాయ మే మడిగేవే నన్ను నీ వి.తటిలోనే
మాయదారిసుద్దులెల్ల మఱఁగులేకావా ॥మిక్కిలి॥

గిలిగింతనవ్వు నవ్వి కిందుమీఁదుఁ జూచేవు
విలువుల నున్నవే మీనేరుపులెల్లా
మలసి మీసరితలు మాకేమి అప్పగించేరే
కొలఁదిలేనివలపు గుమితమేకాదా ॥ మిక్కి ॥

భావపురతిఁ గరఁగి పైఁ జేయివేసేవు
వావిరిఁ దేటపడె మీవగలెల్లను
శ్రీవేంకటేశుఁడు నీవు సిగ్గులిందేల పడేరే
కూవలై వున్నవి మీగుట్టింతే కావా ॥ మిక్కి ॥ 192

## శ్రీరాగం

జవ్వనము పంటవండి సరి ముంగిటికి వచ్చె
యెవ్వరిమాటలు నేల యింతిఁ జేకొనవయ్యా ॥ పల్లవి ॥

తేటలెల్లమిగ నవ్వి తేనెగారేమాట లాడి
కాటుకకన్నులఁ జూచీ కాంత విన్నను
వాఁటమాయ వలపులు వడ్డివారీ తమకము
యేఁటికి జోలివేసేవు ఇంతిఁ జేకొనవయ్యా ॥ జవ్వ ॥

సరసము నీపైఁ జల్లి సన్నలివ్వియునుఁ జేసి
వరుసవంతులు వేఁడీ వనిత విన్నము
సరవాయ కోరికలు చవులాయ వేడుకలు
యొరవు లింకానేల ఇంతిఁ జేకొనవయ్యా ॥ జవ్వ ॥

చెక్కు కొనగోళ్ల నొక్కి చేయివట్టి విసుఁ దీపి
గక్కనఁ గాఁగిలించెను కాంత విన్నను
యిక్కువ శ్రీవేంకటేశ యీకె నిన్నుఁ గూడి మెచ్చె
యిక్కడనే మేలు చేరె యింతిఁ జేకొనవయ్యా ॥ జవ్వ ॥ 193

రేకు 1134 కురంజి

చెల్లుబడిగలవేళ సిగ్గువడవే నీవు
యెల్లవారిలో నీకు యెన్నికలు గావా ॥పల్లవి॥

తగవరిమాఁటలు తతిఁ జూపులతేటలు
విగిడి నీవే లెస్స నేరిచితివే
జగడాలడిచేవేమే సవతులతోనెల్ల
మొగఁడు చూడఁగ నీకు మురిపెముగాదా ॥చెల్లు॥

సారెఁ జాఁచేచేతులు జంకెనలరీతులు
నీరసమాయఁగనక నేరిచితివే (?)
బీరములాడేవేమే పెద్దపెద్దయెలుఁగుల
యీరీతిఁ బతిముందర యెమ్మెలు గావా ॥చెల్లు॥

బచ్చెననీరవ్వలు పకపకనీనవ్వులు
విచ్చలు విచ్చలు నీవే నేరిచితివే
యిచ్చట శ్రీవేంకటేశు నెనసితి విఁకనేమే
గచ్చు లాతవివొద్ద ఘనతలు గావా ॥చెల్లు॥ 194

శంకరాభరణం

నీవే ఆనతియ్యవయ్య నీచెప్పినట్టు నేనే
భావించి రెంటికిఁగాక భ్రమసివుందానను ॥పల్లవి॥

కొచ్చి కొచ్చి నే విన్నుఁ గొసరఁగఁబోతేను
రచ్చలలోవిసతులు రట్టడందురు
వొచ్చెములు విన్నెంచక వూరకే నే నుండితేను
అచ్చకురాలు మరేమీ నెఱుఁగదందురు ॥నీవే॥

జిగి నిన్ను రమ్మంటాఁ జేయివట్టి తీసితేను
మగవాని నింత సేసె మంకుదందురు
వెగటులేక నిన్ను విచ్చనవిడి సేసితే
అగపడె నిది యెంత అధమురాలందురు ॥నీవే॥

వేవేలుగా నీకు వినయాలు సేసితేను
చేవదేర మాయదారిచేఁతదందురు
శ్రీవేంకటేశ నన్నుఁ జేకొని కూడితి విట్టె
నీవురముపై నుండఁగ నీవేనందురు ॥నీవే॥ 195

ధన్నాసి

ఈతఁడు నీవసమాయ నింక నెన్నఁడు
చేతులార వూడిగాలు సేయవమ్మ ఇపుడు ॥పల్లవి॥

నిన్నే చూచీ నాతఁడు నీమొకపై యున్నవాఁడు
విన్నపాలు సేయవమ్మ విభునితోను
నున్ననిమాఁట లాడఁగ నొసలెల్లఁ జెమరించె
తిన్ననికస్తూరిబొట్టు తిద్దవమ్మా దగ్గరి ॥ఈతఁ॥

పూనిపట్టి నవ్వునవ్వి బుజములపైఁ జేయివేసె
కానిక లియ్యవమ్మా కాంతునికివి
ఆనుక చన్ను లొత్తఁగా నంగమెల్లాఁ జెమరించె
మేనిపైఁ గప్పఁగరాదా మెఱుఁగునీపయ్యెద ॥ఈతఁ॥

గక్కన విడెముపెట్టి కాఁగిట నిన్నుఁ గూడె
యెక్కవమ్మా శ్రీవేంకటేశువురము
మొక్కులు నీవు మొక్కఁగా మించెను నిట్టూర్పులెల్లా
తొక్కవమ్మా పాదమున తొడుతనే పెండ్లి ॥ఈతఁ॥ 196

గౌళ

ఆతఁడు నీవు నేకమై అనుభవింతువుగాక
రీతిగానిచలములు రేఁచఁగారాదమ్మా ॥ పల్లవి ॥

మారుమాట లేమిటికి మంతనము లేమిటికి
కూరిమిగలవారికి కొన్నదే కోలు
నేరుపరివిభుఁడు నీవద్దికి వచ్చె
బీరపునీయలుకలు పెంచఁగరాదమ్మా ॥ ఆతఁ ॥

పల్లాదనేమిటికి మాటలాడనేమిటికి
చెల్లుబడి గలితే నేసినదే చేఁత
కొల్లలుగా నానలువెట్టుకొని పతి నమ్మించె
పల్లదపునీవెంగేలు పనికిరాదమ్మా ॥ ఆతఁ ॥

సిగ్గువడనేమిటికి చెక్కుచేయి యేమిటికి
అగ్గమై మీలోనఁ [1]బట్టినదే పంతము
వొగ్గి శ్రీవేంకటేశుఁడు వొనగూడె నిన్ను నిట్టె
వెగ్గళించ నిఁకనేమి వెలితిలేదమ్మా ॥ ఆతఁ ॥ 197

రామక్రియ

ఏమి సేయుమనేవమ్మ యింకా నన్ను
నీమీఁది ప్రేమము కరఁగించఁగవద్దా ॥ పల్లవి ॥

చెప్పినసీమాఁటలెల్లా చెవియొగ్గి వింటి నేను
కప్పురవిడె మియ్యఁగాఁ గైకొంటివి
అప్పటి నే నేమిసేతు వాఁటదాన వింతే నేను
తప్పునీపట్టుకు దయఁదలఁచవద్దా ॥ ఏమి ॥

1. 'పట్టిన + అదే' లోని 'అ' కారముతో యతి

అంగవించి పిలువఁగ నట్టె దగ్గరివచ్చితి
కొంగువట్టి తియ్యఁగానే కూచుండితి
సంగ తానతియ్యవయ్య సన్నపుగొం(గొల్లి?)దాన
చెంగట మొక్కేను కృపసేయఁగవద్దా ॥ ఏమి ॥

నీవు గాఁగిలించఁగాను నీచేఁతకు లోనైతి
వావిసేసుక నవ్వితే వసమైతివి
శ్రీవేంకటేశ నీసేసపెండ్లిదాన వింతే
కేవలమై యిఁక కనికిరించవద్దా ॥ ఏమి ॥ 198

## కన్నడగౌళ

ఇంతి నిన్ను దూరఁజాల దెఁ(దెం?)తైనను
వంతువట్టె నీకు నేఁడు వలపినవూహలు ॥ పల్లవి ॥

పెలపుల నగఁగానే చెక్కులెల్లాఁ జెమరించె
వలవనిగాసిఁ బెట్టవద్దు ఆపెను
వలిపపయ్యెదంటఁగా వాన గురిసెఁ గన్నీరు
తలఁచుకో నీచేసినతప్పులెల్లా నందును ॥ ఇంతి ॥

మాటలు నీవాడఁగానే మచ్చరపుఁజూపు లెచ్చె
వాఁటముగాఁ జండిపెట్టవద్దు ఆపెను
పాటించి వేఁడుకొనఁగా పలువిట్టూర్పులు రేఁగె
యేఁటివో నీపరితలు మెఱఁగుకో అందును ॥ ఇంతి ॥

ముంచి నీవు చూడఁగానే మోమునఁ గళలుదేరె
వంచనతోఁ గొనియాడవద్దు ఆపెను
అంచెల శ్రీవేంకటేశ అన్నిటాఁ దనిసె నాపె
వించి నీవే తెలుసుకో నీవుపకారములు ॥ ఇంతి ॥ 199

రేకు 1135 శంకరాభరణం

ఇందుకుఁగాఁ గొసరికనేలా
చెంది నీపనుపు నేనేమయ్యా ॥ పల్లవి ॥

పలుమరు నీతోఁ బంతములాడఁగఁ
గలిగినవలపులకని వోదు
చలమున నీతో జంకించఁగా
తలఁచినతలఁపులతహతహ వోదు ॥ ఇందు ॥

వట్టికోపమున వాదులదువఁగా
వెట్టికి నెంజెరివియుఁ బోదు
దట్టించి నిన్నును తగవులఁబెట్టిన
పట్టినసూదునుఁ బాదునుఁ బోదు ॥ ఇందు ॥

పేరుకొనుచు విసుఁ బెదవులఁ దిట్టిన
ఆరీతికాఁతాళ మటు వోదు
యీరీతి శ్రీవేంకటేశ కూడితివి
నేరుపు నేరమి నీకే పోదు ॥ ఇందు ॥ 200

సాళంగనాట

మాకేల అంతేసి నీతో మారుమలయ
యీకడివారితో యీడు కెననేవుగాక ॥ పల్లవి ॥

పంతగత్తెనా నీతోఁబలుమారు జగడించ
వంతుదాననా నీతో వాసులెంచను
యెంతకెంత యేమయ్య విన్నే మాకుఁ జెవకఁగ
బంతివారితోడట్టు పాలించేవు గాక ॥ మాకే ॥

మెచ్చనివారమా నిన్ను మీఁదమీఁదఁ దప్పు లెంచ
మచ్చరములా నీతో మారుకొనను
కుచ్చిత మెఱుఁగుదునా గొరబు విన్నేల నేసే
మచ్చికసతులపాడి మన్నించేవుగాక ॥ మాకే ॥

సరివెనఁగేమా నీతో సాములుసేయఁగ నేము
విరుగుపోరదా నిన్ను బూమెలు సేయ
యిరవై శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
వరుసవారికివలె వలచేవుగాక ॥ మాకే ॥ 201

బౌళి

ఒక్కటి మీరిద్దరు నహోబలేశ
వుక్కళమై కాచుకొం డహోబలేశ ॥ పల్లవి ॥

మారుకొండ లెక్కి వచ్చి మంకువాపె లకిమమ్మ
వూరె నీసెలవిన వ్వహోబలేశ
తేరి చూచి నీమారు దేవతలఁ గరుణించె
వూరటాయ నీకాపె యహోబలేశ ॥ ఒక్క ॥

గొబ్బున నీతొడ యెక్కి కొనవెంట్రుకలు దువ్వి
వుబ్బించి విన్నివుదే యహోబలేశ
నిబ్బరపుఁజేతులను నిన్నుఁ గాఁగిలించి పట్టి
వొబ్బిడిఁ దా మెరసె నహోబలేశ ॥ ఒక్క ॥

మొల్లమినవ్వులతోడ మోవితేనె విందుపెట్టి
వుల్లమెల్లఁ గరఁచె నహోబలేశ
యిల్లిదె శ్రీవేంకటాద్రి నిరవై తనచన్నుల-
నొల్లనె నాఁటించి వి న్నహోబలేశ ॥ ఒక్క ॥ 202

రామక్రియ

ఆనసుమీ్మ నీకును ప్ర[1]హ్లాదవరదా। విన్ను-
నానితిఁ గుచముల ప్రహ్లాదవరదా ॥ పల్లవి ॥

అలుక మానుమీ ప్రహ్లాదవరదా। విన్ను-
నలమితి విప్పుదే ప్రహ్లాదవరదా
అలసితి రతుల ప్రహ్లాదవరదా। నీకు-
నలవాటే ఇన్నియుఁ బ్రహ్లాదవరదా ॥ ఆన ॥

అంగపుఁజెమటల ప్రహ్లాదవరదా। నీకు-
నంగడి మొక్కు మొక్కేఁ బ్రహ్లాదవరదా
అంగదెల్లాఁ బొసెను ప్రహ్లాదవరదా। మోవి-
నంగజముద్ర లంటెఁ బ్రహ్లాదవరదా ॥ ఆన ॥

ఆరితేరెఁ బనులు ప్రహ్లాదవరదా। యింక-
నారీతి మన్నించుమీ ప్రహ్లాదవరదా
యీరీతి శ్రీవేంకటాద్రి నిండ నేఁడుఁ గూడఁగాను
హారములు పెనఁగెఁ బ్రహ్లాదవరదా ॥ ఆన ॥ 203

లలిత

ఇంత నేతురా నీవు యెమ్మెకాఁడ
వింతవాఁడవా నీవు వేడుకకాఁడ ॥ పల్లవి ॥

పడఁతి విలువఁగాను పలుకక వూరకుండి
నగుమ నవ్వేదురా నాలికాఁడ
చిడుముడి నప్పటిని చెయివట్టి తియ్యఁగాను
జడిసి మారిడుదురా జాణకాఁడ ॥ ఇంత ॥

---

1. రేకులో అంతటా 'ప్రంహ్లాద' అనియే వ్రాత కలదు. ఆ పదమును పాను-నాసికముగ మచ్చరించుచుండిరా ?

సిగ్గు విడిపించి సతి చెక్కునొక్కి వేఁడుకోఁగా
బగ్గన నలుగుదురా పంతగాఁడ
వెగ్గళమై ఆపె నీకు విందులమో వియ్యాఁగాను
దగ్గరి పీడె మిత్తురా తాటోటుకాఁడ ॥ ఇంత ॥

చింతదీర నీమగువ చేరి కాఁగిలించుకొంటే
అంతలో భ్రమతురా అందగాఁడ
వంతుకు శ్రీవేంకటేశ వనిత నిన్నుఁ గలసె
బంతి నింతేసి మెత్తురా బయకాఁడ ॥ ఇంత ॥ 204

## ముఖారి

నిన్నుఁ జూచుకొనఁద్దా నేఁడు మమ్మేమి చెప్పేవు
జున్నుగా సిగ్గురేఁచితే జోరునఁ బైజారదా ॥ పల్లవి ॥

విందుబాణలైనవారు నీతో నవ్వేరుగాక
అందమున్నకన్నెలము అందుకోపేమా
చంఁడిపెట్టి నీవు నేఁడు చల్లలమ్మేవారిఁ దెచ్చి
బందుబందు సేయఁటోతే పలుచనేకాదా ॥ నిన్నుఁ ॥

యిచ్చకమాడేటివారు యియ్యకొనుందురుగాక
అచ్చపుముద్దరాండ్ల మందుకోపేమా
పచ్చిదేరేమాట లాడి పల్లైతావువారిఁ దెచ్చి
ముచ్చిలి చేచాఁచఁటోతే ముదుగులేకావా ॥ నిన్నుఁ ॥

మందెమేళమైనవారే మారుపెనఁగేరుగాక
అందపుమానావతుల మందుకోపేమా
చెందితి శ్రీవేంకటేశ చేఁగలమట్టిలో నన్ను
మందలించఁటోతేను మతకమేకాదా ॥ నిన్నుఁ ॥ 205

రేకు 1136 సాళంగనాట

ఎంత కెంత పెంచేవే యెందాఁకాను
కాంతలకుఁ బతులకుఁ గలదే కాదా ॥ పల్లవి ॥

పొట్టువెట్టుకొంటినంటా వూరకే మాటాడవు
పట్టినదే వ్రతమా పడఁతులకు
మెట్టిపట్టుకొని నీతో మేనవావి నేనుకొవి
తిట్టేఁగాక కోపాన సాదించవచ్చేనా ॥ ఎంత ॥

ఆడనలిగితినంటా నట్టె శిరసు వంచేవు
ఆడినవే ఆటలా యతివలకు
వేడుక పుట్టవలసి విభుఁడు జూజాన విన్న-
నోడించెఁగాక నీతో వొరటువాఁడా ॥ ఎంత ॥

చెల్లుబడిగలదంటా సిగ్గులువదే విప్పుడు
పల్లదమే పగటా భామినులకు
యిల్లిదె శ్రీవేంకటేశుఁ డెనసె నిన్నింతలోనె
వుల్లము చూచెఁగాక వొకరీతి నుండెనా ॥ ఎంత ॥ 206

పాడి

మంచి మంచేయీ నాడితే మోచేయీ నాడుఁగాక
మంచితనము లేకుంటే మరిగినా తాను ॥ పల్లవి ॥

ఇచ్చకమాడేవారినే ఇందు రమ్మందురుగాక
తుచ్చమాడేవారినేల తొంగిచూతురు
మచ్చిక నేఁ జేయఁగానే మనసిచ్చెఁగాక తాను
వొచ్చెములు దన్నెంచితే వొనగూడీనా ॥ మంచి ॥

అడ్డాలుచెప్పనివారి కట్టి వలతురుగాక
వొడ్డారపువారికేల వొడ్డికొదురు
వెడ్డువెట్టి వేఁడుకోఁగా విడువకున్నాఁడుగాక
యెడ్డెతనాన నుఁడితే ఇయ్యకొసీనా ॥మంచి॥

గక్కన మొక్కినవారిఁ గాఁగిట నింతురుగాక
కక్కసపువారినేల కైకొందురు
నిక్కి శ్రీవేంకటేశుఁడు నేఁ గూడఁగాఁ జిక్కెఁగాక
మొక్కలాన నూరకుంటే మోహించీనా ॥మంచి॥ 207

ఆహిరి

అలుగకువే నీవు అందుకెల్ల నాతనితో
చలములేకుండాఁ దెలుసుటగాక ॥పల్లవి॥

వాదికెమాట లాడితే వద్దనఁగవచ్చునా
యీడుజోడు లందులోన యెంచుటగాక
జాడతో నవ్వు నవ్వితే సాదించవచ్చునా
సూడుఁబాడుఁ గాకుండ సోదించుటగాక ॥అలు॥

తప్పకచూచితేనే తమకించవచ్చునా
కప్పి వెంగెములేకుండాఁ గనుటగాక
మొప్పిరిఁ జేయువట్టితే మొనచూపవచ్చునా
చొప్పుగా బాసలు సరిచూచుకొంటగాక ॥అలు॥

చిమ్మిరేఁగఁ గూడఁగాను సిగ్గువడవచ్చునా
నిమ్మలాన నేరుపులు నించుటగాక
యిమ్ముల శ్రీవేంకటేశుఁ డింతలో నిన్నుఁ గలసె
యెమ్మె చూపవచ్చునా యెఱుఁగుటగాక ॥అలు॥ 208

మాళవిగౌళ

ఆయ రావే యేఁడ సుద్ది అందువంక నేమి గదు
పాయపువేడుకకాఁడు భయపడేనా ॥ పల్లవి ॥

చేయిమీఁదై చేఁతచేసి సెలవుల నవ్వఁగాక
యీయెడ నెంతదిట్టినా యెదురాడీనా
కాయకపుటందగాఁడు కతలెల్లాఁ జెప్పఁగాక
రాయడించి వొద్దనినా రాక మానీనా ॥ ఆయ ॥

తగవుచాలదివాఁడు తలవంచుకొనుఁగాక
జిగి నెంత గాదనినా సిగ్గువడీనా
పొగిసి వేడుకకాఁడు చూరువట్టి వేఁడుఁగాక
వెగటుగా దొబ్బినాను విడువఁబొయ్యీనా ॥ ఆయ ॥

నేరమిపైఁబడ్డవాఁడు నిందా నోర్చుకుండుఁగాక
సారె నెంత జంకించినా చండి మానీనా
సారపుశ్రీవేంకటేశ్వరుఁ డిదె నన్నుఁ గూడె
మీరేమి చెప్పినా మించి వీఁగీనా ॥ ఆయ ॥ 209

లలిత

నీవల్ల వచ్చినమేలు నిన్ను నోఁకును
దేవర వీజగడాలు దిద్దవయ్య నీవే ॥ పల్లవి ॥

మచ్చరించి సవతులు మాటలాడదొరకొంటే
విచ్చలపువెంగేలెల్ల నిన్ను మోచును
కొచ్చి కడకన్నులకు కోపపుచెఱ్ఱ వచ్చితే
కచ్చుపెట్టి నీపైఁ జారి కమ్ముకొనును ॥ నీవ ॥

చిమ్మరేఁగి ఆపెనాపెఁ జేతులు దాఁచఁబోతే
నెమ్మది నడుమనున్ననిన్ను మోచును
పుమ్మడిపంతాలు వొక్కరొక్క రాదుకొంటేను
పమ్మి అవి దిద్ద నీపాల నుండును ॥నీవ॥

మించినయాకాంతలకు మేనులు చెమరించితే
పంచల నాచెమట నీపై నంటును
యెంచఁగ శ్రీవేంకటేశ ఇద్దరినిఁ గూడితివి
కంచపుమోవుల చవి కానవచ్చు నీకును ॥నీవ॥ 210

బౌళి

మాఁటలాడవయ్య ఇఁక మగువ నీవు నొక్కటే
ఆఁటదాని కిదే చల్లవారెఁ గోపము ॥పల్లవి॥

కాయముపైఁ జేయివేసి కప్పురము నోటికిచ్చి
ఆయము లంటఁగాఁ జల్లనారెఁ గోపము
దాయలు సన్నలుఁ జేసి చవులుగా మోవి ఇచ్చి
ఆయెడ మొక్కఁగాఁ జల్లనారెఁ గోపము ॥మాఁట॥

కొప్పు గడుదువ్వి యట్టె కొంగు చేతఁబట్టుకొని
అప్పసము నవ్వఁగాఁ జల్లారెఁ గోపము
రెప్పలెత్తి చూచి చూచి రేసులెల్లా వించఁగాను
అప్పుడట్టె మతిఁ జల్లనారెఁ గోపము ॥మాఁట॥

పచ్చిగాఁగఁ గాఁగిలించి పట్టి తమ్ములము పెట్టి
అచ్చు గోరు మోపఁగాఁ జల్లారెఁ గోపము
మచ్చిక శ్రీవేంకటేశ మనసారఁ గూడితివి
అచ్చలము దేరి చల్లనారెఁ గోపము ॥మాఁట॥ 211

రేకు 1137 సామంతం

ఇదివో నీదొరతన మింకా నేమి చెప్పేను
సదరమైతి నీయాదేజాఁతనాలకును ॥పలవి॥

చలివాసి యాపె నీతో సారె వెంగేలాడఁగాను
నలిరేఁగి నీవు గడునవ్వఁగాను
చులుకనివాఁడవైతి సుదతులకెల్లాను
మెలఁగి చూడఁగ మందెమేలాలపాలైతివి ॥ఇది॥

సందడి మాలో నీతో సన్నలాపె సేయఁగాను
మందలించి నీవు లోనై మన్నించఁగాను
అందరియెంగిలి పైతి వాడికలకు లోనై
కందువరతులలోన కంకి వైతివి ॥ఇది॥

గక్క(న?) విన్నిపు దాపె కాఁగిలించి కూడఁగాను
మిక్కిలి శ్రీవేంకటేశ మెచ్చఁగాను
లక్కవంటివాఁడవైతి లాగుల మాతోఁ గరఁగి
తక్కసించఁగా రొంపిలో కంబమైతివి ॥ఇది॥ 212

ఛా(భా?)యానాట

ఏఁటికి ఆఁటదానికి వింతగర్వము వలెనా
మేఁటిరతులచేతనే మెప్పించుటగాక ॥పల్లవి॥

మాటలాదేపతితోడ మరి పరాకేఁటికే
కాటుకకన్నులఁ జూచి కైకొంటగాక
కూటమికిఁ బెనఁగఁగా గుట్టు చూపనేఁటికే
చాటించి మోవివిందులు చవిరేఁచుటగాక ॥ఏఁటి॥

నవ్వునవ్వేపతియెద నాలితన మేఁటికే
రవ్వగాఁ జన్నులనొత్తి రాయుటగాక
పువ్వులు ముడువఁగాను బొమ్మజంకెనేఁటికే
జవ్వనపాయముపొందు జరపుటగాక ॥ఏఁటి॥

కూడేశ్రీవేంకటపతిఁ గొసరఁగనేఁటికే
జాడతో వలపు పైపైఁ జల్లుటగాక
వేడుక నెనసితివి వేగిరములేఁటికే
పాడిపంతము మెరసి పనిగొంటగాక ॥ఏఁటి॥ 213

## తోండి

ఏల మేకులు నేసేవు ఇందరిఁ జూపి మమ్మ
పాలు వాలే నీరు నీరే పలుకు లేమిటికి ॥పల్లవి॥

కాయకపువావులకాంతలు సరయ్యేరా
చేయిమీఁదై నేసపాలచెలులకును
మాయదారిబీటియెఁ(యెం?)దమావులనేళ్లెల్లాము
కాయపుదప్పి దేరుచఁ కాఁగులు నిండీనా ॥ఏల॥

యెరవులసతులెల్ల యీడుజోడు వచ్చేరా
తిరమైనపట్టంపుదేవులకును
అరమరచి చూచిన ఆమనిపచ్చలెల్లాము
వరుస రాసులై కొలవఁగ వచ్చీనా ॥ఏల॥

కన్నవూడిగపువారు కలనేరా కొలమున
నిన్నుఁ గూడినమావంటినెలఁతలతో
యిన్నిటా శ్రీవేంకటేశ యెంచి చూచుకొంటేమ
వెన్నెలకువ్వలెల్లా వెలకెక్కీనా ॥ఏల॥ 214

గుజ్జరి

వద్దనేనా నే దన్ను వలపెంత చవియైనా
అద్దుకొని తనకును ఆపెకు నమరునే ॥పల్లవి॥

మచ్చికకు వేళ గద్దా మాటలకుఁ గొన గద్దా
పెచ్చు వెరిగీఁగాక ప్రియుఁడు నాతో
ఇచ్చకాలు వేసెనంటా వింతి విట్టె మెచ్చితేనే
మెచ్చనీవే మాతోనేల మెకులు చెప్పినే ॥వద్ద॥

వనుపులో వింత గద్దా నవ్వులకు మితి గద్దా
అనువులు చూచీఁగాక అతఁడు నాతో
పెనఁగి పిలిచీనంటా ప్రియురాలిమాట వించే
వినసీవే మాతోనేల వేడుక చెప్పినే ॥వద్ద॥

కూటమిలో కొంతు గద్దా కోరికకు మేర గద్దా
యేఁటిదో కాక శ్రీవేంకటేశుఁడు నాతో
యీటువెట్టెనంటా నాకెయింపులకె నమఁ గూడె
కూటమికి నన్నేల గొరబువేసీనే ॥వద్ద॥ 215

దేసాళం

ఎందాఁకా వేఁడుకొనేవు యేఁటికయ్యా
అంది పొంది యింకా విన్ను అటమటించేనా ॥పల్లవి॥

అలుకలేఁటికి నీకు నంతరంగ మొక్కటాయ
బలిమి యేఁటికి నీతోఁ బలికితిని
పొలపులేఁటికి నీసుద్దులు సమ్మతించితి
మలసి యప్పటి నీతో మరికాదనేనా ॥ఎందాఁ॥

పట్టిసొలపులేఁటికి వద్దనే వుఁదాన నేను
తిట్టనేల నీమోహము తెలిసితిని
పట్టి కొసరఁగనేల పనులెల్లాఁ జేసే నీకు
మట్టుమీరి యంతలోనే మరి కాదనేనా ॥ ఎందాఁ ॥

జంకించనేఁటికి నీచనవెల్లాఁ జేకొంటి
వుంకువలేఁటికి నీతో నొద్దికైతిని
అంకెల శ్రీవేంకటేశ అన్నిటా నిన్నుఁ గూడితి
మంకు వానె నీతోను మరి కాదనేనా ॥ ఎందాఁ ॥ 216

## లలిత

ఎవ్వరు సాకిరిచెప్పే రిందుకుఁగాఁ దనకు
వువ్విళూ(ళ్లూ?)రఁ దనలోనే వూహించుకొమ్మనవే ॥ పల్లవి ॥

మొగములోపలితేట మొందరనే కానరాఁగా
యెగసక్కెపురమణుఁ డేలటొంకీనే
తగిలి తనవన్నెలు తాఁ జూచుకోరాకుండే
సొగిసి యద్దమైనాను జూచుకొమ్మనవే ॥ ఎవ్వ ॥

లచ్చనగా నొసలను లత్తుక లంటుకుండఁగా
యిచ్చకములాడి విభుఁ డేలటొంకీనే
తచ్చి తనపై మచ్చము తాఁజూచుకోరాకుండే
అచ్చలాన నద్దమైనా నట్టె చూడుమనవే ॥ ఎవ్వ ॥

ఎదపైపై మోవికేలు బిగువులవట్టుండఁగా
యెదుట శ్రీవేంకటేశుఁ డేలటొంకీనే
వదనము తాఁ జూడవసముగాకుండే వద్దము
యిదె చూచుకొమ్మనవే యిట్టె నన్నుఁ గూడెను ॥ ఎవ్వ ॥ 217

రేకు 1138 సౌరాష్ట్రం

ఎఱఁగనంటా నానలేల పెట్టుకొనేవీడ
యెఱిఁగేవుగాక ఇఁక నెందువొయ్యేవయ్యా ॥పల్లవి॥

మనసు మర్మమెఱుఁగు మాటలు వాసులెఱుఁగు
తనువు కాఁగిటిలోనితమి యెఱుఁగు(ను?)
పనివడి నీవెంత పరాకుతో నుండినాను
యెనసేవుగాక మమ్ము నెందు వొయ్యేవయ్యా ॥ఎఱఁ॥

వలపు తెగులెఱుఁగు వయసు వాడికెఱఁగు
చెలువపుపంతములు సిగ్గెఱుఁగును
నిలుపురాజసముతో నీవెంత వుండినాను
యెలమి మన్నించేవుగా కెందువొయ్యేవయ్యా ॥ఎఱఁ॥

కన్నులు కాంక్ష లెఱుఁగు కందువలు గోళ్లెఱఁగు
సన్నపునవ్వులు మోవి సారె నెఱుఁగు
అన్నిటా శ్రీవేంకటేశ అలమేలుమంగను నేను
యెన్నికఁ గూడితి విఁక నెందువొయ్యేవయ్యా ॥ఎఱఁ॥ 218

పాడి

ఊరకే వుండితే నిన్ను వూరెల్లా నెఱిఁగేరు
దూరువచ్చీ సుమ్మీ నీవు దొరపాటివాఁడవు ॥పల్లవి॥

నిలువుఁగస్తూరిపూఁత నీమేన వలఁదుకో
చెలఁగి చీఁకటితప్పు సేసేవాఁడవు
తలఁగక సేమంతులదండలు పండా వేసుకో
తొలువెన్నముద్దలెల్లా దొంగిలేటివాఁడవు ॥ఊర॥

వడిఁ బైఁడిపచ్చడము వల్లెవాటు వేసుకో
చిడుముడిఁ జీరలు దీసేవాఁడవు
కడు నీవు పొద్దోకసింగారాలు నేసుకో
తొడికి ఆఁటదాని నెత్తుకవ చ్చేవాఁడవు ॥ ఊర ॥

మితిలేవిహారములు మెదనిండాఁ గట్టుకో
రతి నలమేల్మంగవురమువాఁడవు
ఇతవై శ్రీవేంకటేశ ఇదె మమ్ము నేలుకో
సతుల వేలసంఖ్యల నంతరించేవాఁడవు ॥ ఊర ॥ 219

బౌళి

పాయపుమదమువట్టి పనులేమి యెఱఁగను
చేయిమీఁదై నీవేమైనాఁ జేసుకోరాదా ॥ పల్లవి ॥

సిగ్గువడ్డనాచిత్తము చెప్పినట్టు నేసీనా
తగ్గి నన్ను మూలమూల దాఁచుఁగాక
యెగ్గువట్టి యేలదూరే వెంతగబ్బి నేనంటా
అగ్గమై నీయిచ్చల నేమైనాఁ జేయరాదా ॥ పాయ ॥

వాసితోదినాచలము వసము నాకయ్యీనా
యీసురేఁచి అట్టె బిగియింపించుఁగాక
ఆసలనేల జంకించే వంకెకు నే రానంటా
నేసవెట్టి యేమైనాఁ జేసుకోరాదా ॥ పాయ ॥

అంగపుజవ్వనమద మదఁచితే నడఁగీనా
పొంగుచు నీకాఁగిటిలో బోగించుఁగాక
రంగగు శ్రీవేంకటేశ రతి నలమేల్మంగను
చెంగట నిచ్చఁ బెండ్లి నేసుకోరాదా ॥ పాయ ॥ 220

శ్రీరాగం

నీరచన లింతేలాయ నివ్వెరగేల పడేవు
పౌరకామినులు నిన్నుఁ బంగించితేఁ దప్పా ॥ పల్లవి ॥

కోరి కోరి పిలువఁగ గుట్టెల్లా బయిటఁబడె
సారె సారె నవ్వఁగాను చలివాసెను
మారుకొని మాటాడఁగ మందెమేలమాయ నేఁడు
తేరి చూచి ఆకె నిన్నుఁ దిట్టకుండునా ॥ నీర ॥

చెక్కులు నీవు నొక్కఁగా సిగ్గులెల్లాఁ దొలఁగెను
చక్కఁగ నీవు మెచ్చఁగ చండిపడెను
దక్కి నీ పందనుండఁగ తనకు వెఱపు దీరె
తక్కక పాదాన నిన్నుఁ దాఁకించక మానునా ॥ నీర ॥

నీవు గాఁగిలించుకోఁగా విందురాజసము గప్పె
కైవసము గాఁగాను కాఁకదేరెను
యీవల నలమేల్మంగ యిట్టె వురమెక్కించఁగ
శ్రీవేంకటేశ నీసేవ సేయవలదా ॥ నీర ॥ 221

ఆహిరి

నే నేమిసేతునే నిచ్చలాన నేనుండాన
ఆవకపుతనసుద్దు లడుగరే మీరు ॥ పల్లవి ॥

చల్లనిచందురుఁడే సారె వేఁడి చల్లీతేను
యెల్లవారి కిఁకమరి యేమిసేసేదే
వెల్లివిరి నానవ్వు వెంగెము తనకైతే
పల్లదాన తవకైసభాగ్య మింతేకాక ॥ నేనే ॥

ముదిచేటిపూవులే మొనలై నాఁటితేను
యెదయక యెల్లవారి కేది దెరువే
అదరి నాకనుచూపు లాయములు గాఁడితేను
బడి బడిఁ .దాఁ జేసినభాగ్య మింతేకాక ॥ నేనే ॥

చక్కెరవంటిమాటలే సరిఁ జిరుచేఁదై తే
యెక్కడా దంపతులకు నిఁక నేఁటిదే
అక్కరై శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
పక్కనఁ గూడితిఁ దనభాగ్య మింతేకాక ॥ నేనే ॥ 222

రామక్రియ

వద్దు వద్దమ్మా యింతవాదు లాతనితోఁడుత
పొద్దువోనిసుద్దులెల్లా బోగులై నిలిచెను ॥ పల్లవి ॥

కోరికలు దఱచై తే కోపములు దఱచౌను
మారుకొంటే మీఁదమీఁద మంకువట్టును
సారె సారెఁ బతినేల సాదించేవే నీమీఁది-
పేరడివలపు పెక్కుప్రియురాండ్లఁ దెచ్చెను ॥ వద్దు ॥

పెనకులు గదునై తే చిమ్మిరేఁగుఁ దిట్లెల్లా
పెనఁగఁబోతే నట్టే బిరుదెక్కును
కినిసి యీతనినేల కెరలి తిట్టేవే నీపై
మనసే పెక్కటిల్లి యీమగువలఁ దెచ్చెను ॥ వద్దు ॥

నయములు మించితేను నగవులు జాలవాగు
వియత నగామేల్మంగ నిమ్ముఁ [illegible]
[illegible]యవెట్టె శ్రీవేంకటోత్తముఁడు [illegible] నీకు
ప్రియము నీమీఁదిదే యీపేరటాండ్లఁ దెచ్చెను ॥ వద్దు ॥ 223

రేకు 1139 పళవం(వం?)జరం

ఆతఁడు నీచేతఁ జిక్కె నదివో నేఁడూ నీ-
యేతులు యెమ్మెలు మరి యేమిచెప్పే మిఁకను ॥పల్లవి॥

వెన్నెలనవ్వులు నవ్వె వేఁడివేఁడివలపు
చన్నులతుదలనె చవుకళించె వయసు
కన్నులచూపులనె కాఁడిపారె మనసు
యెన్నిలేవు నీసుద్దు లేమిచెప్పే విఁకను ॥ఆతఁ॥

నాలికతుదలనె నానెఁ జుట్టరికము
మేలిమిసరసముల మించె మోముకళలు
గాలపుగోరికొనల కరఁగె మర్మములు
యీలాగుల నీనేరుపు లేమిచెప్పే మిఁకను ॥ఆతఁ॥

పెదవిపైఁ గుఱుతులఁ బెరసెఁ గూటములు
పొదిగొన్నతమకాన పోగులాయ నాసలు
అదన శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నిన్ను-
నిదె కూడె మీ భావము లేమిచెప్పే మిఁకను ॥ఆతఁ॥ 224

గౌళ

ఎప్పుడూ నాభావము నీవెఱిఁగినవాఁడవు
తప్పులెంచ కిట్లానే దయఁజూడుమీ ॥పల్లవి॥

చక్కనినీరూపు చూచి చొక్కివున్నదాన నేను
పక్కన నీవే వన్నుఁ బైకొనుమీ
యిక్కువ నే నంటనంటా యెగ్గునట్టేపుగనక
చిక్కని చన్నులమీఁదఁ జేయివేయుమీ ॥ఎప్ప॥

మాటలు నీ వాడఁగాను మత్తురాలనై వుందాన
గాఁటపునీపచ్చడము గప్పుమీ నాపై
కూటమిలోఁ బరాకంటా గుంపించేవుగనక
నాఁటుకొనఁగా నీవే నన్నుఁ గాఁగిలించుమీ ॥ ఎప్పు ॥

సమరతి నిన్నుఁ గూడి సదమదమైనదాన
తమకాన మోవి ఇచ్చి దప్పిదీర్చుమీ
అమరె శ్రీవేంకటేశ అదేమనేవుగనక
సముకమిచ్చి యేపొద్దూ చనవరిఁ జేయుమీ ॥ ఎప్పు ॥ 225

బౌళి

ఇంతగా నేర్చితివి నీ విన్నియు నిందుకొరకే
మంతనవ్వులేకా మక్కువకు మందులు ॥ పల్లవి ॥

మించి ఇంతులు వలవ మిక్కిలి నీవాడేటి-
మంచిమాటలేకావా మచ్చుమేపులు
పంచల నందరికివి పాయరానిపొందులకు
కంచపుఁబొత్తులేకావా గాలపువేఁటలు ॥ ఇంత ॥

కొమ్మలననుపులరు(కు?) కొనగోరితాఁకులు
చిమ్ములేకా విడువనిచేపట్లు
నెమ్మనములు గరఁగ నిలుచుండి నీవు చూచే-
వుమ్మడి చూపులేకావా వుంకువధనములు ॥ ఇంత ॥

కూడిన కూటములకు గుఱుతులు రేఁచేని నీ-
వీడెపుమోవులేకావా వీడుదోళ్లు
యీడనే శ్రీవేంకటేశ ఇందరి నేలితి విట్టె
వేడుకమెక్కులేకావా వెలలేనియాసలు ॥ ఇంత ॥ 226

### ముఖారి

ఒకటంటే నొకటనే వూరకే నీవు
   వెకలివై నిన్నేమైనా వెంగెములాడెనా ॥ పల్లవి ॥

పక్కన నీమోవి చూచి పకపక నవ్వె నాపె
   యెక్కువ నీమోవికెంపు లేదవనెనా
   వెక్కసపునీపై చేయి విసరె నిప్పుడె ఆపె
   చొక్కమై నీవుసేసినసుద్దులు దడవెనా ॥ ఒక ॥

కళదేరేనీమేనికాంతులు పొగడె నాపె
   అలరి వున్నాఁడవు నిన్నదేమనెనా
   అలసినందుకు పన్నీ రట్టె నీపైఁ జల్లెఁగాక
   కలనీచేఁతలు యెఱుకలు సేసుకొనేనా ॥ ఒక ॥

చిమ్మిరేఁగేనీనెరులు చిక్కులుదీనె నాపె
   పమ్మి నిన్ను యిట్టే సిగ్గువడఁజేసేనా
   కమ్మి శ్రీవేంకటేశుఁడ కలసె నలమేల్మంగ
   కుమ్మరించి నీపై బత్తి కొత్తలుగఁ జేసెనా ॥ ఒక ॥ 227

### కన్నడగౌళ

కల్లగాదు చూఁడవయ్య కన్నులెదుటనే యిదె
   జల్లన మైపులకలజాజులు పైఁబోసెను ॥ పల్లవి ॥

చెప్పేటినీగుణములు చెవియొగ్గి మాచెలి
   కప్పురపునవ్వులనే కానుకవట్టి
   చొప్పులుగ నీ విట్టే తనవద్దికి వచ్చేవంటే
   కప్పినతనచన్నులు కప్పముగాఁ బెట్టెను ॥ కల్ల ॥

యివ్వల విడెము నీకు యిట్టె యిమ్మనేనంటే
వువ్విళ్లూరఁ దనమోవి వులుపా వట్టె
దవ్వులనే వలపులు తరి నీపైఁ జల్లేనంటే
నువ్వనఁ జేతిమొక్కులు నూదిదెగాఁ బట్టె ॥కల్ల॥

నెమ్మది నీవు సరుస నిలుచున్నాఁడవంటే
కొమ్మ నీబంగారపుకొంగు వట్టెను
యిమ్ముల శ్రీవేంకటేశ యిదె నీవు గూడఁగాను
పమ్మి నీకాఁగిలి మరి బారచాఁచి పట్టెను ॥కల్ల॥ 228

## భైరవి

నిన్నుఁ జూచి నాకైతే నెరవుగా దయవుట్టె
యెన్నిటి కోపుదువు మాయింటికి రావయ్యా ॥పల్లవి॥

చేసన్నసేసి యొకతె చెట్టవట్టి తీసె నిన్ను
ఆసల నొకతె నిన్ను నట్టె నవ్వేను
యీసందుల నీమనసు యిరుమొనసూదాయ
నేసల యిద్దరిచేతఁ జిక్కేఁగా నీతురుము ॥నిన్నుఁ॥

కందువకుఁ దెచ్చొకతె కాఁగిలించుకుండఁగాను
మందలించి వేరొకతె మర్మమంటీని
అంది తాసువంటిదాయ అట్టె నీరతియెల్ల
సందడి నిద్దరిచేత సదమదమైతివి ॥నిన్నుఁ॥

మునుప వేరొకతె నీమోవి గంటిసేయఁగాను
వెనక నొకతె గోరు వీఁపు మోపీని
యెనసితి నే నిన్ను యింతలో శ్రీవేంకటేశ
అనువై ముక్కాలిపీఁట వైతివిగా యిపుడు ॥నిన్ను॥ 229

రేకు 1140 ఆందోళి

ఇన్నిటా జాణవే నీకిది వోజ
యెన్నని సంతోసించేని కిదివో వోజా ॥ పల్లవి ॥

వచ్చినప్పుడే పతికి వలపు పైఁ బూసితివి
యెచ్చరికగలదాని కిదివో వోజా
లచ్చనలు నించితేను లలి నూరకె వుంటివి
యిచ్చకపుజవరాలి కిదివో వోజా ॥ ఇన్ని ॥

సరసములాడితేనే చనవెల్లా నిచ్చితివి
యెరవులేనిదానికి నిదివో వోజ
తెరవేసినంతలోనే తెలిసి పాదాలొత్తితి —
విరవైనపెండ్లికూఁతు కిదివో వోజా ॥ ఇన్ని ॥

చెంగటికి వచ్చితేనే శ్రీవేంకటేశుఁ గూడితి —
వింగితజ్ఞురాలికి నిదివో వోజ
వుంగిటితమ్ముల మాతఁ దుమియఁబోతే నీవు
యెంగిలికిఁ జేయొగ్గితి విదివో వోజా ॥ ఇన్ని ॥ 230

ఆహిరి

ఇంక నేమిచెప్పేము నీయెమ్మెలు సింగారాలు
చింకచూపులనుఁ జూచి సిగ్గువిడిపించిరి ॥ పల్లవి ॥

ఆవుఁ గాచుచు పరాకైననిన్ను గొల్లెతలు
చేవదేర వలపులు చిమ్మి రేఁచిరి
వోవలఁ బాలెల్లఁ దాగి వుబ్బి మదించీనని
తావిబుజాల గోరికోఁతలు గోసిరి ॥ ఇంక ॥

అంచెలయమునలోన అట్టె యీ(దులాడేవిన్ను
మంచి మానములు చూపి మోహించిరి
పెంచెపువనాలలోన పిల్ల(గోవిపట్టి(ట్టే)నీకు
కంచపుకెమ్మోవు లిచ్చి కళలెల్లా నించిరి ॥ ఇంక ॥

గచ్చకాయలాడేవిన్ను( గా(గిలించుకొని పట్టి
కొచ్చి కొచ్చి చన్నులనే కూరాడిరి
యిచ్చల శ్రీవేంకటేశ యిటు నన్ను( గూడితివి
చెచ్చెర వారెల్ల నీపై నేసవెట్టిరి ॥ ఇంక ॥ 231

## పాడి

ఓపనోప నిందుకెల్లా వోచెలులాల
యేపనులకవి పైపై నెచ్చరించే నతని ॥ పల్లవి ॥

కన్నులు చల్ల(గా( జూచి కడుసంతసించే(గాక
యెన్నిటికని కోపించే నిం(క నాతని
చన్నులమొనల నొత్తి సారె( గా(గిలించే(గాక
కన్నందుకెలా నెట్లు( గక్కసించే నాతని ॥ ఓప ॥

చేతులు నిండా నేను సేవసేసే(గాక మరి
యేతుల నెట్టు జంకించే నిం(క నాతని
[1]ఆతుమార మోవితేనె లట్టే విందువెట్టే(గాక
జాతినీతిమాని యెట్టు సాదించే నతని ॥ ఓప ॥

కాయము నిండా( బొంది కర(గించి కూడే(గాక
యేయుపాయముల మీరే నిం(క నాతని
యీయెడ శ్రీవేంకటేశు( డెనసి నన్ను మన్నించె
చాయల సన్నల నేమి జాగుసేసే నాతని ॥ ఓప ॥ 232

---

1. ఆతుమార=మనసార.

దేసాళం

మంచితనములు సేసి వంచుకోనేర వతని
పొంగి మోవి చూపితేనే పొందు నీకు నియ్యఁడా ॥పల్లవి॥

పచ్చిసేసి బలిమినే పతినేల పిలిచేవే
యిచ్చకమాడితే నాతఁ డింటికి రాఁడా
బచ్చెనలనలు వెట్టి బాసలేల అడిగేవే
చెచ్చెర నీవు మొక్కితే చెప్పినట్టు సేయఁడా ॥మంచి॥

తలుపు మూసుక యేల తగఁ బతి నాఁగేవే
వలచితినంటేనే వద్ద నుండఁడా
మలసి పొలసి యేల మనసు సోదించేవే
మొలకనవ్వు నవ్వితే ముచ్చటెల్లాఁ జెప్పఁడా ॥మంచి॥

చిప్పిల శ్రీవేంకటేశుఁ జెనకి యేల పట్టేవే
కప్పురవిడె మిచ్చితే కాఁగిలించఁడా
దప్పిదేర నప్పటిని తమకపడఁగనేలే
చెప్పినప్రియములకే [1]చేకొనిట్టె కూడఁడా ॥మంచి॥ 236

గౌళ

నీవే నేరుతువమ్మ నేఁ డాతని దక్కఁగొన
యీవల నిందుకే వురమెక్కించె నిన్నతఁడు ॥పల్లవి॥

మచ్చరమువిడిచినమానినికి అట్టికదా
ముచ్చట తనవిభుఁడు మోహించును
చెచ్చెర నుపచారమఁచెప్పినయాపెకుఁగదా
అచ్చపుమన్నవలెల్లా వఱచేతిలోనివి ॥నీవే॥

1. చేకొని + ఇట్టె.

పంతములాడనియట్టిపడఁతికి నిట్టెకదా
సంతతము రమణుఁడు జంటవాయఁడు
చెంతల నెప్పుడు సేవలు సేసినయాపెకుఁగదా
బంతినే ఆతఁ డెప్పుడుఁ బంపుసేసును ॥ నీవే॥

ఇచ్చకురాలైనయట్టిఇంతికి నీ కిట్టెకదా
వచ్చి శ్రీవేంకటేశుఁడు వలచి కూడె
తచ్చివేసి నీవంటితమిగలాపెకుఁగదా
పచ్చుపెట్టి ఇతఁ డిట్టె కైవశమై వుండును ॥ నీవే ॥ 234

తెలుఁగుఁగాంబోది

చెలులాల యీచెలిఁ గాచుకొనుచు
నెలవున నెప్పుడు నే నుందేను ॥ పల్లవి ॥

తప్పక చూచిన తానే తెలుసును
చెప్పకతొల్లే చేరి వలపు
ముప్పిరి నాతనిముందర నిలుపదె
యిప్పుడే యీడకు నేతెఁచీని ॥ చెలు ॥

యింతిఁ జేర్కొనిన యిటు వయదలఁచును
అంత బలిమిసేయఁగ వలదు
కాంతలు చేయెత్తి గక్కన మొక్కరే
నంతనమిచ్చీ మనసతి కిపుడు ॥ చెలు ॥

కానికిచ్చితేఁ గలసీ నీకేను
నానెను పనవిన్నప మపుడే
ఆనుక శ్రీవేంకటాధిపు నగరే
లూనెలంతి గలసె నిదివో నేఁడు ॥ చెలు ॥ 235

రేకు 1141 నీలాంబరి

ఎంత భ్రమలఁబెట్టేవే ఇతని నీవు
దొంతులనీయానలు తోయఁజాలఁడు ॥పల్లవి॥

జిగిఁ జెక్కుచేత నీవు చిరునవ్వు నవ్వఁగానె
మగిడి మగిడి పతి మాఁటలాడీని
మొగము చూచి నీవు మంచి యాస లియ్యఁగానె
తగిలి నీమాట లిట్టె దాఁటఁజాలఁడు ॥ఎంత॥

పెక్కువిధముల నీవు ప్రియములు చెప్పఁగానె
అక్కరతో రెప్పలువేయక చూచీని
లక్కవలెఁ గరఁచి విలాసాలు నీవు చూపఁగ
వెక్కసపునీపొందు విడువఁగఁజాలఁడు ॥ఎంత॥

వేడుకతోఁడుత నిట్టె విడెము నీ కియ్యఁగానె
కూడి శ్రీవేంకటేశుఁడు గోర నొత్తీని
యేడఁజూచినాను నీవే ఇచ్చకములాడఁగానే
జాద నురమెక్కించి దిఁచఁగఁజాలఁడు ॥ఎంత॥ 236

పాడి

ఎంతసేసితివో ఆపె నేమిటఁగాని నమ్మదో
పంతములుమెరసె నేపనికోకావి ॥పల్లవి॥

పలుమారు వాలుకరెప్పలు వంచి చూచీ నిన్ను
యెలమిఁ గొసరె నాపె యేఁటికోకావి
నెలవుల నవ్వుదేర చేత రొమ్ము దట్టుకొంటా
మలయుచు శిరసూఁచె మరియేలోకావి ॥ఎంత॥

పెదవులు గదలఁగ పేరుకొని గొణఁగుతా
యెదురుగా నిలుచుండె నేఁటికోకావి
మదముదొలఁక నీతో మాటకు మాటాడి నిన్ను
నదనఁ జెయివట్టి తీసె నదేఁటికోకావి ॥ ఎంత ॥

గుట్టుతోడఁ బరతెంచి కుచములు గదలఁగ
ఇట్టె నీవద్దఁ గూచుండె నేఁటికోకావి
జట్టిగా శ్రీవేంకటేశ సమరతినిఁ జొక్కించి
నెట్టుకొని నిన్ను మెచ్చె నెపమేదోకావి ॥ ఎంత ॥ 237

లలిత

ఏఁటిమాటలాడేవు యెందాఁకనైనా
వాఁటమై నిన్నుఁ గాదనేవారు లేరంటానా ॥ పల్లవి ॥

చెలుల కిందరికిని సిగ్గే మూలధనము
తలవంచుకొనరాదా తరుణికిని
చలివాసినవాఁడవు సారె నీవు నవ్వితేను
మలసి యిల్లాలికి మారు నవ్వఁదగునా ॥ ఏఁటి ॥

కొమ్మలకునెల్లాను కోపమే సింగారము
బొమ్మల జంకించరాదా పొలఁతికిని
దిమ్మరివాఁడవు నీవు దీకొని సన్న సేసితే
అమ్మరో గరితలకు నాగడాలు దగునా ॥ ఏఁటి ॥

కోమలులకెల్లాను గుట్టే చక్కఁదనము
నేమముతో మందరాదా నెలఁతకును
ఆముక శ్రీవేంకటేశ అట్టె నీవు గూడితివి
ప్రేమపుపెండ్లికూఁతుకు పెనఁగఁగఁదగునా ॥ ఏఁటి ॥ 238

### సౌరాష్ట్రం

ఇంకనేఁటిమాటలు యిట్టె కంటి నీనిజము
వంకలొత్తఁబోతేను కొంకరలయ్యీని ॥ పల్లవి ॥

యెవ్వతెకస్తూరిబొట్టో ఇదె నీనొసల నంటె
చువ్వన నద్దములోన చూచుకోవయ్యా
నవ్వఁబోతే పెదవిపై నయానఁ గెంపులురేఁగె
యివ్వల చెక్కులపస పిరుమేలా నంటెను ॥ ఇంక ॥

కుంకుమగుబ్బలపూఁత గురిగా రొమ్మున నించె
సుంకుమోవఁ దలవంచి చూచుకోవయ్యా
పొంకపుచెవులతట్టుపుణుఁగు బుజాలఁ గారె
లంకెల హారములొత్తి లచ్చనలై వున్నవి ॥ ఇంక ॥

సమరతిచెమటలు చారలై నీమేన నిండె
సుముఖుఁడవై నీవే చూచుకోవయ్యా
అమర శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
జమళి ఇద్దరిచొప్పు సరి నీపైఁ బడెను ॥ ఇంక ॥ 239

### భైరవి

ఏమి వేగిరము నా కింతటిలోనే
దీమసాన నీగుణము తిదలేవిదానవా ॥ పల్లవి ॥

పల్లదపునీమాటకు పదరేటిదానవా
పెల్లున నిన్నింతలోఁ గోపించేదానవా
చెల్లుబడినీచనవు చెల్లించనిదానవా
చల్లఁగా మీవలపు రేఁచఁగలేనిదానవా ॥ ఏమి ॥

అంతలో నవ్వితే నర్తమడిగేటిదాననా
కాంతుఁడ నీయిచ్చ యెఱఁగనిదాననా
పంతమాడి నిన్నింతలో భ్రమయించేదాననా
మంతనాన నీమన్నన మఱచేటిదాననా ॥ ఏమి ॥

ప్రియము చెప్పఁగా నీతో బిగిసేటిదాననా
క్రియ యెఱఁగక కరఁగించేదాననా
రయమున శ్రీవేంకటరమణ నన్నుఁ గూడితివి
నయమిచ్చి నీకాఁగిట నాటుకోనిదాననా ॥ ఏమి ॥ 240

వరాళి

ఎట్టి మొగమాయకాఁడ వేమని చెప్పుదు విన్ను
తిట్టవచ్చినట్టియాపె దీవించె నిదివో ॥ పల్లవి ॥

జగడించేనంటా వచ్చి సకియ తప్పకచూచి
మొగమోటమున నీకు మొంచి లోనాయ
వొగరునీబాసలు వొప్పగించేనంటా వచ్చి
తగిలి నీమోవి తేనె తా నాసపడెను ॥ ఎట్టి ॥

వడి జంకించేనంటా వచ్చి నీమాఁటలు విని
నడుమంతరాలనే నవ్వె నిపుడు
కడఁగి చేయి చాఁచ వచ్చి గక్కన నీమన్ననకు
యెడమిచ్చి నీకుఁ జేయెత్తి మొక్కెను ॥ ఎట్టి ॥

కొంగువట్టేనంటా వచ్చి కూరిమి నీప్రియాలకు
కంగు మాని యంతలోనే కాఁగిలించెను
కుంగక శ్రీవేంకటేశ కూడి గోర మాఁదవచ్చి
యెంగిలిమోవిపైఁ గెంపులెల్లా నించుకొనెను ॥ ఎట్టి ॥ 241

రేకు 1142 రామక్రియ

ఏల సిగ్గువడేవు నే నెఱఁగితే నేమాయ
తాలిమితో నాలోనే దాఁచుకొనే నీకను ॥ పల్లవి ॥

పతులు మన్నించినవి పరకాంతలతోఁద
అతివలయినవారు ఆడుకొందురు
ఇతవుగాని వప్పుడు యేకతానఁ జేసినట్టి-
రతులరహస్యాలు రవ్వకెక్కె నిపుడు ॥ ఏల ॥

వొంటిఁ జేసినట్టితమవుపచారాలు చెలితో
నంటుననుఁ జెప్పి చెప్పి నవ్వుకొందురు
జంటల నప్పటివేళ చవులై నకతలెల్లా
పెంటలఇంతులనోళ్ల పిరివీకు లౌను ॥ ఏల ॥

వలచినవలపులు వడిఁ దమచుట్టాలతో
అలరుచు ముచ్చటగా ననుకొందురు
యెలమి శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
తలఁచి అందరికిని తారుకాణలాయను ॥ ఏల ॥ 242

కాంబోది

ఏల వేగిరపడేరు ఇంత చాలదా
వేలు చూపి మెచ్చినదే వేవేలు గాదా ॥ పల్లవి ॥

వనితలు పెక్కుగలవల్లభునితోడుతను
చనవుగలుగుపాటే చాలు నవ్వులు
మనసుగలయుదాఁకా మంతనమబ్బినదాఁకా
వినకలిమాఁటలే వేవేలు గాదా ॥ ఏల ॥

అన్నిటా నందరితోడా నలసినపతితోడ
చన్నులనొత్తినపాటే చాలు మేలము
విన్నపమందినదాఁకా విచ్చనవిడైనదాఁకా
వెన్నెలబాయిటికొల్పు వేవేలు గాదా ॥ ఏల ॥

సింగారాన నింటికివచ్చిన శ్రీవేంకటేశుతో
సంగడిఁ గూచున్నపాటే చాలుఁ బ్రియాలు
అంగవించి యిట్లా నన్నులమి కూడినదాఁకా
వెంగెములేనిపంతాలు వేవేలు గాదా ॥ ఏల ॥ 243

మాళవిగౌళ

ఆయలేరే యేద సుద్ది ఆతనికి నిది వన్నె
నేయుమన్నటెల్లా నేనే నేనేఁగాక ॥ పల్లవి ॥

అట్టె రమణునికి నంతబాఁతే మామీఁద
పట్టినవ్రతాన నేనే పైకొనేఁగాక
గుట్టు విడువఁ డాతఁడు కోరి మమ్ముఁ గైకొనీనా
వెట్టివలపులదాన వెస నేనే కాక ॥ ఆయ ॥

తావుల పెక్కేండ్లవిందు తలఁచీనా మమ్ము నేఁడు
కావలెననుచు నేనే కదినేఁగాక
దేవరవంటివాఁడు తెమలీనా తనుఁదానె
వావులు వెదకేదాన వడి నేనే కాక ॥ ఆయ ॥

అమ్మరో శ్రీవేంకటేశు కపురూపమా చెలులు
నెమ్మది మేనదాన నేనే కాక
వుమ్మడిఁ బంతమాడక వూరకుండీనా యీతఁడు
యెమ్మెల ఖిచ్చకురాల యేడా నేనే కాక ॥ ఆయ ॥ 244

రామక్రియ

ఆ[1] నేల పెట్టుమనేవు అంతలో నీపై
తానకమై నీ కాపెకుఁ దగునిపుడు ॥ పల్లవి ॥

మిగులాఁజక్కనిదై నమెలుఁత నొక్కతె నీకు
తగిలించే వచ్చేవా తరి నావెంట
మగువ నాదోమతెరమంచములో నున్నది
నగనేల అప్పుడుగా నన్ను మెచ్చేది ॥ ఆనే ॥

నీ కాపెకుఁ బొందునేసి విన్ను సంతోసించఁజేసే
వాకిచ్చి మాఁటాడదు వలెనా నీకు
దాకొనీ గుట్టుమానిసి తలుపు ముయ్యుము వేగ
పైకొని యేల కొంకేవు పండీ[2] నియ్యాన ॥ ఆనే ॥

నెలవై శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
యెలయించేనా నీకు నెవ్వరై రేమి
అలరి ఇదివో అంటే అట్టె కాఁగిలించితివి
కలసితి నేనే ఆపెఁగానా యీడను ॥ ఆనే ॥ 245

వరాళి

వేగిరించే విదియేమి వేవేలునతు లుండఁగ
నీగుణాలు మంచివౌత నేఁడే చూపవలెనా ॥ పల్లవి ॥

సిగ్గువడి వుండఁగానే చేయివట్టి తీసేవు
దగ్గరివచ్చినవేళ తడవరాదా
విగ్గుల విఁచుకవడి విలిచితేనే వలపు
వెగ్గళించి ఇంతలోనే వెల్లివిరిసీనా ॥ వేగి ॥

1. అవ+ఏల. 2. నీ+అవ. వింత్రికవంది

జలకేళి నేయఁగానే సారెఁ జేయిచాఁచేవు
పిలిచినప్పుడే వచ్చి పెనఁగరాదా
వెలయ వించుకవడి వేళగాచుకుండితేను
యెలమి జవ్వనమద మెదురుదొట్టీనా ॥ వేగి ॥

గుట్టుతోడ నుండఁగానే కూడితి శ్రీవేంకటేశ
పట్టితే నలమేల్మంగఁ బైకొనరాదా
యిట్టె యీపెయిచ్చలో నెనసితే నేమాయ
బెట్టుగా నీపెండ్లి వచ్చి పెళ్ల విడిఖున్నదా ॥ వేగి ॥ 246

## పాడి

చెప్పినట్టు నేసీఁగాని సిగ్గులువడితేఁ గాదు
పిప్పిగట్ట మోవియాని ప్రియమెల్లాఁ జెప్పుమా ॥ పల్లవి ॥

మంతనాన మండరాదా మాఁటలాడీ నాపె దానె
బంతి నిందరిలోనైతేఁ బలుక దాపె
చెంతఁ గొలువునెల్లా చేతుల వేఁడుకొనేది
పంతమిచ్చి వోవరిలో పాదాలు వేఁడుకొమ్మా ॥ చెప్పి ॥

మనసు నమ్మించరాదా మగువ నీకు లోనయ్యీ
తనువెంత విమిరినాఁ దరల దాపె
మునుప నీమోవియాకు ముదితకు నిచ్చేది
వెనక నాపెమో[1]వేకు వెన నందుకొమ్మా ॥ చెప్పి ॥

గుట్టుతో నుంతఁగరాదా కూడె నిన్నలమేల్మంగ
వొట్టిరట్టు పేయఁబోతే వోరువదాపె
దిట్ట శ్రీవేంకటేశ తెలిప తుంగరమిచ్చి
మట్టె నీవు తీసుకొని మచ్చికచేసుకొమ్మా ॥ చెప్పి ॥ 247

1. మోవి + ఆకు.

రేకు 1143 దేవగాంధారి

నేసినట్టి వాఁడె జేయనీరే
మాసటీనివంటిమంకువాఁడే ॥ పల్లవి ॥

పట్టఁగఁబట్టఁగఁ బాముతల దొక్కె-
యిట్టిపిన్నవాని నేమందమే
తిట్టఁగఁదిట్టఁగఁ దినె వెన్నలెల్ల
బట్టగుత్తుచలపాదివాఁడే ॥ నేసి ॥

కూయఁగఁగూయఁగఁ గోకలు దొంగిలె
వోయమ్మ వీఁడెంత వుద్దండీఁడే
తోయఁగఁదోయఁగ దుండగములు నేసె
చేయిమీఁదయినట్టిసేఁటవాఁడే ॥ నేసి ॥

చెప్పఁగఁజెప్పఁగఁ జేతఁ గొండ యెత్తె
అప్పుడే శ్రీవేంకటాద్రీశుఁడే
కప్పఁగఁగప్పఁగఁ గలసె వింతుల
అప్పఁ డలమేల్మంగాధిపుడే ॥ నేసి ॥ 248

నాదరామక్రియ

ఆతుర(మః)బందుగుఁడవు అన్నిటా నాకు
యీతల నున్నాఁడవుగా యెప్పుడైనాను ॥ పల్లవి ॥

తలఁగి నీరాక గోరి దప్పిఁ బొరలేటివేళఁ
గలవుగా యిప్పుడైనాఁ గప్పురమీయ్య
జలజలఁ జెమరించి సదమదమై యుండఁగా
వెలినుండి వచ్చితిగా విసరనైనా ॥ ఆతు ॥

చేరి నిన్నుఁ దలఁచుక చింతతోడ నుండఁగాను
　నీరూపు చూపితివిగా నేఁడైనాను
　ఆరీతి నిట్టూరుపుల నసురుసురై వుండఁగా
　గారవించి [1]స్వస్త పెట్టి కందువ నిల్తువుగా ॥ ఆతు ॥

నీకుఁగా నెదురుచూచి నివ్వెరగై వుండఁగాను
　కైకొని శ్రీవేంకటేశ కలసితివి
　యీకడ నలమేల్మంగ నిటు సేవసేయఁగా
　మేకొని యిప్పుడు నన్ను మెత్తువుగా నీవు ॥ ఆతు ॥ 249

శంకరాభరణం

పొంచి యిఁక నెటువలె పొందు సేసేవే
　దించరానిపొంతనాలు దేవరే కూర్చెనే ॥ పల్లవి ॥

సొలసి యాతనిదిక్కు చూడవదేమే
　వలువంక నాతనిమై నాఁటీనంటానే
　మలసి కొంతయినాను మాఁటలాడవే
　నిలిచి యేమనినాను నిందమోచునే ॥ పొంచి ॥

ముడువవే శిరసున ముడిపువ్వులూ
　కడలేని వవియెకా కంతునమ్ములూ
　అడరినదప్పిదేర నధర మీవే
　నడుమఁ బలుసోఁకులు నాఁటీనంటానే ॥ పొంచి ॥

శ్రీవేంకటేశ్వరునిఁ జెక్కునొక్కవే
　ఆవల నొత్తినేరేక లవి రాఁగినే
　కావిరి నలమేలుమంగవుగదవే
　కైవశమై కూడితి వెక్కసమయ్యాఁగదవే ॥ పొంచి ॥ 250

1. 'స్వస్త' స్వస్థశబ్దమునకు వ్యావహారికమా?

నట్టనారాయణి

అప్పుడు నమ్మేవు నీవు అన్నిఁ దారుకాణలైతే
ఇప్పుడు నీతో మాకునేఁటికి వాదించను ॥ పల్లవి ॥

నీమోవిపై నించె నాపె నెయ్యమెల్లాను
కామించి నీవేల యెఱఁగవోకాని
దోమటి మాకైతే నిది తోడ దిష్టము
ఆమాట నిజమూఁ గల్లా నాపెనే యడుగుమా ॥ అప్పు ॥

వువిదవలపులు నీవొళ్ల నించెను
అవల నీకేల తెలియదోకాని
వివరించి మాకుఁజూడ వెల్లావిరులు
తవిలి నీకిష్టమైనతరుణి నడుగుమా ॥ అప్పు ॥

మంచి నీమన్నన వురమున నించెను
అంచెల శ్రీవేంకటేశ అలమేల్మంగ
చంచలమీకూటములు సరివచ్చెను
యెంచఁగ మమ్మేలితిరి యింతినే యడుగుమా ॥ అప్పు ॥ 251

శ్రీరాగం

నే నెఱఁగనా యిది నీవు చెప్పవలెనా
తేనెలమాటలాడఁగ దేవరవు గావా ॥ పల్లవి ॥

యిద్దరము నొక్కచే నీ వేమనినా నేమాయె
చద్దివేఁడిరతులలో సరసాలింతే
అద్దుక యేల లోఁగేవు అనలేల పెట్టేవు
దిద్దుక మాఁటలాడఁగ దేవరవు గావా ॥ నేనె ॥

నీవు నేను భేదమా నేర మిందులోన నేది
భావపుమందె మేళాలపలుకు లింతే
సేవలెల్ల సేసేవు చెక్కు లేల నొక్కేవు
తీవరించి మాటలాడ దేవరవు గావా ॥ నేనె ॥

[1] మనకేలెగ్గల మేలుమంగను నన్నేలితివి
చనవులతిలెల్లా సలిగె లింతే
చెనకి యేల మొక్కేవు శ్రీవేంకటేశ్వర నీవు
దినము నీ మాటలాడ దేవరవు గావా ॥ నేనె ॥ 252

తెలుగుఁగాంబోది

ఇందాఁకా నెఱఁగనైతి నీకఁ గపటము లేదు
చెంది యిట్టె నాతోడఁ జెప్పవయ్య మాటలు ॥ పల్లవి ॥

మంతనానకు రాఁగాను మనసెల్లా నొక్కటాయ
పంతము నీ వియ్యఁగాను పాసెఁ గోపము
అంతరంగము చెప్పఁగా ననుమాన మిఁక నెంచ
రంతులు నేయక యిట్టె రావయ్య యింటికి ॥ ఇందాఁ ॥

సరసము నీ వాడఁగా చల్లనాయ నామేను
సరుసఁ గూచుండగాఁను సమ్మతించితి
యెరవులేక నవ్వఁగా నిరవాయఁ గూరిములు
బిరుదులెల్లాఁ గంటిఁ బెట్టవయ్య విడెము ॥ ఇందాఁ ॥

గక్కన నీవు గూడఁగా కాఁతాళము లణఁగె
మిక్కిలి మన్నించఁగాను మెచ్చితి నేను
అక్కున శ్రీవేంకటేశ అలమేలుమంగను నేను
వొక్కటై కూడితి విట్టె వుండవయ్య వొద్దను ॥ ఇందాఁ ॥ 253

1. మనకు+ఏల+ఎగ్గు+అలమేలుమంగను.

రేకు 1144 ముఖారి

చేరి చనవులే నీవు చెల్లించవయ్యా
వలవనివాసు లింక వద్దు నీకు నయ్యా ॥ పల్లవి ॥

కాంతలకుఁ బతులతో గర్వితనమే వన్నె
కొంతపుఁజూపుతోడికోపమే వన్నె
మంతుకెక్కేగుట్టుతోడిమంకుఁదనమే వన్నె
ఇంతలో మీకు నెగ్గు లెంచనేఁటికయ్యా ॥ చేరి ॥

వెలలేనికొసరులవెంగెపుమాటలే వన్నె
చలివాసినట్టిరాజసములే వన్నె
అలమిపట్టినవేళ నానలుపెట్టుటే వన్నె
యెలమి నాపెకు నీకు నేఁటిచలమయ్యా ॥ చేరి ॥

వానగూడివున్నవేళ వుద్దండములే వన్నె
చనవులసరసపుజంకెనే వన్నె
యెనసి శ్రీవేంకటేశ యీపె నీకిదే వన్నె
యెనలేవితరితీపు లేఁటి కింకా నయ్యా ॥ చేరి ॥ 254

నాదరామక్రియ

ఎఱఁగవివానివలె యేలడిగే విటు వన్ను-
నెఱవుగా నింతసేసి నీవే యెఱఁగవా ॥ పల్లవి ॥

చెంగట నీవు నాకుఁ జేయిసన్న సేయఁగాను
పొంగి చెమరించితి నప్పుడుగాదా
ముంగిటనీచూపు నాపై ముంచి ముంచి చల్లఁగాను
అంగపుసొమ్ములు బిగువైనది యెఱఁగవా ॥ ఎఱఁ ॥

మలసి నీవు నాతో మాఁటలు గదునాడఁగా
మొలు(లః)నూలు జారెను నీముందరఁగాదా
వలపులు చల్లి నీవు వాడికెనవ్వు నవ్వఁగా
పులకలు జాజుకొని పొదలె నెఱఁగవా ॥ ఎఱఁ ॥

గక్కన నీవు నన్నుఁ గాఁగిలించి కూడఁగాను
నెక్కొనెఁ గెంపులు మోవి నీవల్లఁగాదా
అక్కజపుశ్రీవేంకటాద్రిగోవిందరాఁవు
మిక్కిలిరతులలో నీమేలు నీ వెఱఁగవా ॥ ఎఱఁ ॥ 255

సామంతం

ఎటువంటితగవరి వేమోయి నీవు
ఇటువంటివాఁడవా యేమోయి నీవు ॥ పల్లవి ॥

మారుకొవి యాపె సారె మాటలెల్ల నాడఁగాను
వూరకుండుమనేవు యేమోయి నన్ను
చేరి యాపె కమ్మటిని చేతులు చాఁచఁగాను
యారీతి నన్నే పట్టేవు ఇదేమోయి నీవు ॥ ఎటు ॥

వుదుటున రేఁగి యాపె వొట్టులెల్లాఁ బెట్టఁగాను
ఇదె నా కడ్డాలువచ్చే వేమోయి నీవు
పదరి యాపె పూవుబంతిఁ గొనివేయఁగాను
యెదిగి నీమేనొడ్డే వేమోయి నీవు ॥ ఎటు ॥

పన్ని యాపె నా మీఁద పంతమెల్లాఁ జూపఁగాను
ఇన్ని నీపైఁ దీసుకొనే వేమోయి నీవు
వన్నెలశ్రీవేంకటేశ వాకిట నాపె వుండఁగా
యెన్న నన్నే లోనఁ గూడే వేమోయి నీవు ॥ ఎటు ॥ 256

వరాళి

నీ వెఱుఁగవా ఇది నెరజాణవు
యీపల మాతో నీవే యెందాఁకాఁ జెప్పేవు ॥ పల్లవి ॥

పువ్వులఁ గొని వేసేది పుప్పొడి పైఁ జల్లేది
జవ్వనపుసతులకు సాజమే యది
నవ్వు నేసుకొంటేనే నానును వలపులెల్ల
చివ్వనఁ గోపించుకొంటే చేరుఁ గూళతనము ॥ నీవె ॥

మక్కువలు చూపేది మనసు సోదించేది
చక్కనికాంతలకును సాజమే యది
దక్కి లోనై వుండితేనే తతిగొనుఁ గూటములు
మిక్కిలి పెనఁగఁబోతే మించు నెడ్డతనము ॥ నీవె ॥

కరుణించి చూచేది కాఁగిలించి కూడేది
సరసపుటింతులకు సాజమే యది
నిరతి శ్రీవేంకటేశ నీకు నివే యింపులాను
వరుస నిటు గాకుంటే వచ్చు మంకుఁదనము ॥ నీవె ॥ 357

బౌళి

అన్నియుఁ జూతువుగాని యట్టె వుండవే
సన్న లాతఁ డెఱుఁగు వేసారకువే ॥ పల్లవి ॥

నీతులుగాఁ బోహణించి నే విన్నవించేది
ఆతఁడే యెఱుఁగునే అంగనలాల
రాతిరిఁబగలు నాడ రచ్చ లెంత సేసినాను
ఆతుమ యిక్కడ నుండు నాతనికిని ॥ అన్ని ॥

యీఢ్నేఁ గానుక మీచే నిచ్చి పంపేదెల్లాను
అడ నాతనిచే నున్న దతివలాల
చేదెలు పదివేగుదు సేవలు సేసినాను
వేడుకెల్లా నామీఁదిదే విభునికివి ॥ అన్ని ॥

కదిసి శ్రీవేంకటేశుకడకుఁ బోయేమనఁగ
అదె యీతఁడే వచ్చెనే అక్కలాల
[1]అద(దః) నెఱిఁగి కలసె నందరికంటె నాపై-
నెదుగా వలపుగద్దే యీతనికిని ॥ అన్ని ॥ 258

## కన్నడగౌళ

ఇంతి యదె నీ విదె యేమనేము నేమెల్లా
చింతలెల్లాఁ బాపెను నీచిత్త మింతే యిఁకను ॥ పల్లవి ॥

తలఁపెల్లాఁ దమకమే తనువెల్లాఁ జెమటలే
నెలఁత కెంతమోహమో నీమీఁదను
పిలిచినప్పుడు రాక బిగిసి యిప్పుడు వచ్చి
చెలరేఁగి నవ్వేవు నీచిత్తమింతే యిఁకను ॥ ఇంతి ॥

చూపులెల్లా నివ్వెరగే సుద్దులెల్లా నీకతలే
యీపడఁతి కెంతాసో యిటు నీమీఁద
రేపకాడ రచ్చవేసి రేతిరి యీపె దగ్గరి
చేపట్టితి వింతలో నీచిత్తమింతే యిఁకను ॥ ఇంతి ॥

చెక్కులెల్లాఁ బులకలే నెలవులెల్లా సిగ్గులే
అక్కరెంతో కాఁగిటిలో నాపె నీమీఁద
గక్కన శ్రీవేంకటేశ కలసితివి కాంతను
చిక్కనాయ వసుపు నీచిత్త మింతే యిఁకను ॥ ఇంతి ॥ 259

1. ప్రాసభంగము.

రేకు 1145 సాళంగనాట

మీఱితివిగదవమ్మ మెచ్చితిమి నీసుద్దులు
ఆఱడిఁబెట్టకువమ్మ అలమేలుమంగా ॥ పల్లవి ॥

పాయపువిభుఁడు తన్నుఁ బట్టి పెనఁగఁజూచితే
చాయకు వచ్చినదే సరసాలు
చేయిచాఁచి మీఁదమీఁద చెక్కునొక్క వేఁడుకొంటే
రాయడి కోర్చినదే రసికురాలు ॥ మీఱి ॥

సంగతిగా మాటలాడి సన్నలుసేసితేను
అంగము లంటినదే అధికురాలు
చెంగటఁ గన్నులెదుటఁ జేసినచేఁతలకెల్లా
కంగువెట్టుకోనిదే ఘనురాలు ॥ మీఱి ॥

యిత్తలఁ జేతికిలోనై యెంతచన విచ్చినాను
తత్తరించకుండినదే [1] దారకురాలు
బత్తితో శ్రీవేంకటాద్రిపతి నిన్ను నిదె కూడె
కొత్తగా నీవంటిదే కోవిదురాలు ॥ మీఱి ॥ 260

హిజ్జిజి

చెంగలించె నీమొగము జిగి నాపె దగ్గరితే
వంగడి నీ కపుడెంత సంతోసమో ॥ పల్లవి ॥

సోగచూపులమఁ జూచి సద్దులాపెడుగఁగాను
ఆగతి నీ కపుడెంత ఆనందమో
వేఁగదేర మాఁటలాడి చెక్కులొత్తి నొక్కఁగాను
బాగుగ నీ కపుడెంత పరిణామమాయనో ॥ చెంగ ॥

1. 'దారకురాలు' దారకురాలు=శాంతి గలది కావచ్చు.

కొనగోరు సోఁకఁగ నీకొప్పు అపె దువ్వఁగాను
[1]ఘనమైననీ కపుడెంత కళరేఁగెనో
తవియ నీతొడమీఁద తాఁ దొడవేయఁగాను
మనసు నీ కపుడెంత మర్మము దాఁకెనో ॥చెంగ॥

గక్కన నలమేల్మంగ కాఁగిలించుకొనఁగాను
తక్కక నీ కపుడెంత తమ్మివుట్టెనో
అక్కన శ్రీవేంకటేశ ఆపె విన్నపె కూడఁగా
పక్కన నీ కపుడెంత పరవశమందెనో ॥చెంగ॥ 261

శుద్ధవసంతం

దొరవై ననీతోడిపొందులు యెట్టయినా వచ్చు
మరకుండఁగరాదు మరగారాదు ॥పల్లవి॥

యెంగిలినోర మాట యెటువలె నాడేను
సంగడిఁ బలుకనంటా సారె దూరేవు
రంగగువాఁడిచూపు లూరక ని న్నెట్టు నాఁటింతు
అంగవించి శిరసెత్తనని కొసరేవు ॥దొర॥

చెమటచేతులను నీసేవ లెట్టు సేసేను
తమి విడెమియ్యనంటాఁ దత్తరించేవు
జమళిపాదాలు దాఁక సరినెట్టు గూచుండేను
అమర నీవద్దికి రానని సొలసేవు ॥దొర॥

కుప్పెలవంటిచన్నులఁ గుచ్చి ని న్నెట్టెత్తేను
అప్పుడే కాఁగిలించనైతి ననేవు
అప్పఁడ శ్రీవేంకటేశ అలమేలుమంగను నేను
యిప్పుడే కూడితి వింకా నేమని కోరేవు ॥దొర॥ 262

1. 'ఘనమైననీకు' అని అమహద్వాచకవిశేషణముతో మహద్వాచకవిశేష్యానికి సమానమా? లేక, ఘనమైనవాఁడవు నలెనా?

శంకరాభరణం

ఇంగిత మెఱఁగలేవా యింతజాణవు
వుంగిటిగా నాపెనేల వొరసేవు నీవు ॥ పల్లవి ॥

నగవె ననుపు నయమె ప్రియము
తెగువే తెలివి దినదినమూ
మగువనుఁ జూడరాదా మాటాడ సిగ్గువడీని
అగడువేసి యేల అడిగేవు నీవు ॥ ఇంగి ॥

పిలుపే విలుపు పెనఁగుటే తగులు
చలిమే బలిమి సారెసారెకూ
కలదు యీచెలియందే; గక్కన గుట్టుతోనుంటే
సొలసి యాపెతోనేల సోదించేవు నీవు ॥ ఇంగి ॥

మరులే మచ్చికలూ మానమే మోనము
కరఁగులే యితవులు కలకాలమూ
మరలి వివ్వలమేల్మంగ శ్రీవేంకటేశుఁడ
యిరవై పొలసె నీ వింకానేల పొలసేవు ॥ ఇంగి ॥ 263

ఛాయానాట

ఇంతవాఁడవు గాకుంటే యెవతురా గోపికలు
చెంతకురాకతొలుతే చెలఁగె నామొకము ॥ పల్లవి ॥

పిలువకతొలుతే ప్రియముతో వచ్చితివి
తలఁచుకొంటివా నీతప్పువినావ
విలిచినంతటిలోనె విందాఁ తెమరించితివి
తలయకతొలుతనె కరఁగె నామనసు ॥ ఇం:త ॥

అడుగకతొలుతే ఆనతిచ్చితి పీపవి
పెదరేఁచె నావలపు బెట్టుగా నీకు
తడయకతొలుతే దక్కితివి నీవు నాకు
బడిబడి నీకృప ఫలమందెనా ॥ ఇంత ॥

కానికయీకతొలుతే కాఁగిటఁ గూదితి నన్ను
తానకపునీయాస దైలువారెనా
ఆనుక శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
నానారతులు తొల్లె నాటివుందెనా ॥ ఇంత ॥ 264

నాగవరాళి

ఏమి నేసునో విన్ను యింకా నాపె
ప్రేమ నాపెఁ జేసేవంటాఁ బెనఁగీనాపె ॥ పల్లవి ॥

మలసి నీతో నేను మాఁటలాడితినంటా
చలము సాదించి నిన్ను జంకించీ నాపె
నలిరేఁగి నీవప్పటి నవ్వులు నవ్వితివంటా
వెలుచుఁబంతములెల్లాఁ బెంచీ నాపె ॥ ఏమి ॥

చేతులెత్తి నే నీకు పిగ్గన మొక్కితివంటా
కాతరించి సారె విన్నుఁ గసరీ నాపె
ఆతుమెల్లా నీవు నాతో నట్టె చెప్పితివంటా
యేతువలెత్తి నీమీఁద యెమ్మెచూపీ నాపె ॥ ఏమి ॥

యేకతాన నీతో నే నెనసివుందానవంటా
యీకడ నీవురమెక్కె నింతలో నాపె
చేకొని కూడితి విట్టె శ్రీవేంకటేశ్వర నీవు
దాకొనె నలమేల్మంగ తానే యాపె ॥ ఏమి ॥ 265

రేకు 1146 గుండక్రియ

ఇంకనేల తమకించే విందుకు నేను
నంకెలెల్లాఁ దీరెఁ జనవరి నేను ॥పల్లవి॥

వాములుగా వలపులు వలసినవారి కిచ్చి
నా మొగము చూడఁగానే నవ్వితి నేను
చేమంచె నీచేఁతలు చేరె నీవుద్దండములు
యేమని వుత్తరమిచ్చే వియ్యకొంటి నేను ॥ఇంక॥

వుమ్మడి నీ వొక్కఁడవే వూరెల్లాఁ దిరిగివచ్చి
నమ్మికె నీ వియ్యఁగానే నవ్వితి నేను
కమ్మకొనెఁ జెమటలు కానవచ్చె గుఱుతులు
కమ్మటి విన్ననలేక కానిమ్మంటి నేను ॥ఇంక॥

అన్నిటా జాణతనాల నాయములెల్లాఁ గరఁగి
నన్ను నిట్టె కూడఁగాను నవ్వితి నేను
విన్ను శ్రీవేంకటేశుఁడ నే నలమేలుమంగను
నన్నలఁ గలసి మోవి చవిగొంటి నేను ॥ఇంక॥ 266

మాళవి

ఏమి తగవులు చెప్పే మింకా మీకు
ఆముకొన్నవలపుల కవియెల్లా దొడ్డా ॥పల్లవి॥

తలఁపువిలువలేవితమకముగలయట్టి-
చెలి నిన్నెంతవేసినాఁ జెల్లునయ్యా
బలిమిఁ బట్టుక విన్ను పడఁతుఁఱు చూడఁగానే
అలమో వెంగిలిసేసే వదియేమి దొడ్డా ॥ఏమి॥

ఆయములు గరఁగి కాయము మదించినసతి
చేయిమీఁదై చెనకఁగఁ జెల్లునయ్యా
దాయమువచ్చినవేళ దాఁచరానిచోట్ల
యీయెడ గుఱుతు నేసు టదియేమి దొడ్డా ॥ ఏమి ॥

అందుక నీపురమెక్కినట్టియలమేలుమంగ
చెంది వి న్నెంత గూడినాఁ జెల్లునయ్యా
అందపుశ్రీవేంకటేశ అట్టె పాదాలు దాఁచుక
యెందుకునైనా నవ్వే దిదియేమి దొడ్డా ॥ ఏమి ॥ 267

దేసాళం

తిట్టినా వెఱవ వెంతదిట్టతనమే
గుట్టు విడిచితి వెంతగొంట వైతివే ॥ పల్లవి ॥

నావద్దనున్నపతితో నవ్వులు నవ్వేవు నీవు
చేవదేర నీకెంత చెల్లుబడే
కావికన్నులఁ నాతని గమ్మటి నాఁటఁ జూచేవు
తావికావి యెంతగబ్బితవమే నీది ॥ తిట్టి ॥

పొత్తుల మాయిద్దరికి పోరచి వెట్ట వచ్చేవు
యిత్తల నీపెద్దరిక మెంతగలదే
నత్తుగాఁ బైకొసరులు జాణతనాలూ నాడేవు
కొత్తగాఁ బోతర మింత కూడఁబెట్టుకొంటివా ॥ తిట్టి ॥

నన్నిట్టె కూడినవాని నయగారాలఁ బెట్టేవు
కన్నె వోయమ్మ యెంతగామిడివే
ఇన్నిటా శ్రీవేంకటేశు నెలయించి చెనకేవు
సన్నల చాయలనే సవతివై తివా ॥ తిట్టి ॥ 268

## సామవరాళి

వింటిమి కంటిమి నాఁడే వీనులఁ గన్నులను
సొంటులు సోదించవద్దు జొల్పిలిఁ జెమటలు ॥ పల్లవి ॥

చొప్పులెత్తి పలుమారుఁ జూచితి నన్నియు నిట్టె
కప్పవద్దు నీచేఁతలు కల్లలు గావు
[1]వుప్పటించెననేవు నిన్నూరక నే నేమనినా
చెప్పవద్దు నీసుద్దులు చెల్లుబడులాయను ॥ వింటి ॥

బట్టబయటఁ బడెను పట్టితి మి మ్మిద్దరిని
గుట్టునేయ నిఁక వద్దు గురుతు లివే
బెట్టుగా మోవికెంపులు బేల్లెత్తి నేఁ జూపితి
ముట్టవద్దు నన్ను నీవు మునివేళ్ల చాఁచి ॥ వింటి ॥

దివ్వెవెలుఁగుననే తేటపడె నీకూటమి
నవ్వవద్దు నీ వంతేసి వయగారాల
రవ్వగా శ్రీవేంకటేశ రతి విన్నుఁ జేసితివి
దువ్వవద్దు నాకొప్పు దొరకె వేడుకలు ॥ వింటి ॥ 269

## సౌరాష్ట్రం

సతులఁగబ్బితనాలే చవులు గావా
ఇతవులే సుమ్మీ నీకు నెరవులు గావు ॥ పల్లవి ॥

మనసు నీపైఁ బెట్టి మాటల నెంతదూరినా
చనవుగాఁ జేకొనుమీ చలము గాదు
పెనఁగ నా పెచను మొనలు విన్నా నాటితే
కినియకుమీ నీపై కేరడము గాదు ॥ సతు ॥

1. ఉప్పటించెను+అవి+అనేవు.

యెదుటనే నిలుచుండి యెంత నిన్నుఁ గొసరినా
అది నీపై మేలు సుమ్మీ అలుక గాదు
పెదవుల మాటాడఁగా పెనుఁదిట్లు వెళ్లితే
పదరకుమీ నీతో పంత మిది గాదు ॥ సతు ॥

కడుసరసమాడుతాఁ గరము పీపైఁ జాఁచితే
విడువవిపొందుసుమ్మీ వెగటు గాదు
అదరి శ్రీవేంకటేశ అతివఁ గూడి నవ్వితే
వెడమాట లాడకుమీ వెంగె మిదిగాదు ॥ సతు ॥ 270

## శుద్ధవసంతం

ఇటువంటికొత్తలు నే మెఱఁగమమ్మ
చిటుకుమవినంతనే చిమ్మిరేఁగేవు ॥ పల్లవి ॥

మంచిమాఁటాదేపతిని మలసి తిట్టె ననేవు
యెంచరానిరాఁగతన మేల నేసేవే
పొంచి పువ్వుల వేసితే బొప్పిగట్టె మేననేవు
నించి యాతఁ డందుకేపో నివ్వెరగు నందెను ॥ ఇటు ॥

పచ్చడము గప్పితేనే బలిమినేసె ననేవు
అచ్చలాన నీ వెంతగయ్యాళివే నేఁడు
పచ్చిమోవి యానఁగాను పగసాదించీ ననేవు
కచ్చుపెట్టి యివియెల్ల గామిడితనములా ॥ ఇటు ॥

యేకతానకుఁ దీసితే యాడిచెను విన్ననేవు
పైకొని యెంతటినేరుపరివే నీవు
యీకడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
మేకొని యిందుకే నేము మెచ్చితిమే నిన్నును ॥ ఇటు ॥ 271

రేకు 1147. కేదారగౌళ

అదియు నీభాగ్యము అవధరింతువుగాక
వెదకివచ్చేటివారే వేగినంతాను ॥ పల్లవి ॥

కాతరించి నీమోము గంటేఁజాలుఁగాని
చేతులు చాఁచేవారే చెలులెల్లాను
ఆతలనీతల నీవు అందకు వచ్చితేఁజాలు
యేతుల నవ్వేవారే యేడనైనాను ॥ అది ॥

మక్కువ నోరుదెరచి మాట నీ వాడితేఁజాలు
గక్కనఁ దిట్టేవారే కాంతలెల్లాను
చక్కనినీ వేపాటి సమ్మతించినాఁజాలు
యిక్కువ లంటేవారే యెవ్వరైనాను ॥ అది ॥

వలపులు చల్లుచు నీవు వావులు చెప్పితేఁజాలు
అలరి పెండ్లాడేవారే అంగనలెల్లా
యెలమి శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
కలసేమనేవారే యేకాలమైనాను ॥ అది ॥ 272

మధ్యమావతి

ఏఁటికిఁ దమకించే వేల పెట్టే వానలెల్లా
నీటుతోనే వుండరాదా నిజమయ్యీఁగాని ॥ పల్లవి ॥

యిందరిలో రంతులేల యింటికి విచ్చేయరాదా
చెంది నీతో నొకమాట చెప్పేఁగాని
విందువలె నాచేతివిడె మందుకోరాదా
కందువ మీఁదటిసుద్ది గనేవుగాని ॥ ఏఁటి ॥

పాసివుండక పానుపుపైఁ బవళించరాదా
రాసికెక్కఁ నీచిత్తము రప్పించేఁగాని
ఫోనరించి నామోవిపొత్తు గలయఁగరాదా
ఆనల నీపనికి సహాయమయ్యేఁగాని ॥ఏఁటి॥

పక్కన నిట్టె నీపచ్చడము గప్పరాదా
నిక్కము నానేరుపులు నెరపేఁగాని
—— శ్రీవేంకటేశ యెనసితి మిద్దరము
చెక్కునొక్కనియ్యరాదా నేసవెట్టేఁగాని ॥ఏఁటి॥ 273

## హిందోళవసంతం

మాతోడిగొడవేల మాపుదాఁకాను
యేతులకు వెంటవచ్చే విది యేమోకాక ॥పల్లవి॥

సింగారించఁగానే ఆపెచేతికి లోనైతివి
వుంగరపువేలిగోరి కొరవైతివి
కంగినతిట్లకెల్ల కణఁజమైతివి
పంగెనమానిసి వింక పనికివచ్చేవా ॥మాతో॥

కమ్మటి నాపెమోవికిఁ గంచమవైతివి
దొమ్మిచూపులబందెకు దొడ్డివైతివి
పమ్మినవవ్వులకెల్లా పడిగమవైతివి
వుమ్మడివాఁడవు నీకు మన్నదా స్వతంత్రము ॥మాతో॥

కలికిరతులకెల్లా గద్దెవు నీవైతివి
వలపులపంటకెల్ల వామివైతివి
బలిమి శ్రీవేంకటేశ పైకొని నన్నేలితివి
వలరాచకయ్యాన నీవంక వేసటున్నదా ॥మాతో॥ 274

### ఛాయానాట

ఇదివో నీపెద్దరిక మెంతని విన్నవించేము
కదిసి కదిసి ఱాతిగవి వైతివి ॥ పల్లవి ॥

ఆపెకును నీకెకును ఆసలు నీ విచ్చియిచ్చి
చేపట్టి చేరవచ్చితే సిగ్గువదేవు
కోపుల నిరువంకలా కొనగోళ్లు మేననంటి
యేపున నడిగితేను యెమ్మె చెప్పేవు ॥ ఇది ॥

యిద్దరినడుమ నీవు యేకతానఁ బవ్వళించి
వుద్దండాలు సేసితేను వొద్దుకానేవు
చద్దికి వేఁడికి వారు చన్నుల నిన్నొత్తితేను
వొద్దిచెలులసాకిరు లూరకె పెట్టేవు ॥ ఇది ॥

శ్రీసతి[1] భూసతిని చేసూటిఁ గూడికూడి
నేసలు నీపైఁ బెట్టితే చెలరేఁగేవు
ఆసల శ్రీవేంకటేశ అందరుదేవుళ్లతోడ
తానువలెఁ దులఁదూఁగి దయిలువారేవు ॥ ఇది ॥ 276

### ఆహిరినాట

ఏఁటిదో నీమతకము యెఱఁగ నేము
నోటినీయానలకు వీనులు మూసీఁ దాను ॥ పల్లవి ॥

యేతలఁపు దెలిపెనో యెచ్చుకుందు గలిగెనో
నాతో నీవు మాఁటాడఁగ నవ్వీ నాపె
కాతరాన నీవు నాకు కదు(దుఁగ)గిందుపడి యిట్టె
చేతులు చాఁచఁగాను సిగ్గువడీఁ దాను ॥ ఏఁటి ॥

---

1. 'భూసతియు' అని అర్థము కావచ్చు.

యేకడ దెచ్చితివో యెందరి భ్రమయింతువో
నాకు విదెమియ్యఁగాను నవ్వీ నాపె
జోకకు నాసింగారాలు చూచి చూచి సారెకు
దాకొని నీవు మెచ్చఁగ తలవూఁచీఁ దాను ॥ఏఁటి॥

యేపున నింతకుముందే యెవ్వతెఁ బెండ్లాడితివో
నాపై నేసవెట్టఁగ నవ్వీ నాపె
రాపుగ శ్రీవేంకటేశ రతి నన్నుఁ గూడితివి
చాపలాన నింతలోనే సంతసించీఁ దాను ॥ఏఁటి॥ 276

రేకు 1148 సామవరాళి

అఁటది గూళమైతే నందేమి చెప్పేము నేము
వాటముగ నీపైన వద్దనవద్దా ॥పల్లవి॥

వూని యేకతాన నీవొద్ద నేఁ గాచుకుండఁగా
కానుకె(క?)లిచ్చి తగిలీఁ గదిసి తాను
మానక నీతో నేను మంతనములాడఁగాను
ఆనుక యెంగిలిమాట లాడనేల తాను ॥అఁట॥

పడఁతినై నే నీకు బాగాలందియ్యఁగాను
యెడ నాకుమడిచిచ్చీ యేఁటికిఁ దాను
జడిగొని నీతో నేను సరసములాడఁగాను
కడఁగి పయ్యదకొంగు కప్పనేల తాను ॥అఁట॥

గద్దించి ఇంతలో నేను కాఁగిలించుకుండఁగాను
చద్దివేఁడివలపేల చల్లీఁ దాను
ఇద్దరము శ్రీవేంకటేశ పోఁదై(పొందై?) కూడఁగాను
బద్దులకునేల వాదఁబరచీఁ దాను ॥అఁట॥ 277

పాడి

ఒద్దు వొద్దు చాలుఁ జాలు నోపదయ్యా
ఇద్దరి తమకముల నిఁక యెంతయౌనో ॥ పల్లవి ॥

కొమ్మ నీతో నవ్వఁగాను కొప్పున విరులు రాలె
చిమ్మఁజూపులు చూడఁగఁ జెమరించెను
నెమ్మి సాగిలిమొక్కఁగా నిట్టూరుపులు రేఁగె
యెమ్మెల పొందు నేసితే నిఁక నెంతయౌనో ॥ఒద్దు॥

సంగడిఁ గూచుండఁగాను జాజుకొనఁ బులకించె
అంగవించి మాటాడఁగా నాయము లంటె
ముంగిటఁ జెనకఁగాను మోపులాయ వలపులు
యెంగిలిమోవిపొత్తుల నిఁక నెంతయౌనో ॥ఒద్దు॥

గక్కనఁ గాఁగిలించఁగా కడుఁ గరఁగె మనసు
చెక్కునొక్కఁగా సిగ్గులు చిమ్మిరేఁగెను
మక్కువ శ్రీవేంకటేశ మానినిఁ గూఁడితి విట్టె
ఇక్కువలెల్ల నంటఁగా నిఁక నెంతయౌనో ॥ఒద్దు॥ 278

బౌళి

ఎవ్వరు విన్నాఁడుకొనే రేది వెంగె మిందులోన
రవ్వగా మొక్కఁగరాదా రచ్చలోన నీకును ॥ పల్లవి ॥

తగవరివౌదువు తప్పు నీయందేమిలేదు
నగరాదా పూరకె నాలోనను
వెగటు నీ కెక్కుడిది వెరపు నీ కిఁకనేల
మొగము చూడరాదా మంచి నాకు నేఁడు ॥ ఎవ్వ ॥

పంతగాఁడ వౌదువు బాసనేసితే మీరవు
సంతోసించఁగరాదా సారెసారెకు
వింతవా రిందులో వేరీ; వేడుకచుట్టాలే నీకు
మంతనమాడుకోరాదా మాలో మేము ॥ ఎవ్వ ॥

దయగలవాఁడవు తగ్గుముగ్గు లెరఁగవు
ప్రియము చెప్పఁగరాదా పెనఁగి నీకు
నియతి శ్రీవేంకటేశ నీవు నన్ను నేలితివి
నయము చూపఁగరాదా నంటునేసి నీకు ॥ ఎవ్వ ॥ 279

దేసాళం

ఏఁటికిఁ జేసేవు నాతో నింకా గుట్టు
యీటువెట్టి సతులకు నిదె చాలొఁజుమ్మీ ॥ పల్లవి ॥

అన్నువచెమటలతో నలసి నీవు రాఁగాను
నిన్నుఁ జూచి నామనసు నీరాయను
యిన్నిటా నానతీవయ్య యెవ్వతె నీ కింత సేసె
పన్ని వాదువెట్టుకొని పచరించే నాపెను ॥ ఏఁటి ॥

వింతవింతనీమేనివెడవెడగురుతులు
కొంతగొంత వొడగని కోపమాయను
పంతగత్తె యెవ్వతె యీపాట్లఁబెట్టెను నిన్ను
రంతుల నందరిలోన రచ్చవేసేను ॥ ఏఁటి ॥

కందువకు వచ్చి నన్ను గాఁగిలించి కూడఁగాను
విందులపినేర్పులకు వెరగాయను
అందపుశ్రీవేంకటేశ అవ్వల నెవ్వతె నేర్పె
చందమునేసుక నేను సారె మెచ్చే నాపెను ॥ ఏఁటి ॥ 280

బౌళి

అందుకేమి దోసమా అటువంటివాఁడవా
నిందలేనినీమీఁద వించవద్దా మోహాము ॥పల్లవి॥

తగవు నీవు చెప్పఁగా తప్పు లందు లేకుండఁగా
నగరాదా నీతోను నయముగాను
మొగము నీవు చూడఁగ మొక్కులు చేత మండఁగ
చిగురుఁబెదవులెత్తి చెప్పరాదా ప్రియము ॥అందు॥

కప్పురము నీ వియ్యఁగా కాయమెల్లఁ జల్లఁగాఁగా
మప్పిరి మెచ్చఁగవద్దా ముందు ముందే
కొప్పు నీవు దువ్వఁగాను కొంగు చేతఁ బట్టఁగాను
నెప్పున సిగ్గులు నీపై వించరాదా నాకును ॥అందు॥

విడెము చేతికియ్యఁగా వేడుకఁ గాఁగిలించఁగా
కూడవద్దా నిన్ను నేను కోరికదీర
జోడై నీ వుండఁగాను చొక్కఁగా శ్రీవేంకటేశ
వూడిగాలు నేసి వొద్దనుండరాదా ఇఁకను ॥అందు॥ 281

లలిత

నీ వేమి సేతువు నీవాళ్లి కల్లగాదు
వావులు మోవికే నెనవ్వఁగఁ జూతురు ॥పల్లవి॥

నేసవెట్టి లచ్చిమమ్మ చెంగటనే వుండఁగాను
ఆసపడే వెవ్వరికో అప్పటి నీవు
యీటులేవినిరులెల్లా వింటిలోనే వుండఁగాను
కాము నీదిఁ బడియుంటే కొవి యెత్తుదురు ॥నీవే॥

వింతగా భూసతి నీవీఁపుననే వుండఁగాను
చింతించే వెవ్వరినోయి సిగ్గువడక
దొంతిఁబెట్టి రుచులెల్లా దొరకి తమకుండినా
చింతకాయ గనుఁగొంటే చేరి నోరూరుదురు ॥నీవే॥

సింగారపుఁదొళకమ్మ శిరసుపై నుండఁగాను
ముంగిట నెవ్వరికోయి మోహించేవు
ఇంగితాన శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
అంగడిబేరాల కొసరకుగక మానరు ॥నీవే॥ 282

రేకు 1149 భైరవి

ఇంత చాలదా నాకు యేమిసేసేఁ జలములు
వింతగాఁ దా నిట్లా వలచితేఁ జాలును ॥పల్లవి॥

పిలువఁగనేల తన్ను బిగిసితేఁ దిట్టనేల
కలఁడుగా మాకుఁ దానే కలకాలము
చలివాసి వేఁటిపై నవ్వాదికొమ్మువలె
తొలుతటిచెలములో తొరలివుండానను ॥ఇంత॥

ఘనతోడిమాటలేల చెప్పితేఁ గోపించనేల
మునుమున సున్నదిగా మామీఁదిమేలు
మునుకొని తినకుండే ముద్రలోనిసొమ్మువలె
ఘనపనితలలోన తగిలివుండానను ॥ఇంత॥

మొగము చూడనేల తా మొక్కితే దీవించనేల
అగపడి కూడెఁగా తా నప్పుడే నన్ను
జిగి శ్రీవేంకటేశుఁ(డుఁ)జేతికంకణమువలె
తగుఁబట్టపుదేవులపొందనే వుండానను ॥ఇంత॥ 283

పరాఁ

నీకే తెలుసు నిది నేమేమి విన్నవించేము
చేకొన్నరమణిమతి చిక్కుదీర్చవయ్యా ॥ పల్లవి ॥

మచ్చరములేఁసతి మాటలెన్ని యాడినాను
విచ్చనవిడిరతికి వెంగెము గాదు
అచ్చపుమోహాన నింతి ఆయమెంత తాఁకించినా
మచ్చికె పెరుగుఁగాని మఱి నొప్పిలేదు ॥ నీకే ॥

కైవశమయ్యినకాంత కాఁకలెన్ని చల్లినాను
వేవేలై మతికిని వెట్టదోఁచదు
సేవసేసేయట్టిచెలి సిగ్గులెంత రేఁచినాను
మూవంకలపొందులకు మొగచాటై వుండదు ॥ నీకే ॥

నేసవెట్టినమగువ సిగ్గున నెంతమీరినా
పీసమంతాఁ గాఁగిటికి వేసటేది
ఆపల శ్రీవేంకటేశ అంగన నిట్టె కూడితి
వాసితోడిసరసము వదిఁ బదదు ॥ నీకే ॥ 284

కురఁ(రం?)జి

సంగతి యెఱఁగవద్దా జాణకాఁడవు
అంగడి వేతురా మోహా మాసోదకాఁడవు ॥ పల్లవి ॥

చెక్కు చేత నిడుకొని సిగ్గున నవ్వేచెలిఁ
బక్కన నేల పట్టేవు పంతగాఁడవు
చిక్కనిచెమటతోడ చేతువెత్తి మొక్కేయాపె-
నిక్కువ లంటుదురా యింతవాఁడవు ॥ సంగ ॥

అదరి తెరమాఁటున నానలువెట్టేటింతిఁ
దొడికి పట్టుదురా దొరవాఁడవు
వొడఁబాటు మాటల నే వొద్దనే లోనై వుండఁగా
పుడుకుదురా చన్నులు బూములేలేవాఁడవు ॥సంగ॥

అంగవించి నీనేత కడ్డమాడనిసతిని
యెంగిలినేతురా మోపి ఇంపువాఁడవు
రంగుగ శ్రీవేంకటేశ రతి నెనసి చొక్కించి
సంగింతురా యింతలోనే బలువాఁడవు ॥సంగ॥ 285

సాళంగనాట

ఊరకుండు చాలుఁజాలు వొరలోనఁ బెట్టు మీఁక
[1]సారపునీవినయాలు సతములయ్యీనా ॥పల్లవి॥

పయ్యదేల పుడికేవు పంతములేల ఇచ్చేవు
తియ్యనినీమాటలెల్లఁ దెలిసె నాకు
చెయ్యార నీవు నాకు సేసినబాసలే చాలు
వెయ్యయినా నీవినయాలు వీనులఁబట్టీనా ॥ఊర॥

కన్నులనేల మొక్కేవు కడునేల నవ్వేవు
తిన్ననివలపెల్లాఁ దెలిసె నాకు
చిన్ననాఁడు నామీఁద సేసవెట్టినదే చాలు
యెన్నైనా వొడఁబాటు లితవయ్యీనా ॥ఊర॥

బలిమేల సేసేవు పైకొని యేల మెచ్చేవు
తిలకించ నీమేలు తెలిసె నాకు
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
అలరి యెఁ(యెం?)తైనా నీపై యాసమానీనా ॥ఊర॥286

1. ఏ సారపు వినయాలు అనుట సహజము.

సింధురామక్రియ

ఊరివారిఁ జూచి చూచి వూరకే నోరూరనేల
ఆరీతి నీకెందుకైనా ఆసపడనేఁటికి ॥ పల్లవి ॥

కన్నులెంత గనమైనాఁ గాంతకే చక్కఁదనము
చన్నులెంత గనమైనా సాగు బలిమి
యెన్నుకొంటా సారెసారె నేల యేఁకరేవు నీవు
విన్ను నీ వెంచుకోరాదా నీకేల యీగొడవ ॥ ఊరి ॥

నెఱిఁ దురుమెఁ(మెం?)తైనా నెలఁతకే సింగారము
పిఱుఁ దెంతబటువైనా పెద్దటికమే
పఱచై పొగడ నీవు బట్టువాఁడవా యేమి
గుఱుతువెట్టుకొనరాదా కొంచపడనేఁటికి ॥ ఊరి ॥

మొగమెంత మెఱుఁగైనా ముద్దుగారుఁ జెలియకు
నగవెంత గలిగినా వయమై తోఁచు
వెగటుదీర శ్రీవేంకటేశ కూడితివి
మగువనే మెచ్చరాదా మచ్చికలే నింకును ॥ ఊరి ॥ 287

నాదరామక్రియ

ఎందువోయీఁ దాను యేల మానే నేను
సందడి వేఁడికాఁకలు చల్లారనీవే ॥ పల్లవి ॥

తమి యెంతరేఁగినాను తగులమౌఁ బొందులు
తెమలి పొద్దులు వుచ్చితే నేమాయనే
చెమటెంతపుట్టినాను చిగిరించు వలపులు
సముకాన సరసము సాము సేయ వియ్యవే ॥ ఎందు ॥

నగవెంత గలిగినా ననుపులు వతమౌను
మొగసక్కెన నుండితే నేమాయనే
తగవెంత నడపినా తరితీపౌఁ బనులెల్లా
మొగమెదుటనే కొంత మొక్కలాడనీవే ॥ ఎందు ॥

భావమెంత చిక్కినాను పరవశములు మించు
ఠావుల మనోరథాలు తలఁచనీవే
యీవేళ శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడినాఁడు
వేవేలుప్రియములు వెదచల్లనీవే ॥ ఎందు ॥ 288

రేకు 1150 కుంతలవరాళి

ఇందాఁకా నామంకుబుద్ధి ఇట్లుండెను
కందువకు రాఁగాను కడమెల్లాఁ దీరెను ॥ పల్లవి ॥

మక్కళించి మక్కళించి మాటలు నీ వాఁడఁగాను
గక్కన నామనసెల్లఁ గరఁగె నిదె
చెక్కులు నొక్కినొక్కి చేరి నీవే వేఁడుకోఁగా
ఇక్కువ నెలవినవ్వు లిదె వచ్చెను ॥ ఇందాఁ ॥

వనవునేసుక నీవు సారెసారెఁ బెనఁగఁగా
తనివిదీరనియట్టితగులాయను
కొనబుఁజూపులు చిమ్మి కొచ్చికొచ్చి చూడఁగాను
పెనకమునపులెల్ల వింతలాయను ॥ ఇందాఁ ॥

కాఁగిలించి కాఁగిలించి కమ్మటి నీవు గూడఁగా
మాఁగినమోవి సదమదమాయను
యేఁగి వచ్చి పెండ్లాడితి విదివో శ్రీవేంకటేశ
పేఁగనిపిగ్గులు వెల్లవిరులాయను ॥ ఇందాఁ ॥ 289

గౌళ

పొద్దువోనివాఁడవు బొంకేవుగాక
వుద్దండపునీగుణాలు వొద్దికలయ్యీనా ॥పలవి॥

మొగమెంత చూచినాను మొక్కులెన్ని మొక్కినాను
చిగిరించినవలపు చేఁగలెక్కీనా
నగవెంత నగినాను వయమెంత చూపినాను
పొగరులనీమాటలు పొసఁగివుండీనా ॥పొద్దు॥

తీపు లెంతవుట్టించినా తిద్దీని(తిద్దని?)వంకలాడినా
పూపనియాసలు నేఁడు పుల్లటౌరలా
వోపి యంతవోరిచినా వూడిగ మెంతసేసినా
నీపలుచుఁజేఁతలు నేఁడు చక్కనవునా ॥పొద్దు॥

మనసెంత గరఁచినాను మచ్చికెంత రేఁచినాను
పెనఁ(న?)గొన్నరతు లిఁక బీరుపోయీనా
ననిచి శ్రీవేంకటేశ నన్ను నిట్టె కూడితివి
వివవయ్య నీమన్నన వేరొకటయ్యీనా ॥పొద్దు॥ 290

రామక్రియ

నావంటిసతులే నన్ను మెత్తురు
భావించ నీకే నేను బాఁతిగాఁగాని ॥పల్లవి॥

చిన్నదాననైనా నీ చిత్తము రా సేవసేతు
నన్ను నే పొగడుకొవ నాయము గాదు
వున్నతిపీచేఁతలకు వోరుతు నెంతేసికైనా
యెన్నిక నీతో నేను యీడుగాఁగాని ॥నావం॥

కడుగర్వినైనా నీకతలందు లోను
బడిబడి విన్నవి ఒండు దాచిగాదు
యెడయక యిచ్చకాన చెప్పుడూ నీపద్ద నుండు
ముడిమాఁటలను నీపై మోపుగట్టఁగాని ॥ నావం ॥

పట్టపుదేవినైనా నీపలుకులోనె నడతు
చట్టించి నీ చెచ్చరించ వగవుగాను
యిట్టె శ్రీవేంకటేశ యెనసితి నిట్లు నిన్ను
ఒట్టిసితనాన నే నాఅడి సేయఁగాని ॥ నావం ॥ 291

ముఖారి

తనకు నాకుఁ జోవునా తానేల పదరీనే
ననుపులకెల్లాను నవ్వే గురిగాదా ॥ పల్లవి ॥

అలిగి నేనూఁ దాను నాడా నీడా నుండినాను
తలపోఁతలకు గురి తానే కాఁడా
యెలమి నాడకు నన్ను నేల పిలువనంపీనే
మలసి తాఁ జెప్పంపినమాఁటే గురిగాదా ॥ తన ॥

పంతముతో తాను నేను పలుమాటు బిగిసినా
అంతరంగములో గురి ఆసలే కావా
వంతదీర నింతలోనే వాకిటికేల వచ్చీనే
యెఁ(యెం?)తైనా మేనరిక మీదే గురిగాదా ॥ తన ॥

మంచవ[illegible]పై సిగ్గులను మారుమోములై యుండినా
పొంచి రతులకు గురి భోగమే కాదా
అంచెల శ్రీవేంకటేశుఁ డట్టె నన్నుఁ గూడె నిదె
మంచితనముద్రలకు మోవే గురిగాదా ॥ తన ॥ 292

---

త్రిగీతలుగలస్థలములు చిలుమెక్కినందున నే నూహించినవి.

గౌళ

నేము బుద్ధులు చెప్పేమా నెలఁతకును
దీమసము నీవల్ల నే తేటతెల్లమాయను ॥ పల్లవి ॥

చెప్పరానిమాట లేమిచెప్పితివో ఆపెతోడ
ముప్పిరిసిగ్గుఁతోడ మోము వంచెను
తప్పకుండా నేడ నేడఁ దాఁకించితివో గోరు
రెప్పలెత్తి చూచి మేలు రేఁచుకొనెను ॥ నేము ॥

నవ్వరాని నవ్వులేమి నవ్వితివో ఆపెతోడ
దువ్వటపుపయ్యద మీఁదు(ద?) బిగించెను
రవ్వ నెంత వూడిగాలు రతిఁ జేయించితివో
పువ్వులచెండున నిన్నుఁ బూఁచి వేసెను ॥ నేము ॥

నేయరానిసేఁత యేమి నేసితివో ఆపెను
కాయము బిగించి నిన్నుఁ గాఁగిలించెను
యీయెడ శ్రీవేంకటేశ యెంతగా మన్నించితివో
చాయల సన్నల మొక్కి సంతోసించెను ॥ నేము ॥ 293

సౌరాష్ట్రం

మారుకొనేదాననా మచ్చరించి నీతోను
కోరికలే పచరించి కూడుకుందుఁగాక ॥ పల్లవి ॥

పంతమాడఁగలమా పలుమారు నీతోడ
చెంతఁ బ్రియమూ దేనోటిచెలులము
రంతుల నీ విఁక నెంతరాజసము చూపినాను
అంతయు నే నిచ్చగించి అలరుదుఁగాక ॥ మారు ॥

---

క్రిగీతలు గలవి చిలుముదిమటచే నే నూహించినవి.

కొసరఁగఁగలమా క్రొంగువట్టేనీతోను
వెస నూడిగాలు సేసేవెలఁదులము
పసలుగా నీవెంత బలుకులు చూపినాను
పొసఁగ నీకే లోనై పొందేదానఁగాక ॥ మారు ॥

సిగ్గువడఁగలమా చెనకేటినీతోను
వొగ్గి నీరతులకెల్ల వోపుదుఁగాక
కగ్గక శ్రీవేంకటేశ కడు మందెమేళమైన
నిగ్గుల నిన్నే పొగడి నిందుకుందుఁగాక ॥ మారు ॥ 294

1151 నుండి 1160 వరకు గల (10) రేకులు లేవు.

రేకు 1161 నారాయణి

తనతోడి యీడువెట్టి తానేల మమ్ముఁ దడవీ
ఘనుఁడైతే బూములేలఁ గర్త గానీవే ॥ పల్లవి ॥

తాలిమెంతగలిగినా తానే బతుకనీవే
ఆలరికాంతలకెల్లా నవి వచ్చీనా
చాలా నవ్వితేను అజాణతనముఁ దనదే
మేలిమితనగుణాలు మెలుఁతల కుండునా ॥ తన ॥

యింతుల కిచ్చకుఁడైతే యీపుణ్యముఁ దనదే
బంతినున్నవారికెల్లఁ బట్టుపడీనా
యెంత తాఁ బంతమిచ్చినా ఇదియూఁ దనకే వన్నె
వంతులు మాకు నడప వసగాదుగాక ॥ తన ॥

యెందరిరొచ్చుకోర్చినా యీ కీరితి దనదే
అందరికిఁ దనవలె నలవడీనా
యిందరిలో శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
విందుఁ యీమోహానకు వెల వున్నదా ॥ తన ॥ 295

---

క్రీగీతలు గలచోట్లు చిలుముదినుటచే నే నూహించినవి.

దేశాక్షి

ఇదివో నీభాగ్యము యేమని చెప్పఁగవచ్చు
పొదలుసరసముల పోగులాయఁగదరా ॥పల్లవి॥

పుప్పతిల్లుఁగుచముల నూఁదిపట్టి అపె నీతోఁ
జెప్పఁగలమాటలెల్లాఁ జెప్పఁగాను
చిప్పిలేవు చెమటలఁ జెలియకాఁగిలే నీకు
కుప్పళించి మంచికేళాకూళి ఆయఁగదరా ॥ఇది॥

బాగాలిచ్చి సారెసారె పైతరవై అపె నిన్ను
వేగినంతా గోరనంటి వేఁడుకోఁగాను
యీగతిఁ బులకించేవు యీపెతోడిసరసమే
జాగులేనిపువ్వులవసంత మాయఁగదరా ॥ఇది॥

చిగురునీమోవి యాని చేరి యాపె మొక్కఁగాను
నగుతా శ్రీవేంకటేశ నన్నేలితివి
తగ నీ విద్దరితోడఁ దమకించి పెనఁగేవు
తగిలి రతులు నీచే తాసుణాయఁగదరా ॥ఇది॥ 296

పాడి

ఇంతి యిదె నీ విదె యిఁక నెన్నఁడు
సంతసాలు రేఁచకుంటే చవు లేద మున్నవి ॥పల్లవి॥

అలిగి మాఁటాడనట్టిఅతివను నేరుపున
పలికించకుంటేను పంతములేవి
చలపట్టిన [1]గొంటెతఁ జక్క నవ్వించకుంటేను
తలకొన్న నీజాణతన మేమి వున్నది ॥ఇంతి॥

క్రీగీతలు గలవి చెదమూరినందున నే నూహించినవి.
1. కొంటె+త. కొంటెతనము గలదిగావచ్చు.

చెక్కులోఁ జింతించేయాపెఁ జెలరేఁగించి సారెకు
చక్కఁగా నవ్వించకుంటేఁ జనవులేవి
మొక్కులాన రతులకు మొగియకవున్నయాపె
మొక్కఁ జేసుకొనకుంటే మోహమేమి వున్నది ॥ఇంతి॥

తలుచెప్పినసతిచే కాఁగిలింపించుకొనకుంటే
యితవు శ్రీవేంకటేశ యేమున్నది
తతిగొని నిన్నుఁ గలసి తమకించేయాకెనిండు-
వ్రత మీడేరుచకుంటే వాదికేమి వున్నది ॥ఇంతి॥ 297

వరాళి

చవిగావు నీవెంత సటలు సేసినాను
తవిలి లోకులు నీకుఁ దప్పు లేదనేరా ॥పల్లవి॥

యెన్నియానలు వెట్టుక యెంత వాదఁబరచినా
వెన్న నీవు దొంగిలవా వెనకకును
నన్నుఁ జూచి నీవెన్నేసి నవ్వులు నవ్వినాను
నిన్నును నీసుద్దులును నే నెఱఁగనా ॥చవి॥

అందరు జూఁడఁగా నీవు ఆచారాలు సేసినాను
చెంది చీఁకటితప్పులు సేయవా నీవు
యిందులోనే నాయెదకు యిచ్చక మేమిసేసినా
అందుకొని నిన్ను వెంగెమాడక వీఁగుదునా ॥చవి॥

మనసిచ్చి నీవెంత మక్కువ నాకుఁ జేసినా
తనివోక ముట్టవా పదారువేలను
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
చనవున నీరతుల చలము విడుతునా ॥చవి॥ 298

శ్రీగిరగలవి చిలమూరివందుప నే నూహించినవి.

రామక్రియ

చూదరమ్మ యీతనిసుద్దులెల్ల నిట్లానే
వేడుకమాఁటలకెల్ల వెసఁ గారాలెక్కవా ॥పల్లవి॥

నగనేరిచినచోట నగితే నమరుఁగాక
జగడగానితోడ సరసమేలా
మొగము నేఁ జూచితేను మొక్కలానఁ దిట్టవచ్చీ
యెగసక్కెపుచన్నుల కిఁక వాండ్లెక(క్కఁ?)వా ॥చూద॥

ఆసలుచల్లేచోట నట్టే కొసరుటగాక
మాపటీనితోడ మారుమలయనేల
బాసగలవాఁడవంటే పైపై నే వొట్టుపెట్టీ
యీసున చిగురుగోళ్ల కిఁక చేఁగలెక్కవా ॥చూద॥

సులభమయినచోట సూటిపడుఁగాక మేలు
చలపాదివానితోడ సణఁగులేల
యెలమి శ్రీవేంకటేశుఁ డింపుతోడ నన్నుఁ గూడె
యెలయింపుమోవులకు నిఁకఁ గెంపులెక్కవా ॥చూద॥ 299

హిందోళం

వేమారు నెంతలేదు వెలుమజోలి
నేము నీవలెనే కూర్మి నెరపేము గాక ॥పల్లవి॥

నీకు నాతనిమాఁటలు నీలోనే తెలుసునే
మాకేమి చెప్పేవు మాపుదాఁకాను
దాకొని మీవద్ద నేము తగవులు దిద్దేమా
జోకల మీవోపికలు చూచే మింతేకాక ॥వేమా॥

మీయిద్దరిచేఁతలు మీకుమీకే అందాలే
చాయలేల అడిగేరే సారె మమ్మును
యేమనేము నేము మిమ్ము నెటువలె నడచినా
బూమిలో మీనేరుపులే పొగడేముగాక ॥ వేమా ॥

మచ్చికలమీనవ్వులు మాకెల్లాఁ దెలుసువా
చెచ్చెర మీకే ఇవి సెలవుగాక
యిచ్చకమై శ్రీవేంకటేశుఁ దేలె నన్ను; నీవు
ముచ్చటలాడితే మీకు మొక్కేముగాక ॥ వేమా ॥ 300

రేకు 1162 ఆందోళి

ఇందుకుఁగా నెవ్వరును యెగ్గులెంచరు
పందుకొని ఆపెనేల సాదించేవు నీవు ॥ పల్లవి ॥

వాడికగలచోటను వలచి వొకరొకరు
ఆదరావిమాటలైనా వాదుచుందురు
వూడిగము సేసేవారు వూపివాసు లెంచరు
జోడై తమమేనులు సోఁకింతురు ॥ ఇందు ॥

సరసమాడేవేళ సమ్మతించి తమలోన
సరుగ మందెమేళాన జంకింతురు
వరుస విడెమిచ్చేవారు వింత సేయరు
అరిదిఁ దమచేతుల నంటింతురు ॥ ఇందు ॥

రతిఁ గలసేయప్పుడు రాఁపసము విడువరు
తతి గూడఁ దమలోనఁ దమకింతురు
యితవై శ్రీవేంకటేశ ఇంతి నీవూఁ గూడితిరి
చతురులైనవారు సతమే చింతింతురు ॥ ఇందు ॥ 301

సాళంగం

నీయంత నెఱఁగవు నేఁటిదాఁకాను
మాయలెల్లా నీకు నేమసువ నేరిపెరా ॥ పల్లవి ॥

పలుమారు నవ్వుమని పదఁతులఁ దిట్టుమని
చెలఁగి యవ్వతె బుద్దిచెప్పెరా నీకు
చలము సాదించుమని సటలెల్లాఁ జేయుమని
నిలుకడగా నెంతనేరిపెరా నీకు ॥ నీయం ॥

వొద్దనే కూచుండుమని వొడివట్టి తియ్యుమని
తిద్ది యెవ్వతె బోదించెరా నీకు
కొద్దిమీరి వుండుమని గుఱుతులు నేయుమని
గద్దరితన మేగతిఁ గట్టైరా నీకు ॥ నీయం ॥

పంతగాఁడవు గమ్మని పైపై నిచ్చలాడుమని
కాంత యెవ్వతె పట్టముగట్టెరా నీకు
యింతలో శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
బంతినే యీగుణ మెట్టు పట్టించెరా నీకు ॥ నీయం ॥ 302

పాడి

నీయంత నెఱఁగకున్న నేనైనాఁ జెప్పే నీకు
పాయపువాఁడవు గాన పరాకెంతో నీకు ॥ పల్లవి ॥

కరఁగిజారినయట్టికస్తురిబొట్టు చెలికి
సరుగ దిద్దుతాను ముచ్చటలాడేవు
సరిఁ జెఱుఁగువట్టుక సతులెందరో వున్నారు
పరగ వారిఁ జూడవు పరాకెంతో నీకు ॥ నీయం ॥

యెక్కపై తడఁబడినఇంతికిఁ దమాలికలు
చిక్కులు దీసుకొంటాను చిత్తగించేవు
మొక్కులు నీకు మొక్కుతా ముందరనున్నారెందరో
ప(ప?) క్కనవారిఁ జూడవు పరాకెంతో నీకు ॥ నీయం ॥

[illegible]తిఁ గాఁగిటఁ గూడి సురటి విసరుకొంటా
వుదుటై శ్రీవేంకటేశ వున్నాఁడవు
పదిమారులును నీకఁ బాదాలు పిసికేవారి-
పదనుకాంక్ష చూడవు పరాకెంతో నీకు ॥ నీయం ॥ 303

లలిత

నేనూ మీవంటిదాననే నేరమి నాకు నేదే
నానకమై యాశనినే తడవవాదా ॥ పల్లవి ॥

కలివాయ దివసములు [illegible]నతిపాళ్లకు వచ్చు
వలపు పాలు పె[illegible] యేమి
నలువంకఁ జెలులెల్ల న[illegible]ప్పటించేరే
[illegible]లఁదిమీరఁగఁ బతిఁ [illegible] ॥ నేనూ ॥

ప్రియురాండ్లకు నేసలు పెండ్లిపేఁ బెట్టినట్టు
వయసు [1] వంచిపెట్టఁగవచ్చునా యేమి
నయమెుఁగక మీరు నన్నెల గోం నేనేరే
నయవుట్ట నాతనిఁ ద[illegible] ॥ నేనూ ॥

అడియాలపుఁగాఁగిట నాతఁ [illegible]కిఁ [illegible]
వడి రూపు పంచిపెట్టఁగవచ్చునా [illegible]
[illegible]ముడి నన్నుఁ గూడె శ్రీవేంకటేశ్వరు[illegible]
[illegible]డిబడి మీరు [illegible]కైకొనరాదా ॥ నేనూ ॥ [illegible]

1. [illegible]సు + పంచిపెట్టఁగ.

## తోండి

రాఁగదే నొక్కఁడిసుద్ది రమణుఁడున్నాఁడకు
పాఁగినవోవరిలోనఁ బవళించున్నాఁడు ॥ పల్లవి ॥

తెరమఱఁగు దియ్యఁగా తీపులాయ వలపు
సరసములాడఁగానే చవులాయ మాఁటలు
తరితీపు కాయఁగానే తమకము రేఁగెను
యెరపునేసుకవుంటే నెదలౌను పొందులు ॥ రాఁగ ॥

యెడమాఁట లాడఁగానే యియ్యకోలాయఁ బనులు
తొడిఁబడ నవ్వఁగానే దొరకెఁ గూటములు
వొడిపట్టి తియ్యఁగానే వొళ్లెల్లాఁ జెమరించె
ఒడిసి పూరకేషంటే చప్పనౌను వావులు ॥ రాఁగ ॥

యిచ్చకము కాయఁగానే యింపులు మిక్కిలిఁగల్లు
తచ్చి తచ్చి పెనఁగితే తగులాయమౌను
అచ్చపుశ్రీవేంకటేశుఁ డప్పుడే కూడె నిన్ను
మెచ్చి మెచ్చి పొందకున్న మీరుఁ జుట్టరికము ॥ రాఁగ ॥ 305

## దేసి

నీవు సామాన్యుఁడవా నీగుట్టు నే నెఱఁగనా
వావులెంత చెప్పినాను వలచేవా ॥ పల్లవి ॥

కలయఁగ నీకుఁ బని గలుగఁగానే కాక
బలిమి సేసితే నీవు పలికేవా
నెలకొన్నతమకము నీకుఁ గలుగఁగాఁ గాక
పిలిపించితే నీవు ప్రియాన వచ్చేవా ॥ నీవు ॥

చేకొని నీవుల్లాసము సెలవి వెళ్లఁగాఁ గాక
నాకు వలెనంటే నీవు నవ్వేవా
కైకొనఁగా నీకు నాపై కాంక్ష గలుగఁగాఁ గాక
ఆకు నే మడిచియ్యఁగా నందుకొనేవా ॥ నీవు ॥

యింతటాను నీవు నన్ను యేలుకొనఁగాఁ గాక
మంతన మెంతాడినాను మనసిచ్చేవా
యింతులలో శ్రీవేంకటేశ న న్నేలితివి
పంతము నేనాడితేను పరాకునేసేవా ॥ నీవు ॥ 306

రేకు 1163 పళవంజరం

ఏమని వలపు చెప్పే నెవ్వరూ నే మెఱఁగేరు
నేమపునీగుణాలకు నీవే సాక్షి ॥ పల్లవి ॥

వానర నీపై బత్తి వారులకుఁ జెప్పరాదు
మనసులోపలనున్న మరుఁడే సాక్షి
నినుఁబాసి విరహాన నే నిందాఁకా నున్నందుకు
నినుపులయిననానిట్టూర్పులే సాక్షి ॥ ఏమ ॥

నెక్కొన్ననాకోరికలు నీతో వాకుచ్చరాదు
దిక్కులను మొక్కుకొన్నదేవరే సాక్షి
చొక్కపునాచూపులసూటి నీపైనున్నందుకు
పక్కన నే మందేటిభావమే సాక్షి ॥ ఏమ ॥

బాసతోడ నీకాఁగిటఁ బాయలేకవున్నందుకు
రాపికెక్కినట్టినారతియే సాక్షి
నేసవెట్టి యేలితివి శ్రీవేంకటేశ్వర నన్ను
ఆనుద్దులకెల్లా మనఆయములే సాక్షి ॥ ఏమ ॥ 307

వేళావళి

అప్పుడన్నీఁ జెప్పేఁగాని అందరిముందరనేలా
దెప్పరాన నిట్టే పట్టుతెర వేసేమయ్యా ॥ పల్లవి ॥

మొగములోపలిసిగ్గు మోవివెంట నవ్వులాయ
చిగురులోపలిచింత చెక్కుఁ జేయాయ
మగువ నప్పటి నీవు మాఁటలేమి యడిగేవు
అగ్గడుసేయక యేకాంత మియ్యవయ్యా ॥ అప్ప ॥

చేతులఁగారేచెమట చీరకొంగు దడిసెను
కాతరపుఁజూపు కడకన్నులఁ దేరె
యేతున నీపెను నీవు యేల వెద్దువెట్టేవు
జాతులుసేయక రహస్యానఁ జెనకవయ్యా ॥ అప్ప ॥

వట్టినపాయపుమీఁదు పైపై నీకే నెలవాయ
తొట్టినవలపులెల్ల దోమటాయను
యిట్టె శ్రీవేంకటేశ యెనసితి వింతి నిట్టె
దట్టముగా నీవు మంతన మానతీవయ్యా ॥ అప్ప ॥ 208

లలిత

మొక్కవే యాతనికి మున్నిటినేరమి దీర
మొక్కిశీ దాతఁడు నీమోవెంగిలే చాలు ॥ పల్లవి ॥

వేసటేలే నీకూ వేగినంతా నాతఁడు
ఆసలు రేఁచిరేఁచి ఆయాలంటఁగా
వేసములఁ దిట్టకువే విభుని నేమదినాను
దోసము లందురు కాలుద్రొక్కినదే చాలును ॥ మొక్క ॥

జంకెనలేలే నీకు సమ్మతించి నీమగఁడు
వుంకువగా విడెమిచ్చి వూరడించఁగా
మంకుఁదనాలు చూపకు మగనాలి మీరితేను
అంకెగాదు నీచెమట నద్దినదే చాలును ॥ మొక్క ॥

సిగ్గులువడఁగనేల శ్రీవేంకటేశ్వరుఁడు
అగ్గమై నిన్నుఁ గలపి ఆదరించఁగా
వెగ్గళించ కితవికి వెక్కసాలు చూపితేను
సగ్గవు కోరికలెల్లా సరసమే చాలును ॥ మొక్క ॥ 309

## గుండక్రియ

కానీవే నాకెంత గలిగెఁ దనకూ నంతే
వూని నానినసవిగె లొకటి కినుమడి ॥ పల్లవి ॥

తన కెంతకుచ్చితము తానే ఇదికీలేవే
మనసంతే మంగళము మాపుదాఁకాను
వనిత నొక్కతె నాతో వడి నీడువెట్టెను
తనకూ నదేకాదా ఉగవు మీఁదటికి ॥ కానీ ॥

యీసులెంత రేఁచుకొన్నా నెక్కడవో యీలేవే
నేసినసుదాఫలాలు చేతిలోవివే
యీపిరులతో మగవి కెందరిఁ బెండ్లి నేసినా
లాసి నావలెనే తనలాభము గాదా ॥ కానీ ॥

తడవి శ్రీవేంకటేశు దక్కవిచ్చె నాకు నేఁడు
మదుగులఁ(లం?)దే వున్నది నోముఫలము
పదఁతులచేతనెల్లా పంతము నాకిప్పించితే
కదఁగి తనపెద్దరికముగాదా యిఁకను ॥ కానీ ॥ 310

మాళవి

ఏమి చెప్పేవు సుద్దులు యెందాఁకాను
వేమారు వెన్నెలేకాదా వేసవయ్యేది ॥ పల్లవి ॥

పురుషుఁడైతేనేమి పొలిఁతియైతేనేమి
వరుస నొకటేకాదా వావిపట్లు
[1]కడఁ(రఁ?)గి చొక్కినేనేమి కడువెరగైతేనేమి
మరువియమ్ములేకావా మతి నాఁటేవి ॥ ఏమి ॥

వొంటి నేలికైతేనేమి వూడిగపుదైతేనేమి
జంటల సరేకావా జవ్వనములు
ఇంటిలోనైతేనేమి యీవాకిటనైతేనేమి
అంటి చల్లగాలేకాదా ఆయాలు రేఁచేది ॥ ఏమి ॥

దేవరయైతేనేమి దేవులైతే మరియేమి
వావిరిఁ బొత్తేకాదా వలపులెల్లా
శ్రీవేంకటేశ్వరుఁడ చేరి నన్నుఁ గూడితివి
కోవిలకూఁతలేకావా గురులయ్యేవి ॥ ఏమి ॥ 311

రామక్రియ

ఎంతవేగిరకాఁడవు యేమి చెప్పేది
పంతమెల్ల నీవు నాపైఁ బచరించేవు ॥ పల్లవి ॥

కూరిమి నేనాడివకొసరుమాటలకు
ఆరీతిఁ దారుకాణించుమని యాడేవు
నేరుపుతో మెలఁగితే నీవే బదికేవు మరి
వారకపునీగుణా లెవ్వరికి వచ్చీని ॥ ఎంత ॥

1. ప్రాచీనతంగము.

నను పున నే నీతో నవ్వివసుద్దులకెల్లా
పెనఁగి నీవానలేల పెట్టవచ్చేవు
అనువుగా విజమరివై తే విన్నే పొగడేరు
వొవర నొకరికిరి తొకరి నంటినా ॥ ఎంత ॥

కూడేవేళనే విన్ను గోరు సోఁకించినందుకు
చూడఁజూడ రతి నెంత సూడువట్టేవు
యీడుగా శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
యీ దేరినచుట్టరిక మిద్దరికుండీవి ॥ ఎంత ॥ 312

రేకు 1164 ఆహిరి

ఏమయ్య కరుణించేది యిఁక నెన్నఁడు
చేముట్టి సరసమాడి చెక్కునొక్కరాదా ॥ పల్లవి ॥

చిప్పిలుఁగాఁకలతోడి సిగ్గులు నీపైఁ జల్లి
కప్పుగ మియ్యఁగరాదా కలికికివి
రెప్పలెత్తుఁజూపులతో రేసుల విన్నుఁ గొసరీ
దప్పికి మోవియ్యరాదా తరుణికివి ॥ ఏమ ॥

కొంకొలనవ్వులతో కూరిమి నీపై వేసీ
పిలిచి చేకొనరాదా ప్రియురాలివి
తొలఁకునాసలతోడ దూరీ విన్ను సారెకు
అలమి చనవీరాదా అంగనకును ॥ ఏమ ॥

కందువఁ జన్నులు మోపి కళలు నీపై రేఁచీ
అంది కాఁగిలించరాదా అతివను
చెందెను బలిమిఁ బట్టి శ్రీవేంకటేశ్వర విన్ను
అంది విడెమియ్యరాదా అలివేణికి

దేసాళం

వట్టివాదులకునేల వచ్చినే తాను
అట్టునిట్టు జంకించి ఆదరించరాదా ॥ పల్లవి ॥

తగవు చెప్పరే మీరు తరుణులాల
మొగముచూచేపతికి మొక్కరాదా
మగఁడు దనకైతేను మాటమాట సరసాన
వెగటుగాఁ దిట్టి నేను వేఁడుకోరాదా ॥ వట్టి ॥

వొలపక్షమాడకురే వువిదలాల
పలుమారుఁ బిలువఁగాఁ బలుకరాదా
మలసి తనవాఁడైతే మాతోఁ బెనఁగేవేళ
చెలఁగి గోరుదాఁకితే చెక్కునొక్కరాదా ॥ వట్టి ॥

మీకే తెలుసునే మెలుఁతలాల
కైకొని నన్నుఁ గూడితేఁ గలయరాదా
జోక శ్రీవేంకటేశుఁడు పొరిదినే యేలఁగాను
వాకునఁ బ్రియము చెప్పి వంచుకోరాదా ॥ వట్టి ॥ 314

పాళంగనాట

నిన్ను గెలువవసమా నీ వింతటివాఁడవు
మన్నించవయ్యా నే నీమరఁగు చొచ్చితిని ॥ పల్లవి ॥

బలువాఁడ వౌదువు పదఁతు లెందరైనాను
పొలపితిట్టినా నోరుచుకవుందువు
మెలుపునీగుణాలకు మెచ్చితి విందరిలోన
బలిమిఁ బదారువేలపాదములు వోఁకెను ॥ నిన్ను ॥

యెంతలేదు నీమహిమ యెంచి చూడ నిప్పు డిట్టె
కాంతలకెల్లా నీమోవి కంచమాయను
వింతలాయ నీబతుకు వేడుకఁ బీతాంబరము
బంతినే గోపికలకుఁ బరపాయను ॥ నిన్ను ॥

మేలుమేలు నీపొందు మెరవడికత్తెలకు
వాలాయము వరుసలువంతులాయను
యీలీల శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
నీలాగు లిందరికి కానికలాయను ॥ నిన్ను ॥ 315

కుంతలవరాళి

నే మిద్దరమును నీపాలఁ జిక్కితి మిదె
కామించి యేపుణ్యమైనాఁ గట్టుకొనవయ్యా ॥ పల్లవి ॥

ఆకె నీకు నేరిపిన వవే తగవులు
లోకులము మమ్ము నేల లోఁచి చూచేవు
సాకి రెవ్వరు చెప్పినా సటలే యందువు నీవు
వాకున వలచువారి వంకలాడవయ్యా ॥ నేమి ॥

చెవిలో నాడినమాటే చిత్తమునఁ బట్టుఁగాక
వివరించి మమ్ము నేల విచారించేవు
జవళిఁ జెలికత్తెల సారెకు గరిసించేవు
భువిలోఁ గడవారికి పూనుకరావయ్యా ॥ నేమి ॥

ఇచ్చకములాడినవే ఇంపులు నీకౌఁగాక
[1] అచ్చులము మమ్ము నేల అలయించేవు
చెచ్చెర శ్రీవేంకటేశ చెనకి మమ్మేలితివి
మచ్చికైనవారినే మరగవయ్యా ॥ నేమి ॥ 316

1. 'అచ్చులము' అచ్ఛశబ్దభవము. పరిశుద్ధమైనవారము అర్థము కావచ్చు.

హిందోళం

ఒక్కతెనే యాలనా వూరకే నీకు
[1]చక్కఁగా నీనెపమున సాదించేవుగాక ॥ పల్లవి ॥

కొల్లగాఁ జెక్కు నొక్కుచు కొనగోరు నాఁటించేవు
చెల్లినంతఁ జేయవయ్య చేఁతలు నీవు
పల్లదాన నీవిది పగ సాదించుటగాక
చెల్లఁబో నామీఁద బత్తిసేయుటా నీవు ॥ ఒక్క ॥

కొంగువట్టుతానే నాకుచములు విసికేవు
అంగడి వేయవయ్య నీ వన్నిటా సిగ్గు
చెంగట నీపంత మిఁ(మిం?) దే చేకొనవచ్చుటగాక
సంగతి నాపై వలపుచల్లుటా నీవు ॥ ఒక్క ॥

పక్కనఁ గాఁగిటఁ గూడి పలుసోఁకులు సోఁకించేవు
వెక్కసానఁ గూడవయ్య వేడుక నన్ను
మక్కువ శ్రీవేంకటేశ మమ్ము మన్నించుట గాక
తక్కక మాతోడివినోదములా యివి ॥ ఒక్క ॥ 317

శుద్ధదేశి

మదించినవలపులమత్తురాలను
చెదర నీవే యింత నేసితివి నన్ను ॥ పల్లవి ॥

మాటలు నీ వాడించఁగ మఱచివుంటి నిందాఁకా
గాఁటానఁ జేయెత్తి మొక్కేఁ గైకొనవయ్యా
పాటించి నీవు రాఁగాను పైపైఁ జూడఁబట్టె నాకు
చాటువైనకానుకిచ్చే చాఁచవయ్యా చెయ్యా ॥ మదిం ॥

1. చక్కఁగాన్ + ఈనెపమున.

సెలవి నీవు నవ్వఁగ సిగ్గునసుంటి నిందాఁకా
యెలమితో వీడెమిచ్చే నిందవయ్యా
నిలుచుండఁగా బానుపు నీకుఁ బరవఁగఁబట్టె
యెలమిఁ గైదండ ఇచ్చే నిందవయ్యా ॥ మపం ॥

పైకొని కాఁగిలించఁగ భ్రమసివుంటి నిందాఁకా
యీకడ మోవితేనియ లిందవయ్యా
దాకొని శ్రీవేంకటేశ దక్కితి విట్టె నాకు
రేకలఁ గస్తూరి గప్పె జోకైవుండరాదా ॥ మది ॥ 318

రేకు 1165 రీతిగౌళ

ఎంతకు నంతేకాక యెక్కుడేఁటికే
పొంతనుండి యాతని బుజ్జగించఁగదవే ॥ పల్లవి ॥

పయ్యదకొంగు వట్టితే పతివి జంకించితివి
తియ్యనిమోవిపై మరి తిట్లూ నేలే
వొయ్యనే వలపు చింది వొకటి ఇనుమడాయ
చయ్యాటలు మాని ఇఁక సరసములాడవే ॥ ఎంత ॥

కోరి చన్ను లంటితేను కొనగోర నూఁదితివి
వూరకే మీఁదమిక్కిలి వొట్లేఁటికే
పోరచి [1] వయసు వంది పోఁకకుఁ బుట్టెఁడాయ
కేరడాలు మాని ఇట్టే కేలెత్తి మొక్కవే ॥ ఎంత ॥

పక్కనఁ గాఁగిలించితే పాదము పైవేసితివి
చెక్కిటిచేతితోడిసిగ్గు లేఁటికే
యెక్కువైన శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁగూడె
పెక్కులెల్లా మాని యిట్టె ప్రియములు చెప్పవే ॥ ఎంత ॥ 319

1. వయసు + వంది

బౌళి

అట్టె బిదుకవయ్యా అంతలోనే మాకేమి
ఇట్టె వలపే నీకు యెక్కువసింగారమా ॥పల్లవి॥

మాయదారివాఁడవు మావినులవుంగరాలు
యీయెడ వేళ్లఁబెట్టుక యెమ్మెనేసేవు
చాయలమేనిరేఖలు చాలవా అందుకుఁదోడు
కాయముపై మచ్చములు కడుసింగారమా ॥అట్టె॥

పొద్దువోనివాఁడవు పొలఁతులవలువలు
కొద్దిమీర మొలఁ గట్టుకొనివచ్చేవు
ముద్దుముద్దువలె నీమోవికెంపులే చాలవా
పెద్దరికపుచెరవు పెక్కువసింగారమా ॥అట్టె॥

కతకారివాఁడవు కాంతలపువ్వుదండలు
ఇతవై మెడవేసుక యెలయించేవు
తతి నన్నుఁ బొందితివి దగ్గరి శ్రీవేంకటేశ
రతులసదమదము రాఁపులసింగారమా ॥అట్టె॥ 350

శంకరాభరణం

పెనఁగే వూరకే ప్రియపడి నాతో
ననుపు నటించక నయమౌనా ॥పల్లవి॥

చిత్తములోపలిసిలుగులు వాయక
బత్తులు వేయఁగఁ బనిగలదా
వొత్తివగోళ్ల వాళ్లనే వుండఁగ
హత్తినకాఁగిలి అనువౌనా ॥పెనఁ॥

నగవులలోపలినలుసులు దియ్యక
పగటులు సేయఁగఁ బని గలదా
తగిలినదండలు తతి మెదనుండఁగ
వెగటుగఁ బెనఁగఁగ వేడుకలౌనా ॥ పెనఁ ॥

వలపులలోపలివాసులు దోయక
బలుములు చూపఁగఁ బని గలదా
యెలమిని శ్రీవేంకటేశ కూడితివి
కలసినరతులకుఁ గడమలు నౌనా ॥ పెనం ॥ 321

కాంబోది

ఓయమ్మ [1]నీగాతికి నోరుచునా యెవ్వతైనా
పాయలు వడినఁ బోదు పట్టకు మాచెఱఁగు ॥ పల్లవి ॥

కాంతలఁ బెక్కుల్లఁ బొంది కాయాటుపడె నీమేను
యెంతవడ్డైనా నలయ దిదివో నేఁడు
ఇంతలోనే తమ్ములము లిందరివి లోఁగొని
యేఁ(యెం?)తైనాఁ గద్దు నీనోరు యెట్టు మాటాదేను ॥ ఓయ ॥

వనితలరహస్యాలు వాఁగి వాఁగి నీవీనులు
వెనకతియ్య వెంతేసి విన్నవించినా
తవివోవిమర్మములు తాఁకి తాఁకి గట్టిపడె
[2]పవి(న?)వి నీచేతు లెట్టు పట్టిపెనఁగేను ॥ ఓయ ॥

కుచములు దాఁకి తాఁకి గురులాయ నీవురము
రచన నవ్విటాను నీరచ్చకెక్కెను
యిచట శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
పచరించి నీయాసలు పట్ట నెట్టు వచ్చును ॥ ఓయ ॥ 322

1. 'ఘాతకు'శద్బవమా? 2. 'పవివివి' అని విరుచవచ్చునా?

గౌళ

పొయిఁ బాలవంటిది పూఁచినతనమోహమెల్లా
నయముల నెందాఁకా నానఁబెట్టవచ్చునే ॥ పల్లవి ॥

కన్నులఁ గన్నప్పుడే కందువచుట్టరికము
వున్నప్పుడెల్లా నూరకే వుండును తాను
చన్నులు మోఁపినప్పుడే జల్లనఁ బులకించును
యెన్నిక నల్లంతనుంచే యేఁ(యెం?)తైనాఁ గరఁగఁడు ॥ పొయిఁ ॥

పిలిచినప్పుడే తనప్రియవాదిపలుకులు
చలమునన్నప్పుడు సటలే తాను
తలఁచినప్పుడే తనతమకపువినోదాలు
మలసివున్నప్పుడైతే మానుపడివుండును ॥ పొయిఁ ॥

గక్కనఁ గూడినప్పుడే ఘనమైనతనయింపు
తక్కినప్పుడు గొంటుఁదనమే తాను
యెక్కువతో శ్రీవేంకటేశుఁ డిప్పుడు నన్ను నేలె
చెక్కులనొక్కినవేళ చిరునవ్వు నవ్వును ॥ పొయిఁ ॥ 323

సామంతం

ఇంతియవ్వనసీమకు యేలికవు నీవైతివి
రంతు లిన్నియును నేలు రపమాయ నీకును ॥ పల్లవి ॥

మొలకనవ్వులనేటిమోసులు
చెలఁగేటిపెదవులచిగురులు
మలపి పై తాఁకులమారాకులు
వలపులపైరులు వనితపై నవివో ॥ ఇంతి ॥

పూచినసిగ్గులలోనిపుప్పొడులు
కాచినచన్నుల నిమ్మకాయలు
యేచినమోవిపండ్లు యెనఁగెను
చేచేత వసంతవేళ చెలియమై నదివో ॥ఇంతి॥

చెప్పరానిపలుకులచిలుకలు
ముప్పిరి నెరిఁదుమ్మిదమూఁకలు
యిప్పుడే శ్రీవేంకటేశ యింతి నీవు గూడఁగాను
కుప్పలకొటారులు కొమ్మమేన నదివో ॥ఇంతి॥ 324

రేకు 1166 వరాళి

ఇద్దరిలోపల నీవు యెవ్వతెను మెచ్చితివి
అద్దలించక మాకిది యానతియ్యవయ్యా ॥పల్లవి॥

కొమ్మ వొక్కరితె కేళాకూళిలో జలకేళి
కమ్మి పెనఁగేయట్లాఁ గాఁగిటఁ గూడె
పమ్మి వేరొక్కతె వచ్చి పైకొని యది దెలిసి
దిమ్మరితనాన మోవితేనె చవిగొనెను ॥ఇద్ద॥

పడఁతి వొక్కతె నిన్ను పక్కపారికాన వచ్చి
తొడలఁ బీడించి పట్టి తొలఁగఁదీసె
యెదచొచ్చి వేరొకతె ఇవ్వలిపారిసెమున
అడియాలమైనమాట లటు విన్నవించెను ॥ఇద్ద॥

మునిఁగివచ్చి యొకతె మొక్కలాన నిన్నుఁ గూడి
మొనలచన్నుల నూఁది మొకమెత్తెను
ఘనుఁడ శ్రీవేంకటేశ కమ్మటి మఱియొకతె
మనసిజరతులను మాఱుపిల్లాడెను ॥ఇద్ద॥ 325

పాడి

నమ్మెదురు యింక నిన్ను నలినాక్షులు
వుమ్మడి నింకానేల వొడఁబరచేవు ॥పల్లవి॥

వేడుకకాఁడవై తివి విచ్చి విచ్చి ఆపె నాతో—
నాడినన్నిఁ గలవు నీయంగములందు
యీడుపడ నే నిన్ను నింతకంటె నేమాడేను
యేడలేనియానలు నీవేల పెట్టేవిఁకను ॥నమ్మె॥

వగలివట యేడనో నాలి చేసినచేఁతలు
తగుదు వన్నియు వింటిఁ దరుణిచేత
యెగసక్యానకు నే వింతకంటే నేమిసేసే
తగిలి సతులనేల తారుకాణించేవు ॥నమ్మె॥

నన్నేలితివి కాఁగిట నసువు లక్కడివలె
కన్నులెదుటనే నాకుఁ గానవచ్చెను
యెన్నఁగ శ్రీవేంకటేశ ఇంతకంటె నిఁక నేమి
పన్ని ననగవులేల పచారించేవు ॥నమ్మె॥ 326

నాదరామక్రియ

వట్టిదోసాలు గట్టేవు వద్దన్నాఁ బోవు
అట్టడి సేఁతల వింతా అడిసేతురా ॥పల్లవి॥

చలివాయ గొల్లెతలసంగడిఁ గూచుండుకొంటా
బలిమి వారిపాదాలు పైవేసుకొంటా
కులికి చేతుల వారిగుబ్బలు రాచుకొంటా(టాఁ?)
బలిసే వదేమోయి పొద్దువోదా నీకు ॥వట్టి॥

కామరేపడుచులతో కొల్లున నవ్వుకొంటా
చెమటలంట చేతులఁ జెనకుకొంటా
అమర వారిపూదండ లవి మెడవేసుకొంటా
తమకించే వేఁటదొరతనమోయి నీకు ॥ పట్టి ॥

మందబోయి రాండ్లను మానముపైఁ దిట్టుకొంటా?
అంది పోఁకముడి విడిచాడుకొంటాను
ఇందరి శ్రీవేంకటేశ యెనసితివి మమ్మెల్లా
ఇందుముఖులెల్లాను ఇంతబాఁతే నీకు ॥ పట్టి ॥ 327

## దేసాళం

కామాతురునకును గర్వ మెక్కుఁడు
వేమారుఁ బెచ్చువెరిగ విట్టివీఁగు మీఁకను ॥ పల్లవి ॥

నీకేల వెరపూ నీవిన్నిటా దొరవూ
చేకొని యేమిచేసినాఁ జెల్లును నేఁడు
యీకడనాకడ సతు లెందరైనా నున్నవారు
చేకొని మత్తుఁడవై చెలరేఁగు మీఁకను ॥ కామా ॥

అడ్డాఁక లేదవి అన్నిటాఁ దెగుదారివి
వొడ్డారాన నెట్టుండినా వొరపే నీకు
జడ్డుదేరె తమ్ములము సరి నీపుక్కిళ్ల వదె
దొడ్డగాఁ జొక్కుచు సోలి తుదమీరు మీఁకను ॥ కామా ॥

పండెను నీతపమూ పట్టినదెల్లాఁ బైఁడి
అండనే నన్నుఁ గూడితి వాయను పని
నిండఁగ శ్రీవేంకటాద్రినిధిఁ దొక్కివున్నాఁడవు
కొండవంటివుబ్బుతోడఁ గొల్లగొను మీఁకను ॥ కామా ॥ 328

బౌళి

కదమమాటలు నీవే కనుకోవయ్యా
పదఁతులలోన వానిపట్టుదానవయ్యా ॥ పల్లవి ॥

పంతము నేనా విడువ పైకొని మాటలాడేవు
యెంతవడి వూఁకొందు నేమనేవయ్యా
కాంతుడవు నీవు గక్కన వంచుకోరాదు
చెంత నీనవ్వుల కెట్టు చేతులొగ్గేనయ్యా ॥ కద ॥

పాయపుగర్వపుదానఁ బలుమారు మొక్కేవు
యీయెడ నెందాఁకాఁ జూతు నేమనేవయ్యా
నీయంతదొరవు పని నీచేఁ గొనఁగరాదు
చాయల నేమని నీతో సమ్మతించేనయ్యా ॥ కద ॥

చలము నాకే కలదు సారె నన్ను వేఁడుకొనే-
యెలయింపు లెట్టువిందు నేమనేనయ్యా
బలిమి శ్రీవేంకటేశ పైకొని కూడితి విట్టె
నిలువెల్లా వలపులే నీవే నేనయ్యా ॥ కద ॥ 329

సాళంగం

ఇఁ(ఇం?)తా నీమహిమలే యేల నవ్వేవు
ఇంతులెల్లా మందఁగానే యేల నవ్వేవు ॥ పల్లవి ॥

దవ్వులనుండినదాన దగ్గరివచ్చితి నింతే
యెవ్వరు విన్నేమని రేల నవ్వేవు
పవ్వళించివుండఁగాను పన్నీరు చల్లితి నింతే
యివ్వల నామోము చూచి యేల నవ్వేవు ॥ ఇంతా ॥

యిచ్చకములాడి నీకు యిటు ప్రియాలు చెప్పితే
యెచ్చరి నీవే తెలిసి యేల నవ్వేవు
మెచ్చి మెచ్చి చనవుతో మేలములాడినందుకు
యెచ్చుకుందు లాయనంటా యేల నవ్వేవు ॥ ఇంతా ॥

కాయకపుచెమటలు కడిగి కడిగి నేను
యీయెడ విన్నుఁ గూడితే యేల నవ్వేవు
పాయపుశ్రీవేంకటేశ పనులెల్లాఁ జక్కనాయ
యీయరావిచన విచ్చి యేల నవ్వేవు ॥ ఇంతా ॥ 330

రేకు 1167 సౌరాష్ట్రం

లేవే యెందాఁకాను లెక్కలువెట్టేవు
అవటించి పైకొంటే నాయములు రేఁగును ॥ పల్లవి ॥

యెదురుమాటలాడితే నెనైన్నాఁ గలవు
పొదిగి కాఁగిలించితే పొందు చేకూరు
చదురులాడఁజూచితే [1]సరియాఁకలై యుండు
అదన మోవియానితే నద్దాఁక లేదు ॥ లేవే ॥

పనులు విచారించితే బంద్లకొలఁదులు
ననిచి రతినేసితే నాఁడే పెండ్లి
పెనఁగఁబోతే కదువిగియ మనసువుట్టు
చెనకి పైకొంటేను చేతఁజిక్కు వలపు ॥ లేవే ॥

కొచ్చి సిగ్గువడితేను కొండలౌను జగమెల్లా
పచ్చిగా రతినేసితే బట్టబయలు
యిచ్చట శ్రీవేంకటేశుఁ డెనసె నేఁ డింతలోనె
ఇచ్చగించితే నట్టే యితవౌఁ దిమకము ॥ లేవే ॥ 331

1. సరి + ఆఁకలు.

నీలాంబరి

తెలుసుకొమ్మీ యిట్టె దిక్కుల పరాకు మాని
ఫలించెఁజుమ్మీ జవ్వనపాయమెల్లాను ॥ పల్లవి ॥

చిగురుటాకులను వ్రాసిన మేలుసుద్దులే
మగువయాదేమంచిమాటలెల్లాను
మొగి ముత్తెపుఁజిప్పలి మూసిదించినవే
వెగటైనచూపులవెన్నెలలెల్లాను ॥ తెలు ॥

కమలపుపుటికల కలయ నీపైఁజల్లేవే
రమణిచేఁతలు సేసేరచనలెల్లా
అమర మరుగరిడి నటు సాములు చూపేదే
కొమరె నీతొడమీఁదఁ గూచుండేదెల్లాను ॥ తెలు ॥

పువ్వులగుత్తుల నిన్నుఁ బూజలు సేసేదే
జవ్వని చన్నులనొత్తేసరసమెల్లా
రవ్వగా శ్రీవేంకటేశ రమణిఁ బెండ్లాడినదే
బువ్వపురతుల నీతోఁ బొత్తులు గూడినది ॥ తెలు ॥ 332

ముఖారి

ఎరవై పట్టనేరము యింతేసి పూసివాసులు
ఇరవైవుందాన నీకు నేమిసేతురా ॥ పల్లవి ॥

యెంత నే మాటలాడినా యెగసక్కేమే యనేవు
కొంతగొంత చూచితేను కోపమనేవు
వింతప్రియాలు సేసితే వెంగెములుగాఁ బట్టేవు
యెంతటివాఁడవు విన్ను నేమనందురా ॥ ఎర ॥

అట్టే సిగ్గులువడితే నలిగితి నే ననేవు
గట్టిగాఁ గొంగువట్టితే గయ్యాళనేవు
నెట్టుకొని నీవద్దనుంటే నే నిన్ను [1] నమ్మకనేవు
యిట్టిమతకపువాని నెట్టు నే గెలుతురా ॥ ఎర ॥

అంకెకెల్లా వచ్చితేను [2] అబ్బురములివనేవు
సంకెలేక నవ్వితేను సటలనేవు
లంకెల శ్రీవేంకటేశ లలి నన్నుఁ గూడితివి
యింకా నిన్నప్పటిని యెట్టు గొసరుదురా ॥ ఎర ॥ 333

కేదారగౌళ

చూతము దానికేమి సుభము లన్నియు నింకా
కాతరపుచేఁతలచే కదుమించరాదా ॥ పల్లవి ॥

తెల్లనాయఁ గన్నులు తేటలాయ నీసుద్దులు
పల్లదాన మాఘాదేల పట్టేవయ్యా
చెల్లుబడి గలదు సిగ్గులు నీకా లేవు
బల్లిదుఁడవై యిట్లానే బతుకరాదా ॥ చూత ॥

చెమరించె నీమేను చేఁతలు రూఢికెక్కె
తమితో నింకా మమ్మేల దగ్గరేవయ్యా
భ్రమయించనేరుతువు బాసలు మీఱఁగలవు
అమర నిన్నిమేళ్లు నందఁగరాదా ॥ చూత ॥

కళలు మోమున రేఁగె కాఁగిటిలో చలివాపె
బలిమి సేసి మమ్మేల పైకొనేవయ్యా
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
వెలలేనివేడుకల వెలయరాదా ॥ చూత ॥ 334

---

1. నమ్మక + అనేవు: 2. అబ్బురములు + ఇవి + అనేవు.

ఆహిరి

ఇంతికి నీవు లోనైతి వేమందు నిన్ను
పంతములాడేటికాంతఁ బట్టవచ్చునా ॥ పల్లవి ॥

నాయములు చెప్పఁగాను నన్ను నేల తిట్టేవు
ఆయింతిపొందు నేయుమంటినా నిన్ను
ఆయెడ నే నడ్డమురానని నన్ను దూరేవు
పాయపుమదముసతిఁ బటవచ్చునా ॥ ఇంతి ॥

నడుమ నవ్వేటిదాని నన్ను నేల గద్దించేవు
గొడవ లాపెతోఁ బెట్టుకొమ్మంటినా
తొడిఁబడ నీకు నేను తోడుగానైతి ననేవు
బడిఁబై కొనేజవ్వనిఁ బట్టవచ్చునా ॥ ఇంతి ॥

నిన్నుఁ జేయివట్టేదాని నీవేల సొలసేవు
అన్నిటా నాపెతోఁ బెనఁగాడుమంటినా
యెన్నఁగ శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
పన్ని నీమోహపుఁజెలిఁ బట్టవచ్చునా ॥ ఇంతి ॥ 335

మంగళకౌశిక

వద్దనున్నారము నేము వాడికవారమెల్లాను
కొద్దిమీరి ముమ్మదము కుంగ దెఁ(దెం?)తైనాను ॥ పల్లవి ॥

వెలఁది కొత్తవలపు వేఁడివేఁడిచెమటలు
బలిమి వి న్నేపొద్దుఁ బాయఁగలేదు
మెలుపుతోడ నీవు మెడఁగట్టుకొనవయ్య
తిలకించ నాసోదము తీర దెఁ(దెం?)తైనాను ॥ వద్ద ॥

చెలియ వింతొకచూపు చిరునవ్వు లొకటవి
కొలువులో నీతోడఁ  గూరుచున్నది
పొలుపై నీదేవరఁగాఁ బూజించుకొనవయ్య
తలఁపులో నాపెకు తవియ దెఁ(దెం?)తైవను ॥వద్ద॥

అంగనకాఁగిటిపెండ్లి అట్టె నాగవెల్లి
సంగతిగా నినుఁగూడి సతమాయను
యింగితాన శ్రీవేంకటేశుఁడ మన్నించవయ్య
చెంగట మానరునకె చేరె నెంతయినాను ॥వద్ద॥ 336

రేకు 1168 పళవంజరం

దయగలదానవు తమకించకువే ఇట్టె
ప్రియపడఁగానే ఇంక విగియఁగవచ్చునా ॥పల్లవి॥

భావ మెఱిఁగి మెల్లనె పైకొని కూడుటగాక
కైవసమైనవానిఁ గక్కసింతురా
యేవల్లనుండి వచ్చిన యెదురుకొందురుగాక
నీవద్దఁగూచుండఁగానే విష్టూరమాడుదురా ॥దయ॥

వూరట చేసుకొని వొడఁబరచుటగాక
కూరిమిగలుగువారిఁ గోపగింతురా
కోరి మచ్చము లుండినా కూర్చుకొనవలెఁగాక
సారె సారెఁ జెనకఁగా సణఁగులాడుదురా ॥దయ॥

వేఁడుకలెల్లాఁ జూపి విన్నవించుకొంటగాక
కూడి శ్రీవేంకటేశుఁ గొసరుదురా
మేడెపురతులలోన మెచ్చులు మెత్తురుగాక
పాడిగా నీతో నవ్వఁగ పంతములాడుదురా ॥దయ॥ 337

తోఁడి

మావంటివారికెల్లా మాటల లోనయ్యేవా
లావరులంతై తేఁగాక లాలనకు మెత్తువా ॥పల్లవి॥

చలమరులై నట్టిసతులకుఁగాని మరి
బలిమిగలపతులు పంపుసేయరు
తెలివితోఁ గొంగువట్టితీసేవారికిఁగాని
కెలయుచు నెఁ(నెం?)తైనా కిందుపదరు ॥మావం॥

ముంగోపులై నట్టిముదితలనేకాని
కందు దీరి యెందుకునుఁ గై కొనరు
వంగక తిట్టేమెరవడికత్తెలకుఁగాని
ముంగిటఁ గాచుకుండి మోహించరు ॥మావం॥

యెడయక కాచుకుండేఇంతులకేకాని
బడిబడిఁ గాచుకుండి పసికిరారు
అదరి శ్రీవేంకటేశ అట్టె నన్ను నేలితివి
తడవకుఁడిన మీరు తమకించరు ॥మావం॥ 338

ఆహిరి

ఏమోయి నేనెఱఁగనా యెంతకెంత సేసేవు
కామతంత్రములకివి కందువలుగాక ॥పల్లవి॥

తొకదఁ దిట్టితినంటా నెగ్గులేల పట్టేవు
నాకు నీపైఁ గోపమా నగితిఁగాక
కైకొని ఒంకింతునంటా కమ్మటివి దూరేవు
పొచేకొన్న పగదానా చెలిమిగాక ॥ఏమో॥

పొలయలుకలకె వొగిలేవు రానంటా
చలమా నీతో నాకు చవులుగాక
పలుకనై తినంటా పై పైఁ జింతించేవు
చలపట్టినదావనా సరసముగాక ॥ ఏమో ॥

గుట్టులో నేనుండఁగాను కొసరేవు రానంటా
చిట్టకపుదాననా సిగ్గులుగాక
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
జట్టుచేసేనా నిన్ను జట్టిగొనేఁగాక ॥ ఏమో ॥ 339

వరాళి

ఎట్టు భ్రమయకుందుము యిటువంటివిన్నుఁ జూచి
వుట్టిపడీ నిదివో నీవాడఁబాటువొందులు ॥ పల్లవి ॥

పెచ్చురేఁగి వలచినప్రియురాండ్ల కెల్లాను
మచ్చుమేఁపులాయను నీమంచిమాటలు
అచ్చలాన నీవుదూపేఆస లందరికిఁ జేల-
పచ్చలాయ నిదివో నీబయకారిచేఁతలు ॥ ఎట్టు ॥

కాలుదొక్కినట్టినీకామినులకెల్లాను
పాలకూళ్లాయను నీపచ్చినవ్వులు
యీలాగులే ఇందరికి యీఁదులాడేనీటిలోవి-
వోలలాయ నిదివో నీపువ్వువేపిపొత్తులు ॥ ఎట్టు ॥

మక్కువ నిన్నుఁగూడినమముటోండ్లకెల్లాను
చొక్కుమందులాయను నీసొంపురతులు
గక్కన శ్రీవేంకటేశ కలసితివి నీమేలు
రొక్కమాయ నిదివో నీరూఢైవసున్ననలు ॥ ఎట్టు ॥ 340

గౌళ

వెఱపేల రమ్మనవే వింతవాఁడా తా నాకు
మెఱుఁగు మెరిచితేను మించదా దిక్కులను ॥ పల్లవి ॥

అందుకేమె తా నన్ను నాదరించె వింతలోనే
యెందఱిఁ గూడివచ్చినా నేమాయనే
ముందు నన్నుఁగూడెను ముడిచివేసినపువ్వు
పొందుగా పీదినుండితే బుగంధించకుండునా ॥ వెఱ ॥

కడమ యేదే తాను కైకొని నన్ను మెచ్చె
యెడసి యెందుండినాను యేమాయనే
కడఁగి నాతో నవ్వె గరచివేసినబూరె
అడరి యెక్కడఁగన్నా నట్టె నోరూరదా ॥ వెఱ ॥

ఇన్నినేలె శ్రీవేంకటేశుఁ డిట్టె నన్ను నేరె
యెన్నిపెండ్లిండ్లాడినా నేమాయనే
వున్నాఁడు నాకాఁగిటను వొద్దికైననాకంచము
కన్నవారెల్లాఁ బొత్తుగలయక వుందురా ॥ వెఱ ॥ 341

ఆహిరినాట

ఇయ్యకొఁటి నీపనులు ఇంతా మేలే
చెయ్యిమీఁదాయ నాకు సిరులేమి బాఁతి ॥ పల్లవి ॥

నయగారివాఁడవు నాకు నీవు గలవు
ప్రియములేమి గడమ పెక్కుమారులు
క్రియ లెఱుఁగుదువు కేలు దాఁచేవు నామీఁద
వియకాన నిందుకే నీయాలనైతిని ॥ ఇయ్య ॥

చలపాదివాఁడవు సతమై వున్నాఁడవు
బలిమి యేమి గదమ పైపై నేఁడు
వలపించ నేరుతువు వంచేవు నాపై నసువు
కలకాలమును నీకుఁ గైవశమైతిని ॥ఇయ్య॥

శ్రీవేంకటేశుఁడవు చేరి నన్నుఁ గూడితివి
దైవిక మేమిగదమ తగులాయను
భావ మెఱుఁగుదువు పచ్చిగా నవ్వేవు నాతో
వేవేలకును నీకే వెల్లవిరి యైతిని ॥ఇయ్య॥ 342

రేకు 1169 సామంతం

తరుణి కింతచలము తగవు గాదు
సరుగ నాతనిమాఁట సమ్మతించవే ॥పల్లవి॥

ఎవితే నొద్దుకొంటా ఇరితీపుసేసుకొంటా
వుడుకఁబెట్టేవు మోహ మొక్కమాఁటే
విడలె నీరమణుఁడు పంతము నీకుఁ జెల్లె
యెడయ కింతటనైనా యింపు చల్లవే ॥తరు॥

పిలిచితే బిగుసుతా ప్రియము చెప్పించుకొంటా
కలయ నూరేవు నవ్వు కడుఁగడు
అలవిమీరె నాతఁడు అమరె నీరాజసము
సొలసి యింతటనైనాఁ జొక్కించవే ॥తరు॥

కదిసితేఁ దిట్టుతాను కందువలు రేఁచుకొంటా
వెదచల్లేవు సిగ్గులు వేడుకతోడ
చెదరకుండా నిన్ను శ్రీవేంకటేశుఁడుఁ గూడె
పొదలి ఇంతటనైనాఁ బొసఁగుండవే ॥తరు॥ 343

పాడి

మానినులమీఁదనేల మదములు చల్లేవు
అనుకొని జాణాలెల్లా నాడుదము రమ్మా ॥పల్లవి॥

వలపులెల్లా రేఁచి వాడలసతులఁ జూపి
చలము పుట్టింతురా సతుల కింత
పొలసి పొద్దులు నీకుఁ బోకుండేఁగనక నేఁడు
అలవోక చదురంగాలాడుదము రమ్మా ॥మాని॥

సరసములెల్లా నాడి సవతుల నెచ్చరించి
కరికరినేతురా కాంతల వింత
పురుటున నీకింత పుబ్బసపోకుండేను
అరుదుగాఁ బగడసాఁగాడుదము రమ్మా ॥మాని॥

కొల్లన నవ్వులు నవ్వి కొలువుసతులఁ గూర్చి
పల్లదాలాడుదురా పట్టపువారి
యెల్లగా శ్రీవేంకటేశ యేనసితి విటు నన్ను
అల్లాడ నెత్తము మన మాడుదము రమ్మా ॥మాని॥ 344

ఆహిరి

ఎందాఁకా వట్టిజాగులేల వేవేవే
సందడించి వలపులు జాజుకొనఁగాను ॥పల్లవి॥

సిగ్గులువడుదురా శిరసు వంచుదురా
దగ్గరి కూచుండి పతి తలఁపించఁగా
వొగ్గి అందుకోకుందురా వూరకే వుండుదురా
వెగ్గళించి యాతఁడు విడెమియ్యఁగాను ॥ఎందా॥

కన్నెపడుచవా నీవు కడుముద్దరాలవా
మిన్నక లోఁగేవు పతి మేలమాడఁగా
మన్నన నెఱఁగవా మనసు సోడించేవా
విన్నంతనే పలుకవు వేఁడుకోఁగాను ॥ఎందాఁ॥

కప్పుర మియ్యఁగవద్దా కాఁగిలించుకొనవద్దా
యిప్పుడె శ్రీవేంకటేశుఁ డెనసె నిన్ను
చెప్పినట్టు సేయవద్దా సేవల మెప్పించవద్దా
తప్ప కాతఁ దప్పటివి తమకించఁగాను ॥ఎందాఁ॥ 345

## భైరవి

కరుణించవయ్యా కామినిని
గరిమ నివ్వెరగుల కాణాచితో నున్నది ॥పల్లవి॥

జమళికానుకలు సతి నీకు నియ్యవచ్చి
సముకాన నిలిచుండి చాఁచుమా చెయ్యి
నెమకి చెక్కులనే నిలువుటద్దాలు వట్టి
అమర నూడిగాలు నీకదివో సేసీని ॥కరు॥

వేడుక మోవిపంటి విందు నీకుఁ జెప్పవచ్చి
వోడక నిన్నుఁ జూచీ వొగ్గుమా కొంగు
వీడినకొప్పునీలాలు వెలసేసి నీకుఁ జూపి
జాదతోడ నిచ్చకాలు సారెసారె జేసీ నీకును ॥కరు॥

కనకపుమేనివన్నె కప్పములు నీకుఁ బట్టి
చెనకీఁ బామపుమీఁదఁ జేకొనరాదా
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసె నిన్నింతలోనే
వనిత నానారతుల వంతులువేసీని ॥కరు॥ 346

ముఖారి

ఏమి చెప్పేవు సుద్దులు యెందాఁక మాతో
కామించినటువలెఁ గైకొందువు గాక ॥పల్లవి॥

పంతములాడఁగనేల బలిమి గలితే నీకు
చెంతనుండి యేమైనా జేతువుగాక
వింతలు మరేడవి వెల్లావిరైననీకు
సంతకూటములనె జడుతువుగాక ॥ఏమి॥

అనుమానాలు మరేల అన్నిటా సర్వజ్ఞుఁడవు
చెనకి మమ్ము రట్టుసేతువుగాక
వెనకముందేడది వేడుకగలుగునీకు
పనిగలయపుడెల్లాఁ బైకొందువుగాక ॥ఏమి॥

సిగ్గు వీడనేల నీకు శ్రీవేంకటేశుఁడవు
వొగ్గి నన్నేలితి విట్టె వుందువుగాక
యెగ్గుదప్పు లేడవి యింతవలచిననీకు
కగ్గులేక యిట్లానే కలతువు గాక ॥ఏమి॥ 847

నాదరామక్రియ

ఏమి సేయవచ్చునమ్మ యీకాలము
కామినుల నెవ్వరైనాఁ గైకొందురా ॥పల్లవి॥

యిచ్చకములాడేకాదా యింతులెల్లాఁ బతులను
పచ్చిగాఁగ భ్రమయించి వలపించేది
మచ్చరించి సతులెల్లా మతియేల అగ్గువైరి
తచ్చి యిటువంటివారే తలచైరి భువిని ॥ఏమి॥

సరసములాడేకాదా సారెకును మనసులు
కరఁగిఁ(గిం?)చి గర్వముల ఘనమయ్యేది
తరితీపుల మరేల తడఁబడేరు ముయ్యీ(య్యే?)ద
సరి నిండువంక మొగచాటాయ మోహము ॥ఏమి॥

నవ్వులు నవ్వేకాదా నయాన వేంకటేశు
రవ్వఁగాఁ గాఁగిటఁ గూడి రతికెక్కర
యివ్వల మరేల నన్ను నెవనె నీతఁడై పైపై
మువ్వంక నిండువంక నేమును వాయఁబంతము ॥ఏమి॥ 348

రేకు 1170 వేళావళి

ఎన్నిమాయలు నేసేవు యేఁటివేసాలు బొయ్యేవు
నిన్ను నన్ను నెంచు కొంటే నీవే కావా ॥పల్లవి॥

మిన్నక నీవలపులే మెరమీ వింతేకాక
కన్నులనాచూపు పీపైఁ గాఁడిపారీనా
తిన్ననై నీకాఁక తరితీపులు నేసీఁగాక
వున్నతి నామోవి నోరూరించీనా ॥ఎన్ని॥

పట్టరాని నీవయసు భ్రమయించీ నింతేకాక
గట్టినాచన్నులు పీకళ దాఁకీనా
నెట్టన నీతమకమే విన్నుఁ గరఁగించీఁగాక
తొట్టి నాచక్కఁదనము దొమ్మి వేసీనా ॥ఎన్ని॥

కలఁ పీకాఁగిలే గక్కనఁ జొక్కించెఁగాక
మలసి నామేలు విన్ను మఱపించెనా
తెలిపి శ్రీవేంకటేశ దిక్కయి నన్నేలితివి
చలపట్టి నాగుణము సాదించెనా ॥ఎన్ని॥ 349

### మేఁచబౌళి

ఓపితేఁగనక నీవు వాదిగట్టు మిందుకును
కోపము పనికిరాదు కొమ్మలయెడలను ॥పల్లవి॥

వలపు జున్నువంటిది వడి రేఁచఁబోతేను
తిలకించ మోవినే తేనె గారును
తలఁపు తీగెవంటిది దగ్గరి పొందునేసితే
పులకలమొగ్గలు గొబ్బున మేనఁ బొడము ॥ఓపి॥

ననుపు వెన్నవంటిది నవ్వులు నవ్వితేనే
మొనసి నెలవి నయములు దేరును
చనవు పంటవంటిది జాణతనాలాడఁగానే
అనుగునాలికె తుద నక్షయమై పెరుగు ॥ఓపి॥

రతి తపమువంటిది రచనలు మీఱఁగాను
చతురతఁ గాఁగిటిలో సఫలమౌను
హితవుతో శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
మితిమీఱి యిందులోనె మేలెల్లాఁ జేరును ॥ఓపి॥ 350

### దేసాళం

మఱచేమా నేమిఁక మాఁటిమాఁటికి
తఱితోద నేపొద్దు ధ్యానము సేసేము ॥పల్లవి॥

ఆపె గరుడిఁ జదివినటు వంటిమాఁటలు
రాషల విదివో నేఁడు రచ్చకెక్కెను
పైపై నే మవియెల్లా పాటముగొంటిమి నేఁడు
చాపలాన నేపొద్దూ జపము సేసేవు ॥మఱ॥

---

ప్రతిలోఁ గలవి చిఱుమెక్కినవి.

పడఁతి మొగసాలలోఁ బచరించినచేఁతలు
వడిగాఁగ విన్నిట్లాను వహికెక్కెను
విడివిగా నేమవి నేరుచుకొంటి మిదివో
తడఁబడ కేపొద్దూఁ దలఁచుకొనేము ॥ మఱి ॥

అంగవమంచముమీఁద నభ్యసించినవిద్యలు
రంగుగా మాకాఁగిటిలో రతికెక్కెను
అంగవించి శ్రీవేంకటాధిప నన్నే కూడితి
సింగారాలవీరూపే చింతనవేనేము ॥ మఱి ॥ 351

## సామంతం

ఇవివో మాసుద్దులు యెవ్వరికి ముద్దులు
వివరించి చూచుకొమ్మా వింతవింతబుద్ధులు ॥ పల్లవి ॥

తారుకాణించఁగఁబోతే తప్పులాయ మాఁటలు
వూరకే వినఁగఁబోతే నుప్పులాయను
సారెసారెఁ జెనకఁగ చప్పనాయ వలపులు
కోరి వెనఁగఁగఁబోతే గొప్పలాయను ॥ ఇది ॥

బడిబడిఁ జేయఁబోతే పగలాయచేఁతలు
తడవివప్పుడెల్లాను తగులాయను
నడుకొత్త వినయాలు నానావగలాయను
గొడవలేవిపొందుఁగుట్టు మిగులాయను ॥ ఇది ॥

నవిచి పెనఁగఁబోతె నవ్వులాయ నాసలు
పొనుఁగక దాఁచితేనే పువ్వులాయను
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను వింతలోనే
ఏనుఁగొన్నరతులెల్లా కడురవ్వలాయను ॥ ఇది ॥ 352

క్రిగీతగలవి చిలుమెక్కినవి

బౌళి

నేసవెట్టవయ్యా ఇట్టె చెలిమీఁదను
ఆసల మీకిద్దరికి నన్నిటా నమరును ॥ పల్లవి ॥

గక్కనఁ జెట్టపట్టితే కంకణమువంటి దాపె
దక్క వురమెక్కితేను తాళివంటిది
మొక్కలానఁ దొడెక్కితే మొలనూలువంటిది
అక్కజమై నీకు నాపె కన్నిటా నమరును ॥ నేస ॥

చేరి విన్నవించితేను చెవిపోగులవంటిది
నీరతికి వద్దనుంటే నీడవంటిది
కోరి పానుపుపై పెండ్లికూఁతురువంటి దేపొద్దు
ఆరీతి నాపెకు నీకు నన్నిటా నమరును ॥ నేస ॥

పాదాలనేవ నేసితే పావకోళ్ల(కోళ్ళ?)వంటిది
సోదించి కూచుండితేను సొమ్ము వంటిది
యీదెస శ్రీవేంకటేశ యింతి నీవుఁ గూడితిరి
అదిగాని నీకు నాపె కన్నిటా నమరును ॥ నేస ॥ 353

మధ్యమావతి

అప్పటి మమ్ముఁ జెనకే వానోదకాఁడవు నీవు
చప్పఁగాగరివద్ద పెసరుగింజవయ్యా ॥ పల్లవి ॥

అలిగించుకొంటా వెంగే లాడి యాడించుకొంటా
వెలఁది యొకతెచేత వేగించరాదు
పలువురుగొల్లమంకుభామలబారిఁ జిక్కి
బలిమినెట్లా వెళ్లఁబడితివయ్యా ॥ అప్ప ॥

చన్నుల నొత్తించుకొంటా సారె జంకింపించుకొంటా
కన్నెవొక్కతె కాఁగిటఁ గరఁగరాదు
పన్నినపదారువేలవంతలకు లోనై
ఇన్నిటా నెల్ల ధరియించితివయ్యా ॥ అప్ప ॥

చెందినరతికేలివి శ్రీవేంకటేశ్వర
పొంది యొక్కతె మెప్పించి భోగించరాదు
యిందరిరూపులై నయిందిరను నన్ను నేలి
అందపు వేడుకల నెట్టలరితివయ్యా ॥ అప్ప ॥ 354

రేకు 1171 ఆహిరినాట

సిగ్గువడ వె(వెం?)తైనా చెల్లఁబో నీవు
బగ్గన మమ్ము నవ్వఁబాటు నేసేవు ॥ పల్లవి ॥

చాయలకు నీవు నాతో సరసములాడఁగాను
మోయుచు సవతులు మోములుచూచుకొనేరు
యీయెడ మంచముమీఁద నిద్దరముఁ గూచుండఁగా
నాయములు పెట్టుక సన్నలునేసుకొనేరు ॥ సిగ్గు ॥

కాతరాన నీవు నాకు గందపుబొట్టు వెట్టఁగా
జాతులువేసేరు వారె సారెసారెఁ జెలులు
చేతిసురటివి నీవు చేరి నాకు విసరఁగ
రాతిరిఁబగలును కేరడములాడేరు ॥ సిగ్గు ॥

కందువల నీవు నన్నుఁ గాఁగిలించి కూడఁగాను
అందరుఁ దమతమకే ఆసపడి రిపుడు
పొందిన శ్రీవేంకటేశ భోగము లెల్లా సరి
మందలించి నా కెక్కుడుమన్నన లనేరు ॥ సిగ్గు ॥ 355

బౌళి

ఏమిదప్పిపోయ నీకు నెందరు లేరు సతులు
నేమముతో నున్నదాన నెరవేర్చరాదా ॥పల్లవి॥

మగువా నీవును నుండి మాటలు నన్నాదించేవు
యెగసక్కెలాడఁగా నీ వేమందువో
జగడాల కోపను చాయనేసుకొని నేను
వొగి నూరకున్నదాన నుండనీరాదా ॥ఏమి॥

పదఁతి నీకుండఁగా నాపయ్యెదకొంగు వట్టేవు
యెదపి చేత దొబ్బఁగా నేమందువో
కదుఁగోప మాఁపలేక గక్కన గుట్టువేమ్మక
వొదికాన నున్నదాన నుండనీరాదా ॥ఏమి॥

దక్కి యాపెఁ గూడుండి తడవేవు వన్నప్పటి
యెక్కడికైనా రమ్మంటే నేమందువో
ఇక్కడ శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
వుక్కుమీరి వున్నదాని నుండనీరాదా ॥ఏమి॥ 366

లలిత

ఎఱుఁగుదు మిందరము నీవలపు
[1] తర(ఱ?)గరితనముతో దాఁచనేమిటికే ॥పల్లవి॥

జొబ్బిలుఁజెమటలతో బోవగారీ నీవలపు
విబ్బరపుటూర్పుల విండీ వలపు
వుబ్బిరిపులకలచే వుట్టిపడీ నీవలపు
అబ్బురపుపతితోడ నలుగనేమిటికే ॥ఎఱు॥

---

1. యతిప్రాసస్థలముల [illegible] అక్కడక్కడ అవి [illegible] వ్రాయసకాని లోపముగా తోచుచున్నది.

జాతెడితురుముతోడ నందడించీ నీవలపు
మీఁటినరతుల మితిమీఁటీ నీవలపు
అణిదికాఁకలతోడ ఆయాలురేఁగీ వలపు
చూటులుగా నిశినికి చూపిచెప్పనేఁటికే ॥ ఎటు ॥

వేడుకచూపులతోడ వేళగాచీ నీవలపు
పూడిగెపుచేఁతల కౌగ్గి వలపు
కూడె శ్రీవేంకటేశుఁడు గొబ్బున నిన్నంతలోనె
¹మోడామోడిసిగ్గుల మూసిపెట్టనేఁటికే ॥ ఎటు ॥ 357

మంగళకౌశిక

ఏల తిట్టు దిట్టేవు ఎవ్వరి దవరాధము
మూలలవారిచన్నులు ముట్టితియ్యఁగాను ॥ పల్లవి ॥

చెక్కులు నొక్కె నొకతె చీరలుదీసె నొకతె
చక్కనిగొల్లెతలతో సాముసేయఁగా
తొక్కెఁ బాదాన నొక్కతె దొమ్మిసేసె మరొకతె
వుక్కన వారింట్లలోనివు లెక్కఁగాను ॥ ఏల ॥

చన్నుల నొత్తె నొకతె చప్పరించె మోవొకతె
పన్ని గొల్లవారి నీవు బందుసేయఁగా
వన్నెల దూరె నొకతె చలము రేఁచె నొకతె
పన్నగ వారిచీరలు వట్టితియ్యఁగాను ॥ ఏల ॥

కైకొని పట్టె నొకతె కందువఁ గూడె నొకతె
తోకతో మందలవారి సోదించఁగా
అకడ శ్రీవేంకటేశ అలయించె నిన్నొకతె
దీకొని వారి బలిమిఁ దీపి కూడఁగాను ॥ ఏల ॥ 358

1. 'మోడామోడి' శబ్దరూపము కావచ్చు. బయట పడినదనిసిగ్గులు కావచ్చు.

### సామవరాళి

తగవెఱఁగనివాఁడా తరుణిరో నీమగఁడు
నగవులకొలఁదినే నాఁటుకొనీఁగాక ॥పల్లవి॥

నొంచేవు రమణుని నూటిదప్పకచూచేవు
కలసినందాఁకా నిట్టే కొంతాళించేవు
నెలవులు చూపుదురా పతితోడ నింతేసి
కొలఁదెఱిఁగితఁడే కూడీఁగాక ॥తగ॥

పెనఁగే నాతనితోడ పెట్టిమాటలాడేవు
తమకుపోఁకినదాఁకాఁ దమకించేవు
మొనలెత్తి చూపుదురా మొదలనే ఆతనితో
అనువెఱిఁగి తానే ఆదరించీఁగాక ॥తగ॥

కక్కసించి పిలిచేవు కరకరిఁబెట్టేవు
చిక్కి తోనైనదాఁకా చిమ్మిరేఁగేవు
యెక్కువశ్రీవేంకటేశుఁ డితఁ డిట్టె నిన్నుఁ గూడె
మిక్కిలియితఁడే నీకు మేలువాఁ డవుఁగాక ॥తగ॥ 359

### అమరసింధు

అనతియ్యవయ్యా అందుకు మాఁకెఱుఁగుదు
పూని అందరిని నీకుఁ బొందువేసేను ॥పల్లవి॥

వసివాడుమోముతోడ వంచుకొనేవు శిరసు
దెవల నెవ్వతెనైనాఁ దిట్టదుగదా
అమరుమరొకాన అలసేవు పలుమారు
ననికి ని న్నెవ్వతెనైనాఁ బిప్పవేసెనో ॥అన॥

పుడుకుఁ జెమటతోడ నొరగేవు మలగుపై
కడనెవ్వతైనా నలుగదుగదా
చిడుముడితోఁ గొంత చిన్నఁబోయివున్నాఁడవు
పడఁతి యెవ్వతెయైనాఁ బంతమాడెనో ॥ అన ॥

నిండుఁగళలతోడుత నివ్వెరగైనాఁడవు
అండనెవ్వతైనా మర్మా లంటదుగదా
దండిగా శ్రీవేంకటేశ తగ వన్ను నేలితివి
చండిపెట్టి యెవ్వతైనా సారెకు బోధించెనో ॥ అన ॥ 360

రేకు 1172 సామంతం

నీవాళ్లనేర మెంచవు నేమే కల్లలమనేవు
తావుకు విచ్చేయుమా తారుకాణించేము ॥ పల్లవి ॥

మావంటివారిమాట మనసునఁ బట్టకుంటే
ఆవలికి రావయ్యా ఆపె ఆడీని
కావించి నేనిచ్చినట్టికమ్మ నీవు నమ్మకుంటే
వావిరి నీపదుగుమా వా(వ్రా?)సి చూపీని ॥ నీవా ॥

వూడిగపువారిమొక్కు లొల్లఁబోతైతేను
ఆడకే రమ్మా నీకు నాపె మొక్కీని
యీడ నేమువెట్టేటిఆన లియ్యకోలుగాకుంటే
తోడనే విచ్చేయుమా తొయ్యలిచే వినేవు ॥ నీవా ॥

[1]ఇచ్చినమాచేకానుక లింపులు నీకుఁ గాకుంటే
అచ్చటికి రమ్మా చెలి ఆపె యిచ్చీని
ఇచ్చల శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
అచ్చుగా నీ వేకతములాడుమా విన్నవించీని ॥ నీవా ॥ 361

1. 'మాచే నిచ్చినకానుక' అనుట పాఠము.

వరాళి

మాపుదాఁకా వట్టిజోలి మాతో నేఁటికి
నీపొందుల కిది వలె నేరుచుకోవయ్యా ॥పల్లవి॥

తెగరానిమాఁటలకు తెరువు కోపగించుట
నగితేనే పెనగొను నాలితనము
మొగము చూచితేనే మోహములెల్లా నిందు
నిగిడి నీకేది వలె నేరుచుకోవయ్యా ॥మాపు॥

తీరనియలుకలకు తెరఁగు పంతమిచ్చుట
పూరకుండితేనే నాయ మమ్మళినుండు
కూఁటమి గొనరితేనే కుప్పవడు వలపులు
నీరచన కేది వలె నేరుచుకోవయ్యా ॥మాపు॥

వట్టినవా(వాచ?)లములకు పరిహా(హా?)రము మొక్కుటే
గుట్టుతో మంచే వన్నెఁ గొనసాగును
ఇట్టె శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
నెట్టన నీకేది వలె నేరుచుకోవయ్యా ॥మాపు॥ 382

దేసాళం

చేతికి లోనై నప్పుడే చేరి కై కొందువుగాక
పోతరపుమదమునఁ బొద్దేల జరపేవె ॥పల్లవి॥

పిలువఁగఁబిలువఁగ బిగిసే వాతనితోను
బలపాదితనమేలే పారెపారెకు
వలువున నీవలపు వాఁటి మతి సందఁగాను
వెలి నీవు వడిచేసి విఱ్ఱవీఁగేదేఁటిదే ॥చేరి॥

పట్టఁబట్టి నాతనితో బలిమినే పెనఁగేవు
వట్టిబీరములేఁటికే వరవాతాను
వుట్టిపడి నీయాసలు వొడినిండా నుండఁగాను
దిట్టతనములు చూపేదీమన మదేఁటిదే ॥ చేతి ॥

కూడఁగఁగూడఁగ గునిసే వాతనితోను
పాదిపంతము లేఁటికే పచ్చిదేరెను
యీడనె శ్రీవేంకటేశుఁ డెవనె నిన్నింతలోనె
నీదెపుసౌఖ్యాలతోడి నింత లిదేఁటిదే ॥ చేతి ॥ 363

రామక్రియ

ఏల వేగిరించేవు యింతలోననే నీవు
కాలుదొక్కినప్పుడే కరఁగించీఁగాక ॥ పల్లవి ॥

నిన్ను నేమైనాఁ దిట్టైనా నెంఁత నీచేఁతలకు
చన్నుల మొనలనే సాదించీఁగాక
యెన్నిసుద్దులు చెప్పినా యెదురు నీకాడినా
సన్నలచాయలనే చక్కఁబెట్టీఁగాక ॥ ఏల ॥

కోపగించినా ఆపె కొందుకనీసుద్దులకు
చూపులకొనలనే సోదించీఁగాక
మాపుదాఁకా నవ్వినాను మారుకొనీనా నీతి
తీపులమాటలనే తిద్దుకొనీఁగాక ॥ ఏల ॥

జంకించినా నేఁడు సతి నీగుణములకు
వొంకపురతులనే భోగించీఁగాక
అంకెల శ్రీవేంకటేశ ఆపె నీవుఁ గూడితిరి
మంతుఁదనాలు చూపినా మనపిచ్చీఁగాక ॥ ఏల ॥ 364

గౌళ

ఎప్పటికెప్పటివాదు లెందాఁకానే
కొప్పులువీడినమీఁద కూడుకొనవలదా ॥పల్లవి॥

సొగిసి మొగామొగాలు చూచుకొంటే(?) జాలుఁగాక
తగవు లేమున్నవే తనకు నాకు
నగవులు నెలవుల నాటుకొంటేఁ జాలుఁగాక
ఎగసక్కేలు మరెవ్వరు నేమాడేరే ॥ఎప్ప॥

ఆరీతినే మాటకు మాటాడుకొంటేఁ జాలుఁగాక
తారుకాణ లేమున్నవే తనకు నాకు
తారసించి మేనుమేనుఁ దగులై తేఁ జాలుఁగాక
నేరములు మరెవ్వరు నేఁడేమి పట్టేరే ॥ఎప్ప॥

ఇతవుతో నిట్లానే యెనసితేఁ జాలుఁగాక
తతి యెంచ నేమున్నదే తనకు నాకు
రతివి శ్రీవేంకటాద్రిరమణుఁడు నన్ను నేలె
మతకా లెవ్వరు నింక మరేమి వన్నె రె ॥ఎప్ప॥ 365

పళవంజరం

ఈతగవు నీమతిలో నెంచుకోవద్దా
కాతరాన నీవు మమ్ముఁ గదియఁగఁ జెల్లునా ॥పల్లవి॥

వేడుకకు నేఁ దిట్టితే వెంగెము సేసుకొందురా
ఆడుకొనేరా నిన్ను నవ్వులివారు
పాడితో నింత పిల్చితివదేవాఁడ వైతేను
వోడక మోవెంగిలికి నొగ్గ నీకుఁ జెల్లునా ॥ఈత॥

నగుతా గోరగిరితే నాతో వాదింతురా
అగడు వేసేరా నిన్ను నవ్వలివారు
వాగి నీ వింతపనికి నోపనివాఁడ వైతేను
మిగులా రతులఁ గిందుమీఁదుపడఁజెల్లునా ॥ ఈత ॥

చేయివట్టి నేఁదీసితే శిరసిచే పంతురా
ఆయెడఁ బంగించేరా అవ్వలివారు
యీయెడ నన్నుఁ గూడితి వింతవాసివాఁడవు
చాయల శ్రీ వేంకటేశ చన్నులంటఁజెల్లునా ॥ ఈత ॥ 366

రేకు 1173 కాంబోది

అనరాదు గాక నిన్ను ఆయములు చూపి మోపి
ఘనుఁడవైతే పాపము కలపేవా నీవు ॥ పల్లవి ॥

శిరసు వంచుకుందాన సిగ్గువడివున్నదాన
కరఁగుచు నాపై నేల కాలు వేసేవు
సరుగవ నెఁ(నెం?)తైనా మజ్జన మవధరించవు
దొరవైతే నేసినట్టిదోసములు వాసునా ॥ అన ॥

కలయక వున్నదాన కడవిట్టే వున్నదాన
యెలమిఁ దమ్మలము నాకేల పెట్టేవు
కలవి మోవి యెంగిలి కడుగుకో వెఁ(వెం?)తైనా
యిలయేలేవాఁడవైతే నెంగిలి లేదా ॥ అన ॥

అంటఁగాక వున్నదాన ఆసవెట్టుచున్నదాన
జంటగాఁ గాఁగిటఁ బట్టి సారెఁ గూడేవు
నంటున శ్రీవేంకటేశ నామతక మెఱఁగవు
దంటవయనువాఁడవైతే తప్పొప్పు లేదా ॥ అన ॥ 367

ఆహిరి

ఇన్నాళ్ల నెఱఁగము ఇంతలేసిపనులు
సన్నల చాయలనే సతమాయ వావులు ॥పల్లవి॥

పాటపాట సిగ్గులతో పడఁతి నీవు నవ్వఁగ
తేటతెల్లమాయను మీ తెఱఁగులెల్లా
మాటమాటలను మీరు మర్మాలు సోఁకనాడఁగా
వాటమాయ మీలోనివాడికవలపులు ॥ఇన్నా॥

వెడవెడచూపు మీపై విచ్చనవిడిఁ బారఁగ
తడఁబడీ మీలోవితమకమెల్లా
చిదుముడితో మీరు చేతులు పైఁ జాఁచఁగాను
అదియాలాలాయను మీఅంకెలైనలంకెలు ॥ఇన్నా॥

పొద్దువొద్దు బాసలు గొబ్బున మీలోఁ జేయఁగాను
వొద్దికాయఁ గూటములు వొందురులలో
అద్దుక శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడఁగాను
మద్దులాయఁ దొల్లిటిపెనొలపులపొందులు ॥ఇన్నా॥ 368

పాడి

తరవాతిపనులకు తానే నేము
మరుతంత్రములోన మరియేఁటిమాటలే ॥పల్లవి॥

బలువుకొలఁదియే పంతము
దలముకొలఁదియే పాదింపులు
కలిమికొలఁదియే గర్వము
మలపి తనకు వాకు మరియేఁటిమాటలే ॥తర॥

మనసుకొలఁదియే మంగళము
చనవుకొలఁదియే సరసము
యెనసినకొలఁదివే యింపులు
మనవి ననవి చెల్లె మరియేఁటిమాటలే ॥తర॥

మచ్చికకొలఁదివే మంతనాలు
వచ్చినకొలఁదివే వాడికలు
ఇచ్చగించి శ్రీవేంకటేశుఁడే తా నన్నుఁ గూడె
మచ్చరములెల్లాఁ బాసె మరియేఁటిమాటలే ॥తర॥ 369

హిందోళం

ఏమయ్య కటకటా యెంతదోసము
ఏమైన మందెమేళ మింత సేసీనా ॥పల్లవి॥

ఆపె నీకు విడెమిచ్చేననఁగానే వేగిరించి
చాపలానఁ దముల మొసఁగుమనేవు
ఆపవి [1]తొల్లిలవాటైతే నీకు నాయఁగాక
యీపదఁతి యిపుడు నీ కెంగిలివెట్టీనా ॥ఏమ॥

వెలఁది నీ కొకనాఁడు విందువెట్టేననఁగానె
తొలఁగక యిపుడే పొత్తుకు వచ్చేవు
అలరి నీకిది సాజమైతే నాయఁగాక
కలికి నీకు నెంగిలికడి వెట్టీనా ॥ఏమ॥

సారెకు రతుల మేలు చవిచూపేననఁగానె
తేరి యిందరిలో మోవితేనడిగేవు
మారుక శ్రీవేంకటాద్రిమందెమురాయ కూడితి
యీరీతి నింకా నీకు నెంగిలివెట్టీనా ॥ఏమ॥ 370

1. తొల్లి + అలవాటు.

దేసాళం

నేయవయ్య నీకు నేఁడు చెల్లినంతాను
పాయరాదు విన్ను విట్టె పైకొనుటేకాని ॥ పల్లవి ॥

తెగరాదు నీవెంత దిమ్మరివై తిరిగినా
జగడానఁ గొంతగొంత సాదించది(చు టె?)
నగరాదు నీవు నేనేనాటకపుఁజేఁతలకు
మొగమోడి చేతులెత్తి మొక్కు టింతేకాని ॥ నేయ ॥

తిట్టరాదు యెవ్వతెతోఁ దెగడియాడినా నిన్ను
జట్టిగాఁ జూపులఁ జూచి జంకించుటే
పట్టరానినీ వెందుఁ బఱచవై తిరిగినా
చెట్టవట్టి నీసేవసేయు టింతేకాని ॥ నేయ ॥

మానరాదు నీవెన్నిమతకముల నుందినా
నావినచెమటలతో నంటుసేయుటే
పూనిక శ్రీవేంకటేశ పొందితివి నన్ను విట్టె
అనుకొని నీతో ముదమందు టింతేకాని ॥ నేయ ॥ 371

కాంబోది

నన్నునేల తడవేవు నాణాద నీవెఱఁగవా
యెన్నిక విను దగ్గర విది వేళా నాకు ॥ పల్లవి ॥

చాయలకు నాపె నీతో పరసములాడఁగాను
నాయమూ నీతో నాకు నవ్వఁగ నేఁడు
చేయి చాఁచి యప్పటివి చెనకులు చెనకఁగా
యీయెడ నీసేవ సేయ విది వేళా నాకు ॥ నన్ను ॥

యెలయించి యాపె నిన్ను నేకతానకుఁ దియ్యఁగా
చలమా నిన్నుఁ బిలువ సారెకు నాకు
పలుమారుఁ దానె నీతోఁ బచ్చిమాఁటలాడఁగాను
యెలమి నే విడెమీయ నిది వేళా నాకు ॥ నన్ను ॥

గరిమ నాపె నిన్నుఁ గాఁగిలించుకుండఁగాను
పురుఁడా నేను నట్టె పొత్తుగలయ
ఇరవై శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
యెరవులేక కొసర నిది వేళా నాకు ॥ నన్ను ॥ 372

రేకు 1174 ముఖారి

అంత విచ్చి చెప్పకు మా కప్పటి నీవు
యింతా నీమన్నవలోనె యెఱఁగరాదా ॥ పల్లవి ॥

నీనులకు నేఁజేసేవిన్నపము చవులైతే
నావినావి నీవలపు ననలొత్తివి
ఆనందించి నీకు నాపై నంతబత్తి గలిగితే
కావరాదా నీమోముకళలలోనె ॥ అంత ॥

సొగలుగా నేఁజూచేచూపులే నీ కితవైతే
చేఁగదేరెనీమనసు చిగిరించీని
వేగిరించి నన్నుఁ బొందేవేడుక నీకుఁ గలితే
లాగుగాఁ దెలియదా పెలవినవ్వులోనె ॥ అంత ॥

చెనకేనాసరసము చిత్తాన నీకుఁ బట్టితే
పనివడి నీకోరిక ఫలియించీని
యెనయుచు శ్రీవేంకటేశ నన్ను నేలితివి
వనుపెల్లాఁ దోఁచదా యీనయములోనె ॥ అంత ॥ 373

శ్రీరాగం

ఇంతలోనె వేగిరమా యెందు వోయేము
వంతులువెట్టాడకురా వచ్చేఁగాని నేను ‖ పల్లవి ‖

నాలితనాననే నీవు నాతులను వలపించి
వేలసంఖ్యలను లోన వేసుకొంటివి
పాలించి యింకా నెందరి భ్రమయించనున్నాఁడవో
చేలకొంగు విడువరా చెప్పేఁగాని నీకు ‖ ఇంత ‖

సాదుఁదనాన నప్పటి సతులఁ దక్కులఁబెట్టి
ఆదిగో విందరిమానా లంటుకొంటివి
యీదెస నెవ్వరెవ్వరి నెంతవేయ నున్నాఁడవో
సోదించకురా నావాడి చూపేఁగాని మేలు ‖ ఇంత ‖

మంచితనాననే నీవు మానినులమోవు లావి
చంచల నెంగిలిసేసి చవిగొంటివి
యెంచఁగ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
దించకురా నీవురము తిరమైతి విపుడు ‖ ఇంత ‖ 374

పూర్వగౌళ

ఇద్దరూ నెదిరించిరి ఇన్నిటికి మూలము
పొద్దువొద్దుకు మనము బుద్ధిచెప్పనేఁటికే ‖ పల్లవి ‖

వెలవివవ్వివనవ్వు పిగ్గులకు మూలము
కలికితనము కాఁకలమూలము
పలుకులు లోలోనె పైకొమటకు మూలము
వెలపె వన్నిపములు వేగిరించనేఁటికే ‖ ఇద్ద ‖

కొనఁగోరిచెనకులు కోరికలకు మూలము
పెనఁగులాటలు కపుఁబ్రియమూలము
తనివోనికొసరులు తమకముల మూలము
యెనసెఁ దనంతఁదానె యెచ్చరించనేఁటికే ॥ఇద్ద॥

మొగమొగాలు చూచుట మొక్కులకు మూలము
తగవులు కూటమికిఁ దానె మూలము
నిగిడి శ్రీవేంకటాద్రినిలయుఁడు సతి నేలె
పగటున నిఁక వేరేబాసదుగనేఁటికే ॥ఇద్ద॥ 375

## గౌళ

ఇంత వెఱపుమఱపు లేఁటికి నీకు
కాంతలుపెక్కుగలుగుఘనుఁడవు నీవు ॥పల్లవి॥

చెక్కులు నిన్ను నొక్కితే సిగ్గులువడుదురా
చొక్కపుచూపుల నన్ను చూతువు గాక
గక్కున చేయివేసితే కడుఁజెమరింతురా
ఇక్కువ లంటి నన్ను యెచ్చరింతువు గాక ॥ఇంత॥

నిన్ను నోఁకనాడితేను నివ్వెరగందుదురా
అన్నిటాను నాకు లోనవుదువుగాక
సన్నలు సేసితేనే జల్లనఁ బులకింతురా
మన్నించి నాతో మారుమలతువుగాక ॥ఇంత॥

వొద్దికై నేఁ గూడితేను వూరకే భ్రమతురా
చద్దివేఁడిసలపులు చల్లుదుగాక
అద్దో శ్రీవేంకటేశ ఆలనైతి నీకు నేను
పొద్దువొద్దు రతులను భోగింతువుగాక ॥ఇంత॥ 376

ఆహిరినాట

తనవోజ మానఁడు తప్పు లాతనికి లేవు
పెనఁగఁగఁ బెనఁగఁగ బీరమే కలది ||పల్లవి||

సారె మీరు చెప్పఁగాను చలపట్టి పోరఁగాను
కూరిమిఁ గొసరఁగాను కోపగించేనా
మేరమీరినాతఁడు మిందుఁగిందు నెంచఁడు
తారుకాణించఁగఁబోతే తగవులే కలవి ||తన||

అందాలు మీరు చెప్పఁగా నట్టె వేఁడుకొనఁగా
విందువలె మొక్కఁగాను వెగ్గళించేనా
మందెమేళమే యాతఁడు మానఁడు తన గుణాలు
అందుకు నౌఁగాదంటే నావలే కలవి ||తన||

పవివడి మీరవఁగా పంతాలు సరిసేయఁగా
చనవులు చెల్లించఁగా సాదించేనా
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను విట్టె
వనుపు నటించఁగాను నవ్వులే గలవి ||తన|| 377

సామంతం

నీలోవివారమే నేమెల్లాను
పాలువొంగినట్లనే బతుకవే యిఁకను ||పల్లవి||

విలువెల్ల నీడే నీకేమి గడమే
వలపించితివి యిందువంక నాతని
చలవాసితి వన్నిటా సతమాయ నాతఁడు
ఫలియించె నీతపము బతుకవే యిఁకను ||నీలో||

మేనెల్ల గర్వమే మేకులు నీకేమి బాఁతె
లోను సేసుకొంటివి మేలున నాతని
యీనెపాన దొరవైతి వింత సేసె నాతఁడు
పావినచలము చెల్లె బతుకవే యిఁకను ॥నీలో॥

రూపెల్ల బిగువే నేరుపులు నీకేమి గొత్తె
తీపులఁబెట్టితివి యింతేసి యాతని
చేపట్టి విన్నిట్టె కూడె శ్రీవేంకటేశుఁడు
పైపైనె మావలెనే బతుకవే యిఁకను ॥నీలో॥ 378

రేకు 1175 ఆహిరి

ఏమి సేయవచ్చునయ్యా ఇంతుల భాగ్యము గాక
బూమెలనీగుణములే బుద్ధులునేరుపవా ॥పల్లవి॥

వెలుపలినీచేఁతలు వెల్లవిరులై యుండఁగా
తెలియదా నామాట దిష్టము నీకు
చలివాసి నీవలపు సరివచ్చివుండఁగాను
సెలవి నీనవ్వులింకాఁ జిమ్మిరేఁగవా ॥ఏమి॥

మికై (క్కి?)లిపరాకులు నీమీఁద విండివుండఁగాను
చిక్కదా నాకానికె చేతికి నీకు
మక్కువతో నీమేను మచ్చములు చూపఁగాను
తక్కక నీసిగ్గు లింకాఁదలకొనవా ॥ఏమి॥

కరఁగిననీరతులు కాంరి(కాఁగి?)టిలో మండఁగాను
యిరవుగావా నాగోరియెచ్చరికెలు
యెరవులేక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
ధరలోన నీబాసలు తగవులు చెప్పవా ॥ఏమి॥ 379

శ్రీరాగం

నేరుతునా నేనేమైనా నీమహిమ లింతేకాక
వూరకేవుండేనన్నా వుద్యే(ద్యో?)గాలఁ బెట్టును ॥ పల్లవి ॥

నెట్టుకొన్న యటువంటినీతోడిపొందులు
రట్టుసేయవా నీచట్టాలనెల్లా
గుట్టున నెంతవుండినాఁ గొచ్చికొచ్చి పెదరేఁచి
దిట్టమాట లాడించు దీకొని నీతోను ॥ నేరు ॥

కూరిమితో నీకాఁగిటఁ గూడేటికూటములు
ఆరీతి రేఁచకుండునా అందవారివి
యేరేతిసాదులనైనా యెమ్మెలెల్లాఁ బుట్టించి
నేరములు పట్టింపించు నిన్ననే సారెకును ॥ నేరు ॥

సందడించినటువంటిసరసపురతు లివి
మందెమేళము సేయించు మావినులను
కందువ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
అందాలు సేయించును నీయరఁగొరలెల్లాను ॥ నేరు ॥ 380

వరాళి

ఇంకవేల కొసరూ యిన్నిపనులను నాయ
పొంకమైతి రిన్నిటాను పొరలెల్లాఁ బాసె ॥ పల్లవి ॥

యీవల వింటిలోన మిమ్మిద్దరివిఁ బొదగవి
వేవేగ మామతిలోవివెఱపు వాసె
చేవలుమీరినమీకు చేతులారా వద్దను డి
వేవలెల్లాఁ జేయఁగాను సిల్సితి వాసె ॥ ఇంక ॥

వనపున నిద్దరూను నవ్వు లిట్టె నవ్వఁగాను
పనివడి తొల్లిటికోపమూఁ బాసె
పెనఁగుచు నొండొరులు ప్రియములు నటించఁగా
జయమంది తిట్లాడేచలమెల్లఁ బాసె ॥ఇంక॥

అలమేల్మంగ నురమందు నీవెక్కించుకోఁగా
మొలచినయనుమానములెల్లఁ బాసె
యెలమి శ్రీవేంకటేశ ఇద్దరూ నమ్మేళఁగాను
నెలకొంటి మిఁకను మానేరమెల్లఁ బాసె ॥ఇంక॥ 381

## భైరవి

నేనే యెంతైనాను నిన్ను నిడువలేఁగాక
నానఁబెట్టితే గొడ్డలి నావఁబొయ్యీనా ॥పల్లవి॥

చెలరేఁగి నీకెంత సేవలు చేసినాను
వలపుగలంతెకాక వద్దనుండేవా
మలసి విన్నప్పటివి మాటలఁ బేలించినాను
తలఁపుకొలఁదే కాకతమకించేవా ॥నేనే॥

యెనసి నీతో నెన్నియిచ్చకము లాడినాను
కనుపట్టినంతేకాక కైకొనేవా
చనవునేసుక మరి సరసములాడినాను
పెనఁగేకొలఁదిగాక ప్రియపడేవా ॥నేనే॥

పగటున నిను నెంత పట్టి యెచ్చరించినాను
నగవుకొలఁదేకాక నాఁటుకొనేవా
మిగుల శ్రీవేంకటేశ మెచ్చి నన్నుఁ గూడితివి
మొగమోటకైనాను మోహించకుండేవా ॥నేనే॥ 382

పాడి

మించి కతలకుఁ గాళ్లు మించకుఁ జెవు లదిగేవు
అంచెలమోవితీట్ల కందుకేమదిగేవు ॥ పల్లవి ॥

గబ్బితనావనాడినకాఁకలమాటలకెల్లా
గొబ్బునఁ దెలుపుమని కొంగువట్టేవు
పుబ్బున రతివేళల నొకటొకటే యాడిన-
అబ్బురపుసుద్దులకు నందుకేమనేవు ॥ మించి ॥

కూరిమి గొసరుతాను గొణఁగినబాసలకు
తారుకాణించుమనుచు దగ్గరేవు
యేరోరి అనుచునాదేయింపులరాకొట్లకు
ఆరసి యేకతమున నప్పుదేమనేవు ॥ మించి ॥

జవ్వనమదాన నీపైఁ జల్లినపంతాలకు
చివ్వనఁ గాఁతాళించి చేయివట్టేవు
నవ్వుతా శ్రీవేంకటేశ నన్నుఁ గూడితి వింతలో
అవ్వల నిందుకు నాతో నర్తమేమనేవు ॥ మించి ॥ 383

శంకరాభరణం

గోరగిరి నాచెక్కు గోవిందుఁడు
కూరిములు గొసరీని గోవిందుఁడు ॥ పల్లవి ॥

నలిరేఁగి నను జూచి నవ్వీఁగదవే నేఁడు
కొలువులోపలనుండి గోవిందుఁడు
తలవంచుకొని నేను తరుణిమాటున నుంటే
కులికికులికి చూచీ గోవిందుఁడు ॥ గోర ॥

చిప్పిలుఁదమకమున చేసన్న సేసీఁగదే
కొప్పు ముడుచుకోఁగానే గోవిందుఁడు
వుప్పతిల్లుసిగ్గుతోడ నొదికాన నే నుండితే
గొప్పతామరల వేసీ గోవిందుఁడు ॥గోర॥

కమ్మటినిఁ దెరవేసి కాఁగిలించి కూడెఁగదే
కుమ్మరింపుమోహముల గోవిందుడు
ఇమ్ముల శ్రీవేంకటాద్రి నిరవై తిరుపతిలో
కొమ్మలతో పీడువెట్టీ గోవిందుఁడు ॥గోర॥ 384

రేకు 1176 ధన్నాసి

ఆతఁ డెవ్వాఁడు చూపరే అమ్మలాల
ఏతుల నాదేటిక్రిష్ణుఁ డీతఁడే కాఁడుగదా ॥పల్లవి॥

కందువ దేవకి బిడ్డఁగనెనట నడురేయి
అంది యశోదకుఁ గొడుకై నాఁడట
సందడించి పూతకిచంటిపాలుఁ దాగెనట
మందల ఆవులఁ గాచి మలసెనట ॥ఆతఁ॥

మంచిబండి దన్నెనట మద్దులు విరిచెనట
ఇంచుకంతవేలఁ గొండయెత్తినాఁడట
మంచాలపై గొల్లెతలమానాలు చేకొనెనట
మించులఁ బిల్లగోవివట్టి మెరసెనట ॥ఆతఁ॥

కాళింగుని మెట్టెనట కంసుఁ బొరిగొనెనట
పాలించి సురలఁ జేపట్టెనట
యీలీల శ్రీవేంకటాద్రి నిరవైనదేవుఁడట
యేలెనట పదారువేలింతుల నిందరిని ॥ఆతఁ॥ 385

### దేశాక్షి

ఏమిసేతుమమ్మ నేము యెశోదమ్మ
గామిడితనములనే కడఁగీ బాలుఁడు ॥పల్లవి॥

అందెలు మువ్వలు ఘల్లురనఁగ వీదివీదుల-
నందుక పుట్లు గొట్టీవదె బాలుఁడు
గొందిమన్నఁ బోసీక కోలలు చాఁచిచాఁచి
పొందుగ దొండ్లువోవఁ బొడిచీ మీబాలుఁడు ॥ఏమి॥

చంగులకాళతోడ సొరిది బాలులతోడ
ముంగిటి వుట్లు గొట్టీ ముద్దుబాలుఁడు
అంగవించి గొల్లెతలు అడ్డములురాఁగానే
యెంగిలిసేసీ మోవులు యిదిగో మీబాలుఁడు ॥ఏమి॥

చొల్లెపుజెడ వీఁపున సోయగమై వేలఁగాను
చిల్లరవుట్లు గొట్టీఁ జిన్నిబాలుఁడు
మెల్లనె సతులఁ దాను మేలములాడుకొంటా
ఇల్లిదె శ్రీవేంకటాద్రి యెక్కెను మీ బాలుఁడు ॥ఏమి॥ 386

### పాడి

ఇంకనేఁటిమాటలే ఇయ్యకొనేదేగాక
పంకపుఁజెమటలు మైఁ బిరగెఁగదే ॥పల్లవి॥

కడఁగి నీ వలిగి గక్కన లేచి నిలుచుంటే
జెడిదపుటానలెల్లాఁ జెట్టీ నీపతి
వాడివట్టి తియ్యఁగాను వోవనఁటాఁ జెనఁగఁగ
జడిసి పోఁకముడి జారెఁగదవే ॥ఇంక॥

పంతమున నీవు లోనిపరపుపైఁ బండితేను
చెంతల నాతఁడు నీచెక్కులు నొక్కె
కొంతఁగొంత చెనకఁగఁ గోపగించి తిట్టఁగాను
బంతినే సిగ్గులు నీరై పారెఁగదవే ॥ ఇంక ॥

నమపున నింతలోనె నవ్వులు నీవు నవ్వితే
ఘనశ్రీవేంకటేశుఁడు కలసెఁగదే
మనసులు సోదించఁగా మరపులు మించఁగాను
నినుపులై పులకలు నిండెఁగదవే ॥ ఇంక ॥ 387

## అమరసింధు

అక్కవు నీవు నాకు నైనానైతివి గాని
వొక్కింతవడికైనా నోపుదువటె ॥ పల్లవి ॥

చెలరేఁగి చెలరేఁగి చేతులు చాఁచేవు నీవు
వలెనటే నాతో నీకు వరవాతాను
బలుములు చూపి పెక్కుపంతములాడుకొనేవు
నిలిచేవా నాముందర నేరుపులను ॥ అక్క ॥

నారువోసి నారువోసి నవ్వులు నవ్వేవు నీవు
వోరిచేవటే నాతో వొడ్డారాలకు
పేరువాడి పేరువాడి బిరుదులు మెరసేవు
చేరఁగలవా నాచేవల్లకు ॥ అక్క ॥

పెచ్చురేఁగి పెచ్చురేఁగి పెనఁగేవు నాతోను
వచ్చేవటే నాతోడి వరుసలకు
యిచ్చగించి శ్రీవేంకటేశుఁ డిద్దరిఁ గూడె
మెచ్చేవటే విన్నుమించినయంమకును ॥ అక్క ॥ 388

సోమరాగం

విగిసి యాపె నీకుఁ బెట్టవికోట
యెగసక్కెలకు నీవు యేమిసేసుకొంటివి ॥ పల్లవి ॥

కోపగించుకోఁబోఁగా కొలిచి మొక్కవలసె
తీపులఁ దిట్టినందుకు దీవించవలసె
చూపుల జంకించఁగాను సూడుపెనఁగవలసె
యేపున నెంతకునెంత యేమిసేసుకొంటివి ॥ విగి ॥

చేవట్టితియ్యఁగఁబోఁగా చెక్కులు నొక్కవలసె
చేవమీర నవ్వఁగాను సిగ్గువడవలసె
కావరించి పైకొనఁగా కైవశము గావలసె
యే(యీ?)విదాన నుండివుండి యేమిసేసుకొంటివి ॥ విగి ॥

కాఁకలుసేయఁగబోఁగా గక్కనఁ గూడవలసె
పోఁకముడి యంటఁగాను భోగించవలసె
వేఁకపుశ్రీవేంకటేశ వెలఁదిఁ గలసితిట్టె
యేఁకట నీయంత నీవు యేమిసేసుకొంటివి ॥ విగి ॥ 389

ఆహిరి

మానితినే తనతోడిమచ్చరములు
కానీవే ఇఁకనేమి కపటాలు బాసెనే ॥ పల్లవి ॥

వెనకటివలెఁగాక విచ్చేసెఁ దా నీడకు
మనసొక్కటాయ వేరేమాఁటలేఁటికే
చనవిచ్చె నింతఁగాను చలమెల్లా విడిచెను
కనుపట్టెఁ దనచేఁత కాఁతాళించనేలే ॥ మాని ॥

పరులమాట వినక పైకొని నన్ను మన్నించె
మరిగితి నాలోనిమంతు దీరెనే
సరసము లాడె నాతో సటలెల్లా విడిచెను
కెరలెను నామోహము కిసరు విడిచెనే ॥ మాని ॥

వూసివాసు లెంచక వాగి నన్ను వేఁడుకొనె
సేసలు పైఁబెట్టితినే చెల్లెఁ బంతము
ఆసల శ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
నేసిననాపుణ్య మంబెఁ(మబ్బె?) జెలఁగితినె ॥ మాని ॥ 390

రేకు 1177 శ్రీరాగం

ఇంకానేల కొసరేవు యింతిని
సుంకులు గావా గోరిసూటివాటు ॥ పల్లవి ॥

చిగురుఁజిత్తములోనిచేఁగతనములే కావా
నగియేటిచెలిమోవినగవులు
మొగ్గి విచ్చకకురిసేమోవితేనెలే కావా
పగటువ నీతోడిపలుకులు ॥ ఇంకా ॥

వుదుటుఁగాంక్షలలోనివురుఁదాళ్లే కావా
సుదతి నిన్నుఁజూచేచూపులు
వదలుఁబయ్యెదలోనివన్నెకానికలు గావా
మెడలుఁజన్నులనీమేటినోఁకులు ॥ ఇంకా ॥

నల్లేటివలపులసంగడి సేసలు గావా
చెల్లుఁబడి నింతిసేసేచేఁతలు
మెల్లనె శ్రీవేంకటేశ మించి యేలితి వాపెను
కొల్లలుగావా నీతో(?) గొనకొన్నరతులు ॥ ఇంకా ॥ 391

మధ్యమావతి

తప్పులేల పట్టేవు తరణి నప్పటి నీవు
చప్పరింపుమాటలు సాజమేకాదా ॥ పల్లవి ॥

వతి సన్న సేసితేను పనిలేనిపనికై నా
సతులు జంకించేది సాజమేకాదా
రతికి రాయడించితే రాజసాన జంపు[1] సేసి
చతురతఁ దిట్టేది సాజమేకాదా ॥ తప్పు ॥

చేరి కొంగువట్టేవానిఁ జిగిరింపుఁగాఁకతో
సైరణతోఁ జూచేది సాజమేకాదా
మేరమీరి కాఁతాళించి మీఁదమీఁదఁ బొదిగితే
సారె సిగ్గులువడేది సాజమేకాదా ॥ తప్పు ॥

అంకెల నీవు గూడఁగా నట్టె శ్రీవేంకటేశ్వర
జంకించి మోవదిగేది సాజమేకాదా
లంకెలై మీరిద్దరును లావులఁ బెనఁగేవేళ
సంకెలెల్ల మానేది సాజమేకాదా ॥ తప్పు ॥ 392

కాంబోది

నేమెల్లా నీయంత నేరమా యేమి
గామిడితనాలు బుద్ధికాదనికాక ॥ పల్లవి ॥

యిచ్చకపుమాఁటలు యెందాఁకా నాడేవే
పచ్చిగా విభునినేల భ్రమయించేవే
నెచ్చెలులు నీవలె నేరనివారా యేమి
తుచ్చెము సేయుట కడుదోసమనికాక ॥ నేమె ॥

1. ఈ 'సేసి' హేత్వర్థకక్త్వార్థకారము కావచ్చు.

చనవున నెంతని సాదించేవే యతని
యెనసి పను లెట్టు చేయించుకొనేవే
వనితలిందరు నీవంటివారే కాఁగా యేమి
కొనల కెక్కేది కదు [1]గోరతనికాక ॥ నేమె ॥

భావించి యెటువలె బ్రాసలుగొనేవే నీవు
శ్రీవేంకటేశ్వరు నెట్టు చిక్కించితివే
నీవలెనే కూడమా నిందుఁగాఁగిట నితని
చేవదేరే దిది కదుసిబ్బితనికాక ॥ నేమె ॥ 393

## వరాళి

కాఁగిలించుకొనవలెనా కమ్మటి విన్ను
పీఁగక మాఁటాడితేనే వేడుకెల్లాఁ జెల్లెను ॥ పల్లవి ॥

కందువల నీవు నన్నుఁ గన్నులఁ జూచితేనే
అందరితోడివరుస లబ్బెను నాకు
చెంది నీవు వొకమాఁటు నెలవుల నవ్వితేనే
పొందినటువంటిరతిభోగములు నాయను ॥ కాఁగి ॥

చెనకి యొకమాఁటు నాచెక్కులు నీవు నొక్కితే
పనివడి సంసారఫల మబ్బెను
చనవున నిటువలె చదురంగమాడితేనే
తనువుమీఁదిమదనతాపమెల్లా నారెను ॥ కాఁగి ॥

ఇచ్చగించి నావద్ద నేకతాన నీ వుండితే
విచ్చకల్యాణము లిట్టే నెరవేరెను
యెచ్చరించి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
అచ్చపుమనోరథము లన్నియు సిద్ధించెను ॥ కాఁగి ॥ 394

1: గోరత + అని "హోరత" శబ్దమునకు "గోరత" యని తప్పువించినట్లున్నది.

రామక్రియ

తానేల సిగ్గువడీనే తనకెలే వెరపు
నానాటిసుద్దుల్లకు నవ్వేఁగాక ॥ పల్లవి ॥

యేలే తనతో నాకు నెక్కువతక్కువ లాడ
మేలుమేలనుచుఁగడు మెచ్చేఁగాక
చాలుకొని యప్పటిని చలము సాదించనేల
కేలెత్తి తనకు మొక్కి గెలిచేఁగాక ॥ తానే ॥

పైకొని [1]తన్నింఁ జేసిబాసలు గొనఁగనేలే
యేకాలఁది కాకాలఁది యెననేఁగాక
దీకొని మారుకుమారు తిట్లు దిట్టఁగనేలే
వాకున మంచిమాఁటాడి వలపించేఁగాక ॥ తానే ॥

కనుచూపులను తన్ను కాఁకలఁ బెట్టఁగనేలే
చనుమొన లొత్తి మేలు చల్లేఁగాక
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనే తానె నన్ను
పెనఁగనేలె రతుల బెరయించేఁగాక ॥ తానే ॥ 395

రీతిగౌళ

ఆమాఁట నాతో నీవు ఆనతిమ్మా
యీమతకమింతా నీదా యేమోయివోయి ॥ పల్లవి ॥

పైకొని నిన్ను నేను పచ్చిగాఁ దిట్టితినని -
నాకెకుఁ దెలుపవోయి లసుద్ది
దాకొన్నమగఁడపంటాఁ దా నీకుఁ బూనుకవచ్చి
చేకొని నీవే తనలోఁ జెప్పితివా నోయి ॥ ఆమాఁ ॥

1. "తానింతేని" కావచ్చు.

చేరి నీచేత సేవలు సేయించుకొంటిననీ
నారుకొన నీ వాపెను నమ్మించవోయి
యారీతిఁ జుట్టమవంటా నిచ్చకములు నెరపీ
అరీతిని నీవే యిన్నీ నాడించవోయి ॥ ఆమా ॥

పక్కన నీపై నేను పాదాలువేసితిననీ
పెక్కులాపెతో నానలు పెట్టుకోవోయి
ఇక్కువల శ్రీవేంకటేశ నన్ను నేలితివి
మొక్కీఁ దాను బావవంటా మొరఁగులా వోయి ॥ఆమా॥ 396

రేకు 1178 శంకరాభరణం

వినిపించవే యీసుద్ది వినే నేను
వనితరో యిన్నాళ్లవలెఁ గాదు నీవు ॥ పల్లవి ॥

చెలరేఁగి చెలరేఁగి చెలులతో నవ్వేవు
అలనీపతి నీతో మాఁటాడెనటె
తలపీడి మొలపీడి దగ దవ్వులఁబడేవు
వలపులసివములు వడిఁబట్టెనటవే ॥ విని ॥

తమకించి తమకించి తడఁబడ నడచేవు
అమరఁగ రతులు పీకబ్బెనటె
చెమటలమేనితో చిందువ(వం?)దై యుందానవు
కొమరెమదము నీకు గొనకొనెనటవె ॥ విని ॥

పదరి పదరి నీవు పాటలెల్లాఁ బాడేవు
యెదుటశ్రీవేంకటేశుఁ డెనసెనటె
చెదరవికళలతో చిమ్ముల మాఁటలాడేవు
మదనరాజ్యగర్వము మతిఁ బట్టెనటవె ॥ విని ॥ 397

ఆందోళి

రాఁగదవె అన్నిటాను రవ్వయితిమి
కాఁగినకాఁకలచేతఁ గరివడె నిపుడు ॥ పల్లవి ॥

సాదించేవు నీ కాతఁడు చాయలకు వచ్చినా
వాదించేవు నీ కాతఁడు వలచీనా
ఆదిగొని చెలులెల్ల నట్టె పైపైఁ బడఁగాను
గాదిలియాతనిమది కాయగాచె నిపుడు ॥ రాఁగ ॥

చెనకే వాతఁడు నీచెప్పినట్టు సేసీనా
పెనఁగే వాతఁ డందుకు ప్రియపడీనా
వనితలందరు వచ్చి వద్దనే వుండఁగాను
చనుమానముల మొగచాటాయ నిపుడు ॥ రాఁగ ॥

యేకతానకుఁ దీసేవు యింతలోనే లోనయ్యీనా
పైకొని కూడితి విట్టె బాఁతిపడి
శ్రీకాంత వురమెక్కిన శ్రీవేంకటేశుఁ డితఁడు
మైకొని వురమెల్లాను మట్టుపడె నిపుడు ॥ రాఁగ ॥ 398

గౌళ

పరివారమా నీతో సరసములాడఁగా
నెరవాదివై మమ్ము నీవేల రేఁచేవు ॥ పల్లవి ॥

నగితేనేకాదా నాఁటుక వెంగేలయ్యేది
తగులనాడితేఁ గాదా తప్పు లయ్యేది
వెగటు లింతేసికి వెఱతుమయ్య నేము
వొగి నీవేమనినాను వోరుచుకుండేము ॥ పరి ॥

ముందర నుండితేఁగాదా మొగచాట్లయ్యేది
కందువ లంటితేఁగాదా ఘాతలయ్యేది
విఁడవెట్టి పగలకు పెరతుమయ్యా నేము
ఇందరివలెనే నీకునిచ్చక మాడేము ॥ సరి ॥

సన్నలు నేసితేఁగాదా చలములు పుట్టేది
కిన్నలఁ జూచితేకాదా కాఁక పుట్టేది
యెన్నికతో శ్రీవేంకటేశ నీకు వెఱతుము
మన్నించి కూడితివి నీమఱఁగుఁ జొచ్చేము ॥ సరి ॥ 399

## సామంతం

రమణుఁడు వీఁడివో రాతిరి యీడ నున్నాఁడు
సముకాన నుండవే చలము వాసీని ॥ పల్లవి ॥

మంతనమాడవే చాలు మనసు నీకుఁ గరఁగి
చెంతల నేమెల్లా బుద్ధిచెప్పనేల
పంతములాడవే చాలు పతితోడ నదే మించి
యింతి నీకు మచ్చుమందయ్యీ నదే నేఁడు ॥ రమ ॥

కొచ్చి చూడవే చాలు కోపము తానె పోయీని
వచ్చి వచ్చి నేము నిన్ను వద్దననేల
పచ్చిగాఁ దిట్టవే చాలు పైకొని యదే నీకు
తచ్చి వలపులవల్లెతాళ్లయ్యీ నిపుడు ॥ రమ ॥

విడెమియ్యవే చాలు వేడుక తానే పుట్టీని
కూడుమని నేము నిన్నుఁ గొసరనేల
యీడుగా శ్రీవేంకటేశుఁ డెనసె నీకు విడె
వాడికరతులకును వాఁటమయ్యీ నికను ॥ రమ ॥ 400

బౌళి

నీయంత నీవెఱఁగవు నేనది విన్నవించితి
చేయి మీఁదాయెను నాచెక్కులు నొక్కకుమీ ॥ పల్లవి ॥

పిలువకు సారెసారె పేరుకొని నన్ను నీవు
వలపు పేరడిఁబడీ వద్దు నవ్వకు
బలిమిసేసి నీవు పట్టకు నాకుచములు
కొలఁదిఁబడదు కొనగో రంటిఁచకుమీ ॥ నీయ ॥

తప్పకచూడకు నీవు తమకపుచూపుల
కుప్పలువడీ సిగ్గులు కొంగువట్టకు
కొప్పు జారీ నీవు నన్ను కూరుములు గొసరః
దప్పిదేరీ మోవి విదే దంట మాటాడకుమీ ॥ నీయ ॥

వాడివట్ట కంత నీవు వూరకే దగ్గరి వచ్చి
తడఁబడీ మానములు తతిగొనకు
అదరి శ్రీవేంకటేశ యలమేల్మంగను నేను
యెదయక కూడితి ఇట్టె మరవకుమీ ॥ నీయ ॥ 401

దేసాళం

మానవే యెక్కడిసుద్ది మంకుఁదనాలు
తానే యాతఁడు నిన్నుఁ దగులఁగాను ॥ పల్లవి ॥

చలపాదితనమేల సారెకుఁ బిలువఁగాను
పలుకరాదా నీపతితోను
తలపోఁత లింత యేల తమకించి యాతఁడు
వెలయ నీపైఁ జేయివేయఁగాను ॥ మాన ॥

పంతములింతేఁ జేలే బలిమిఁ బెనఁగఁగాను
మంతనములాడరాదా మగనితోను
రంతుతోడ వాడులేలే రతినాథుఁ దలముక
వింతలుగా నిన్ను నిచ్చె వేఁడుకోఁగాను ॥ మాన ॥

నివ్వెరగు లిఁకనేలే నిన్నుఁ బెండ్లాడఁగాను
నవ్వరాదా శ్రీవేంకటనాథునితోను
రవ్వగా నమ్మికలిచ్చి రమణుఁడు వేడుకతో
నివ్వటిల్లఁ బొగడుతా నిన్ను మెచ్చఁగాను ॥ మాన ॥ 402

రేకు 1179 నారాయణి

ఎడుపకొంటేఁ జోడు దొడరి నీపె(వెం?)త్తైనా
పడియించీ మొక్కలపు వలపు నీమీఁద ॥ పల్లవి ॥

నిక్కిచూచి చెలి నీపై నిండా నవ్వులు నవ్వి
చిక్కనివెన్నెలతేట చిందీనదె
చెక్కులను కొనగోళ్ళఁ జెనకి కాంతుల మించ
లక్కరసములు చల్లీ లావుగా నీమీఁద ॥ తుడు ॥

వారసి వారసి నీతో వూరఁగలమాటలాడి
సిగులగమ్మఁదేనెలు చిందీనదె
సరిగా సేవలు సేసి చన్నుల మెఱుఁగులను
సరుగ బంగారుపొడి చల్లీ నీమీఁద ॥ తుడు ॥

బలిమిఁ గాఁగిటఁ బట్టి భావములనే కరఁగి
చెలఁగి వయోమదము చిందీనదె
యెలమి శ్రీవేంకటేశ ఇంతి నిన్నిటాఁ గూడి
చలములఁ గూరిములు చల్లీ నీమీఁద ॥ తుడు ॥ 403

### దేశాక్షి

అంగడిఁబెట్టేవయసు అడియాల మానునే
బెంగటినాన నుండినాఁ బెదరేఁచుఁగాక ॥పల్లవి॥

వాసికి నెంతలిగినా వలపేల తక్కువౌను
ఆసలతోఁ జిగిరించి అలరుఁగాక
యీసున నెంతదిట్టినా ఇంపులేల కొఁచమౌను
వేసరనిపులకలై విఱ్ఱవీఁగుఁగాక ॥అంగ॥

ఆకడిమోమెఁ(మెం?)తైనా ఆయమేల పూరకుండు
దీకొని తమకమై తిమురుఁగాక
చేకొని మాటాడకుంటే చిత్తమేల మరపించు
కాకుసేసి లోలోనె కరఁగించుఁగాక ॥అంగ॥

చేయి చాఁచకుంటేను సెలవి నవ్వేల వుండు
తోయరానిసరసమై తొడరుఁగాక
యీయెడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
వేయిటికి నీరతులు వింతసేసుఁగాక ॥అంగ॥ 404

### లలిత

ఈపాటిమానేరుపు యెట్టువలసినాఁ జేయి
చూపినపాటి నే నొనగూడేఁగాక ॥పల్లవి॥

బిరుదుమగనిలోడఁ బెనఁగఁగఁగలనా
గరిమ నే నొడ్డుకొనఁగలఁగాక
దొరవు చేతులఁబట్టి దొబ్బఁగలనా నేను
కెరలి కొనగోర దాఁకించఁగలఁగాక ॥ఈపా॥

చలపాదివానితోడ సరసమాడఁగలనా
కలసి మలసి మొక్కఁగలఁగాక
పెలుచఁదనపువీతో బిగియఁగలనా నేను
వొలిసినట్టు చన్నుల నొత్తఁగలఁగాక ॥ ఈపా ॥

శ్రీవేంకటేశ్వర నిన్నుఁ జేరి మీరఁగలనా
కావరించి సేవసేయఁగలఁగాక
యీవేళ నలమేలు మంగ నేను నన్నుఁ గూడితివి
చేవమీరఁగలవా చెందఁగలఁగాక ॥ ఈపా ॥ 405

## శుద్ధవసంతం

ఎంతైనా నెక్కినవాని కేమఁగు గుజ్జెకాదా
పంతమున మొగవానిఁ బచ్చిసేతురటవే ॥ పల్లవి ॥

మనసుమర్మ మెఱిఁగి మాటలాడవలెఁగాక
చనవుగద్దంటాఁ బతి జంకింతురటే
చెనకితే ప్రియములుచెప్పి లాలింతురు గాక
కినిసి మారుకుమారు గేలిసేతురటవే ॥ ఎంతై ॥

వేళచూచుకొని నీవే వేఁడుకొనవలెఁగాక
మేలుగద్దంటా నట్టె మీరుదురటే
చేలకొంగు వట్టితేను సిగ్గువడుదురుగాక
పేలరివై యింతేసి పెనఁగుదురటవే ॥ ఎంతై ॥

కావించి నీవే యిచ్చకము లాడుదురు గాక
శ్రీవేంకటేశ్వరు నింతసేతురటే
యీవిభుఁడె విన్నుఁ గూడె నిందుకు మొక్కుటకుగాక
భావించి యలమేల్మంగ పదరుదురటవె ॥ ఎంతై ॥ 406

గౌళ

అనరే యీమాఁటే మీరు ఆతనితోను
నసుపు చూపితే నవ్వు నాలిఁబడదా ॥ పల్లవి ॥

తననగరిలో నుంటే తనకే సెలవుగాదా
చెనకి పైకొని గాసిసేయవలెనా
మనసుగలిగితేనే మన్నించీఁగాక తానె
పెనఁగఁబోతే వలపు పిప్పిగట్టదా ॥ అన ॥

కొలువువారిలో నుంటే కోరి తన సొమ్మేఁగానా
మొలకచన్నులు సారె మోపవలెనా
వలసినప్పుడు తానే వచ్చీఁగాక యిట్టె
చలపట్టితే రతులు చప్పనగాదా ॥ అన ॥

అండఁ బానుపుపై నుంటే అలఁ దనకేకాదా
బండుగాఁ గాఁగిట మెదుపఁగవలెనా
నిండు కలమేలుమంగ నేను శ్రీవేంకటేశుఁడు
దండిగాఁ దా నన్నుఁ గూడె తప్పే వొప్పుగాదా ॥ అన ॥ 407

శోకవరాళి

నీచిత్తమునఁ బెట్టి నీవే దయదలఁచేవు
యేచి నీతో సారెసారె యెదురాడేనా ॥ పల్లవి ॥

నిన్నుఁ గొసరేమాఁట నన్నే కొసరుకానే
యెన్నఁగ నిన్నుఁ గాదననేఁటికి నాకు
వున్నతిఁ బ్రోదవు నీవు కన్నెపడుచను నేను
సన్నలచాయల నీతో సరిదూఁగేనా ॥ నీచి ॥

నీతోఁ బెనఁగేమారు నేనే నాతోఁ బెనఁగేను
యేతున గాసిసేయనేఁటికి నిన్ను
యీతల నీ వేలికవు యేలినదాన నేను
కాతరించి నీకంటె ఘనమయ్యేనా ॥ నీచి ॥

నీకు విన్నవించేమారు నేనే బుద్దినేర్చేను
యీకత లిన్నియుఁ జెప్పనేఁటికి నీతో
ఆకడ శ్రీవేంకటేశ యలమేల్మంగను నేను
పైకొని కూడితి నింకాఁ బంతమాడేనా ॥ నీచి ॥ 408

రేకు 1180 ఆహిరి

గుట్టుతో నుండనీవయ్య గుణవంతుఁడవు నీవు
పట్టి పెనఁగఁబోతే పంతు గాయయ్యీనా ॥ పల్లవి ॥

మలసి సారెకు నిన్ను మనసు సోదించనేల
యెలమి నందులోఁ వప్పించనేల
బలిమి సొక్కు కాచితే పై పై రాఁబోదే కాక
కలిగినా నందులోనే కనకపుటము ॥ గుట్టు ॥

ఇంతమాఁటి నితోఁ బంటిమిఁ బెనఁగనేల
పంతకారివైన నిన్ను సోదించనేల
యింతమాసు రాచినాను ఎదుటఁ జూపరే కాక
బంతినే గండమువలెఁ బరిమళించీనా ॥ గుట్టు ॥

శ్రీవేంకటేశ నిన్నుఁ జేరి కోపగించనేల
మూపుంకల నంతలోనె మొక్కనేల
యీవేళ నన్నుఁ గూడితి వేసలమేల్మంగనని
నీవు నీవేకాక మరి నేనయ్యేనా ॥ గుట్టు ॥ 409

పాడి

అప్పటిగురుతులెల్లా నట్టె వున్నవి
దెప్పరమునఁ గొంత సాత్మించనీయరాదా ॥ పల్లవి ॥

నెట్టనఁ గళలుదేరె నీమొగము చూచితేను
నట్టుకొట్టి నాకై తే నవ్వువచ్చీని
ముట్టి నిన్నుఁ జూడుమని ముసుఁగేల తీసేవు
జట్టి నీవేఁడిచేఁతలు చల్లారనీరాదా ॥ అప్ప ॥

వద్దనుండి నీమేవివాసన మూరుకొంటే
కొద్దిమీరి చూపులఁ గుంకుమ రాలీని
అద్దో నే(నీ?)వంచిన సిరసట్టె యేల యెత్తేవు
బద్దులు యీవేళ మట్టుపడనియ్యరాదా ॥ అప్ప ॥

గక్కన నీచెమటమై కాఁగిలించుకొంటేమ
చిక్కి నాతమి నీమీఁదఁ జిమ్మిరేఁగీని
అక్కరై శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
చెక్కులేల నొక్కేవు చిత్తగించరాదా ॥ అప్ప ॥ 410

బౌళి

ఎంతచేసిన నీవిద్య లేల మానేవు
బంతినే నీనవ్వులెల్లాఁ బచరింతువుగాక ॥ పల్లవి ॥

వెక్కసపుమాఁట లాడి వేమారు నిన్నుఁ దిట్టేటి-
యెక్కువసతులకుఁగా కేల వంగేవు
మొక్కులు మొక్కి నేము ముందే సేవలు సేయఁగ
మిక్కుటపుపంతాలు మామీఁద నింతువుగాక ॥ ఎంత ॥

---

శ్రీగీతలుగలవి చిలుముదినినవి.

కొప్పువట్టితీసి నిన్ను గోరు నీమీఁదఁబెట్టేటి-
యెప్పటియింతులకుఁగా కేల వంగేవు
ముప్పిరిఁ బ్రియాలుచెప్పి మొగమోడి పొందఁగాను
ఇప్పు డింతేసి మమ్ము నెలయించఁదగదా ॥ఎంత॥

పరవుపైఁ బడవేసి పచ్చిమోవి గంటిచేసే-
యెరవులవారికిఁగా కేల వంగేవు
అరిది శ్రీవేంకటేశ ఆలమేల్మంగ నేనంటా
సరవిఁ గూడితి వింత చవిసేయవలదా ॥ఎంత॥ 411

## హిందోళం

తనకు నా కెంతదవ్వు దగ్గరఁ జేలెఁడు గద్దు
మొనసి నాకాలు దన్ను మోఁచెననీని ॥పల్లవి॥

తగవులఁబెట్టఁబోతే తనవంకదే నేరమి
యెగసక్కె లెవ్వరిఁ దా నేలాడనే
చిగురుఁజేతులఁ దనసేవచేనే దెఱఁగఁడు
అగడుచేసి గోర నంటితిననీని ॥తన॥

సాకిరులడుఁగఁబోతే జగడము తన్నే మోఁచు
చేకొని మరేల నన్ను చిమ్మిరేఁచీనే
వాకుచ్చి తనకుఁగాను వంకలాడే దెఱఁగఁడు
దీకొని సందుచేసుక తిట్టితిననీని ॥తన॥

నిజము తెలిసితేను నేనుఁ దాను నొక్కటే
గజరుఁజేఁతలనేల కాఁతాళించీనే
భజనఁ దా శ్రీవేంకటపతి నే నలమేల్మంగను
త్రిజగ మెఱఁగఁ గూడె దిట్ట నేననీని ॥తన॥ 412

---

క్రిగీతయుగలవి చిలుముదినినవి.

వసంతవరాళి

చూచేవారికే యివి సోద్యా లింతేకాక
యేచి నీకయితే యివి యింపులే కావా ॥ పల్లవి ॥

సారెసారెనాదేటిసవతులజగడాలు
నారుకొన వింటే నీకు నవ్వులు గావా
చేరిచేరి వొందొరులు చేపట్లకుఁ జొచ్చితే
సైరణతో వినోదించఁ జవులు గావా ॥ చూచే ॥

కొలువులోనిఇంతులు గొణఁగి తిట్లాడితే
అలరి నీకుఁ జెర్లాటా లవియె కావా
వొలసి నీమీఁదఁబెట్టి వొట్లు వెట్టుకొంటే
చెలరేఁగి నీకు విన సిగ్గులు గావా ॥ చూచే ॥

నీపెండ్లికూఁతు లిద్దరు నిన్ను సాకిరడిగితే
పైపై నీవుచేసినభాగ్యముగాదా
యేపున శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
రాఁపుగాఁ గూడితి నీరపముగాదా ॥ చూచే ॥ 41[illegible]

నాదరామక్రియ

నెలవినవ్వులతోడ సిగ్గులతోడ
తలఁపించరే పనులు తమితోనున్నారు ॥ పల్లవి ॥

పంతములాడే రిద్దరు బాగా లియ్యఁగదరే
వంతల కొకరొకరి వంకలాడరే
మంతనమాదేరేమొ మరి తెరవేయరే
కాంతయుఁ బురుషుఁడును గద్దెపై నున్నారు ॥ నెల ॥

త్రిగీతలుగలవి చిలుముదినినవి.

సరసమాడే రిద్దరు సంగడి నుండఁగదవే
అరిది మర్మపుమాఁట లందీయరే
కరఁగి మోహించేరేమో కిందువలు దెలుపరే
సరిగ్ బేసికిని మంచముపై నున్నారు ॥ నెల ॥

యెనసిరి శ్రీవేంకటేశుఁ డలమేల్మంగయు
మొనయుచు నుపచారములు సేయరై
చనవులు గొసరేరేమొ సమరతి నుపరతి
పెనచి మొక్కరె పెండ్లిపీఁటపయి నున్నారు ॥ నెల ॥ 414

రేకు 1181 శ్రీరాగం

అంగనకు విరహమే సింగారమాయ
చెంగట నీవే యిది చిత్తగించవయ్యా ॥ పల్లవి ॥

కలికి నిన్నుఁ దలఁచి గక్కున లోలోఁ గరఁగి
జలజలఁ జెమరించి జలకమాడె
బలుతమకాన నీకుఁ బక్కన నెదురువచ్చి
నిలువునఁ గొప్పువీడి నీలిచీర గప్పెను ॥ అంగ ॥

సుదతి నిన్నుఁ జూచి సోయగపుసిగ్గులను
పొదలి చెక్కులదాఁకాఁ బూసె గందము
మదనమంత్రములైనమాటల మర్మము సోఁకి
ముదురుఁబులకలను ముత్యాలు గట్టెను ॥ అంగ ॥

గక్కనఁ గాఁగిట నిన్నుఁ గలసి యీమూలిసి
చొక్కి చంద్రాభరణపుసొమ్ములు పెట్టె
అక్కున శ్రీవేంకటేశ అలమేలుమంగ నీకు
దక్కి సరసములను తలఁబాలు వోసెను ॥ అంగ ॥ 415

శ్రీగీతములగలవి చిలుము దినినవి.

ఆహిరి

ఏమి సేతునయ్య ఇఁక నిదివో మా౹౹బదుకు
చేముట్టినసరసాలు సిగ్గులకే మూలము ॥ పల్లవి ॥

తప్పులెంచఁబోతేను తగిలీ నీనుతులె
రెప్పలెత్తి చూడఁబోతే రేఁగీ వలపు
అప్పటిఁ బెనఁగఁబోతే ఆయములు గరఁగీని
యెప్పుడు నీతోడివాదు లింపులకే మూలము ॥ ఏమి ॥

చేతుల దొబ్బఁగఁబోతే చిమ్మిరేఁగీఁ బులకలు
గాతలఁ జంకించఁబోతే కమ్మీ నవ్వులు
యేతులు నెరపఁబోతే నెలయింపులై తోఁచీ
నీతోడిమచ్చరాలు నెయ్యానకే మూలము ॥ ఏమి ॥

కొప్పువట్టి తియ్యఁబోతే కూడీఁ బరవశము
ముప్పిరి నలుగఁబోతే ముంచీనాసలు
యిప్పుడే శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
దెప్పరపునీతో రతి తేఁకువకే మూలము ॥ ఏమి ॥ 416

పాడి

పొద్దువొద్దు కిట్లానే భో'గించరయ్యా
ఇద్దరికిఁ గలిగె నేఁ డిదివో సోబనము ॥ పల్లవి ॥

పెంచెపుమీతొడలే పెండ్లిపీఁటలు మీకు
మించినసిగ్గులే కడుముత్తైలసేస
పంచలచిమ్ముఁజూపులు పసపులు నలఁచుట
అంచెల మీయిద్దరికి నమరె సోబనము ॥ పొద్దు ॥

పొత్తులమోవితేనెలే బువ్వపుఁబాలకూళ్లు
  బత్తితోడినవ్వులే కప్రపుబాగాలు
  హత్తినచెనకులే అలరినవుంకువలు
  యెత్తులఁ జూచిన మీకు నెనసె సోబనము ॥పొద్దు॥

కందువకాఁగిటిరతి గందాక్షతలు మీకు
  విందులసరసములు వీడ్యదోడులు
  యిందునె శ్రీవేంకటేశ యింతి నీవు గూడితివి
  సందడితో మెరసె నిచ్చలు మీసోబనము ॥పొద్దు॥ 417

కాంబోది

మంచితనముఁ జేయఁగ మంకుఁదనా లేఁటికే
  అంచెల విభునితోడ నంతచలమేఁటికే ॥పల్లవి॥

గక్కన నాతఁడు నిన్నుఁ గప్పురాన వేసితేను
  ఇక్కువలు దాఁకెనంటా యేల తిట్టేవే
  చెక్కులునొక్కెనని చేరి వేఁడుకొనరాఁగా
  పెక్కుగోళ్లు దాఁకీనంటా పెనఁగనేమిటికే ॥మంచి॥

ఘనుఁడు వల్లెగా నీపై కలువదండ వేసితే
  చనుఁగవ దాఁకెనంటా సాదించేవేమే
  [1]యనసి యందుకె యాతఁడిట్టె కాఁగిలించుకొంటే
  తనువంటెఁ జెమటంటా తప్పువేయనేఁటికే ॥మంచి॥

శ్రీవేంకటేశుఁడు నిన్ను చెంగ్దామరలవేసితే
  యీవేళనేల జంకించే విందరిలోన
  చేవదేర నీతఁడే చేకొని రతిఁ గలిసె
  బావించ చలమించెనంటా పంతమాడనేఁటికే ॥మంచి॥ 418

1. 'యనసి' అని అదాదిగా నుండుట వ్యావహారిక రూపముగాబోలు.

దేసాళం

దిక్కుల నీకతలెల్లాఁ దెలిసేఁగాక
వెక్కసాన నిన్ను నావెంటవెంటఁ దిప్పనా ॥పల్లవి॥

యితరులు పిలిచితే నెఁ(నెం?)తైనాఁ బలుకవు
సతిమాటకై తేను జవదాఁటవు
ప్రతినలాడుకోఁగా నీపలుకుల భ్రమయించి
వెతదీర నిన్ను నావెంటవెంటఁ దిప్పనా ॥దిక్కు॥

సరసు మెప్పాడినా సరకుఁగొనవుగాని
తరుణి నవ్వినంతనే తమకించేవు
సరవులు దప్పఁగాని చలపట్టి నే నిన్ను
విరివిగా వలపించి వెంటవెంటఁ దిప్పనా ॥దిక్కు॥

కొలువులో నెవ్వరున్నాఁ గూరిమి సేయవుగాని
కలికిఁ బొడగంటేనే కరఁగేవు
మెలఁగి శ్రీవేంకటేశ మీరఁగాని నిన్నుఁ గూడి
వెలయ సిగ్గులుమాన్పి వెంటవెంటఁ దిప్పనా ॥దిక్కు॥ 419

వరాళి

మీవంటిదాననా మీరఁగ నేను
పూవుఁబరిమళమై పొదిగేఁగాక ॥పల్లవి॥

చలము సాదించేనటే సరిగెగలదానను
బలువుకొద్ది పంతానఁ బతికేఁగాక
అలిగేనటే పతి కంతరంగమైనదాన
పలుకుసరసమునఁ బై కొనేఁగాక ॥మీవం॥

తప్పు లెంచేనటవే తగినచుట్టపుదాన
ఎప్పుడూ మేలుదాననై యెనసేఁగాక
వుప్పటించేనటే నేను వూడిగము సేసేదాన
దప్పిదేర మోవితేనెఁ దనిపేఁగాక ॥మీవం॥

వొరసేనటవే నేను వురమెక్కి సట్టిదాన
గరిమఁ గాఁగిట నించి కైకొనేఁగాక
యిరవై శ్రీవేంకటేశుఁ డిదివో నన్ను మన్నించె
సరిలేనివేడుకల సతమయ్యేఁగాక ॥మీవం॥ 420

రేకు 1182 గుండక్రియ

ఓజతో నుండినవారి కొకటొకటె రేఁచేవు
రాజవై తేనే మమ్ము రవ్వసేయవలెనా ॥పల్లవి॥

అప్పటికప్పటికి నీ వనుచరించేవుగాక
యెప్పుడును ఇంటికి నీ విట్టే వచ్చేవా
వొప్పగువేవేలుసతు లొద్దనే వుండఁగాను
చప్పనై కాక సతులు సరికయ్యేం· ॥ఓజ॥

బాసదప్పినంటా నాతోఁ బైకొని నవ్వేవుగాక
ఆసల నేపొద్దూ నిట్టె అదరించేవా
రాసికెక్కి ఇరుమేలా రాముల కొల్వుసేయఁగా
వేసటేకాక రతులు వెలవెట్టీనా ॥ఓజ॥

దయదలఁచేమో నన్ను తతిఁ గూడితివిగాక
ప్రియము లిట్టే నీకు పెనగొనీనా
నియతి శ్రీవేంకటేశ నేనే నీయంద నుండఁగా
జయమేకాక మేలు చండిపడీనా ॥ఓజ॥ 421

గుజ్జరి

నెలఁత యెంతటిజాణో నీవెంత చతురుఁడవో
పిలిచితేఁ జెలియకు ప్రియముచెప్పితివి ॥ పల్లవి ॥

మగువ యలిగి నీతో మారుమోము వెట్టుకొని
మొగిచి యప్పటి నీతో మోము చూచెను
నగుతా నప్పటి నీవు నలినాక్షిఁ గాఁగిలించి
పగటున నాదరించి పంతములిచ్చితివి ॥ నెలఁ ॥

మానిని నీతోఁ గొంత మౌనము జరపి యట్టె
మానములు సోఁకించి మాటలాడెను
కానిమ్మని నీ వందుకు గతిగూడ నింపు చల్లి
మేనవావి పచరించి మేలెల్లాఁ జూపితివి ॥ నెల ॥

కోమలి ముసుఁగువెట్టుకొని పవళించి నిన్ను
గామిడి శ్రీవేంకటేశ కాఁగిలించెను
దోమటి దొడికి నీవు తొలుఁతటికంటెను
నేమమునఁ బాలించి సిరుల మించితివి ॥ నెలఁ ॥ 422

పాడి

ఇంటికివచ్చినవాఁడ వీదేర్చుకోవయ్యా
జంటగూడినవాఁడవు చనవియ్యవయ్యా ॥ పల్లవి ॥

తరుణి వలచినదే తప్పయితేఁగనక
పురవుగా నీవది వోర్చుకోవయ్యా
మరలి నిన్నుఁ జూచుటే మచ్చరమైతేఁగనక
నిరతితో నందుకొను నీకు మొక్కేనయ్యా ॥ ఇంటి ॥

వెలఁది మాటాడినదే వెంగెములై అఁగనేల
మలసి యీనేరమి మన్నించవయ్యా
అలమిపట్టినదే అపరాధమైతేఁగన
బలిమిచెల్లఁగ నీకుఁ బంతమిచ్చీనయ్యా ॥ ఇంటి ॥

ఇంతి పాదాలొత్తినదే యెగ్గులైతేఁగనక
చెంతనే నేరు పాపెకుఁ జెప్పవయ్యా
కాంతను శ్రీవేంకటేశ కలిసితి వింతలోనె
వింతవింతరతులను వియ్యమందవయ్యా ॥ ఇంటి ॥ 423

వరాళి

నీవేళ భ్రమసేవు నే నుందాన నిది(ది?)వో
సేవసేసేఁగాని యిట్టె సేయించుకోరాదా ॥ పల్లవి ॥

కప్పురవిడె మింద కస్తూరివుండ లివిగో
దప్పిదేర్చుకో కొంత దగదొట్టకు
కొప్పు చక్కఁబెట్టుకో గోణము చక్కఁగట్టుకో
అప్పటి మేను గిజిగిజియై వుందురా ॥ నీవే ॥

చల్లనిగందవొడిదె సారపుఁబన్నీరిదే
చల్లుకోరాదా మేని[1]సరతు వాసు
పల్లెవాటు వేసుకో వద్ద వచ్చి కూచుండు
బల్లిదుఁడవై వుండి పాఁచి సింగారాలేల ॥ నీవే ॥

చాయపట్టుపరపదె సకినలమంచ మిదె
యీయెడనే పవళించు ఇఁక లోఁగకు
పాయపుశ్రీవేంకటేశ పచ్చిగాఁ గూడితి
దాయిదండై వుండు మేల తడఁబడ నిపుడు ॥ నీవే ॥ 424

1. సరతు=చెమట. ఈయర్థములో ఈపదమీనాటికి వ్యవహారములో కలదు.

### బౌళి

ఆసతిమ్మా వినేఁగాని అది గొంత
యీనెలఁత నీపై బతి యిటువంటిదా ॥ పల్లవి ॥

వద్ద నే నుండఁగానె వనిత సన్నలు సేసీ
కద్దా [1] తొల్లిఁ బొందు కాంతకు నీకు
ముద్దుముద్దువలెనే మోము చూచి నవ్వీని
యిద్దరికి లోలోనే యింతవలపా ॥ ఆన ॥

కమ్మటినిఁ గానకుండా కానికలంపీ నీకు
సమ్మతా నీ కాపెనేసేసరితలెల్లా
ఎమ్మి నీవు విందువంటా పాటపాడీ నాదనుండే
వుమ్మడి మీఁదమకపుటొద్దిక లింతేశా ॥ ఆన ॥

నీవూ నేనూఁ జూడఁగానే నిలుచున్న దీద వచ్చి
కావర మింతేసి మీకుఁ గప్పివున్నదా
శ్రీవేంకటేశ యిద్దరిఁ జేతులు వట్టి కూడితి—
వీవేళనే నీయాపెయెన్నికలుఁ గూడెనా ॥ ఆన ॥ 425

### భైరవి

ఎక్కడ పరాకు నీకు నింతకంటె నేమున్నది
చిక్కనాయఁ గోరికలు చిత్తగించవయ్యా ॥ పల్లవి ॥

సెలవినవ్వు చిందఁగాఁ జెక్కునఁ జేయివెట్టె
పులకపైరు పయ్యెదఁ బొదిగె నిదె
కొలఁదిమీరె వయసు కొప్పు గట్టిగా ముడిచె
చెలియసింగారము చిత్తగించవయ్యా ॥ ఎక్క ॥

1. తొల్లిన్ = తొల్లియున్ కావచ్చు.

చిమ్ముఁజూపులు మీఱఁగా చెంపల గందాలు పూసె
ముమ్మరమై మేలు పోఁకముడి వేసెను
చెమ్మగిలె మోవితేనెఁ దమ్మరసములు నించె
చిమ్మిరేఁగె సొబగులు చిత్తగించవయ్యా ॥ఎక్క॥

చనుమొనల కద్దము సరి నిన్నుఁ గాఁగిలించె
ఘనమైనరతులను కళరేఁగెను
యెనసితివి శ్రీవేంకటేశ యీయింతిని నీవు
చెనకులముకిపెము చిత్తగించవయ్యా ॥ఎక్క॥ 426

రేకు 1183 కేదారగౌళ

ఏమి టాఁతి నేఁ దనకు యెందాఁకనే
యీమాట నిజమయ్యే దెందాఁకనే ॥పల్లవి॥

పన్ని యలిగితినంటా పలుమారు దూరిదూరి
యెన్నిమాట లాడీని యెందాఁకనే
వెన్నెలనవ్వులు నవ్వి వేఁడుకొని చెక్కునొక్కి
యెన్ని నేఁ జెప్పిన మానఁ డెందాఁకనే ॥ఏమి॥

గక్కునఁ దా లేచివచ్చి కప్పురవిడెమిచ్చి
యెక్కడిసుద్దు లింకా నెందాఁకనే
పక్కన నానలువెట్టి పచ్చడము గప్పి లోలో
ఇక్కువ లిదివో యంటె యెందాఁకనే ॥ఏమి॥

పచ్చిమాఁటలెల్లా నాడి బలిమిఁగాఁ గిటఁబట్టి
యిచ్చీఁ బంతములు తా నెందాఁకనే
ఇచ్చట శ్రీవేంకటేశుఁ డింతటఁ దా నన్నుఁ గూడె
హెచ్చి సరసములాడే దెందాఁకనే ॥ఏమి॥ 427

ముఖారి

చక్కఁజాడనుండవే చలమేమౌనో
నిక్కకువే సారెసారె నిలువేమౌనో ॥ పల్లవి ॥

నెలవి నవ్వఁగఁబోతేఁ జెక్కులెల్లాఁ బులకించె
పలుకకువే ఇఁకఁ బంతమేమౌనో
తలవంచఁబోతేను తనువెల్లాఁ బులకించె
నెలసి చూడకువే సిగ్గులేమౌనో ॥ చక్క ॥

చేసన్న సేయఁబోతే చిత్తమెల్లా నీరాయ
పాసి యదుగిడుకువే పాయమేమౌనో
వాసికిఁ జంకించఁబోతే వాడఁబారె మొగమెల్లా
ఆసలఁ జింతించకువే అప్పటి నేమౌనో ॥ చక్క ॥

కాఁగిటఁ గూడఁగఁబోతే కందువ మరపులాయ
మూఁగి బుసకొట్టకువే మోనమేమౌనో
పాఁగినశ్రీవేంకటాద్రిపతినై వనను నీవు
వీఁగక రతినేసితి వెనక నేమౌనో ॥ చక్క ॥ 428

దేసాళం

నీవేమి నేసినాను నీచిత్తము
భావము వేరొకటై పదర నేఁ జాలను ॥ పల్లవి ॥

కొంగువట్టితే నిన్నుఁ గోపగించఁజాలను
అంగజగురుఁడవు నీ వటుగాన
అంగడి నవ్వి నిన్ను నదలించఁజాలను
వెంగలిపదారువేలవిభుఁడవుగాన ॥ నీవే ॥

పూవుల వేసి నిన్నుఁ బొరిఁ దిట్టఁజాలను నీ—
వవ్వలఁ బారిజాతహరుఁడవుగాన
రవ్వల గోరంటఁగాను రాయడించఁజాలను
చివ్వలగోళ్ల నరసింహుఁడవుగాన ॥ నీవే ॥

చనుఁగొండ లొత్తఁగాను చాలుననఁజాలను
యెనసి గోవర్ధనగి రెత్తితివిగాన
మునుపె శ్రీవేంకటేశ మొక్కి నన్నుఁ గూడితివి
తనిసినా నిన్నుఁబాసి [1] తలమనఁజాలను ॥ నీవే ॥ 429

ఆహిరి

మోహమెంతో కోపమెంతో ముదిత నీయెడ నేఁడు
వూహల యీభావములు వొక్కఁదోమటాయ ॥ పల్లవి ॥

సెలవినే నవ్వెఁగాని చేకొని మాటాడదాయ
చెలువుఁడ నీవు విచ్చేసితివంటే
వలచేత మొక్కెఁగాని వడి సుద్దిచెప్పదాయ
పొలసి నీకడకు నేఁ బోయేనంటేను ॥ మోహ ॥

కన్నులనె చూచెఁగాని కమ్మర దగ్గరదాయ
సొన్నల నీగురుతులు చూపినాను
సన్నలనే మెచ్చెఁగాని సరి దండె మీఁటదాయ
పన్ని నీ వల్లంతనుండి పాడఁగాను ॥ మోహ ॥

పరవశ మందెఁగాని పైకొని బిగించదాయ
గరిమఁ గాఁగిట నీవు గలయఁగాను
సిరుల సంతసమందె శ్రీవేంకటేశ నేఁడు
శిరసువంచి కొంత సిగ్గువడదాయ ॥ మోహ ॥ 430

1 తలము ౼ అవన్ + చాలను.

### సామంతం

ఇంతి చూచి యేమనెనో యెంతభ్రమసితినంటా
కంతువిమాయ లవుత గావనైతినే ॥ పల్లవి ॥

వెన్నెల గాయఁగఁ జూచి వెలఁది నవ్వేనోయంటా
పన్ని నే మారుకుమారు పతి నవ్వితినే
కన్నెచకోరాలఁ జూచి కన్నులఁ జూచెనోయంటా
మన్ననచూపుల నేను మారు చూచితినే ॥ ఇంతి ॥

కోవిల గూయఁగ పివి కొమ్మ మాటాడెనోయంటా
వోవల మారుకుమారు వూఁకొంటినే
పూవులు మాఁకుల రాలఁ బొలఁతి నేసలోయంటా
యీవలఁ గమ్మర నవే ఇటు చల్లితినే ॥ ఇంతి ॥

చల్లగాలి విసరఁగా సతినిట్టూర్పులోయంటా
వుల్లపుసంతసమున నొనరితినే
మెల్లనె శ్రీవేంకటాద్రిమీఁదనె నే నుండఁగాను
వొల్లనె చెలియ వచ్చి వూరడించి కూడెనే ॥ ఇంతి ॥ 431

### పాడి

ఏమో నేయఁగఁబోగా నేమో సుమ్మీ
[1]మోమెదిరి, నందుపై మొక్కులే సుమ్మీ ॥ పల్లవి ॥

చిగురుఁగెమ్మోవి వంచేవు చేరి నన్నుఁగని
వొగరుటధరామృతం బొలికీఁ జుమ్మీ
పగము మాఁటాడి గుక్కి జడిసేవు యింతలో
పగటు నీపుక్కిటను పట్టదది సుమ్మీ ॥ ఏమో ॥

---

1. మోమెదిరిన్ = మోగమెదుటన్ కావచ్చు.

ొబ్బనను గమనించి కొంకేవు నన్నుఁ గని
పుబ్బెల్లఁ జెమటలై వుదిరీఁజుమ్మీ
మబ్బు విడువఁగ నవ్వి మానితివి అంతలోనె
గుబ్బతిల్లి యానవ్వు గురిదెవట్టుఁజుమ్మీ ॥ ఏమో ॥

యింపు చేకొనుచు బిగియించేవు కాఁగిటను
మొంపుఁగుచములవాఁడి మొద్దాఁజుమ్మీ
తెంపున శ్రీవేంకటాద్రిదేవుఁడ గవక నన్ను
సంపదలఁ గూడితివి సరికిసరిసుమ్మీ ॥ ఏమో ॥ 432

రేకు 1184 కాంబోది

వద్దువద్దు తడవితే వాదులేసుమ్మీ । నీవు
పొద్దువొద్దు వారిపిరిపోడులే సుమ్మీ ॥ పల్లవి ॥

పూచివనా మేననున్న పులకలకంత లివి
చే చేత నీమాటలచే చిల్లులేసుమ్మీ
చాఁచివనాచన్నులు నీజవ్వనపురాయడిచేఁ-
గాచినవురముమీఁదికాయలే సుమ్మీ ॥ వద్దు ॥

వేఁకపునాకళ లివి వెలికురికినయట్టి-
కాఁకల నీవిరహాగ్ని కాంతులేసుమ్మీ
చేకొను నాతురుమిది చిత్తములోపలనున్న-
చీకాకులచింతలచీఁకటి సుమ్మీ ॥ వద్దు ॥

వన్నెలనామోవి యిట్టె వడి నేటితేనెలు
వున్నతి నీకు నోరూరేవూటలేసుమ్మీ
యెన్నఁగ శ్రీవేంకటేశ ఇంతలో నన్నుఁ గూడితి—
విన్నిటా నీవూ నేనూ నేకమేసుమ్మీ ॥ వద్దు ॥ 433

సాళంగం

ఇట్టె వచ్చేఁగాని యీవనకేలికిఁ బోయి
నెట్టన నాడనుండేది నిమిషమేసుమ్మీ ॥ పల్లవి ॥

మఱవకుమీ నాపై మన్ననా నే-
నెఱఁగ కేమనినా [1]విముడుకొమ్మీ
గుఱిగా నాయుంగరమే కోరి యెప్పుడుఁ బెట్టుమీ
మొఱి నాచెలులను నామారుగాఁ జూడుమీ ॥ ఇట్టె ॥

తలఁచుమీ నామీఁదితగులాయమూ నా-
మెలుపుఁబాయము నీకే మీఁదుసుమ్మీ
నలుపునీపేరు నాకు జపమునుమ్మీ యీ-
యలరులఁబంతి నాయాత్మగాఁ జూడుమీ ॥ ఇట్టె ॥

చవి నీతమ్ములమే నాచద్దినుమ్మీ నేఁ-
బవళించేపానుపే నీపదవిసుమ్మీ
ఇవల శ్రీవేంకటేశ ఇంతలోనే కూడితివి
వివరించ దినమొకవింత ఇదెసుమ్మీ ॥ ఇట్టె ॥ 434

మంగళకౌసిక

సరికి బేశాయ విది చాలదా నేఁడు
యిరవాయఁ బనులెల్ల నిఁకనేల మాటలు ॥ పల్లవి ॥

బయలువంటిదె నాపట్టినవెన్నడుము
బయలుపందిలి నీపలుకులెల్లా
నయమైనకుచములు నావి కొండలవంటివి
దయలేవినీమనసు తగురాలివంటిది ॥ సరి ॥

1. 'ఇముడు' — అంతర్భావితణ్యంతమా ?

నిండివనాతురుమున నెరులెల్లా వంకలే
చండియై నీమేనెల్లా చంద్రవంకలే
పండిననామోవి ఇదె పైపైనే కదుఁదీపు
దండినీవినయములు తరితీపులే ॥ సరి ॥

మెఱుఁగువంటిదివో మించయిననామేను
మెఱుఁగువంటిదెపో నీమేఁటివలపు
నెఱి శ్రీవేంకటేశ్వర నీవే నను( గూడితివి
తఱితోడఁ జవులాయ తగిననీరతులు ॥ సరి ॥ 435

## వరాళి

చొల్లెపుఁజుట్లవో చొక్కనాథా నీ-
చల్లరిచేఁతలు గంటిఁ జొక్కనాథా ॥ పల్లవి ॥

చూడ వేగన్నులు నిన్నుఁ జొక్కనాథా నీకు
జోడు భూమియును లక్ష్మిఁ జొక్కనాథా
సూడిదె నాపాయమిదె చొక్కనాథా నీతో
స్గూడువట్టీ నారతులు చొక్కనాథా ॥ చొల్లె ॥

చొక్కపుసింగారాలచొక్కనాథా। మోవిఁ
జుక్కలు నించె నెవ్వతో చొక్కనాథా
చొక్కించితి గోపికలఁ జొక్కనాథా। నాతో
సుక్కులమాట లేలోయి చొక్కనాథా ॥ చొల్లె ॥

సొమ్ములతొవిఱ్ఱవఁగేచొక్కనాథా। పోదు-
సుమ్మీ నీకు నాకుఁ జొక్కనాథా
ఇమ్ముల శ్రీవేంకటాద్రి నిటు నీవు గూడఁగాను
జుమ్మన మై పులకించెఁ జొక్కనాథా ॥ చొల్లె ॥ 436

శంకరాభరణం

పచ్చిసేయకుందునా పైపై నిన్ను
అచ్చలపునీవు దొరవని యింతేకాక ॥ పల్లవి ॥

నీకన్నులకావి చూచి నిన్ను మెచ్చకుందునా
దాకొని నీవంటివాని దగ్గరక వుందునా
యీకడ నీమేనితావి ఇందుఁ జొక్కకుందునా
పైకొని నామనసొడఁబడ దింతేకాక ॥ పచ్చి ॥

ముందు నీభావము చూచి మొక్కి మొక్కకుందునా
చిందేటిచెమట చూచి చెక్కు నొక్కకుందునా
పొందగుఁగళలు చూచి పొగడక వుందునా
యెందు నాపంతము నన్ను నెడసేసీఁగాక ॥ పచ్చి ॥

కాఁగిలించుకోఁగా కొంగు గప్పక నే నుందునా
మూఁగినరతులవేళ ముచ్చటాడకుందునా
వీఁగక శ్రీవేంకటేశ విన్నవించకుందునా
మాఁగినమరపు నన్ను మంకుఁ జేసీఁగాక ॥ పచ్చి ॥ 437

లలిత

ఏమిసేత నేమిసేత నేవంక చూచినాఁ దామె
దోమటి నాకెకు నాకు దొరసీ నేఁ డిపుడె ॥ పల్లవి ॥

కాసీ నవొకటి కాంతనవ్వువెన్నెలలు
వూసీ నదొకటి పూఁపవలపు
రాసీ నొకవంక రాఁపుఁగుచములు రెండు
యేసీ మఱి దీవంక నేమిసేసేదే ॥ ఏమి ॥

చిమ్మి నదొకటి చెలిచూపులచీఁకటి
కమ్మి మాటలనె కమ్మఁదేనెలు
తుమ్మిఁ జింకతుమ్మలు తుమ్మిదగుంపులకొప్పు
అమ్మి నల్లదె పాయ మాకెకె నన్నుమ ॥ ఏమి ॥

చాఁచీ నదొకటి సతికాఁగిటికిఁ జేయి
పూఁచీ నదొకటి బువ్వపుమోవి
యేఁచీ యిట్టె శ్రీవేంకటేశుఁడగనక నన్ను
లాచి కూడె నీమగుప లాగాయ నిఁకను ॥ ఏమి ॥ 438

రేకు 1185 తెలుఁగుఁగాంబోది

అతనిఁదోడి తెచ్చినందాఁకా
హితబుద్ధుల చెలి యేమరకుమీ ॥ పల్లవి ॥

వెలఁది విరహముల వేసవికాల మిది
యెలమి మోవిచిగు రెండనీకుమీ
కలికి నిట్టూర్పులగాలికాల మదె
తెలివలపుపదను తియ్యనీకుమీ ॥ అత ॥

వనిత పెంజెమట వానకాల మదె
మొనపులకననలు ముంచనీకుమీ
మనవుల సిగ్గుల మంచుఁగాల మదె
ఘనకుంచగిరులనుఁ గప్పనీకుమీ ॥ అత ॥

వెసఁ గాంత నవ్వువెన్నెలకాలము
నసిఁ గొప్పుచీఁకటి జారనీకుమీ
పసగా శ్రీవేంకటపతి విచ్చేసి కూడె
వసంతకాల మిదె వదలనీకుమీ ॥ అత ॥ 439

సామంతం

తానొక్కఁడే గురి తమకమునకును
యే నింక నెవ్వరితో నేమిచెప్పేనే ॥ పల్లవి ॥

తనువొక్కటే గురి తన్నుఁబానేకాఁకలకు
మనసొక్కటే గురి మంతనాలకు
కనుఁగొనలే గురి కడునిట్టచూపులకు
యెనసి యెవ్వరి కింక నేమిచెప్పేనే ॥ తా ॥

ప్రాయమొక్కటే గుఱి పచ్చివలపులకెల్లా
చేయి చెక్కిటికి గురి చింతలకును
మోయునిట్టూర్పులే గురి మునుకొన్నకోరికకు
యేయెడ ముచ్చట లింక నేమిచెప్పేనే ॥ తానొ ॥

కూడినకూటములకు కొనగోరొక్కటే గురి
యీడ నాకు శ్రీవేంకటేశునికిని
తోడనే కళలు గుఱి తుదలేనివేడుకకు
యేడ నెవ్వరికి నింక నేమిచెప్పేనే ॥ తానొ ॥ 440

మేఁచబౌళి

తనిసితి నన్నిటాను తాలిమే మేలిమాయః
యెనసినసంతసము లింక నెన్నఁడే ॥ పల్లవి ॥

ఆసలనే కొంతవొద్దు అంగమంటి కొంతవొద్దు
బాసచేసి కొంతవొద్దు భ్రమయించెను
వాసికి సరసమాడ వయసు వోయీనేమో
యీసుదీర మన్నించే దింక నెన్నఁడే ॥ తని ॥

మోము చూపి కొంతవొద్దు మొక్కులాడి కొంతవొద్దు
నాముదేర నవ్వి కొంత నాలిసేసెను
ఆమవిఁ గుంటెనమాఁట లాడఁగానే తెల్లవారె
యీమేర నన్నుఁ గూదే దిఁక నెన్నఁడే ॥తని॥

చేయివేసి కొంతవొద్దు నేసవెట్టి కొంతవొద్దు
యీయెడఁ గాఁగిటఁ గూడె నీపొద్దు
పాయపుశ్రీవేంకటాద్రిపతి కింతా వెలవాయ
యేయెడఁ జొక్కుదుఁగాక యిఁక నెన్నఁడే ॥తని॥ 441

## హిజ్జిజి

అది నీకుఁ దారుకాణ అవునోకాదోకాని
కదిసి చెప్పఁగబోతే కతలయ్యీఁగాని ॥పల్లవి॥

కలలోన నీరూపు కన్నులఁగన్నట్లయ్యీ
చెలఁగి ఆసుద్ది చెప్పఁజింతయ్యీఁగాని
వెలయ నీపలుకులు వీనుల విన్నట్లయ్యీ
సెలవిఁ గమ్మరఁ జెప్పసిగ్గయ్యీఁగాని ॥అది॥

మంతనాన నీతో మాట లాడినట్లయ్యీ
అంతటఁ జూచితే వెరగయ్యీఁగాని
కంతుసమరతి నిన్నుఁ గాఁగిలించినట్లయ్యీ
వంతాన నేమనినాను పచ్చిదేరీఁగాని ॥అది॥

సరుస నీమోవితేనె చవిగొన్నఅట్లనయ్యీ
వొరసి చూపఁబోతే గోరొత్తీఁగాని
ఇరవయినశ్రీవేంకటేశ నీవు ద్రిష్టముగా
సరుగఁ గూడిన నదె చాలాయఁగాని ॥అది॥ 442

లలిత

ఏమాటకేమాట యేమే నీవు వోరి
అమాటకామాట లవి యంతే కావా ॥ పల్లవి ॥

పచ్చిపాలు వోయవుగా పసిగొల్లెతా। అవె
పచ్చివెచ్చి అయ్యీఁగాని పదరా నీవు
పచ్చిచిగురేకాదా భామ నీమోవి। నీవు
పచ్చిగాఁ దిరుఁగఁగాను పసురెక్కకుండునా ॥ ఏమా ॥

పెరుగు వెట్టవుగా గుంపెనగొల్లెతా। నీవు
పెరిగి యింతైతివి పెక్కులేలర
పెరుగు నీకుచములు పిక్కటిల్లను। నీవు
పెరుగఁగ నవి కడుఁబెద్దలు గాకుండునా ॥ ఏమా ॥

వెన్నలైనఁ బెట్టవుగా వెదగొల్లెతా నిన్ను
వెన్నకంటె నున్నఁజేసే వేగమేలరా
వెన్నతోఁ బెట్టినది యీావేషము నీకు
వెన్నలఁ గూడితి శ్రీవేంకటేశ చాలదా ॥ ఏమా ॥ 443

సామంతం

తొల్లిటితాఁదానే కాఁడా దొరయాయనా
అల్లనాఁటి తగవు నేఁ దందదాయనా ॥ పల్లవి ॥

చాయల నే రానంటా సణఁగులాదేవాఁడు
కాయముఁ దానంటఁగా నేఁ గాదంటినా
పాయపుసతుల మింతో బలుమగవాఁడు దాను
పాయక గొల్లెతలను పచ్చిసేయఁడాయనా ॥ తొల్లి ॥

కన్నులఁ దిట్టితినంటా ఘాతలు సేసేవాఁడు
నన్నుచేసి పిలువఁగాఁ జరసితినా
కన్నెలము ఇదె నేము ఘనమైనప్రౌఢ దాను
మున్నే ఎరుకచేసితే మొగిఁ జెల్లదాయనా ॥ తొల్లి ॥

కులికి గోరంటితేను కోపగించేవాఁడు నన్ను
పలునోఁకించఁగ నేను పదరితినా
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
ఆలమి పదారువేల నంగవించఁడాయనా ॥ తొల్లి ॥ 444

రేకు 1186 శంకరాభరణం

ఏమయ్య రమణుఁడ యింత సేతురటవయ్యా
కామిని నూరడించి కలయఁగరాదా ॥ పల్లవి ॥

దఁటి కధరమిచ్చి పలునోఁకించినది
బడి బడి విందువెట్ట పగలాయ
వెడవెడఁగా నవ్వి వెంగెమాడినది
తొడికేదోమటిపాలఁ దోడనే వేఁడాయ ॥ ఏమ ॥

తరుణిఁ దప్పకచూచి తలవంచినది
అరిది నమ్మించి తప్పినట్లాయ
సరస మాడియాడి సరుగన దాఁగినది
పొరిఁబొరి మధ్యాహ్నానఁ బొద్దుగుంకినట్లాయ ॥ ఏమ ॥

మెలుఁత గాఁగిటఁ గూడి మేను మరచినది
నిలువునీడలలోన నివ్వెరగాయ
అలరి శ్రీవేంకటేశ ఆదరించినది
ఫలియించి పసిఁడిలోఁ బరిమళమాయ ॥ ఏమ ॥ 445

శంకరాభరణం

[1] చూచినవారికినెల్లా సోభనమై వుండువు
తాచిన శ్రీవేంకటేశ దైవమై వుండువు ॥పల్లవి॥

నాలుగుచేతులతోడ నలి నీవు నిలుచుంటే
చాలి కొమ్మలకల్పవృక్షమువలె నుండువు
మేలిమిపీతాంబరాన మెరసి నీ వుంటేను
వాలినబంగారురాశివలె నుండువు ॥చూచి॥

జమళిపాదములతో సరి నీవు నిలుచుంటే
అమరి యిహపరము లందినట్టె వుండువు
తమినీలవర్ణముతోఁ దగ నీవు నిలుచుంటే
గమిఁ గనకవరుషకాలమేఘ మౌదువు ॥చూచి॥

కొండవంటితురుముతోఁ గోరి నీవు నిలుచుంటే
మెండుశిఖరముతోడిమేడవలె నుండువు
అండనె శ్రీవేంకటాద్రి నలమేలుమంగఁ గూడి
వుండితే మిన్నునేలా నొక్కటైనట్లుండువు ॥చూచి॥ 446

పాడి

చల మింకానా నీకుఁ జాలదా నేఁడు
సలిగెలు పతితోడఁ జాలదా నేఁడు ॥పల్లవి॥

వదనము వసివాడె వనిత నీకొప్పు వీడె
చదురులబింకము చాలదా నేఁడు
గుదిగొనెఁ బులకలు కుమ్మరించెఁ జెమటలు
సదమదమైతి వింకఁ జాలదా నేఁడు ॥చల॥

1. ఇది అధ్యాత్మ కీర్తనలభాయలోనిది.

కన్నులఁ గెంపులుదేరెఁ గడునిట్టూర్పులు మీరె
సన్నలుఁజాయలు వింకఁ జాలదా నేఁడు
వెన్నగా మతి గరఁగె విభుపైఁ దనువొరగె
సన్నపుమోవితిట్లు చాలదా నేఁడు ॥ చల ॥

నెలవుల నవ్వులు చిందె సిగ్గులు లోలోఁ గుండె
చలివేఁడికొసరులు చాలదా నేఁడు
బలిమి శ్రీవేంకటాద్రిపతి నిన్ను నిదె కూడె
సరసపుతెల్లఁ బాసఁ జాలదా నేఁడు ॥ చల ॥ 447

## సౌరాష్ట్రం

చాలుఁజాలు వాఁడులేనిజన్మమేలా
జాలి నన్నుఁబెట్టకురె సారెసారెఁ జెలులు ॥ పల్లవి ॥

నేఁడు వానిఁబాసినవెన్నెలబయలేలా
వోడక వాఁడుగాఁగిటనుండనినిద్రేలా
కూడి వాఁడు నేను గప్పుకోనిపయ్యెదేలా
వీడనిచెక్కుతోడివెరగే చాలును ॥ చాలు ॥

ల వావిసరసములేనినవ్వేలా
ఆలించి వాడువినవిఅమాటలేలా
పోలి నిద్దరు నొక్కటై చూడనియద్దమేలా
తాలిమితో లోలోనె తలపోఁతే చాలును ॥ చాలు ॥

యీకడ వాఁడుగూడనియీజవ్వనమేలా
ఆకు వాఁడు మడిచియియ్యనితమ్ములమేలా
వాఁకగా శ్రీవేంకటాద్రివాఁడు నన్నుఁ గూడె నిదె
మాఁకుపడఁజొక్కినయీమరపిదె చాలును ॥ చాలు ॥ 448

ముఖారి

చాలునె చాలునె నట లిఁకనూ ని-
న్నేలినపతికడ కేఁగగరాదా ॥ పల్లవి ॥

పెంచినఁ బెరుగును పెనుసీచలములు
నించివనీకొప్పునెరులవలె
వంచిన వాలును వడి నీకోపము
ముంచులనీకనుచూపులవలెను ॥ చాలు ॥

కరఁచినఁ గరఁగును కలికి నీమనసు
పరుగునీకాంతులపసిఁడివలె
మరపిన మరగును మహి నీగుణములు
పెరతేనెలనీపెదవులవలెను ॥ చాలు ॥

కదిసిన(?) గద్దా [1]కాంక్ష నీరతులు
ముదిరిననీకుచములవలెను
యెదురనె శ్రీవేంకటేశుఁడు గూడెను
పదవులజవ్వనపాయమువలెను ॥ చాలు ॥ 449

మంగళకౌసిక

కంటిమి వింటిమి నాఁడె కమ్మర నేఁడు కొత్తేల
వొంటినుండఁగాఁ జేత నొత్తకురా మమ్మును ॥ పల్లవి ॥

వొప్పుల నీతీపుమోవినుండి వెదలేమాఁట
దెప్పరపుటొగరౌనా తీపేకాక
ముప్పిరి నీతరితీపు మొగచాటాయె మాకు
అప్పుడే తవిసితివి అంటకురా నమ్మును ॥ కంటి ॥

1. కద్దు + ఆకాంక్ష.

నయగారిగుణమున నడపేనీచేఁతలు
నయములేకాక వేరేనాఁటివెట్టవునా
నయములఁ బ్రియముల నమ్మికలఁ దనిసితి
చెయిముట్టి నీవంత చెనకకు నన్నును ॥ కంటి ॥

చల్లనికాఁగిట నీవు సరిఁగాఁగిలించఁగాను
చల్లనయ్యేవుండుఁగాక సారెఁ గాఁకౌనా
యెల్లగా శ్రీవేంకటేశ యిన్నిటా నేఁ దనిసితి
మెల్లనె పూరుకుమారు మెచ్చకురా నన్నును ॥ కంటి ॥ 450

రేకు 1187 వరాళి

ఎన్నఁటికెన్నఁటిపొందు యిస్సీ నేను .
ఎన్నుకొను నామనసు యిస్సీ నేను ॥ పల్లవి ॥

కొంకక నీరాతిగుండెగుణ మెరిఁగుండియు
యింకా నిన్నుఁ గొసరే నిస్సీ నేను
వుంకువ వేరొకతెతో వుండఁగా నిన్నుఁ జూచియు
యింకవు నాకన్నీళ్లు యిస్సీ నేను ॥ ఎన్న ॥

మంతనాన నాడినవీమాఁట గల్లైవుండఁగాను
యెంతైనా మానఁగలేను యిస్సీ నేను
పంతాన నీవటుమోమై పరాకై వుండఁగాను
యెంతకెంత మాఁటలాడే నిస్సీ నేను ॥ ఎన్న ॥

తొప్పఁదోఁగి చమటల తొల్లిటినీబాగు చూచి
యిప్పుడె నేఁ గాఁగిలించే నిస్సీ నేను
అప్పుడె శ్రీవేంకటేశ అదరించి కూడితివి
యెప్పుడో మైమరచితి నిస్సీ నేను ॥ ఎన్న ॥ 451

శంకరాభరణం

మెచ్చనిదానవా నీవు మితిమీఱఁగాఁగాక ని-
న్నెచ్చరించే దాననాయిచ్చలోనే కాక ॥ పల్లవి ॥

యింత నీవు వద్దనుండే దెరఁగనిదాననా నీ-
పంతము చెడీనంటాఁ బట్టఁగాక
అంతకంటె ముద్దుమాఁట లాడకుండేదానవా
వింతరీతిఁ దిరుగఁగా వెరచితిఁగాక ॥ మెచ్చ ॥

గుట్టునఁ బిలువఁగ నే కొంకేటిదాననా నీ-
వొట్టు దప్పీనని లోన నుంటిఁగాక
తొట్టిననీమైచెమట తుడువనిదాననా
మట్టు నీమైగురుతులు మాసీననికాక ॥ మెచ్చ ॥

నీకపుఁ(ప్పుఁ?)గాఁగిట నిన్ను నించకుండేదాననా
చొక్కపునీసరితెలు చూచితిఁగాక
యెక్కువ శ్రీవేంకటేశ యిటు నీవె కూడితివి
మొక్కకుందునా నీవు మొక్కేవనికాక ॥ మెచ్చ ॥ 452

మంగళకౌసిక

ఏమన్నా నాకుఁ బోదు ఇచ్చగించ నీకుఁ బోదు
మోముచూచినంతలోనె మొక్కనేఁటికయ్యా ॥ పల్లవి ॥

పాయమె నాకు నెక్కె పంతమె నీకు నెక్కె
చేయార యేమైనాఁ జేయవయ్యా
కాయము నాకే నెలవు కాఁకలు నీకే నెలవు
చాయలు సన్నలు ఇంకఁ జాలించవయ్యా ॥ ఏమ ॥

వలపు నాకాయ నీకు వలసీనొల్లములాయ
మలకలబొంకు లిఁక మానవయ్యా
పులకలు నావంతు బూటకాలు నీవంతు
నిలువునివ్వెరగులు నీకేలయ్యా ॥ ఏమ ॥

బాగుగఁ గూడేది నాది పైపైఁ జొక్కేది నీది
చేగలనీసరసము చెల్లునయ్యా
యీగతి శ్రీవేంకటేశ యిద్దరముఁ గూడితిమి
తీగెనవ్వులెల్లా నేఁడు దిష్టమాయనయ్యా ॥ ఏమ ॥ 453

## లలిత

ఇంక నీచిత్తముకొలఁ దిదేమాఁట
అంకెల చెలికడకు నంపనేల నన్నును ॥ పల్లవి ॥

చెప్పిచూపవచ్చుఁగాని చెట్టవట్టి తియ్యరాదు
ఇప్పుడెట్టున్నదో చెలి యిదేమాట
రెప్పలెత్తవచ్చుఁగాని రిచ్చవడివుండరాదు
అప్పటి చెలికడకు నంపనేల నన్నును ॥ ఇంక ॥

మోముచూడవచ్చుఁగాని మోహము గడించరాదు
యీమగువప్రాణ మెత్తు మిదేమాట
దోమటిదొడకవచ్చుఁ దూరి కాలుదొక్కరాదు
ఆమాట చెలికిఁ జెప్ప నంపనేల నన్నును ॥ ఇంక ॥

పంతమాడవచ్చుఁగాని పాడిదప్పకుండరాదు
యింతలో చెలిఁ గూడితి విదేమాట
చెంతల శ్రీవేంకటేశ్వర చెల్లుఁజెల్లు విద్దరికి
అంతయు మేలాయ నిఁక నంపనేల నన్నును ॥ ఇంక ॥ 454

శుద్ధవసంతం

కూడినంతఫలమె కోరి నీ వేపకుండితే
ఆడికెరమణుఁడ నేఁ డందు కదె చాలును ॥ పల్లవి ॥

కులికికులికి నవ్వె కొమ్మ నీయానలకు
పలికిపలికి మెచ్చె పచ్చినీనేఁతలకు
నిలిచినిలిచి చూచె విందునీరాజసము
అలనెఅలనె నింతె అందు కదె చాలును ॥ కూడి ॥

తిరిగితిరిగి చూచె తెలివ నీరాకలకు
వొరగివొరగి వుఁడె వొక్కటె నీఅలుకకు
మొరఁగిమొరఁగి చొక్కె మొన్నటినీపొందులకు
అరసియరసి నవ్వె అందు కదె చాలును ॥ కూడి ॥

తవిసితవిసి కూడె తరుణి నీకాఁగిటికి
యెనసియెనసి పేఁగె యెక్కువనీరతికి
మునుపె శ్రీవేంకటేశ మొక్కె నీసన్నలకు
అనుమానము వానె నందు కదె చాలును ॥ కూడి ॥ 455

ముఖారి

సమమోహములతోడ సంగడిభ్రమతతోడ
విమిషము సందేహించి విలిచి రిద్దరును ॥ పల్లవి ॥

వనితకుచంబులు వనజంబులు హరి-
కనుచూపుతామరలు కలవెరసై
యెనసి చిక్కువడి యేరుపరచఁగరాక
వినుపునివ్వెరగుల విలిచి రిద్దరును ॥ సమ ॥

కాంతచెక్కుటద్దముల ఘనునిచెక్కుటద్దాల-
కాంతి విద్దరిరూపులు కలబెరసై
అంతలోనే తమమేను లవె తడఁబడెనవి
వింతలై నిలిచి రట్టె వెరగై యిద్దరును ॥సమ॥

చెలిబాహులతలను శ్రీవేంకటేశ్వరుని-
కలయుబాహులతలు కలబెరసై
అలమి మరుకేళిని అవి యేర్పరచరాక
నెలకొన్నమరపున నిలిచి రిద్దరును ॥సమ॥ 456

రేకు 1188 ముఖారి

ఎవ్వరు జాణలే వీరిద్దరిలోన
రవ్వలు మాయలుసేసీ రాజసపుకృష్ణుఁడు ॥పల్లవి॥

దోసిట నీరు నించె తొయ్యలి మోము గడిగె(గడుగ?)
ఆసమయాన కృష్ణుఁడు అటు వెనకనుండఁగా
వోసరి యాతనినీడ దోసిటిలోఁ గని నీరు
వాసిఁ గాళ్లఁజల్లుకోఁగా వడి నవ్వె కృష్ణుఁడు ॥ఎవ్వ॥

అద్దము చూచి నామ మటు దీర్చుచును ఇంతి
వొద్దనే మానిమీఁదనున్నకృష్ణు నందుఁ గని
అద్దము తామరగొవి యడిచిన నది చూచి
చద్దికి వేఁడికి నవ్వి జంకించెఁ కృష్ణుఁడు ॥ఎవ్వ॥

నిక్కి పువ్వులు గోయుచు నీరెండగాయఁగాను
పక్కన కృష్ణునినీడ పడఁతి గని
అక్కడ నేతెంచి వద్దియంగనఁ గూడఁగాను
వెక్కసాన మెచ్చెను శ్రీవేంకటాద్రికృష్ణుఁడు ॥ఎవ్వ॥ 457

దేశి

మీఁఱరాదు దూరరాదు మేనవావివలెనాయ
ఆఱడి నీతోడిపొందు లగడాయ నిఁకను ॥ పల్లవి ॥

చేరి మాటలాడఁబోతే సెలవుల నవ్వు చిందీ
వూరకుంటే పెంజెమట లుమ్మగిలీని
యీరీతి ముందరనుయ్యి యెంచ వెనకఁ దగరు
యేరా నీతోడిపొందు యేమిసేతు నిఁకను ॥ మీఁఱ ॥

తప్పకచూడఁగఁబోతే తనువెల్లాఁ బులకించే
రెప్పలు మూసిన కాఁకరేఁగీని
విప్పకపట్టితే నుమ్మ విడిచి తేనెగారీ
తిప్పరానినీపొందు ద్రిష్టమాయ నిఁకను ॥ మీఁఱ ॥

మోవి చవిగొంటేను మోహ మగ్గలమయ్యీఁ
తావితములమందితే తమివుట్టీని
యీవేళ మందాఁ బాలు యిఁటాఁ [1]బాళమాయ
శ్రీవేంకటేశ కూడితి చెప్పరాదు ఇఁకను ॥ మీఁఱ ॥ 458

దేశాక్షి

అంటివి వింటిని అవుఁ బదరా నీ-
దంటతనంబులు తగుతగురా ॥ పల్లవి ॥

నిక్కుల గంటిని నీమాట చేకొంటి
చొక్కుల నను నిఁక సొలయకురా
చెక్కులి నొక్కితి సేసయుఁ బెట్టితి
యెక్కడిసుద్దులు యేఁటికిరా ॥ అంటి ॥

1. పాళము=పాయసము.

సెలవుల నగితిని సేఁతలఁ దెగితిని
బెళకులఆనలు పెట్టకురా
పులకల మునిఁగితి బూతులఁ గొణఁగితి
వలపులు చల్లఁగవలెనటరా ॥ అంటి ॥

కాఁకల వాడితిఁ గాఁగిటఁ గూడితి
వాకుసరసములు వలెనటరా
యీకడ శ్రీవేంకటేశ నీప్రియము
కైకొంటి పయ్యెదఁ గప్పేరా ॥ అంటి ॥ 459

## శుద్ధవసంతం

ఇంకనేలే మాటలూ యింతి నీజాడ చూచితి
అంకెలఁ జల్లగాలికి నాయాలు ముట్టితివి ॥ పల్లవి ॥

కప్పురముదిన్ననోటఁ గాదన నింపుగాక
వుప్పుదిన్ననోట నంటే నొడఁబాటౌనా
నెప్పున నాబుద్ధి విని నీవు పతిఁ గలసేవా
విప్పఁగోవిలనోటికి వెరచితిగాక ॥ ఇంక ॥

వుంగరపువేల సన్న లూరకనైనా నింపుగాక
సంగతి రుత్తైనవేల చవివుట్టీనా
బంగపడి మొక్కనాను పతిని దగ్గరితివా
వుంగిటఁ జంద్రునిరాక కులికి వచ్చితివి ॥ ఇంక ॥

కాటుకవెట్టినకంటఁ గసరితే నింపుగాక
గాఁటపురుత్తకన్నులఁ గందువయ్యీనా
నాటినమరునమ్ములనంజు తలకెక్కఁగాను
కూటువ శ్రీవేంకటేశుఁ గూడితివే మగువా ॥ ఇంక ॥ 460

శంకరాభరణం

దవ్వులఁ బంతాలు చెల్లె దగ్గరరా
యివ్వలనవ్వల మీకు నిద్దరికిఁ దగులు ॥ పల్లవి ॥

కాయములో కరఁగు కనుచూపులో మొరఁగు
చేయిచెక్కు వెరగూ చెలియ కదె
పాయములో బిగువూ పచ్చిమోవినగవూ
యీయెడ నీకే చెల్లె యింతిమనోహరుఁడా ॥ దవ్వు ॥

పలుకులకొదలూ పయ్యెదలోవదలూ
అలకలకదలూ అతివె కదె
నిలువుఁదమకము నిట్టూర్పుగమకము
చెలువుఁడ నీకుఁ జెల్లె చెప్పనిఁకనేలా ॥ దవ్వు ॥

మొనపేటిసిగ్గులూ మోములోనినిగ్గులూ
పనిలేనియెగ్గులూ పడఁతె(తి?) కదె
యెనసితివి శ్రీవేంకటేశ నీవే విచ్చేసి
వనితకు నీకుఁ జెల్లె వాసు లింతలోనె ॥ దవ్వు ॥ 461

సామంతం

తక్కులు మొక్కులు తగులాయ
దిక్కులమోహము ద్రిష్టములాయ ॥ పల్లవి ॥

కాంతమేను కడుఁగాఁకలఁ బొరలఁగ
చెంతలఁ జెక్కులు చెమరించె
వంతుల నెండయు వానయు నొక్కట
దొంతులఁ గూడిన తోయములాయ ॥ తక్కు ॥

ద్రిష్ట-గీతగలతావు చిలుముతో నస్పష్టము.

తెలినిట్టచూపుదీపాలు గలుగఁగ
కలికితురుముచీఁకటి నెరసె
వెలసినచీఁకటి వెలుఁగును నొక్కట
కలిగినభావము కతలై నిలిచె ॥తక్కు॥

పూవులపులకలు పొడమినఆవేళ
మోవులపండు ముదిరె నదె
శ్రీవేంకటపతి చేరి కూడఁగ
వావులరతు లేవంబులు గాచె ॥తక్కు॥ 462

రేకు 1189 రామక్రియ

సారెసారె నన్నంత జరయకురే
మేరతో నాపతియట మేలు మఱచీనా ॥పల్లవి॥

తానే వచ్చీఁగాని తడవకురే కొంత
నానితేనే మెత్తనౌను నయగారాలు
పోసిపోసివే అంతపొదుగరురే
పూనిపూచినవిరులు పూఁపలు గాకుండునా ॥సారె॥

కూడీకూడీఁగాని కొసరకురే కొంత
వాడితేను చవులౌను వలపైనాను
నాడెనాడె మొక్కె నవ్వకురే
వేడుక చంద్రోదయము వెన్నెల లేకుండునా ॥సారె॥

పంతేసుండీఁగాని పొరయకురే
కొండలైనఁ గొట్లపుసు బట్టుగలితే
పండి శ్రీవేంకటపతి తానే విచ్చేసి కొంత
మెండుగా మెరిసినంత మేఘము లేకుండునా ॥సారె॥ 463

శంకరాభరణం

చెలి నీవు సేసవెట్టి సిగ్గులింకేలే
ఫలము దెలుసుకొమ్మీ పతి యిందున్నాఁడు ॥ పల్లవి ॥

తరుణి నీవు బింబాధరివి
సరిఁ జిలుకపలుకు లిచ్చుట నీకేలే
పొరసి మోవిఁ జిలుకపోట్లాఁ జూమ్మీ
వరుస నీరమణుఁడు వద్దనే వున్నాఁడు ॥ చెలి ॥

అంగన నీవు చకోరాక్షివి
అంగడి వన్న(న్నె?)లనవ్వు లవి నీకేలే
ముంగిటఁ బొత్తుగలసి యెంగిలొఁ జూమ్మీ
చెంగట నీరమణుఁడు చేకొనియున్నాఁడు ॥ చెలి ॥

కోమలిరో కరికుంభకుచవు నీవు
ఆమైఁ జెమటమడుగు లవి నీకేలే
గామిడిజవ్వన మిది కలగీఁ జూమ్మీ
యామీఁద శ్రీవేంకటేశుఁ డిటు నిన్నుఁ గూడె ॥ చెలి ॥ 464

సాళంగం

నీచందములు వేరె నాచందములు వేరె
ఏచి నీవు నాకుఁ బొందు లెటు గూడెరా ॥ పల్లవి ॥

కమ్మనినీకస్తు లిట్టె కిమ్మఁ దెల్లఁగాఁగాను
ఇమ్ముల నాకనుఁగొన లెఱ్ఱఁబారెరా
సమ్మతించి నీమేను చల్లనై నంయుల కె
కమ్మర నామేను యిట్టె కాఁకరేఁగెరా ॥ నీచం ॥

పూచిననీమేన నిట్టె పులక లుబ్బఁగ జూచి
లాచి నీవుండి నాదేహాలత వాదెరా
వీచుల నీసెలవుల వెన్నెలలు గాయఁగాను
యీచాయ నాకోపముల యెండగాసెరా ॥నీచం॥

అంతలో శ్రీవేంకటేశ ఆదరించి కూడఁగాను
వింతగా నాతురుమును వెడవీదెరా
చింతలనీమతి నీవే చిమ్మిరేఁగి మఱవఁగా
యింతట నాతమకము లెచ్చరించీరా ॥నీచం॥ 465

## సౌరాష్ట్రం

పట్టినదెల్లాఁ దప్పు భావించినదే తప్పు
యెట్టయినఁ దలపోఁత లెనయవిచోటికి ॥పల్లవి॥

మించుఁగాఁగిలియ్యఁబోతే మేనురాయుటే తప్పు
కంచపువిడి(డె?)మిచ్చితేఁ గారమౌటే తప్పు
వుంచముగాఁ బిలిచితే నూఁకొనుటే తప్పు
ఇంచుకంత మతిలోన నీసడించేచోటికి ॥పట్టి॥

చేకొని మొక్కఁగఁబోతే చేతులు దాఁకుటే తప్పు
యీకడ మోవానితేను యెంగిలైనదే తప్పు
మేకుఁగొప్పు దువ్వితేను మే గోరంటితే తప్పు
పూకించి లోలోన నొరసైనచోటికి ॥పట్టి॥

పానుపుపైఁ గూడితేను బడలఁజేయుటే తప్పు
యీనెపానఁ దారుకాణ లిందరికిని
కోనల శ్రీవేంకటేశ కూడితివి నన్ను నేఁడు
[1]యీనవ్వు మనకేకాని ఇంపుగానిచోటికి? ॥పట్టి॥ 466

1. 'యీనవ్వు మనకేకా వీఇంపుగానిచోటికి' అనుకొన్నను సరిపడినట్లు తోచదు.

కాంబోది

ఇంత చాలదా మరి యేమైన నాయఁగాని
వంతులు వాసులు నందే వక్కాణించఁ గంటిఁగా ॥ పల్లవి ॥

చూచినచూపులలోన చురుకన్నా ననెఁగాని
కాచినమోవి కెంపైనాఁ గంటిఁగా నేను
వేచినచిరునవ్వులు వేఁడైనా నాయఁగాని
చేచేతనే సిగ్గు చేవదేరఁ గంటిఁగా ॥ ఇంత ॥

వారింపులమాటలలో వాండ్లయినా నాయఁగాని
తీరైనగొణముతెల్లఁ దెలిసితిఁగా
వేరులేనిమొక్కులలో వెంగెమైనా నాయఁగాని
నారుకొన్నపులకల నాములైనాఁ గంటిఁగా ॥ ఇంత ॥

పట్టినకైదండలోనె పచ్చయినా నాయఁగాని
చిట్టంటుచేఁతలు మేనఁ జేయఁగంటిఁగా
గుట్టుగా శ్రీవేంకటేశ కూడినాఁ గూడితిఁగాని
వొట్టులు సత్యాలు నీచే నొనరించఁగంటిఁగా ॥ ఇంత ॥ 467

ముఖారి

నీయందు గదమా నిండుదొరవు నీవు యీ-
నాయము లోకపునడపదేకదరా ॥ పల్లవి ॥

సగమా నీఁ జేఁతయు సగము వెలుంగును
పగి యొందిదినమునఁ జెలఁగినటా
నిగిడి నీగుణములు నిజమును తెల్లయు
పొగి నీకుఁ గలుగు పొనితమేకదరా ॥ నీయం ॥

చేఁదు కాఁకరను చెరకునఁ దీపును
పోదితో నిట్టే పొదమీనటా
వేదల మతి నొలసియు నొల్లమియును
యీదెస నీకిది ఇటు దగుఁగదా ॥నీయం॥

శ్రీవేంకటేశ్వర చిగురును చేఁగయు
వోవల నొకమాన నుండీనటా
నీవల వినయము విటు రాజసముఁ
దావాయ నీరతిఁ దగుఁదగుఁ బదరా ॥నీయం॥ 468

రేకు 1190 సామంతం

చెక్కునొక్కనా బుద్ధిచెప్పుటగాక
గక్కన విందులకుఁగా కళవళమేఁటికే ॥పల్లవి॥

తనుఁదానె రాకుండితే తలఁపులో రాఁడా
మనసునా రాకుండితే మాటలో రాఁడా
తను నిందరిలో దొరతనము చెరుచనేలే
వెనకఁ జెప్పేఁగాని వేగిరించనేఁటికే ॥చెక్కు॥

పాదిదా నొల్లకుండితే పంతమైనా నొల్లఁడా
వాదికా నొల్లకుండితే వంతులకు నొల్లఁడా
యీదనె ఇంతటిలోన యెమ్మెలు చెరుచనేలే
ఆడఁ దనరచ్చలలో నైనదయ్యీఁగాని ॥చెక్కు॥

సెలవి నవ్వకుండితే చెక్కు చెమరించఁడా
చెలఁగి వూరకుండితే చేతికి లోఁగాఁడా
బలిమి శ్రీవేంకటాధిపతి నన్నుఁ గూడె ఇట్టె
పలువివయాలు నేసీఁ బచ్చిసేయనేఁటికే ॥చెక్కు॥ 469

శంకరాభరణం

ఇద్దరు విద్దరే మిమ్ము నేమనేదే
నిద్దపునాబుద్ధి విననిది మీకుఁ దగదే ॥ పల్లవి ॥

ముందుముందే వొట్లు మోవిమీఁదిలిట్లు
నిందలునాదే దాతని నీకుఁ దగదే
కందువై నబీరాలు కాఁకవుట్టేనేరాలు
అందమై నీమీఁదఁజేసే దాతనికిఁ దగదే ॥ ఇద్ద ॥

చలివేఁడిగొణఁగులు సారెసారె సణఁగులు
నిలిచి మారుమొగము నీకుఁ దగదే
వలవనితమకాలు వాడుమోముసముకాలు
అలిగితే మారలుగ నతనికిఁ దగదే ॥ ఇద్ద ॥

కాఁగిటిలో వాసులు కదిసినరేసులు
నీఁగనిచలము వీడ నీకుఁ దగదే
వీఁగక నిన్ను శ్రీవేంకటేశుఁ డిటు గూడె
ఆఁగి చలములుచూప నాతనికిఁ దగదే ॥ ఇద్ద ॥ 470

లలిత

ఇది దా నావలపంటా యీడుచూపీనే
పదరేనామతికిఁ దాఁ బె కొసరా ॥ పల వి ॥

నిక్కి నే విరహమున నిట్టూర్పు నించఁగాను
పుక్కటఁ దా నెమినేశో బుసకొట్టీనే
చెక్కుచేతిచింతతో నే చెమరించఁగాఁ దాను
చిక్కినసురతములచెమటఁ దోఁగీనే ॥ ఇది ॥

తనపై మోహమున నే దగఁ బులకించఁగాను
    పొనిగి తానేమిటికో పులకించీనే
నినుపుఁగోరికల నే నివ్వెరగుపడఁగాను
    వెనకటిచేఁతలకు వెరగందీనే ॥ ఇది ॥

కమ్మరఁగమ్మర నే కాఁగిలించఁగా తాను
    కమ్మి యెవ్వతోఁ దలఁచి కాఁగిలించీనే
అమ్మరో శ్రీవేంకటేశుఁ డట్టివాఁడా కాఁడు నేఁడు
    నమ్మించి నన్నుఁ గూడి నవ్వు నవ్వీనే ॥ ఇది ॥ 471

దేసాళం

నీకుఁ బ్రియమైన వెల్లా నేఁడు నా యందివిగో
    పైకొనిచేకొనుమీ యోభళనారసింహా ॥ పల్లవి ॥

కొండలెక్కి చూచితివి కోరి యోభళాన నా-
    కొండలకుచములె ఇక్కువవో నీకు
అండనే కంబాన నుంటి వలనాఁడు నాతోడను
    నిండునరఁటికంబాలు నీకు నివివో ॥ నీకు ॥

యెత్తితివి రెండురూపు లేకమైనమేను నాఁడు
    అత్తనినీనారూపు లటువలెఁబో
చిత్తగించి నవనారసింహములై వుంటి వాద
    మొత్తమినానవరసములఁ దేలరాదా ॥ నీకు ॥

నిచ్చలును భవనాశినీట నోలలాడితి వందు
    పచ్చినాచెమటనీరు పతి యిదివో
లచ్చనల గురుడాద్రిలక్ష్మిపతివి నాఁడు
    చెచ్చెర శ్రీవేంకటాద్రిశ్రీపతివి నేఁడు ॥ నీకు ॥ 472

---

త్రిగీతలుగలవి చిలుముదినినవి.

సాళంగం

నాకె సతమైనప్పుడు నమ్మెఁగాని
చీకాకుకానగోర చిమ్మకురా నన్నును ॥ పల్లవి ॥

వడఁగండ్లగుళ్లాయ వానలేనిజల్లాయ
వొడఁబాటు లేఁకనేల వోపరా నేను
ముడిలేనివలలాయ మూఁగగన్నకలలాయ
యెడనెడ నీపొందు; లేఁపకురా నన్నును ॥ నాకె ॥

యెండమావినీళ్లాయ యెదుటిగుక్కిళ్లాయ
చండితో నీవినయాలు చాలురా నేఁడు
వండ వండనట్లాయ వావిగావివొట్లాయ
అండనే మొక్కులు మొక్కే అంటకురా నన్నును ॥ నాకె ॥

తినఁదినఁ దీపులాయ తిద్దులేనిరూపులాయ
తనియ నీమోవితేనె దక్కెరా నాకు
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విదె నన్ను
అనువాయ నిఁకనేమీ నాదకురా నన్నును ॥ నాకె ॥ 473

మంగళకౌశిక

పడఁతి యిందులకె భ్రమసితినే
విడువుఁగుఱుచ లివి నేర్చితివే ॥ పల్లవి ॥

చిక్కనినవ్వులు శిరసుల(న?) పువ్వులు
వొక్కటఁ గులుకుచు వొలుకకువే
పుక్కిటివూర్పులు బూమెలనేర్పులు
మిక్కిలిఁ గంటివి మెచ్చితినే ॥ పదఁ ॥

కెరలినచూపులు కెమ్మోవితీపులు
సరిసరి నొక్కట జరపకువే
మరువపుఁబులకలు మాఁటలఅలకలు
అరుదుగఁ గంటిని అవునౌనే ॥ పద ॥

వేగిరపురతులును వేడుకమతులును
పోగాయ నెమ్మెలఁ బొరలకువే
యీగతి శ్రీవేంకటేశుఁడ నేనిదె
బాగుగఁ గూడితి పదరకువే ॥ పద ॥ 474

రేకు 1191 కాంబోది

ఓబులేశుఁ డీకాంత నొరసీఁ గొఁ(గొం?)త
యీబిగువు దనకేల ఇంతెఱఁగఁడా ॥ పల్లవి ॥

అదవో లకిమమ్మ ఆయపుచూపులు చిమ్మ
యెదురై నవ్వీ నితఁ డిదేమమ్మ
మది నిఁ(నిం?)తగలవారు మారుగొంద లెక్కినారు
వదలుఁబయ్యదజారు వనితకుఁ జూడఁడా ॥ ఓబు ॥

సొమ్ములతో ఆకె పీఁగీ సొంపుఁజెమటలఁ దోఁగీ
వుమ్మలయీతఁడై తే వూర్పుల రేఁగీ
యెమ్మెలింతగలవాఁడు యీడనేలున్నాఁడు ఇంతి-
తమ్మిమోముచింత వాఁడు తాఁ గానఁడా ॥ ఓబు ॥

కాయసమోహము రేఁచెఁ గాఁగిటికిఁ జెయి చాఁచె
యేమిరే యీనరసింహుఁ డిందా(ఁ?)క లాచె
ఆమని శ్రీవేంకటాద్రి నవ్వినోములు నోఁచె
కామతంత్రముల నంతఘనుఁడు గాఁడా ॥ ఓబు ॥ 475

ముఖారి

కానికాని మెచ్చునేనేఁగానీ నేను
సోనల శ్రీనరసింహ చూడుమీ నేను ॥పల్లవి॥

గొంటి నీవు హోబిళపుకొండలో వుండేపునికి
ఇందిరతో విన్నవించే నిదివో నేను
వెంటి నీవు చేచేతఁ జేసినట్టిఅగడాలు
అంది యాకెతోనే చెప్పే నప్పటి నేను ॥కాని॥

శిరసుపంచి నీవు చిరునవ్వులునవ్వేది
సిరితో విన్నవించే సంచెలనే నేను
అరుదై నీమేన విండానానినపెంజెమటలు
ధర నాపె కెరిఁగించేఁ దప్పక నేను ॥కాని॥

అమరు నీవాఁడిగోళ్లఅందపువిటతనాలు
కమలతో విన్నవించేఁ గందువ నేను
సమమై శ్రీవేంకటేశ సతిఁ గాఁగిటఁ గూడి నా-
కమర లంచమిచ్చితి పంటిదాన ॥కాని॥ 476

రామక్రియ

ఆన లింకా మానవా [1]ప్రహ్లాదవరదా
నానెఁ జెమటఁ జెక్కులు నవ్వులింత చాలదా ॥పల్లవి॥

పిప్పిచేసితివి మోవి [2]బెదరించితివి నీవి
అప్పటి నాసోదమా ప్రహ్లాదవరదా
కొప్పు జారఁజేసితివి కొంగువట్టితీసితివి
రెప్పలెత్తి చూచే వింకా రేసెంత గలదో ॥ఆన॥

---

1. రేకు లందంతటా 'ప్రంహ్లాద' అనియే యున్నది. ఈసున్నకు కారణ మూహ్యము.
2. బెదరించు = సడలింపజేయు అని లక్ష్యార్థముకావోలు.

మానముపైఁ దిట్టితివి మర్మము చేముట్టితి
ఐన నింతచాలదా ప్రహ్లాదవరదా
మేనెల్లఁ జొక్కించితివి మేకులఁ దక్కించితివి
[1]శేననవ్వులు నవ్వేవు నేఁత లింత చాలదా ॥ ఐన ॥

చెక్కుఁ గడునొక్కితివి చేతులెత్తి మొక్కితివి
అక్కరింకానేఁటికి ప్రహ్లాదవరదా
యెక్కువ శ్రీవేంకటాద్రి నిరవైనదేవుఁడవు
దక్కి నన్నుఁ గూడితివి తమి యెంతగలదో ॥ ఐన ॥ 477

## భైరవి

ఇదివో చెలియభావ మిఁక నీచిత్త మెట్టో
పెదవులు మోఁపిమోఁపి పేరుకొనిపాడును ॥ పల్లవి ॥

నీవు వచ్చేవని చెలి నిలుచుండినిలుచుండి
తోవకెదురుగ వచ్చి తొంగిచూచును
భావములో నీరూపు భావించిభావించి
నీవి జారఁ గరఁగుచు నివ్వెరగు నొందును ॥ ఇది ॥

యెవ్వరు మాఁటాడినా నీయెలుఁగని సారెసారె
అవ్వలనివ్వలఁ జూచి యాలకించును
జవ్వని గాలివెట్టినచప్పు డట్టె వినివిని
మవ్వపుఁగళపళాన మాటలాడును ॥ ఇది ॥

యింతలో శ్రీవేంకటాద్రి యెక్కి ప్రహ్లాదవరద
కాంత నిన్నుఁ గూడి కవకవ నవ్వెను
చింతదీర నీవు మేనఁ జేసినరేకలు చూచి
వంతుల నీమేనఁ జేయవలెనని యెంచును ॥ ఇది ॥ 478

---

1. 'శానా' అని వ్యవహారము.

లలిత

చూచినవారికి నిది సోద్యములయ్యా
నీచనవు గాదనేనా విచిత్తమయ్యా ॥ పల్లవి ॥

కాకిపైఁడి మాటొట్లు కప్పు పారిటాకుపట్లు
పైకొనఁ జూచేవు నీకు బాఁతైతినా
మేకుల మొల్లలకొప్పు మేనెల్లఁ గస్తూరితుప్పు
కైకొని నిన్ను మెప్పించఁగలనటవయ్యా ॥ చూచి ॥

చెక్కుల జవ్వాదిపూనె చెంచుజాతి తోడుతోనె
యిక్కువ నాతోఁ బెనఁగే వింత కోపేవా
పెక్కువపూఁబొద యిల్లు పిసకత్తి యేదుముల్లు
నిక్కినిక్కి చూచేవు నీకు నింతేలయ్యా ॥ చూచి ॥

పానుపు లేఁతచిగురు పట్టువలపు జిగురు
నానాఁటి కిఁక నంత నవ్వకువయ్యా
యీనెపాన శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
అని నీనామై గురుతు లంటెఁ బైపైనయ్యా ॥ చూచి ॥ 479

నాదరామక్రియ

అందుకదే తారుకాణ అంతే చాలునేఁ
జెంది నిన్ను దూరఁజుమ్మీ చెప్పితిఁగాని ॥ పల్లవి ॥

వింటిఁజుమ్మీ నీనటన వింతసుద్దులు నిన్ను-
వంటిముట్టి యిఁకనేమి ననఁగాని
కంటిఁజుమ్మీ నీమేన గబ్బిచేఁతలు నే-
నొంటి నీకు బుద్ధిచెప్పనొల్లఁగాని ॥ అంద ॥

హెచ్చెఁజుమ్మీ నీవేసా లిందరిలోన । అంత
విచ్చివిచ్చి యిటు వెళ్లవేయఁగాని
వచ్చెఁజుమ్మీ నీబాస నీవద్ది కప్పుడే । నే
రచ్చనీదొరతనాలు రాఁపునేయఁగాని ॥ అందు ॥

చిక్కెఁజుమ్మీ నీకాఁగిలి చేతికిఁజేయి । వేరే
తక్కినసుద్దులు మరి తడవఁగాని
దక్కెఁజుమ్మీ నీమన్నన తప్పక నాకు । నేఁ
జక్కవిశ్రీవేంకటేశ చాలించఁగాని ॥ అందు ॥ 480

రేకు 1192 పాడి

ఇందును బతిమాలించ నిది యేలయ్యా
అంది దవ్వుచుట్టరిక మదియే మేలును ॥ పల్లవి ॥

పన్నినతెరమఱఁగు బహురూపములెల్లాను
కన్నదాఁకానే కాని కడఁ బవుకే
యెన్నిక నీనాపొందు లెదసివుండఁగఁగాని
మన్ననఁ గూడివమీఁద మరి ఇట్టిపో ॥ ఇందు ॥

వోడక ముచ్చటమాట లొకరొకరు గదిసి
ఆడినదాఁకానేకాని అంతటఁ జొక
యీాడ నీనాయెదమాట లింతులాడఁగానేకాని
కూడిమాటాడితి విఁకఁ గొస రింతేపో ॥ ఇందు ॥

గరిమ సమరతులు కడుఁబలములు మేను
మరిగినదాఁకాఁగాని మరిచొకే
సిరుల శ్రీవేంకటేశ చేరి నీకాఁగిట నేను
అరమరచితిఁ బను లన్నియు నింతేపో ॥ ఇందు ॥ 481

గౌళ

పెక్కునిచ్చకల్యాణాలపెండ్లికొడుకా
మిక్కిలి జాణఁడవయ్యా మేలయ్య నీకు ॥పల్లవి॥

చెలులుపదారువేల నేసవెట్టినచేతుల
చెలఁగి నాకు మొక్కేవు చెల్లునా నీకు
కలఁగక గొల్లెతలకాలుదొక్కేపాదమున
అలరి నాకాలుదొక్కే వౌనయ్య నీవు ॥పెక్కు॥

పురకాంతలఁగూడ బోదించినమాటల
ధర సరసమాడేవు తగునా నీవు
పరగఁ గొలనిలోనిపచ్చితనపుచూపుల
వొరసి మమ్ముఁ జూచేవు వోయయ్య నీవు ॥పెక్కు॥

కడుబలిమి రుక్మిణిఁగాఁగిలించిన కాఁగిట
యెడయక కాఁగిలించే విదివో నన్ను
కడఁగి శ్రీవేంకటాద్రిఘనుఁడ నీకు నాకు
బడినే శోభనములు పైకొనెనయ్యా ॥పెక్కు॥ 482

కేదారగౌళ

నీకే తెలుసుమ నెలఁతభావములు
యీకడఁ గలదియు నింతేమాట ॥పల్లవి॥

చెలువుఁడ నీపేరు చెవిలో నుడిగిన
చెలియకుఁ జెక్కులు చెమరించె
పులకలు కుచములఁ బొదలెను కమ్మర
విలువువివ్వెరగు వింటెమ మతివి ॥నీకే॥

కాంతకు నీరూపు కన్నులఁ జూపిన
వింతగునగవులు వెదలె నదె
చెంతల నుదుటు(ట?)నుఁ జెదరె నెరిఁగురులు
కంతునికళలును గరఁగెను తుదిని ॥ నీకే ॥

తరుణిఁ గాఁగిటికి గ్గరఁ బిలువఁగ
అరిదిబాహులత లదె యదరె
యిరవుగ శ్రీవేంకటేశ యిద్దరికి
మరుతంత్రంబుల మర్మము లలరె ॥ నీకే ॥ 483

## కాంబోది

అల్లదివో చూడరమ్మ అతివభావము నేఁడు
వెల్లవిరిఁ బతివద్ద వింతలాయఁగదరె ॥ పల్లవి ॥

తప్పకచూచి యింతి తలవంచి సిగ్గువడి
చిప్పిలఁ గడమచూపు చిత్తములోఁ జూచెనే
కొప్పు గదల నదచి కొంచి కడమనదపు
చెప్పక పయ్యద మాఁటుసేయుచు నడచెనే ॥ అల్ల ॥

నెలవిఁబారఁగ నవ్వి సిగ్గునఁ గడమనవ్వు
కులికికులికి తనకుత్తికలో నవ్వెనే
నిలిచి కొంతమాఁటాడి నీఁటునఁ గడమమాఁట
నెలసి చేయి మరగుచేసుక మాటాడెనే ॥ అల్ల ॥

చేతికి నాకు చుట్టిచ్చి సిగ్గుతోడ సగమాకు
చేతనే చిదిమి తనవాతెరఁ గీలించినే
యీతల శ్రీవేంకటేశుఁ డింతిభావములు చూచి
కాతరానఁ గూడఁగాను గడుసై నిలిచెనే ॥ అల్ల ॥ 484

## ముఖారి

ఇంతచాలదా విన్ను యింక నొలయనేల
పంతముఁబలుకు నొక్క[1] పాటేయఁగదరా ॥ పల్లవి ॥

చొక్కి[2] మనతనువులు సోఁకకుండినా నేమి
ఇక్కువ నీనాచూపు లిటు సోఁకెఁగా
మిక్కిలినీటిలోనిమీనములు కన్నులనె
తక్కక చూచితేనే తనివయ్యీఁగదరా ॥ ఇంత ॥

ఇమ్ముల నీనాపాన్పు లెడదవ్వయినా నేమి
చిమ్ము నీపై తలపోఁత చేరువలేకా
పమ్మినకూర్మములు పాసి యెచ్చోటనున్నా
తమ్ముఁదామె తలఁచితే తనివయ్యీఁగదరా ॥ ఇంత ॥

శ్రీవేంకటేశ నీచిత్తము పరాకైనా
వోవరి నాకాఁగిటిలో నున్నాఁడవుగా
యీవలఁ బక్షులు భూమి నెందు మేసి వచ్చినాను
తావులఁ బొదిగితేనే తనివయ్యీఁగదరా ॥ ఇంత ॥ 485

## సామంతం

కంటివో కానవో కాని ఘనమై నామోహ మిది
వెంటవెంట నీకు వేవేలై వున్నదిరా ॥ పల్లవి ॥

నెమ్మది నాశిరసే నీతొడపై నుండెఁగాని
కమ్మర నాచిత్తము నీకాఁగిటిపై నుండెరా
దొమ్మి నాకొనగోరు నీతొడమీఁద నుండెఁగాని
పమ్మి నాయాస నీమోవిపంటిపై నున్నదిరా ॥ కంటి ॥

1. పాటి+అయఁగదరా 2. చేపలు చూపులతో, తాబేళ్ల తలపులతో, పక్షులు పొదిగీ బిడ్డలను పోషిస్తాయి, 1, 2, 3, చరణములలో విశేష మిది.

పాయక నాచన్నులు నీపాదముపై నుండెఁగాని
మోయుచు నాచూపు నీమొగముపై నుండెరా
చేయార నాచేఁతలు నీసిగ్గులపై నుండెఁగాని
మాయపుఁదిట్లు నీమానముపై నుండెరా ॥కంటి॥

పొంది నాతములము నీపుక్కిటిలో నుండెఁగాని
చందపునాకూటమి నీసమరతి నుండెరా
వొందిలి శ్రీవేంకటేశ వురాన నే నుండుఁగాని
అందపునావయసు నియాతుమ నున్నదిరా ॥కంటి॥ 486

రేకు 1193 ముఖారి

ఏమంటి వేమంటి వెఱఁగ నేను । వో-
కామిని నీకిప్పుడైనఁ గానవచ్చెఁగా ॥పల్లవి॥

వేలఁ దలుపుమీఁటినవిటుఁ డెవ్వఁడే । వో
తాలిమి నేనే మాధవుఁడను
వాలినమాధవుఁడవంటే వసంతుఁడవా । కాదే
గాలింపుచక్రము చేతఁగలవాఁడ నేనే ॥ఏమం॥

ధరఁ జక్రివైతేఁ గుమ్మరవాఁడవా । కాదే
సిరుల భూమి ధరించినవాఁడనే
శిరసున భూమిమోఁచే శేషుఁడవా । కాదే
అరయ విన్నియునేలేహరినే నేను ॥ఏమం॥

వంతులకు హరివైతే వానరమవా । నీ-
మంతనపులక్ష్మీరమణుఁడ నేను
యింతయేల శ్రీవేంకటేశుఁడ ననఁగరాదా । తొల్లి
అంతేపో నామారు నీవంటివిగదే ॥ఏమం॥ 487

### రీతిగౌళ

ఔనయ్య నీకింతా నలవాటే పో
నానాఁటఁ దెలిసేవు నన్ను నీవే చెలియా ॥పల్లవి॥

యేమయ్య యిందాఁకా నెటువోతివే । నే-
నామనిమెకాల వేఁటలాడఁబోతినే
బూమి సర్వసముఁద వీబుద్ధి దగునా । అందు-
కేమే రావణాదిదుష్టు లిందరి నేఁ జంపనా ॥ఔన॥

ఐతే నీమేనివాస నది యేదద
ఆతలఁ బుప్పొడి నామై నంటుకొనెనే
యీతల నీమేనిజీర లేల వచ్చెను
వోతరుణి పూఁదీగె లొరసెనే నన్ను ॥ఔన॥

కాని మెయి చెమరించఁ గారణమేల । నేఁ-
డీనెపము వేసఁగి యెండదాఁకెనే
మోనపుశ్రీవేంకటేశ మోవిగంటేలా । నేఁ
బూని శంఖమూ(ఁ?)దఁగానే పొరయెత్తెనే ॥ఔన॥ 488

### రామక్రియ

అదియేల నీవుచెప్పినట్టు చేసేనే
కదిసితి మిఁకనేల కంటి మన్నిపనులు ॥పల్లవి॥

బాసనేయుమంటే నేఁ బాముఁ బట్టేనే । అవులే
భాసురపునీపరపు పామేకాదా
మోసదీర జలధి ఇమ్ములఁ జొచ్చేనే । నీవు
వాసికి జలధిఁబండేవాఁడవేకాదా ॥అది॥

చింతదీర ననలంబు చేతఁబట్టేనే । తొల్లి
బంతి నగ్ని మింగినట్టిబాలుఁడవేకా
దొంతరకొండలతో నేఁ దులఁదూఁగేనే । నీ-
కింతేల గోవర్ధనగిరెత్తవా తొల్లి ॥ అది ॥

యెంచనేల మీఁదిమాట లేమనేవే । అయితే
పంచ నొక్కయక్షరమె పంతమీవయ్యా
పెంచనేల నీకు నాకు భేదమటవే । యిఁకఁ
గొంచక శ్రీవేంకటేశ కూడితి యిందులకే ॥ అది ॥ [1] 489

దేసాళం

ఓపనవఁగానేపో [2] వొళ్లు వేసీని
తీపుల జంకించి నాపైఁ దేనెచల్లీని ॥ పల్లవి ॥

మాటలాడెఁబో తాను మరి నే నూఁకొంటినా
కూటమి నిందులకే తాఁ గొంగువట్టీని
నీటున సన్న సేసెఁబో నిక్కి నేఁ జూచితినా
తాటల నిందులకే తాఁ దగులనాడీని ॥ ఓప ॥

సరుసఁ దా నవ్వెఁబో నే జాణతనాలాడితినా
అరుదై యిందులకే నన్నంటవచ్చీని
అరసి తా మొక్కెఁబో నే నామొక్కు గైకొంటినా
సిరుల నందులకే తా సేసవెట్టీని ॥ ఓప ॥

చేయివట్టి తీసెఁబో నే సిగ్గువడి రాకుంటినా
బాయిట నందులకే తాఁ బచ్చిసేసీని
వోయమ్మ శ్రీవేంకటేశుఁ [3] దోఁగునూఁతులాడ నన్ను
చాయలకే కూడెఁబో వేసాలుసేసీని ॥ ఓప ॥ 490

---

1, 488, 489, 490 పాటలు వాకోవాక్యములు. 2. శరీరము పైన వేయుటయా?
3. 'ఓఁగు – నూఁతు' లలో అరసున్నలు చింత్యములు. అర్థమూ విచార్యమే.
'ఓఁగునూఁతులు' గ్రామముపేరు కాబోలు.

### లలిత

ఇంతకతొల్లేమియు నే నెఱఁగఁబో
మంతనానఁ దనకే నే మరులైతిఁబో ॥పల్లవి॥

చెక్కులెల్లాఁ [1]జమరించెఁ జింతలెల్లాఁ జిగిరించె
చొక్కుల నిట్టె తాఁ జూడఁగానే పో
ముక్కున నూరుపు దొట్టె మోమెల్లా వాడువట్టె
మక్కువ నాతోఁ దా మాటలాడఁగాఁబో ॥ఇంత॥

అంగమెల్లాఁ బులకించె నాయమెల్లా గిలిగించె
అంగడిఁ బయ్యెదకొంగు అంటఁగానేపో
ముంగురులెల్లాఁ జెదరె మోవియంతయు నదరె
సంగతి సెలవినవ్వు చల్లఁగానేపో ॥ఇంత॥

కన్నులఁ గెంపులుమీరె కాఁగిటఁ బంతము చేరె
కన్నెనై నన్నుఁ దాఁ గలయఁగాఁబో
చన్నులు పైపై నిక్కె జవ్వనము రతికెక్కె
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డిటు గూడఁగాఁబో ॥ఇంత॥ 491

### రామక్రియ

పట్టితే నాతోపని పదియుఁబది । ఇట్టె
నెట్టుకొని నిలువుము నీవే నేను ॥పల్లవి॥

వారసి తప్పకచూచే[2] వోతఁడా
తిరిగి యిట్టె తల దియ్యకుమీ
గిరిపితేఁ బోదింక కెరలీ పంతాలు
సరస నీనవ్వులెల్లా చక్కఁజేసే విఁకను ॥పట్టి॥

---

1. ఈ వ్యావహారికములో 'చెమరించె' 'చమరించె' లు సాధారణములే.
2. 'వో + అతఁడా'. ఇందు దశావతారసమన్వయము కలదు.

అడుగు దియ్యకుమీ నీవంతేసి । నీవు
గొడవల కియ్యకొంటే( గొంకేనా
అడవే మేడెము మాయంకెకు । నీ -
వెడసిలికానెకు వెఱతు నేను ॥ పట్టి ॥

మాటలపచారమేల మగవారికి
గాటపునీరాతిగుండె కంటి నేను
నేటనే శ్రీవేంకటేశ నిన్ను నన్ను నొకటిగా
తూటవిలుతు(డు వచ్చి దొమ్మి సేసె(గా ॥ పట్టి ॥ 492

రేకు 1194 ముఖారి

నీవు నన్ను దగ్గరుటే నేరమాయ(గా
కావిరి నీనుద్దులెల్ల కతలాయ(గా ॥ పల్లవి ॥

తొల(గి కడలు నీవు తొక్కివచ్చినట్టివేళ
వెలవి నానవ్వు నీకు( జే(దాయ(గా
పలుచే(తలను నీపై పచ్చియైనయీవేళ
కలికినాకనుచూపే కారమాయ(గా ॥ నీవు ॥

యెంచ(గ వేరొకతెతో నేకతమైవున్నవేళ
వంచిననామొక్కు నీకు [1] వా(డాయ(గా
నించి రాత్రిజాగరాలు నీవు నిద్రించేవేళ
వొంచిననామాట నీకు పులుసాయ(గా ॥ నీవు ॥

కందువకా(గిట( గూడి కర(గివుండేవేళ
సందడి నాకొనగోరే చవులాయ(గా
ఇందునందు శ్రీవేంకటేశ నన్ను( గూడ(గాను
చందపువవులలెల్లా సతమాయ(గా ॥ నీవు ॥ 493

1. వా(డి + అయ(గా.

ఆహిరి

ఇంకా నీమనసెట్టో యెఱఁగఁజుమ్మీ
కొంకితి నింతే నేఁ గొసరఁజుమ్మీ ॥పల్లవి॥

చుక్కలు గాయఁగా నేఁ జూడఁ దలెత్తితి నింతె
ఇక్కడ నేముండుతా నే నెఱఁగఁజుమ్మీ
చిక్కువడ్డముత్యములు చేతులఁబట్టితి నింతే
అక్కర నివేఁటివవి యడుగఁజుమ్మీ ॥ఇంకా॥

తుమ్మిదలు బెదరఁగాఁ దోడ నే నవ్వితి నింతే
తమ్మిమోవి నిన్ను నేమీఁ దడవఁజుమ్మీ
వుమ్మ గాలివిసరఁగా నొంటి నేఁ బండితి నింతే
అమ్మరో నీతో నే నలుగఁజుమ్మీ ॥ఇంకా॥

చీకాకురేకలు చూచి చే గోరగీరితి నింతే
చేకొని నీమేను పచ్చినేయఁజుమ్మీ
యీకడ శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
పైకొని చొక్కితి నింతే పదరఁజుమ్మీ ॥ఇంకా॥ 494

గుండక్రియ

కేరడమాడఁగలనా కేశవరాయా
చూరగొని మర్మములు సోఁకింతుఁగాక ॥పల్లవి॥

పంతమాడితే నీతోఁ బతి యాడఁగలనా
కాంతలతోఁ జెప్పి నవ్వఁగలఁగాక
దొంతి సాకిరివెట్టేవు తొలమనఁగలఁగాక
కొంత మోముమూసుక సిగ్గున నుందుఁగాక ॥కేర॥

వట్టియెమ్మె మెరసితే వద్దన నేఁ గలనా
చుట్టపుమొకమోటానఁ జూతుఁగాక
వెట్టినీచేఁతలకు వేఁగై మాడఁగలనా
కిట్టి మరునికి నొప్పగించఁగలఁగాక ॥ కేర ॥

కాఁగిలించితే నిన్నుఁ గాదనఁగఁగలనా
లోఁగి యందులకే చొక్కి లోనౌదుఁగాక
నాఁగులెల్లఁ దీర మాఁచనవోలిచెన్నుఁడవై
మూఁగితి శ్రీవేంకటేశ మోవి యిచ్చేఁగాక ॥ కేర ॥ 495

## లలిత

ఇది మేలు నీలాబ మిందరిలోన
అదనెరిఁగి బేహారాలాడనేర్తువే ॥ పల్లవి ॥

కన్నులఁ గెంపులుదేరెఁ గాఁకల ముత్యాలు రాలె
వున్నతి మరునిపెద్దవోడ దిగెను
మున్ను మోవిఁ బగడాల మునిఁగేవు నిలాల
కన్నెరో నీవేడనైనా గని గంటివో ॥ ఇది ॥

చెక్కులఁ గస్తూరి నిండెఁ జెమటఁ గుంకుమ గూడె
మొక్కలాన నీకుచాలు మూల గలదో
చిక్కనిమేన జాజులు నెలవిఁ గప్రము చిందె
పక్కన నిదేమి నీకుఁ బంట పండెనో ॥ ఇది ॥

కోరి మేనఁ బైఁడి రాలీ కొనగోర వెండి రాలీ
నేరుపుల నీవు పెన్నిధి గంటివో
సారెకు శ్రీవేంకటేశ్వరుఁడును నీవు నిట్టె
చేరి మారుబేరాలాడి చెలఁగే రిదెట్టిదో ॥ ఇది ॥ 496

శ్రీరాగం

మమ్ము మన్నించి పిచ్చేయు మగువకడకె నీవు
కమ్మర నన్నంటకు నీకపటమే యెఱుఁగు ॥ పల్లవి ॥

తిలకించి చూచె నినుఁ దేరకొాన దేఁటికో
చెలికన్ను లెఱుఁగు నీచిత్త మెఱుఁగు
పిలిచె నూరక నిన్ను బిగువున నేఁటికో
మలయుమో వెఱుఁగు నీమర్మమే యెఱుఁగు ॥ మమ్మ ॥

పక్కన నవ్వె నదె పడఁతి యదేఁటికో
చెక్కు నెలవు లెఱుఁగు సిగ్గు లెఱుఁగు
అక్కడఁ జేసన్న సేసె నతివ యదేఁటికొ
నిక్కుఁబాయ మెఱుఁగు నీనిందుమోహ మెఱుఁగు ॥ మమ్మ ॥

పూవులచెండున వేసె పొలఁతి యదేఁటికో
తావులచే యెఱుఁగు నీతను వెఱుఁగు
యీవల శ్రీవేంకటేశ ఇద్దరిఁ గూడితి విట్టె
కావరపుగుణములు కంతుఁడే యెఱుఁగు ॥ మమ్మ ॥ 497

వరాళి

చెల్లఁబో నన్ను నీవింత సేతురటవే
వెల్లవిరిగా నేమైనా వింటివటవే ॥ పల్లవి ॥

వెన్నెలలే మరిగేవు వెంటవెంటఁ దిరిగేవు
నన్ను నీవు మతి నంత నమ్మవటే
వెన్న నున్నఁగా నూరేవు వెక్కసమై దూరేవు
కన్నెరో నీవేమైనాఁ గంటివటవే ॥ చెల్లఁ ॥

కుంకుమలే కురిసేవు కొంగువట్టి జరసేవు
ఇంకా నాగుణము నీ వెఱఁగవటే
లంకెనుండి జునిఁగేవు లావులకే పెనఁగేవు
కంకిగా నెందుకైనా నేఁ గాదనేనటే ॥ చెలఁ ॥

పన్నీరే చిలికేవు పట్టి తేనె యులికేవు
అన్నువనాకాఁగి లింత యలపటవే
వున్నతి శ్రీవేంకటాద్రినుండి వచ్చి సంబటూరి-
చెన్నుఁడనై కూడితిని చేకొంటివటే ॥ చెల్లఁ ॥ 498 ॥

రేకు 1195 భైరవి

అప్పు డెట్టుండెనో చిత్త మయ్యో యెఱఁగనైతి
చెప్పుడుమాటలకే నేఁ జేరనైతిఁగా ॥ పల్లవి ॥

కొసరికొసరి నీపై కోపమున నుంటిఁగాని
అసమిచ్చి నీతో మాటలాడనైతిఁగా
పసలేనిసిగ్గుతోడిపంతాననే వుంటిఁగాని
ముసిముసినవ్వుమోవి మోపనైతిఁగా ॥ అప్పు ॥

విరహపుఁగాఁకల నావిసుపే చూపితిఁగాని
సరిఁ బిల్చితే నూఁకొనఁజాలనైతిఁగా
వరుసవంతులకై నే వాదులాడితిఁగాని
మురిపేన మొక్కితే నే మొక్కనైతిఁగా ॥ అప్పు ॥

వేగమే నీవు గూడితే వెస భ్రమసితిఁగాని
చేగలనీమేను పచ్చిసేయనైతిఁగా
భోగపుశ్రీవేంకటేశ పోట్లదొరితిలోన -
నీగతిఁ జెన్నుఁడవైతే నెనసితిఁగా ॥ అప్పు ॥ 499

పాడి

ఎక్కడి కెక్కడిసుద్ది లేమనేవురా
వొక్కమారే యింతసేయ నొద్దు వొద్దురా ॥పల్లవి॥

మాటలనే కరఁగితి మన్ననకే పెరిగితి
యీటునఁ గోపించనేర నేమిసేతురా
సీటున నివ్వెరగైతి నెయ్యానకే వొరుగైతి
నేఁటికి నన్నారసేవు యేడకేదరా ॥ ఎక్క ॥

చింతలనే జునిఁగితి సిగ్గులనే మునిఁగితి
ఇంతలోనే పిలిచేవు యేమందురా
పంతానకే పాలైతిఁ బాయానకే లోనైతి
యెంతకెంత సారె నిన్ను నెచ్చరింతురా ॥ ఎక్క ॥

కాఁకలనే తనిసితి కాఁగిట నే నెనసితి
వాకున నన్నుఁ బొగడవలెనటరా
పైకొని శ్రీవేంకటేశ పలురతులఁ జొక్కితి
యేకచిత్తమాయఁ బను లియ్యకొంటిరా ॥ ఎక్క ॥ 500 ॥

ఆహిరి

నెలఁత మోహించినదే నేరమటయ్యా
పలువిన్నపాల కిఁకఁ బనిలేదయ్యా ॥పల్లవి॥

చెక్కునఁ జేర్చినచేత సేమంతిరేకులు రాలె
చొక్కపు నీసతిదెస చూడవయ్యా
విక్కచూడ వంతలోనే నిలువునఁ గొప్పు వీడె
వెక్కసపుఁజలమేల విచ్చేయవయ్యా ॥ నెలఁ ॥

ముంచినపూవ్వులవెంట ముత్యపుఁగన్నీరు జారె-
నించుకంత తెమలవు యిదేమయ్యా
చంచలపునడపుల సందడించెఁ జెమటలు
అంచెల నీమనసు రాయడనయ్యా ॥ నెలఁ ॥

పెట్టినపయ్యదలోన బేఁటుగందములు రాలె
చిట్టకాల కింతి నింత సేసితివయ్యా
యిట్టె శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
అట్టె మేను పచ్చిసేతురటవయ్యా ॥ నెలఁ ॥ 501 ॥

## సామంతం

అయినట్టయ్యీఁగాక అతనునిమాయ లివి
దయయు దాక్షిణ్య మెంగీఁ దనకేఁటికే ॥పల్లవి॥

రచ్చకెక్కె వలపులు రాఁపులకెక్కెఁ గన్నులు
ఇచ్చకాలు మాపుదాకా నిఁకనేఁటికే
వెచ్చనాయ నిట్టూర్పు వెరఁగు పైతరవాయ
తచ్చనఁగడములు తనకేలే పతికి ॥ అయి ॥

కొప్పు గడువెడజారెఁ గోపము కన్నుల మీరె
ఇప్పుడు మూసిదాఁపురా లిఁకనేఁటికే
చప్పనాయ సాదింపులు చౌకాయఁ గుంటెనలు
దప్పిదేరేవినయాలు తనకేఁటికే ॥ అయి ॥

రంగుమీరెఁ బులకలు రతులు కాఁగిటఁ జేరె
ఇంగితాకారాలు చూడ నిఁకనేఁటికే
అంగవించి శ్రీవేంకటాధిపుఁడు ననుఁ గూడె
దంగుడుబంతములాడఁ దనకేఁటికే ॥ అయి ॥ 502

### బౌళి

వేగిర మిప్పుదేయేల వింతవారమా
సోగల నివెల్ల నేఁడే సోద్యమా ॥ పల్లవి ॥

యీతల మెచ్చకయున్న నెదలో మెచ్చేవుగాక
ఆతల నిప్పుడే యేమి అవసరమా
ఘాత మోవి నవ్వకుంటే కన్నుల నవ్వేవుగాక
తోతో ఇంతన యేమి దోసమా ॥ వేగి ॥

యెదుట మాటాడకున్న నింటిలో నాడేవు గాక
పదరి నీమీఁద నేను పై తరవా
మదిఁ రేపట రాకుంటే మాపట వచ్చేవుగాక
కదిసి ఇప్పుడు యేమి కక్కూరితా ॥ వేగి ॥

రచ్చల పిఁగకయున్న రతుల పిఁగేవుగాక
వచ్చివచ్చి నీతోడ [1]వావాదమా
పచ్చిగా శ్రీవేంకటేశ పైకొనికూడితి విట్టె
గచ్చుల నీగుణ మిది కానమా ॥ వేగి ॥ 503

### భూపాళం

మూలనున్నవారి నీవు ముంగిట వేసేవుగాక
గోలపై యూరకుండితే కొంగువట్టేనా ॥ పల్లవి ॥

పిలువఁగాఁబో నీతోఁ బ్రేమమున నూఁకొంటి
అలిగినట్టే వుంటే నదేమనేనా
నిలిచి చూడఁగఁబో నే నిన్నుఁ జూచితివి
తలవంచుకొనియుంటేఁ దడవఁబోయేనా ॥ మూల ॥

1. వావాదము = వాగ్వాదము లేక, నోటి వదరుబోతుతనము? 'వాతువాదము' అనే వ్యవహారభాషలో 'తు' లోపించెనా·

చెనకఁగాఁబో నేఁ జేబలిమి చూపితిని
కొనగొనలనే వుంటే గోరఁ దీసేనా
మనసిచ్చి నవ్వఁగాఁబో మారుకొని నవ్వితిని
వెనకటివలెనుంటే వేగిరించేనా ॥ మూల ॥

పైకొరఁగఁగానే పో పంతానకే కూడితిని
మాని నీ వూరకుండితే మాయసేసేనా
యీనెపాన శ్రీవేంకటేశ నన్ను నేలితివి
నేనే నీపైనమీఁద నేరమెంచేనా ॥ మూల ॥ 504

రేకు 1196 ఆహిరి

ఎండగాదు నీడగాదు యెక్కుపసిపొందులు
బెండుబెండులైతి నింకఁ బడలేనురా ॥ పల్లవి ॥

పచ్చిగాదు వెచ్చిగాదు పాయపునీచేఁతలు
ఇచ్చట నే మొకమోట నేమందురా
వెచ్చనాయ పచ్చనాయ వెడ నిమేను నీమోవి
రచ్చకెక్కె వలపు రాకు రాకురా ॥ ఎండ ॥

వేండ్లాయ వాండ్లాయ వెడద నీచూపులు
యేండ్లాయ నిమిషము లేమిసేతురా
ఆండ్లైరి గోపసతులంటానే బిగినేవు
పీండ్లవాండ్లమాటలు వినలేనురా ॥ ఎండ ॥

ఆంకెలాయ లంకెలాయ అందపునీకాఁగిలి
యింక నిన్ను వీడనాడ యేడకేఁగరా
తెంకినే శ్రీవేంకటేశ తేజముతోఁ గూడితివి
మింకునానీగుణా మింత మానుమానురా ॥ ఎండ ॥ 505

ముఖారి

చాలువిది పదివేలు సరివచ్చెఁగా
తాలిమిఁ జెలులమాఁటే తప్పుదాయఁగా ॥ పల్లవి ॥

అదె నామతి పలచనైనా నాయఁగాని
కదిసితే నీనవ్వు గట్టియాయఁగా
అదన నాచూపు తెల్లనైనా నాయఁగాని
యెదుట నీమోవి యిదె యెఱ్ఱనాయఁగా ॥ చాలు ॥

కడగిననామేను కాఁకైనా నాయఁగాని
చిడుముడి నీచెక్కు చెమరించెఁగా
నడుమనే వేగించినా వేగించితిఁగాక
తొడరి నీకైతే నిద్ర తొట్టుకొనెఁగా ॥ చాలు ॥

రేఁగుచు నాగోరఁ జిన్నరేకయైనా నాయఁగాని
కాఁగిటినీయాసలైతేఁ గనమాయఁగా
చేగఁదేరెను రతుల శ్రీవేంకటేశ నేఁడు
తోఁగినమనరతులు తులఁదూఁగెఁగా ॥ చాలు ॥ 506

సామంతం

తాను నేసినట్టిచేఁత తనకుఁ జెల్లెననరే
ఆవినతనకిది సందాయననరే ॥ పల్లవి ॥

చిత్తజుఁ దమ్ములనేసె సిగ్గులు నానోము నూసె
వొత్తి తన్ను దూరనేరకున్నాననే
జొత్తుఁగూడెఁ బులకలు సొంపుపిదె నలకలు
యెత్తినతనతోఁ బెనఁగ నెఱఁగనైతినే ॥ తాను ॥

చిన్నిగాలి సందు దూరె చెమట నామేనఁ గారె
పన్ని తనకొంగు బిగ్గఁబట్టనైతినే
కన్నులఁ గెంపులు మూఁగె కమ్మర నామోవి మాఁగె
మున్నిటిచేఁత మరచి మొకమోడితినే ॥తాను॥

చందురుఁడు సుంకుమోఁపె జవ్వనము చిమ్మిరేఁపె
మందలించి నామేను మరచితినే
యిందులో శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
[1]అందెను మన్ననరతి కందునే చొక్కితినే ॥తాను॥ 507

సాళంగం

వలపు చల్లుదుఁగాని వాదిక నే నొల్లనయ్య
తొలతొల యింతేసిలోఁతుకు నే వెరతురా ॥పల్లవి॥

మునుప నీచూపులకు మొక్కేఁగాని నే
వెనక నీసన్నలకు వెఱతుమయ్య
యెనలేవినవ్వులకు నెఁ(నెం?)తైనాఁ బొగడేఁగాని
వొనరేనీసరసము లుత్తరమీనోపరా ॥వల॥

ఇప్పటినీకావికలు యియ్యకొనేఁగాని నే
వొప్పుల వీవిడె మందనోపమయ్య
తప్పనినీనిజమరితనము మెచ్చేఁగాని
చెప్పేనీయేకతములు చెవియొగ్గనోపరా ॥వల॥

సంగడి జాణతనాలు సమ్మతించేఁగాని నే
అంగపుఁజెనకులు పయ్యాదలేనయ్యా
యెంగిలిగా శ్రీవేంకటేశుఁడ కూడితి విట్టె
ముంగిట నిన్నిఁకఁ బాసి మోనపోనోపరా ॥వల॥ 508

1. 'అందెను మన్ననరతి అందునే చొక్కితినే'. అని యుండవచ్చు. లేదా, ఆనేందెను మన్నన రతి కందు చొక్కితినే. అని యైనా కావచ్చు.

ముఖారి

అలుగఁజూచేవు నీవు అంతేసికిఁ బొద్దేది
తలపోఁత యిప్పుడింతే దాచఁగఁ బొద్దేది ॥ పల్లవి ॥

నీరాక వింటే నింతే నివ్వెరగైతి నిట్టె
అరసి నీతో మాటలాడఁ బొద్దేది
చేరితి నిప్పుడే యింతే సిగ్గున మునిగితిని
మోరతోపు మాని నీకు మొక్కఁగాఁ బొద్దేది ॥ అలు ॥

నీదెస చూచితి నింతే నిలువెల్లఁ బులకించె
నాదించి నీతో నవ్వఁ బొద్దేది
పాదము లొత్తితి నింతే భావమెల్లఁ గరఁగితి
నేదదేర వినయము నేయఁ బొద్దేది ॥ అలు ॥

కూడితి నిట్టె ఇంతె గొబ్బన మేను చొక్కితి
మేదెపునీరతులకు మెచ్చఁ బొద్దేది
వాదిక శ్రీవేంకటేశ వరస నాకిపు డింతే
తోడనే నేసవెట్టితి తొలఁగఁ బొద్దేది ॥ అలు ॥ 509

సామంతం

నీకునీకే తెలుసును నీచేఁతలు
జోకలాయ నీసుద్దులు సొంపులెల్లా వింటిరా ॥ పల్లవి ॥

పంతము చూడవలసి పక్కన నవ్వితిఁగాక
కాంతుఁడ వొచ్చెము నీమైఁ గంటినా నేమి
అంతలోనె సిగ్గువడే వందరిలో నీకునీకె
యెంతని నీగుణమున కిఁక నేమినేతురా ॥ నీకు ॥

నిజముఁ గనవలసి నీమోము చూచితిఁగాని
భజన నిన్ను నమ్మనిభావమా యేమి
గుజగుజఁబొయ్యేవు కొంకికొంకి నీకునీకే
గజరునీచేఁతలకు కమ్మరా నెమందురా ॥ నీకు ॥

మోహము గానవలసి ముందర మొక్కితిఁగాక
సాహసించి వుప్పటపుసాదనా యేమి
యీహల శ్రీవేంకటేశ ఇంతలోనె కూడితివి
ఆహా నీరతు లెన్నియని పొగడుదురా ॥ నీకు ॥ 510

రేకు 1197 లలిత

మైల వాసి మఱఁగాయ మాటలేలరా
చాలుఁజాలు బనులెల్లఁ జక్కనాయరా ॥ పల్లవి ॥

తొడిఁబడ నవ్వితిని తోడుతనే మొక్కితిని
చిడుముడి నిఁక నేమిచేసేవురా
అదరి నేఁ దిట్టితిని అంతలోఁ బంతమిచ్చితి
వదిగాఁ బైపై నాతో వాదులేలరా ॥ మైల ॥

కోపగించి చూచితిని గొబ్బననే మెచ్చితిని
మాపుదాఁకా నింత జోలిమాటలేలరా
రేఁపకాద నెదసితి మాపటంతఁ గూడితిని
యీపాటివాసికిని యెగ్గులేలరా ॥ మైల ॥

మోవి గంటిసేసితి నామోవి తేనె లిచ్చితిని
దేవుఁడ శ్రీవేంకటేశ తెగునేలరా
భావమెల్లఁ గరఁగితి పక్కన మెప్పించితివి
చేపదేరెఁ బనులెల్లఁ జింతలేలరా ॥ మైల ॥ 511

ఆహిరి

దగ్గరగరాదు మరి దగ్గరకుండఁగరాదు
యెగ్గులాయ జవ్వనము యిఁకనేఁటికే ॥ పల్లవి ॥

చేరి వానిరూపు చూచి జీగి సంతోసించేనంటే
సారె నాకన్నులనీరు సం(సా?)గరమాయ
ఆరయ వానితో మాటలాడి చొక్కేనంటేను
దూరేనానవ్వులే నాకుఁ దొడసాయెనే ॥ దగ్గ ॥

మునప వానింటికేఁగి ముచ్చటఁ బానేనంటే -
ననువైనమరపులే అడ్డమాయెనే
తనితోఁక వానిరతి తలపోసివుండేనంటే
కొనసాగి(గే?)కోరిక పైకొసరాయెనే ॥ దగ్గ ॥

గక్కన వానిమేను కాఁగిలించి పట్టేనంటే
పక్కన నాసిగ్గులు దెప్పరమాయెనే
ఇక్కువశ్రీవేంకటేశు నిట్టె నేఁ గూడితిని
దక్కినవానిమన్నన తలకూడెనే ॥ దగ్గ ॥ 512

సామంతం

అంతటిపై నీవుచెప్పినట్టే సేనేఁగాని
పంతమాడ కందాఁకా పండరంగి[1]విట్టలా ॥ పల్లవి ॥

చెదరినకురు లివి చెరిగినందాఁకను
పదరకు మంత నీవు పండరంగివిట్టలా
వదలుఁబయ్యదకొంగు పైపుగాఁ బెట్టినదాఁకా
పదిమారులు నవ్వకు పండరంగివిట్టలా ॥ అంత ॥

1. రేకులో "విత్యలా" అనియే కలదు

చిక్కువడ్డ హారములు చేతదిద్దువందాఁకా
పక్కనఁ జెనకకుమీ పండరంగివిట్ఠలా
చెక్కులనూనినయట్టిచెమట లారినదాఁకా
పక్కన వోరుచు పండరంగివిట్ఠలా ॥ అంత ॥

చలువనీమోవితేనె చవిగొన్నయందాఁకా
పలుకులు చాలించు పండరంగివిట్ఠలా
చెలఁగి [?]దితి విట్టె శ్రీవేంకటాద్రిమీఁద
బలిమి నీకె చెల్లెఁ బండరంగివిట్ఠలా ॥ అంత ॥ 513

## భైరవి

చెప్పితి విప్పుడే నే నాచిత్తములోఁగలమాట
యెప్పు దేద మాటలాదే దిది మేలుసుమ్మీ ॥ పల్లవి ॥

మనసులో కోపమెల్లా మఱచేనంటే నాకుఁ
దనమేవిగుఱుతులు తలఁపించీనే
తనుఁదానే విచ్చేసినాఁ దలవంచుకొందుఁ జేతు
యెనలేక ఇందుకు నెగ్గువట్టీఁజుమ్మీ ॥ చెప్పి ॥

మొదలితనవోజలు మూసిదాఁచేనంటేను
యెదిరి తనమైకాఁక లెత్తిపెట్టీనే
కదిసి తాఁ గూచుండినాఁ గడ వేరేమంచముపై
నిదిరింతుఁ జేతు వది నేరమెంచీఁజుమ్మీ ॥ చెప్పి ॥

సోలసై తనసతిల్లు గుట్టునేసుకొనేనంటే
నాలితనమొక్కు చూచి నవ్వువచ్చీనే
యీలీల శ్రీవేంకటేశుఁ డింతలో విచ్చేసికూడె
పాలుపడి మెత్తుఁ జేతు పంతమాడీఁజుమ్మీ ॥ చెప్పి ॥ 514

ముఖారి

ఇప్పటిసిచేఁతే వొకటినుమదై పొదచూపీ
దప్పితో సిగ్గుపడకు తారుకాణయ్యీని ॥ పల్లవి ॥

సారెసారె నవ్వకువే సరి నవె వెన్నెలలై
ఆరయ విరహవేళల నలయించీని
మేరమీరి పల్కకువే మించి యివె తేనెలై
తేరుకొని నిన్నుఁ దరితీపులఁబెట్టీని ॥ ఇప్ప ॥

తప్పకచూడకువే తగుచూపులే యమ్ములై
యప్పటి నలిగితే నాయము గాఁడీని
వుప్పటించి జంకించకు వూర కవి పొగలై
ముప్పిరిఁ దాపాగ్ని రాఁజమొదలునేసీని ॥ ఇప్ప ॥

సరసములాడకువే సారె బాహులతలై
సొరిదిఁ గాఁగిట నవె చుట్టుకొనీని
యిరవై శ్రీవేంకటాద్రి నిద్దరముఁ గూడితిమి
విరుల వేయకువే వేడుక రేఁచీని ॥ ఇప్ప ॥ 515

ఆహిరి

ఏమని వుత్తరమిచ్చి పిఁకఁ దా నాకు
వేమారు సారెసారె వెడమాటలేఁటికే ॥ పల్లవి ॥

అద్దరిపాటుర[illegible] రాకెయింటఁ దానుపుపై
[illegible]చి నే నాఁపలేక
నొద్దఁబండి కుచములఁ [illegible] నాతనిపైఁ బు
బద్దివో నన్నాతనిఁటాఁ నాపేరఁ బిలిచె ॥ ఏమ ॥

తక్కక ఆకెమేడలో దాఁగిలిముచ్చులాడఁగా
గక్కన మోవి యావి గంటిసేయఁగా
పెక్కుమారు లానెలఁత పేరఁ దిట్టె నన్ను నేఁడు
తక్కులేమీ నెఱఁగఁదు తన్ను [1]నేమనెందునే ॥ఏమ॥

దొంతులై ఆకెయుఁ దాను దొమ్మిరతి సలుపఁగా
కాంతఁగన కాఁగిలించి కళలంటఁగా
అంతలో శ్రీవేంకటేశుఁ డాకెనంటా నన్నుఁ గూడె
యెంతకెంత అవసర మిపుడు దాఁ గనెనే ॥ఏమ॥ 516

రేకు 1198 కాంబోది

చెల్లినంతయు నీవు సేతువుగాక
మొల్లంపునీచేఁత ముయికిముయిగాద ॥పల్లవి॥

ప్రేమమున నంటఁగాఁ బెనఁగే వపుర నీ-
దీమసం బెట్టిదో తెలియఁగలదు
వేమారు నీకింత వేగితేఁ జాలుఁగా-
కేమాయ నుపొ్పలి కినుమదేకాదా ॥చెల్లి॥

పిలువనంపిన రాక బిగిసితి విందాఁక నీ-
అలరుఁదలంపెట్టిదో అడుగఁగలదు
నిలుకడై నీమనసు నిల్చితేఁ జాలుఁగాక
వలపు వేయింటిపై జవ్వాదికొమ్మగాదా ॥చెల్లి॥

కాఁగిలించిన నపుడె కరఁగేవు నీతొంటి-
నాఁగుఁజలములకు నిది నవ్వుగాదా
వీఁగ కిటు నన్ను శ్రీవేంకటేశ కూడితివి
రేఁగితివి గోర గీరిన నేరుగాదా ॥చెల్లి॥ 517

1. ఏమని+అందువె.

ఆహిరి

మొక్కేరా నీకంటే ముందుముందే
  కక్కూరి తింతయేల కాఁకలఁబెట్టకురా ॥ పల్లవి ॥

నీటిలోనిముల్లువంటినీగుణము దెలియ
  యేఁటవెట్టి హెచ్చుకుంది లెంచనోప
  [1]యేఁటికి గొర(రి?)పెరాయ దెందుఁ బొందవివేళ
  ఆఁటదాన వింతే నన్నారడి నేయకురా ॥ మొక్కే ॥

వేవేలుఁ జేసి నీకు వేఁడుకొనేదే గుణము
  ఆవల నలిగితే మారలుగనోప
  వావిదప్పు కంత నీపు(వు?)వల్లెవేసే వెందునైనా
  పూవువంటిదాన నింతే బూకలు సేయకురా ॥ మొక్కే ॥

మానుమాను మిఁకనైనా మాతోడిచలములు
  కేనముతో రాయి గిలిగించ నేనోప
  యీనెపాన శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
  ఆవిపట్టి నన్ను నింత అలయించకురా ॥ మొక్కే ॥ 518

పాడి

ఇంతి నీపైఁజేయు టిదిగదా వలపు నీ-
  వంతటికి సమ్మతించు టదిగదా వలపు ॥ పల్లవి ॥

పెదవిపైఁ దములంపుబేంట్లటురాలఁగా
  యెదుట నేకతమాడు టిదిగదా వలపు
  వదలుఁదురుమునశిరసు వడి నీదుతొడలపై-
  నదన నిడుకొని నవ్వు టదిగదా వలపు ॥ ఇంతి ॥

---

1. "యేంటికిగొరసెరాయదెండ్డుంబొండ్దవివేళ" అని రేకులో వ్రాత. ఈ పాఠమునకు యథామతి సవరణలిచ్చి చూపితిమి. ఐనా అర్థమంత తృప్తిగలేదు. 'గొరపెరాయరి' అంటే స్పష్టము కాలేదు.

కనుఁగొనలమోదుృతో కాఁకదేరఁగఁ జూచి
ధ్యేనలేక మైమరచు టిదిగదా వలపు
కొనచెమట జవ్వాదిఁగూడి చెక్కుల జార
అనుగుఁజేయి పయివేయు టదిగదా వలపు ॥ఇంతి॥

వాడలునొదలునుఁ బెనచి వొక్కటై చెమరించి
యెడపుఁబయ్యేద దడుపు టదిగదా వలపు
జడిసి శ్రీవేంకటేశ్వర నీవు నీచెలియ
అదియాలముగఁ గలయు టదిగదా వలపు ॥ఇంతి॥ 519

## కేదారగౌళ

నీరాజసముతోడ నెమ్మది నుందువుగాక
కూరవంది కనవేరి(రే?)గుణ మింకానేఁటికి ॥పల్లవి॥

కోపగించఁజెల్లునా కొంగువట్టితివి నీవు
ఆపవి; కేమైనాఁ జెలి యనుఁగాక
వోపనఁజెల్లునా వూఁకొంటివి పైఁడికత-
కీపాటివాఁడవు ముందేల నవ్వితివి ॥నీరా॥

వేగిరించఁజెల్లునా వెలఁదిఁ బిల్చినవాఁడ-
వాగతి నాకెచిత్త మది నీభాగ్యముగాక
రాగిదేర్చ కంత నీవు రాలుదింటా మలిగండ్లా
వేగి లేచి వచ్చి నీవు వేసాలే సేసేవు ॥నీరా॥

వంతమాడఁజెల్లునా పడఁతికాఁగిటఁ జిక్కి-
చెంతల నాకె యేమైనాఁ జేసుఁగాక
వింతగా శ్రీవేంకటేశ వేసితే వేయిరూపులాయ
మంతనపురతులు నీమగువకును నీకును ॥నీరా॥ 520

సామంతం

చెట్టవట్టి తీసినదే సెలవుగాక
నెట్టన నాతనితోనే నిష్ఠూరమేఁటికే ॥పల్లవి॥

చింతలెల్లాఁ దీరె నింకాఁ జెక్కుచే యేమిటికే
అంతటా విచారించేనంటే నూయి
కాంతుఁడు మతిలో మొక్కెఁ గన్నుల దీవించితివి
యెంత కెంతదొరతోడ నెచ్చుకుందులేఁటికే ॥చెట్ట॥

తనువు చెమటఁ దోఁగె తాప మింకా నేఁటికే
కనుఁగొంటే నింతటాఁ జీకటే వెలుఁగు
మొనగోర గీరెఁ బతి మోహమున కేరువారె
వనిత బలువునితో [1]వావాదమేఁటికే ॥చెట్ట॥

నేస దలమీఁద మోఁచె సిగ్గులింకా నేఁటికే
పోసరించి వోరిచితేఁ బూవే పిందె
ఆసల శ్రీవేంకటేశుఁ డాదరించి నిన్నుఁ గూడె
పాసికూడేపతితోడఁ బంతమాడనేఁటికే ॥చెట్ట॥ 521

బౌళి

ముందుముందే నిక్కితే మూరెఁడు మాట
పొందితి నీసతినైతే పొడఁబాటు లేదా ॥పల్లవి॥

కడదాఁక నీసుద్దులే కాంతలతోఁ జెప్పేవు
అదరి నామాటఁ గొంత ఆదనీరాదా
తొడిఁబడ నీవు గడుదొరవైతే రాజ్యమేలు
పడఁతులతోనే ఇంతబలువా నీకు ॥ముందు॥

1. చూ 504 పాట.

సందడించి యెందునైనా సాకిరులేల పెట్టేవు
విందుఁగా నాతగ వింత వినవీరాదా
కందువలఁ జెల్లఁబడి గలితే నీవే బదుకు
యిఁదువదనలతోడ నెగసక్కెమేఁటికి ॥ముందు॥

పచరించి యాన నీవే పలుమారుఁ బెట్టుకొనే-
విచట నావొట్టువత్యా లెక్కనీరాదా
రచన శ్రీవేంకటేశ రతుల నన్నుఁ గూడితివి
పచరించి నాతోనే పంతమా యిపుడు ॥ముందు॥ 522

రేకు 1199 శ్రీరాగం

లోకు లేమందురోయవి లోఁగేఁగాక
మేకొని విన్నిట్టె కిందుమీఁదు నేయనా ॥పల్లవి॥

మానవుగా ఆదేమోయి మాటిమాటికిఁ దిట్టేవు
కానీలే మగనాలింత కదునసుదా
పోనీపోవిమ్మవికాక పొరుగిరుగు మొరఁగి
తేనెవంటినీమదము దించ నిట్టె నోపనా ॥లోకు॥

వుండవుగా చక్కనాడ నొకటొకటె చెవకే-
వండనే ఇల్లాండ్లింత ఆటపాటలా
కొండవంటిదొర వంటా గొంకితిఁగా కిట్లయితే
కండగర్వమెల్లాఁ దీర్చి కంకినేయనోపనా ॥లోకు॥

విడువవుగా చలము పెనఁ గాఁపురాలువేవే-
పడఁతుల కూరమిందఁ బాసెనా యేమి
యెదపుశ్రీవేంకటేశ యింతలోఁ గూడితిఁగాక
విడువనిపంతమైతే వింతవింత నేయనా ॥లోకు॥ 523

ముఖారి

ఏమని చెప్పుదునే యీతని జాణతనము
నాముదేర నూరకిట్టె నవ్వించీనే ॥పల్లవి॥

సిగ్గువడి తనవద్ద శిరసు నే వంచుకొంటే
బగ్గన నామోము తప్పకచూచీనే
అగ్గలపుమోహముతో నరమరచి నేనుంటే
బుగ్గలంటి నామేను పులకింపించీనే ॥ఏమ॥

కడుఁదమకములఁగాఁకల నేనుండఁగ నాకు-
మడిచియిచ్చి మేను చమరింపించీనే
బడిఁ బాన్పుపై సలసి పవ్వళించి వుండఁగాను
నిడివి న్నాకళ్ల(శ?)లంటి నిద్దిరింపించీనే ॥ఏమ॥

అంగవించి తనరతి కడ్డమాడకుండఁగాను
చెంగట నందంద మెచ్చి చెక్కునొక్కీనే
యింగితాన శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
కొంగువట్టితీసి నన్నుఁ గొసరింపించీనే ॥ఏమ॥ 524

సామంతం

ఎవ్వరి దూరే మేమనఁగల మిఁక
జవ్వనపుమీకె చందములాయ ॥పల్లవి॥

కలిమికి లేమికిఁ గాణాచి యదియె
అలివేణిచన్ను లపియాడునడుము
చెలువుఁడ నీలోచిత్తము కఠినము
పలచనికెమ్మోవి [1]పతికిఁ బతియాయ ॥ఎవ్వ॥

1. 'పతి' శబ్దములు ప్రతిశబ్దభవములు.

చీకటి వెలుఁగుకు నీమది యొకటే
నీకాంతతురుము నీచూపు
వాకున వినయము వచుకులు చెంతల
సాకిరిరమణుఁడ సరికి సరియాయ ॥ ఎవ్వ ॥

చిగురుకుఁ జేవకు [1] శేఖరమొకటే
మగువహస్తనఖమహిమ లవె
తెగి శ్రీవేంకటదేవ నీకొకటె
తగవులు వగవులు తగురతులాయ ॥ ఎవ్వ ॥ 525

సౌరాష్ట్రం

చాలుఁజాలు దీమసము సతిమాట వినవయ్య
మేలుగలవాఁడవు గామిడిచేఁతలేలా ॥ పల్లవి ॥

అవ్వలిమోమైనపరా కంత గలవాఁడవైతే
జవ్వనిఁ గాంతలచే విచారించనేల
నవ్వకపిలిచినాను నాలినేసేవాఁడవైతే
పువ్వులవలె నీమేను పులకించనేలా ॥ చాలు ॥

యింటిలోనమండి బీరా లింత గలవాఁడవైతే
అంటి నాఁడు సరసములాడఁగనేల
వొంటి నే మాటాడినా వూఁకొననివాఁడవైతే
అంటుముట్టుచెమటల నలయఁగనేలా ॥ చాలు ॥

కాలుదొక్కి యింతలోనే కళదాఁకేవాఁడవైతే
బాలకితో వలి గింత పాయఁగనేల
మేలిమి శ్రీవేంకటేశ మెచ్చితి నీగుణము
వేళతోఁగూడితి వింత వేగిరించనేల ॥ చాలు ॥ 526

1. శేఖరము=ప్రధానమైనది ?

గౌళ

ఇంపుగాని సొంపుగాని యెఱఁగించితి విదివో
జంపాలీగుణములచంద మెట్టోకాని ॥ పల్లవి ॥

పలుకఁగవచ్చుఁగాని పంతములియ్యఁగరాదు
చెలితోడ జగడించఁ జెల్లదుసుమ్మీ
పలుకఁగరాదుసుమ్మీ పెక్కువ జాణతనాన
తొలఁగి పిమ్మట నటు దూరవచ్చుఁగాని ॥ ఇంపు ॥

కాఁకపేయవచ్చుఁగాని కలఁకదీర్చఁగరాదు
తేకువకు నెమ్మొకు తీదీపుసుమ్మీ
కాఁకపేయరాదుసుమ్మీ కమ్మర నేరుపుతోడ
వేఁకపుపిష్టూర మందె వేయవచ్చుఁగాని ॥ ఇంపు ॥

జంకించవచ్చుఁగాని సారెకుఁ బొంకఁగరాదు
వంకలనేమీ ననవద్దుసుమ్మీ
జంకించరాదుసుమ్మీ పతిమనసు దెలిపి
కొంకక శ్రీవేంకటేశ కూడవచ్చుఁగాని ॥ ఇంపు ॥ 527

మధ్యమావతి

అందులకుఁ దగినట్టు అప్పుడే చూచుకొందుమ
ముందుముందే యింతవేవేమెఱఁగులు గానవైతి ॥ పల్లవి ॥

పిలువనంపెననేటిపెద్దరికమే చూచితి
తలఁపు వేరొకటొట దలఁచవైతి
నిలిచి మాటాడెనని నెయ్యపుమేలే యెంచితి
వలవని [1]తొలిమాటలవగెఱఁగవైతి ॥ అందు ॥

1. తొలిమాటలవగ+ఎఱఁగవైతి.

యీరానిచనవులెల్ల నిచ్చేదే చూచితిఁగాని
దారకాన మచ్చుచల్లి తగిలించే దెంచనైతి
చేరి ప్రియములు సారెఁ జెప్పేదే చూచితిఁగాని
కారించి నాకొడఁబాటుగానిపని చూడనైతి ॥ అందు ॥

కాఁగిలించి బుజ్జగించేఘనతే చూచితిఁగాని
ఆఁగి మేలుమరపించేఅయము దెలియనైతి
రాఁగినశ్రీవేంకటేశురతులఁ గూడితిఁగాని
యేఁగించి పురమెక్కించే ఇక్కువ దెలియనైతి ॥ అందు ॥ 528

రేకు 1200 దేసాళం

ఇట్టివిందు గంటివా నీ వెక్కడనైనా
అట్టె ఆకెపొత్తున నీ వారగించవయ్యా ॥ పల్లవి ॥

కలికికెమ్మోవితీపు కమ్మనితేనెలవిందు
చలువచూపులు నీకుఁ జక్కెరవిందు
నెలవిలేనవ్వులే చిలుపాలతోడివిందు
అలమేలుమంగ నేసీ నారగించవయ్యా ॥ ఇట్టి ॥

కాంతగోరిచెనకులు కారపుఁగూరలవిందు
పంతపుమాటలే ఆవపచ్చడివిందు
వింతబొమ్మజంకెనలే వేఁడిపదిదాలవిందు
అంత నేసీ నీదేవి యారగించవయ్యా ॥ ఇట్టి ॥

అట్టడిసమరతియాటడి తరితీపువిందు
గట్టిసిగ్గు పెరుగుమీఁగడలవిందు
గుట్టుతో మన్నించితివి కొమ్మను శ్రీవేంకటేశ
అట్టె నీతనివిదీర నారగించవయ్యా ॥ ఇట్టి ॥ 529

### సామంతం

చిత్తమెట్టున్నదో కాని చెప్పవెరపయ్యా నాకు
మొత్తాన నూరకేవుండే మోవమాఁటో యిపుడు ॥ పల్లవి ॥

తొయ్యలిచెక్కుఁ జేయీ దొంతరతామరలాయ
వొయ్యనె నీవిరహసూర్యోదయవేళ
నెయ్యపునీనవ్వుల వెన్నెలఁ గొంతచిలికితే
చయ్యన వానివాఁడి సమసుఁటో యిపుడె ॥ చిత్త ॥

అంగవ మోనాన మోవు లమదమంకెనలాయ
భంగపుఁగోరికలప్రభాతవేళ
అంగపునీమాటల పయ్యెద గొంత విసరితే
వెంగలి వానిగుట్టు విరియుఁటో యిపుడె ॥ చిత్త ॥

కాంత మేను నీమేను కదంబపుఁబువ్వులాయ
ఇంతలో శ్రీవేంకటేశ యీకెఁ గూడఁగా
పొంతల మీరిద్దరును పొంది యెదయకుఁడితే
బంతినే వాసనలంటెపాటు లౌఁటో యిపుడె ॥ చిత్త ॥ 530

### పాడి

చాలదా ఇంత సారెసారె వలెనా। తాను
యేల చలమున నింత నేమి సేయుమనీవి ॥ పల్లవి ॥

మొక్కఁతీఁగదె తనకు మొన్ననే నేను
యెక్కడనుండిన మనవేకమవి
దక్కఁతీవంటేఁగదె తనపాలికి
యిక్కడఁ జెలులమాటలెల్లా నే వింటినే ॥ చాల ॥

ఇచ్చితిఁగదె పంత మింతకుముందె। నాకు
హెచ్చి తా నాడినమాట లియ్యకోలని
మెచ్చితిఁ గదెతన్ను మీఁదమీఁదనె। మం
పచ్చియెమ్మెలు నావద్దఁ బచరించనేఁటికే ॥ చాల ॥

అంటితిఁగదె తనఆయము నేనే। ఇది
దంటపాయ మిందరికిఁ దగునని
గుంటిపై శ్రీవేంకటేశుఁ గూడితిఁగదె। ఇఁక
వెంటవెంటఁ దను నే విడుపనని ॥ చాల ॥ 531

## లలిత

చాలుఁజాలు ననరె సాదించ మమ్మింతయేల
యీలకూర కష్టు చాల దిందేమి గలదే ॥ పల్లవి ॥

గొప్పలు మాకన్నులు కొంచము మానెమ్మొగము
తపపులెన్నైనాఁ గలవు తడవనేలే
చిప్పిలీ నాకిదె నవ్వు చిందీ నామోవిఁ దేనె
యెప్పుడు వచ్చినాఁ దన కిందేమి గలదే ॥ చాలు ॥

పిడికెఁడు మానడుము పెచ్చువెరిగేచన్నులు
నెడ మామేనివావాచ్చాలు వెదకనేలే
పుడికీ నామననైతే వూంకె యదరీ మేను
యెడయక తాఁ బిలిచీ నిందేమి గలదే

కంచువంటిది కుత్తిక కపురాలు పలుకులు
యెంచి మామాటలు సోదించఁగనేలే
అంచెల శ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
యెంచియెంచి పొగడీని యిందేమి గలదె ॥ చాలు ॥ 532

## ముఖారి

తానే యెఱఁగఁడా తగినజాణఁ డతఁడు
మానిని విను మన్నించె మన్ననలే చాలదా ॥ పల్లవి ॥

మట్టులేనిమాటలేల మందెమేల మింతయేల
గుట్టుతో నవ్వుటే మంచిగుణముగాదా
చిట్టంటుఁ జెనకులేల పిగ్గువడి వుండనేల
వొట్టినమోహముతోడ నుస్సురంటేఁ జాలదా ॥ తానే ॥

కానికానివొట్లేల కాఁకలఁ బొరలనేల
మౌనముతో నుండుటే మంచిదిగాదా
పానుపుపై విద్దరేలపైఁ గలవరించేల
పూనిన జాగరముల పొద్దువోకే చాలదా ॥ తానే ॥

యిందాఁకా బింకమేల యిటు పంతమియ్యనేల
పొంది మేనుమరచుటే బుద్ధిగాదా
అందపుశ్రీవేంకటేశుఁ డంతలోనె నిన్నుఁ గూడె
గొందినే(సీ?)మేనిచెమటే గురితిచి చాలదా ॥ తానే ॥ 533

## తోడి

ఇంకనేల మొరఁగు యిదివో విన్నేరగు
వుంకువ నేనన్నమాట వుత్తరమీవేఁటికే ॥ పల్లవి ॥

చిత్తమెల్లఁ జిగిరించె చెలి నీజవ్వనమున
అత్తినవవ్వుల పువ్వు లవి యెన్నఁడే
కొత్తగాఁ గాఁకర గాచె గోరికొనకాఁకులెల్ల
యెత్తి చన్నులనిమ్మపం డ్లెక్కడ దాఁచితివె ॥ ఇంక ॥

కురులచీఁకట్లవె కొంతగొంత సమకూడె
అరచందురులపొడ పది యేడదే
విరిపై సిగ్గులఁ గరువెన్నెలలు గాసికాసి
తిరమై కెంపుఁగన్నుల తెల్లవారెఁగదవె ॥ ఇంత ॥

చెమట వాన గురిసి చిత్తడి యేరులువారె
-మకాన వెలిచేటితతి యెప్పుడె
తమి శ్రీవేంకటపతి తగ నిన్నేలుటఁ గంటి
గుమురుఁబులకలేల కొంగునఁ గప్పేవే ॥ ఇంత ॥ 534

శ్రీః శ్రీః శ్రీః

# 1-వ అనుబంధము

## అకారాదిగ రాగ - సంకీర్తన - సంఖ్యాసూచి

| రాగములు | | సంకీర్తనసంఖ్యలు |
|---|---|---|
| అమరసింధు | ... | 35, 360, 388 |
| ఆందోళి | ... | 54, 230, 301, 398 |
| ఆరబి | ... | 74 |
| అహిరి | ... | 5, 27, 41, 63, 72, 115, 188, 155, 160, 190, 208, 222, 231, 313, 335, 339, 345, 368, 379, 390, 409, 416, 430, 494, 501, 505, 512, 516, 518 |
| అహిరినాట | ... | 276, 342, 355, 377 |
| కన్నడగౌళ | ... | 122, 132, 199, 228, 259 |
| కాంబో(భో)ది | ... | 79, 119, 140, 173, 184, 186, 248, 322, 367, 372, 393, 418, 438, 467, 475, 484, 517 |
| కుంతలవరాళి | ... | 34, 289, 316 |
| కురంజి | ... | 22, 194, 285 |
| కేదారగౌళ | ... | 18, 109, 174, 272, 334, 427, 483, 520 |
| గుండక్రియ | ... | 104, 266, 310, 421, 495 |

| రాగములు | పంక్తిసంఖ్యలు |
|---|---|
| గుజ్జరి | 39, 215, 422 |
| గౌళ | 16, 25, 46, 69, 75, 84, 113, 136, 164, 187, 197, 225, 234. 290, 293, 323, 341, 365, 376. 399, 407, 482 |
| ఛా(చా)యానాట | 213, 264, 275 |
| తెలుఁగుకాం(ఁగాం)బోది | 90, 235, 253, 439 |
| తోండి | 32, 111, 214, 305, 333, 534 |
| దేవగాంధారి | 248 |
| దేశా(సా)క్షి | 31, 62. 129, 182, 189, 296, 336, 404, 459 |
| దేశి | 175, 306, 458 |
| దేసాళం | 8, 28, 81, 146, 161, 167, 216, 233, 268, 280, 314. 328, 351, 363, 371. 402, 419, 429, 472, 490, 529 |
| ధ(ద)న్యాశి(సి) | 37, 61, 121, 183, 196, 385 |
| నట్టనారాయణి | 43, 251 |
| నాగగాంధారి | 120 |
| నాగవరాళి | 97, 123, 265 |
| నాట | 56, 166 |
| నాదరామక్రియ | 78, 134, 163, 181, 249, 255, 288, 327, 348, 414, 480 |
| నారాయణి | 295, 403 |

| రాగములు | | పంక్తిసంఖ్యలు |
|---|---|---|
| నీలాంబరి | ... | 236, 332 |
| పట(డి)(ళ)మంజరం | ... | 44, 124, 224, 307, 337, 366 |
| పాడి | ... | 2, 9, 12. 21, 29, 60, 67, 98, 106, 147, 153, 168, 207, 219, 232, 237, 247, 278, 297, 303, 326, 344, 369, 383, 387, 410, 417, 423, 432, 447, 481. 500, 519. 531 |
| పూర్వగౌళ | ... | 375 |
| బౌళి(భవుళి) | ... | 6, 18, 20, 38, 51, 59. 68, 99, 110, 135, 138, 141. 154, 180, 202. 211, 220, 226, 258, 279, 281, 320, 329, 353, 356, 401, 411. 425, 508, 522, 527 |
| భూపాళం | ... | 188, 504 |
| భైరవి | ... | 1, 42, 48, 65, 131. 159, 171, 229, 240. 288, 346, 382, 426, 478, 499, 514 |
| మంగళకౌసి(శి)క | ... | 55, 143, 179, 336, 358. 435, 450, 453, 474 |
| మధ్యమావతి | ... | 49, 278, 354, 392, 528 |
| మాళవి | ... | 156, 267, 311 |
| మాళవిగౌళ | ... | 4, 87, 209, 244 |
| మాళవి(శ్రీ) | ... | 108 |

| రాగములు | | సంకీర్తనసంఖ్యలు |
|---|---|---|
| ముఖారి | ... | 14, 23, 70, 101, 127, 151, 172, 177, 205. 227, 254, 292, 333, 347, 373, 428, 449, 456, 457, 468, 476, 485, 487, 493, 506. 509, 515, 524, 533 |
| మేచబౌళి | ... | 350, 441 |
| రామక్రియ | ... | 15, 24, 35, 39, 88, 93, 139, 149, 162, 198, 203. 223, 242 245. 291, 299, 312, 364, 395, 463, 477, 489, 492 |
| రీతిగౌళ | ... | 103, 126. 319. 396. 433 |
| లలిత | ... | 17. 40. 53 76. 83. 107. 142. 158, 165, 204, 210, 217, 233 282, 304, 309, 357, 405, 433, 443, 454, 471, 479, 491, 496, 511, 532 |
| వరాళి | ... | 10, 13, 45, 64, 71, 86, 118, 128, 150, 185, 241, 246, 257, 284, 298, 325, 340, 362, 381, 394, 420, 424, 436, 451, 498 |
| వసంత వరాళి | ... | 413 |
| వేళావళి | ... | 192, 308, 349 |
| శంకరాభరణం | ... | 47, 96, 145, 195, 200, 250, 263, 321, 384, 397, 437 445, 446, 452, 461, 464, 470 |

| రాగములు | | సంకీర్తనసంఖ్యలు |
|---|---|---|
| శ్రీరాగం | ... | 3, 52, 66, 77, 80, 176, 193, 221, 252, 374, 380, 391, 415, 497, 523 |
| శుద్ధదేశి | ... | 318 |
| శుద్ధవసంతం | ... | 33, 58, 148, 191, 262, 271, 406, 455, 460 |
| శోకవరాళి | ... | 408 |
| సామంతం | ... | 7, 30, 57, 82, 94, 116, 137, 170, 212, 256, 324, 343, 352, 361, 378, 400, 431, 440, 444, 462, 469, 486, 502, 507, 510, 513, 521, 525, 530 |
| సామవరాళి | ... | 50, 178, 269, 277, 359, |
| సావేరి | ... | 114 |
| సాళంగం | ... | 11, 95, 112, 125, 302, 330, 434, 465, 473, 508 |
| సాళంగనాట | ... | 26, 36, 100, 130, 152, 201, 206, 260, 286, 315 |
| సిందురామక్రియ | ... | 287 |
| సోమరాగం | ... | 389 |
| సౌరాష్ట్రం | ... | 73, 102, 105, 218, 239, 270, 294, 331, 448, 466, 526 |
| హిందోళం | ... | 91, 144, 157, 300, 317, 370, 412 |
| హిందోళవసంతం | ... | 117, 169, 274 |
| హిజ్జిజి | ... | 92, 261, 442 |

# 2-వ అనుబంధము

## అకారాదిగ సంకీర్తన, - రాగ - సంఖ్యాసూచి


| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అంగడిఁ బెట్టే | దేశాషి | 404 |
| అంగనకు | శ్రీరాగం | 415 |
| అంటివి వింటివి | దేశాక్షి | 459 |
| అంతటిపై | సామంతం | 513 |
| అంత విచ్చి | ముఖారి | 373 |
| అందరిని | సాళంగం | 95 |
| అందరి ముందర | శంకరాభరణం | 145 |
| అందరి ముందరా | బౌళి | 110 |
| అందుకదే | నాదరామక్రియ | 480 |
| అందుకేమి | బౌళి | 281 |
| అందుకేమి | వరాళి | 64 |
| అందులకుఁదగి | మధ్యమావతి | 528 |
| అక్కవు నీవు | అమరసింధు | 388 |
| అట్టె బదుక | బౌళి | 320 |
| అతనిఁదోడి | తెలుఁగుఁగాంబోది | 439 |
| అత్తఁగారు | పాడి | 67 |
| అదినీకుఁదారు | హిజ్జిజి | 442 |
| అదియు నీ | కేదారగౌళ | 272 |
| అదియేల | రామక్రియ | 489 |
| అనరాదు | కాంబోది | 367 |
| అనరెయా | గౌళ | 407 |
| అన్నియుఁజక్కన | కేదారగౌళ | 174 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అన్నియుఁ జూతురు | బౌళి | 258 |
| అప్పటి కప్పుడే | మాళవిగౌళ | 4 |
| అప్పటి గురుతు | పాడి | 410 |
| అప్పటి మమ్ముఁ జెన | మధ్యమావతి | 354 |
| అప్పుడవిన్నీఁజె | వేళావళి | 308 |
| అప్పుడు నమ్మేత | నట్టనారాయణి | 251 |
| అప్పుడు మనసు | పాడి | 60 |
| అప్పుడెట్టుండె | భైరవి | 499 |
| అయినట్టయ్యీఁగాక | సామంతం | 502 |
| అలుగఁజూచేవు | ముఖారి | 509 |
| అలుగకువే | ఆహిరి | 208 |
| అల్లదివో | కాంబోది | 484 |
| ఆఁటది గూళమైతే | సామవరాళి | 277 |
| ఆతఁడాడు | హిందోళం | 144 |
| ఆతఁడిదె | కురంజి | 22 |
| ఆతఁడీడనే | ఆహిరి | 27 |
| ఆతఁడు నీ | పళవంజరం | 224 |
| ఆతఁడు నీవు | గౌళ | 197 |
| ఆతఁడెవ్వాఁడు | ధన్నాసి | 385 |
| ఆతఁడే | గౌళ | 84 |
| ఆతుర | నాదరామక్రియ | 249 |
| ఆనతిమ్మా | బౌళి | 426 |
| ఆనతియ్యే | అమరసింధు | 360 |
| ఆవలింతా | రామక్రియ | 477 |
| ఆవమమ్మి | రామక్రియ | 203 |
| ఆవేంపెట్టు | రామక్రియ | 245 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అపె మెచ్చ | రామక్రియ | 35 |
| ఆపెఱఁగదా | అరిబి | 74 |
| ఆమాఁట | రీతిగౌళ | 396 |
| ఆయనాయఁబద | ముఖారి | 172 |
| అయనాయనూర | రీతిగౌళ | 126 |
| ఆయరావే | మాళవిగౌళ | 209 |
| ఆయలేరే | మాళవిగౌళ | 244 |
| అయలేవే | బౌళి | 138 |
| ఆరమణి | ఆహిరి | 72 |
| ఆఱడిఁబెట్ట | దేశి | 175 |
| ఇంకనీ చిత్తము | లలిత | 454 |
| ఇంకనేఁటిమాటలు | సౌరాష్ట్రం | 239 |
| ఇంకనేఁటిమాటలే | పాడి | 387 |
| ఇంకనేమి చెప్పేము | ఆహిరి | 231 |
| ఇంకనేల కొసరూ | వరాళి | 381 |
| ఇంకనేల తమకించే | గుండక్రియ | 266 |
| ఇంకనేల బొంక | భైరవి | 1 |
| ఇంకనేలమొరఁగు | తోండి | 534 |
| ఇంకనేలరావయ్య | శ్రీరాగం | 176 |
| ఇంకనేలేమాటలు | రామక్రియ | 39 |
| ఇంకనేలేమాటలూ | శుద్ధవసంతం | 460 |
| ఇంకానీమన | ఆహిరి | 494 |
| ఇంకానేల | శ్రీరాగం | 391 |
| ఇంకామరి | లలిత | 53 |
| ఇంగితమెఱఁగ | శంకరాభరణం | 263 |
| ఇంటికివచ్చిన | పాడి | 423 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇంతకంచెఁజెలు | గౌళ | 16 |
| ఇంతకతొల్లె | లలిత | 491 |
| ఇంతగానేర్చి | బౌళి | 226 |
| ఇంతచాలదానాకు | భైరవి | 283 |
| ఇంతచాలదా నిన్ను | ముఖారి | 485 |
| ఇంతచాలదా మరి | కాంబోది | 467 |
| ఇంతటిమీఁద | సౌరాష్ట్రం | 105 |
| ఇంతలోనె | శ్రీరాగం | 374 |
| ఇంతవాఁడవుగా | ఛాయానాట | 264 |
| ఇంతవాఁడవు నీ | గౌళ | 25 |
| ఇంతవెఱపు | గౌళ | 376 |
| ఇంతసేతురా | లలిత | 204 |
| ఇంతా నీ | సాళంగం | 330 |
| ఇంతికి నీవు | ఆహిరి | 335 |
| ఇంతి చూచి | సామంతం | 431 |
| ఇంతి నిన్ను | కన్నడగౌళ | 199 |
| ఇంతినీపైఁజేయు | పాడి | 519 |
| ఇంతియదె నీ | కన్నడగౌళ | 259 |
| ఇంతియవ్వన | సామంతం | 324 |
| ఇంతియిదె | పాడి | 297 |
| ఇంతులునీకు | మాళవిగౌళ | 87 |
| ఇంతేనే | సావేరి | 114 |
| ఇంతేపిమతకాలు | దేసాళం | 81 |
| ఇందాఁకా | కుంతలవరాళి | 289 |
| ఇందాఁకా | తెలుఁగుఁగాంబోది | 253 |
| ఇందుకుఁగాఁగొన | శంకరాభరణం | 200 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇందుకుఁగా నీ | ముఖారి | 177 |
| ఇందుకుఁగానె | ఆందోళి | 301 |
| ఇందు కేకా | గౌళ | 136 |
| ఇందు కేపో | నాట | 166 |
| ఇందుసు | పాడి | 481 |
| ఇంపుగాని | బౌళి | 527 |
| ఇటమీఁద | కాంబోది | 140 |
| ఇటువంటి | శుద్ధవసంతం | 271 |
| ఇట్టివిందు | దేసాళం | 529 |
| ఇట్టె వచ్చేఁగాని | సాళంగం | 434 |
| ఇదిదానా | లలిత | 471 |
| ఇది మేలు | లలిత | 496 |
| ఇదియేవేళ | తోండి | 111 |
| ఇదివో చెలి | భైరవి | 478 |
| ఇదివోనీదార | సామంతం | 212 |
| ఇదివోనీపెద్ద | ఛాయానాట | 275 |
| ఇదివోనీభాగ్య | దేశాక్షి | 296 |
| ఇద్దరనుఁగూడి | శంకరాభరణం | 96 |
| ఇద్దరి మీతల | పాడి | 147 |
| ఇద్దరి లోపల | వరాళి | 325 |
| ఇద్దరు నిద్దరే | శంకరాభరణం | 470 |
| ఇద్దరూనెది | పూర్వగౌళ | 375 |
| ఇన్నాళ్లు | ఆహిరి | 368 |
| ఇన్నిటా జాణ | ఆందోళి | 230 |
| ఇన్నిటికి | ముఖారి | 151 |
| ఇన్నియు | ఆహిరి | 41 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇప్పటి నీ | ముఖారి | 515 |
| ఇప్పుడిట్టె | ధన్నాసి | 61 |
| ఇయ్యకొంటి | ఆహిరినాట | 342 |
| ఇవివో మా | సామంతం | 352 |
| ఈకె యెంత | బౌళి | 141 |
| ఈతఁడు | ధన్నాసి | 196 |
| ఈ తగవు | పళవంజరం | 366 |
| ఈపాటి | లలిత | 405 |
| ఊరకుంటే | దేశాక్షి | 189 |
| ఊరకుండు దాలుఁజా | సాళంగనాట | 286 |
| ఊరకుండు మనవే | ఆహిరి | 155 |
| ఊరకున్న | దేసాళం | 161 |
| ఊరకేకోప | బౌళి | 180 |
| ఊరకేవుండితే | పాడి | 219 |
| ఊరివారిఁజూచి | సింధురామక్రియ | 287 |
| ఎంగిలిపొందులు | బౌళి | 59 |
| ఎండగాదు | ఆహిరి | 505 |
| ఎంతకునంతే | రీతిగౌళ | 319 |
| ఎంతకెంత | సాళంగనాట | 206 |
| ఎంతకెంత మన్నించేవు | పళవంజరం | 44 |
| ఎంతచేసిన | బౌళి | 411 |
| ఎంతశ్రమలఁబెట్టే | నీలాంబరి | 236 |
| ఎంతమాయకాఁడ | సాళంగం | 125 |
| ఎంతవేగిరకాఁడవు | రామక్రియ | 312 |
| ఎంతవేసితివో | పాడి | 237 |
| ఎంతైనా నీ | సాళంగనాట | 130 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎంతైనా నెక్కున | శుద్ధవసంతం | 406 |
| ఎందరులేరు | సామంతం | 82 |
| ఎందాఁకావట్టి | ఆహిరి | 345 |
| ఎందాఁకావేఁడు | దేసాళం | 216 |
| ఎందువోయీఁదాము | నాదరామక్రియ | 288 |
| ఎక్కడనున్నా | సాళంగనాట | 100 |
| ఎక్కడ పరాకు | భైరవి | 426 |
| ఎక్కడికెక్కడ | పాడి | 500 |
| ఎక్కినంతలో | గుజ్జరి | 89 |
| ఎక్కువతక్కువ | బౌళి | 6 |
| ఎటువంటి | సామంతం | 256 |
| ఎటువలెఁజేసి | నాదరామక్రియ | 181 |
| ఎట్టిమొగమాయ | వరాళి | 241 |
| ఎట్టున్నదో | సామవరాళి | 178 |
| ఎట్టు భ్రమయ | వరాళి | 340 |
| ఎదిరి నెఱఁగ | రామక్రియ | 88 |
| ఎన్నఁటి కెన్నఁటి | వరాళి | 451 |
| ఎన్నాళ్ల | కుంతలవరాళి | 34 |
| ఎన్నిమాయలు | వేళావళి | 349 |
| ఎన్నిలేవు | శుద్ధవసంతం | 58 |
| ఎప్పటి కెప్పటి | గౌళ | 365 |
| ఎప్పుడయ్యా | గౌళ | 75 |
| ఎప్పుడు నీ | పాడి | 168 |
| ఎప్పుడునుఁ దమ | ఆహిరి | 160 |
| ఎప్పుడూ నా | గౌళ | 225 |
| ఎరవైన పట్ట | ముఖారి | 333 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఎఱఁగనంటా | సౌరాష్ట్రం | 218 |
| ఎఱఁగవి | నాదరామక్రియ | 255 |
| ఎఱుఁగుదు | లలిత | 357 |
| ఎవ్వరి దూరే | సామంతం | 525 |
| ఎవ్వరు జాణ | ముఖారి | 457 |
| ఎవ్వరు విన్నారు | బౌళి | 279 |
| ఎవ్వరు నేమి | భైరవి | 159 |
| ఎవ్వరు సాకిరి | లలిత | 217 |
| ఎవ్వరెవ్వరి | లలిత | 142 |
| ఏఁటికిఁజేసేవు | దేసాళం | 280 |
| ఏఁటికిఁ దమకించే | మధ్యమావతి | 273 |
| ఏఁటికిఁ బొట్లఁబదే | కాంబోది | 79 |
| ఏఁటికి అనుమాన | శ్రీరాగం | 66 |
| ఏఁటికి అఁట | ఛాయానాట | 213 |
| ఏఁటికి దోసాలు | హిందోళం | 157 |
| ఏఁటికి నెగ్గులు | భైరవి | 171 |
| ఏఁటిదో పీ | ఆహిరినాట | 276 |
| ఏఁటిమాటలాడీనే | పాడి | 106 |
| ఏఁటిమాటలాడేవు | లలిత | 238 |
| ఏకతాన వీవు | సామంతం | 94 |
| ఏదివాటి పీ | రామక్రియ | 15 |
| ఏమంటి వేమంటి | ముఖారి | 487 |
| ఏమందుము | గౌళ | 113 |
| ఏమని చెప్పు | ముఖారి | 524 |
| ఏమని వలపు | పళవంజరం | 307 |
| ఏమని వుత్తర | ఆహిరి | 516 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏమనే ము | సౌరాష్ట్రం | 102 |
| ఏమన్నా నాకుఁబోదు | మంగళకౌశిక | 453 |
| ఏమయ నీతోడి | వరాళి | 150 |
| ఏమయ్యా కట | హిందోళం | 370 |
| ఏమయ్యా కరుణించే | ఆహిరి | 313 |
| ఏమయ్యా రమణుఁడ | శంకరాభరణం | 445 |
| ఎమాట కేమాట | లలిత | 443 |
| ఏమి చెప్పేవు | ముఖారి | 347 |
| ఏమి చెప్పేవు | మాళవి | 311 |
| ఏమి తగవులు | మాళవి | 267 |
| ఏమి దప్పిపోయ | బౌళి | 356 |
| ఏమిబాఁతి | కేదారగౌళ | 427 |
| ఏమి వేగిరము | భైరవి | 240 |
| ఏమి సేత | లలిత | 438 |
| ఏమిసేతు నమ్మ | కాంబోది | 184 |
| ఏమిసేతునయ్య | ఆహిరి | 416 |
| ఏమిసేతుమమ్మ | దేశాక్షి | 386 |
| ఏమి సేయ వచ్చునమ్మ | నాదరామక్రియ | 348 |
| ఎమిసేయ వచ్చునయ్యా | ఆహిరి | 379 |
| ఏమిసేయుమనే | రామక్రియ | 198 |
| ఏమిసేసినా | శుద్ధవసంతం | 148 |
| ఏమి సేసునో | నాగవరాళి | 265 |
| ఏమోయి నే | ఆహిరి | 339 |
| ఏమోయి మా | మధ్యమావతి | 49 |
| ఏమో సేయఁగఁబోఁగా | పాడి | 432 |
| ఏల కరఁగఁదే | హిందోళవసంతం | 117 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏల తిట్టు | మంగళకౌశిక | 358 |
| ఏల నన్ను | భైరవి | 42 |
| ఏల భేదాలు | గౌళ | 187 |
| ఏల మేకులు | తోండి | 214 |
| ఏల యింత | బౌళి | 154 |
| ఏలయ్య మా | మంగళకౌశిక | 179 |
| ఏల వేగిర | కాంబోది | 243 |
| ఏల వేగిరించేవు | రామక్రియ | 364 |
| ఏల సాకిరి | నట్టనారాయణి | 43 |
| ఏల సాకిరులు | నాట | 56 |
| ఏల సిగ్గువడేవు | రామక్రియ | 242 |
| ఏల సిబ్బితి | ఆహిరి | 190 |
| ఒకటంటే | ముఖారి | 227 |
| ఒక్కట మీ | బౌళి | 202 |
| ఒక్కతెనే | హిందోళం | 317 |
| ఒక్కమనసున | బౌళి | 99 |
| ఒద్దనే నే | రామక్రియ | 24 |
| ఒద్దు వొద్దు | పాడి | 278 |
| ఓజతో నుండిన | గుండక్రియ | 421 |
| ఓపననఁగానే | దేసాళం | 490 |
| ఓపవన్నవారి | బౌళి | 18 |
| ఓపనోప | పాడి | 232 |
| ఓపితేఁగనక | మేఁచబౌళి | 360 |
| ఓబులేశుఁడీ | కాంబోది | 475 |
| ఓయమ్మ నీ | కాంబోది | 322 |
| ఔనయ్య నీ | రీతిగౌళ | 488 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఔనౌమరి | ముఖారి | 14 |
| కంటిమి | మంగళకౌశిక | 450 |
| కంటివౌకా | సామంతం | 486 |
| కదమమాటలు | బౌళి | 329 |
| కరుణించ | భైరవి | 346 |
| కలమాఁట | పాడి | 21 |
| కన్న దేకంటి | రామక్రియ | 162 |
| కన్నవే అన్ని | సాళంగనాట | 26 |
| కన్నులనే | భూపాళం | 188 |
| కల్లగాదు | కన్నడగౌళ | 228 |
| కాంతమీఁద | దేశాక్షి | 31 |
| కాంతలమనసు | మాళవి | 156 |
| కాఁగిలించుకొనవ | వరాళి | 394 |
| కాఁగిలించుకొనవే | కన్నడగౌళ | 132 |
| కాకుండితే | ముఖారి | 127 |
| కామాతురునకు | దేసాళం | 328 |
| కామిని యప్పట | వరాళి | 10 |
| కానికాని | ముఖారి | 476 |
| కానీవయ్యా | కాంబోది | 173 |
| కానీవే నా | గుండక్రియ | 310 |
| కూచుండవే | వరాళి | 86 |
| కూడినంత | శుద్ధవసంతం | 455 |
| కొంకనేల | వరాళి | 128 |
| కొమ్మలకు | లలిత | 107 |
| కొలువువారి | వరాళి | 13 |
| కొలువుఁజేయుచు | శంకరాభరణం | 47 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కోరినట్టె వున్న | మాళవిశ్రీ | 108 |
| కోరి విన్నిదె | దేసాళం | 167 |
| కేరడమాడఁగల | గుండక్రియ | 495 |
| గుట్టుచేకొందు | భైరవి | 48 |
| గుట్టుతోడి | పాడి | 2 |
| గుట్టుతోనుండ | అహిరి | 409 |
| గోరగిరి | శంకరాభరణం | 384 |
| చక్కజాడ | ముఖారి | 428 |
| చలమింకానా | పాడి | 447 |
| చలువకు | అమరసింధు | 85 |
| చవిగావు | వరాళి | 298 |
| చవిచార | ముఖారి | 101 |
| చాలదా ఇంత | పాడి | 531 |
| చాలుఁజాలు దీమన | సౌరాష్ట్రం | 526 |
| చాలుఁజాలు నన | లలిత | 532 |
| చాలుఁజాలు నీక | బౌళి | 68 |
| చాలుఁజాలు వాఁడు | సౌరాష్ట్రం | 448 |
| చాలునయ్యా | తెలుఁగుఁగాంబోది | 90 |
| చాలువిది | ముఖారి | 506 |
| చాలునె | ముఖారి | 449 |
| చిత్తమెట్టున్న | సామంతం | 530 |
| చూచినవారికివిది | లలిత | 479 |
| చూచినవారికినెల్లా | శంకరాభరణం | 446 |
| చూచేవారికే | వసంతవరాళి | 413 |
| చూడఁబిన్న | సామంతం | 137 |
| చూడరమ్మ | రామక్రియ | 299 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| చూతము దానికేమి | కేదారగౌళ | 334 |
| చెంగలించె | హిజ్జిజి | 261 |
| చెక్కునొక్కే | సామంతం | 469 |
| చెట్టవట్టి తీసిన | సామంతం | 521 |
| చెప్పక నే | పాడి | 29 |
| చెప్పితి నిప్పుడే | భైరవి | 514 |
| చెప్పినట్టి | ధన్నాసి | 37 |
| చెప్పినట్టు | పాడి | 247 |
| చెలినీవుసేన | శంకరాభరణం | 464 |
| చెలులాలనాయకు | శ్రీరాగం | 3 |
| చెలులాల యీ | తెలుఁగుఁగాంబోది | 235 |
| చెల్లఁబో | వరాళి | 498 |
| చెల్లదా | నాగవరాళి | 97 |
| చెల్లినంతయు | కాంబోది | 517 |
| చెల్లుబడిగల | కురంజి | 194 |
| చేఁతకుఁజేత | బౌళి | 135 |
| చేతికిలోనై | దేసాళం | 363 |
| చేరిచవవు | ముఖారి | 254 |
| చేవట్టితే | మంగళకౌసిక | 55 |
| చొల్లెపుఁజుట్ల | వరాళి | 436 |
| ఙవ్వనము | శ్రీరాగం | 193 |
| జాముహోయ | దేసాళం | 146 |
| తక్కులుమొక్కులు | సామంతం | 462 |
| తగవెఱఁగని | సామవరాళి | 359 |
| తగులాయ | నాగగాంధారి | 120 |
| తనకునాకుఁబోవు | ముఖారి | 292 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| తనకు నాకెంత | హిందోళం | 412 |
| తనతోడి | నారాయణి | 295 |
| తనవోజ | అహిరినాట | 377 |
| తనిసితి | మేచబౌళి | 441 |
| తప్పులేల | మధ్యమావతి | 392 |
| తరవాతి | పాడి | 369 |
| తరుణికింత | సామంతం | 343 |
| తరుణి నీతో | వరాళి | 71 |
| తాను సేసిన | సామంతం | 507 |
| తానే యెఱుగఁడా | ముఖారి | 533 |
| తానేల సిగ్గు | రామక్రియ | 395 |
| తానే సిగ్గు | నాగవరాళి | 123 |
| తానొక్కఁడే | సామంతం | 440 |
| తిట్టినా వెఱవ | దేసాళం | 268 |
| తీరుచవయ్యా | వరాళి | 45 |
| తుదుచుకొంటేఁబోదు | నారాయణి | 403 |
| తెలిసినదే | గౌళ | 164 |
| తెలుసుకొమ్మీ | నీలాంబరి | 332 |
| తొల్లిటితాఁ దానే | సామంతం | 444 |
| దగ్గరగరాదు | అహిరి | 512 |
| దయగలదానవు | పళవంజరం | 337 |
| దవ్వుల వంతాలు | శంకరాభరణం | 461 |
| దిక్కులు నీ | దేసాళం | 419 |
| దేవుఁడు దేవి | దేశాక్షి | 182 |
| దొరవైన నీ | శుద్ధవసంతం | 262 |
| నన్ను నేల తడ | కాంబోది | 372 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నన్ను నేల సోల | లలిత | 165 |
| నమ్మఁగల వార | శ్రీరాగం | 77 |
| నమ్మిక లియ్య | ఆహిరి | 5 |
| నమ్మితిమి | భైరవి | 65 |
| నమ్ముదురు | పాడి | 326 |
| నాకె సతమైన | సాళంగం | 473 |
| నాతోనేమి | ముఖారి | 70 |
| నావంటిసతులే | రామక్రియ | 291 |
| నావల వింతే | శ్రీరాగం | 80 |
| నిన్నుఁ జూచి | భైరవి | 229 |
| నిన్నుఁ జూచు | ముఖారి | 205 |
| నిన్ను గెలువ | సాళంగనాట | 315 |
| నిన్నేమనేము | పాడి | 12 |
| నీకుఁ బ్రియమైన | దేసాళం | 472 |
| నీకు నంకె | నాదరామక్రియ | 78 |
| నీకు నీకే | సామంతం | 510 |
| నీకేతెలుసునయ్యా | వరాళి | 185 |
| నీకేతెలుసునిది | వరాళి | 284 |
| నీకేతెలుసును | కేదారగౌళ | 483 |
| నీకేపంపు | నాదరామక్రియ | 134 |
| నీకేంభయము | ధన్నాసి | 121 |
| నీచందములు | సాళంగం | 485 |
| నీచిత్తమునఁబెట్టి | శోకవరాళి | 408 |
| నీపాలిటికి | శుద్ధవసంతం | 191 |
| నీయంతనీ | బౌళి | 401 |
| నీయంది నెఱఁగకు | పాడి | 303 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నీయంతనెఱుఁగవు | సాళంగం | 302 |
| నీయంతవార | దేసాళం | 28 |
| నీయందు కడ | ముఖారి | 468 |
| నీరచనలింతే | శ్రీరాగం | 221 |
| నీరాజనము | కేదారగౌళ | 520 |
| నీలోనివారమే | సామంతం | 378 |
| నీవల్లవచ్చిన | లలిత | 210 |
| నీవిన్నిటా | కాంభోది | 186 |
| నీవు నన్ను | ముఖారి | 493 |
| నీవు నేనుఁ జాల | తోండి | 32 |
| నీవు సామాన్యుఁడ | దేసి | 306 |
| నీవెందరికి | ఆహిరి | 115 |
| నీవెఱుఁగవా | వరాళి | 257 |
| నీవేఆనతియ్యి | శంకరాభరణం | 195 |
| నీవే ఇంతసేయఁగా | లలిత | 83 |
| నీవే నేరుతు | గౌళ | 234 |
| నీవేమిసేతువు | లలిత | 282 |
| నీవేమిసేసినా | దేసాళం | 429 |
| నీవేల నన్ను | దేశాక్షి | 62 |
| నీవేలభ్రమసేవు | వరాళి | 424 |
| నీవొక్కటొక్క | లలిత | 76 |
| నీవొల్లినేర | సామంతం | 361 |
| నెట్టనఁ బాప | బౌళి | 51 |
| నెలఁతమోహించి | ఆహిరి | 501 |
| నెలఁతయొంతటి | గుజ్జరి | 422 |
| నేననఁగ | బౌళి | 20 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| నేను మీ | లలిత | 304 |
| నేనెఱఁగనా | శ్రీరాగం | 252 |
| నేనే ఎంతైనా | భైరవి | 382 |
| నేనేమి సేతునే | ఆహిరి | 222 |
| నేమిద్దరమును | కుంతలవరాళి | 316 |
| నేము బుద్దులు | గౌళ | 293 |
| నేమెల్లా నీయంత | కాంబోది | 393 |
| నేమేమి సేతుమే | నాదరామక్రియ | 163 |
| నేరుతునా | శ్రీరాగం | 380 |
| నేరుపరి నను | పాడి | 9 |
| నేరుపరివౌదువ | సామంతం | 30 |
| నేరుపరివౌదువే | గుండక్రియ | 104 |
| పచ్చిసేయ | శంకరాభరణం | 437 |
| పట్టముగట్టిరి | సాళంగనాట | 152 |
| పట్టితే నాతో | రామక్రియ | 492 |
| పట్టినదెల్లాఁ దప్పు | సౌరాష్ట్రం | 466 |
| పడఁతి యింపుల | మంగళకౌశిక | 474 |
| పాయపుమదము | బౌళి | 220 |
| పూవకపూచె | కేదారగౌళ | 19 |
| పెక్కువిచ్చు | గౌళ | 482 |
| పెద్దలు మీ | హిందోళం | 91 |
| పెనఁగే వూరకే | శంకరాభరణం | 321 |
| పొంచిన నీ | శ్రీరాగం | 52 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| పొంచియుఁక | శంకరాభరణఁ | 250 |
| పొద్దుపొద్దు | పాడి | 417 |
| పొద్దుపోని | గౌళ | 290 |
| పోయిఁబాల | గౌళ | 322 |
| బలిమిసేయఁగఁబోతే | సాళంగం | 112 |
| బాపుబాపు | బౌళి | 38 |
| బిగిసియాపె | సోమరాగం | 389 |
| భామలతోఁబో | రామక్రియ | 93 |
| మంచితనములు | దేసాళం | 233 |
| మంచితనముసేయఁగ | కాంబోది | 418 |
| మంచిదాయ | సౌరాష్ట్రం | 73 |
| మదించినవలపుల | శుద్ధదేసి | 318 |
| మనలోనెక్కడి | ఆహిరి | 63 |
| మమ్ముమన్నించి | శ్రీరాగం | 497 |
| మమ్మేమదిగేవు | సాళంగనాట | 36 |
| మరిగిమరిగీ | కాంబోది | 119 |
| మఱచేమా | దేసాళం | 357 |
| మఱిఇంతే | పాడి | 98 |
| మాఁటలాడ | బౌళి | 211 |
| మాకేల అంతేసి | సాళంగనాట | 201 |
| మాతోడిగొడవేల | హిందోళవసంతం | 274 |
| మానరాదా | సామవరాళి | 50 |
| మానవేమెక్కడి | దేసాళం | 402 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| మానితినే | ఆహిరి | 390 |
| మానినుల | పాడి | 344 |
| మాపుదాఁకానేల | కేదారగౌళ | 109 |
| మాపుదాఁకారేప | హిజ్జిజి | 92 |
| మాపుదాఁకావట్టి | వరాళి | 362 |
| మారుకొనే | సౌరాష్ట్రం | 294 |
| మావంటివారి | తోండి | 338 |
| మించి ఇన్నిటికి | మంగళకౌశిక | 143 |
| మిక్కిలివిచ్చి | వేళావళి | 192 |
| మీరే నేరుతు | సామంతం | 170 |
| మీఅరాదు | దేశి | 458 |
| మీఱితివి | సాళంగనాట | 260 |
| మీవంటిదాన | వరాళి | 420 |
| ముంచికతలకు | పాడి | 383 |
| ముంచిముంజేయి | పాడి | 207 |
| ముందుముందు | బౌళి | 522 |
| మూలనున్నవారి | భూపాళం | 504 |
| మెచ్చనిదానవా | శంకరాభరణం | 452 |
| మేలే జాణ | గౌళ | 69 |
| మొక్కవేయా | లలిత | 309 |
| మొక్కేరా | ఆహిరి | 518 |
| మోహమెంతో | ఆహిరి | 430 |
| మైలవాసి | లలిత | 511 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| రమణుఁడు | సామంతం | 400 |
| రమణునికడ | సామంతం | 57 |
| రమ్మనవే | ఆందోళి | 54 |
| రాఁగదవె | ఆందోళి | 398 |
| రాఁగదే | తోండి | 305 |
| లేవే యెందాఁకా | సౌరాష్ట్రం | 331 |
| లోకు లేమందురో | శ్రీరాగం | 523 |
| వట్టి దోసాలు | నాదరామక్రియ | 327 |
| వట్టి నవ్వులంత | దేసాళం | 8 |
| వట్టి పంతములు | రామక్రియ | 149 |
| వట్టి వాదుల | దేసాళం | 314 |
| వద్దనుండే చెలుల | గౌళ | 46 |
| వద్దనున్నారము | మంగళకౌశిక | 336 |
| వద్దనేనా | గుజ్జరి | 215 |
| వద్దువద్దమ్మా | రామక్రియ | 223 |
| వద్దు వద్దు అంతేసి | హిందోళవసంతం | 169 |
| వద్దువద్దు తడ | కాంబోది | 433 |
| వద్దు వద్దు మాతో | సాళంగం | 11 |
| వనిత లిట్టయితే | లలిత | 17 |
| వలచినదాని | సామంతం | 7 |
| వలచు టే | ధన్నాసి | 183 |
| వలపించఁబోయి | పళవంజరం | 124 |
| వలపుచల్లు | సాళంగం | 508 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| వింటిమికంటిమి | సామవరాళి | 269 |
| విచ్చిచెప్పరాదు | రీతిగౌళ | 103 |
| వినవే నా | భైరవి | 131 |
| వినిపించవే | శంకరాభరణం | 397 |
| విన్నవించితి | ఆహిరి | 133 |
| వివరించి | వరాళి | 118 |
| వెట్టి చెలులము | దేశాక్షి | 129 |
| వెలుపేల | గౌళ | 341 |
| వెలుపలఁ | శుద్ధవసంతం | 33 |
| వేగిరమిప్పుదే | బౌళి | 503 |
| వేగిరించే | వరాళి | 246 |
| వేడుకమదనుని | సామంతం | 11 |
| వేమారునెంత | హిందోళం | 300 |
| వేళగాదుసిగ్గు | పాడి | 153 |
| సంకెలెల్లాఁదీరె | ముఖారి | 23 |
| సంగతియెఱఁగ | కురంజి | 285 |
| సతులగబ్బితనా | సౌరాష్ట్రం | 270 |
| సమమోహముల | ముఖారి | 456 |
| సరికిబేళాయ | మంగళకౌసిక | 435 |
| సరివారమా | గౌళ | 399 |
| సారెనేలే | రామక్రియ | 139 |
| సారెసారె | రామక్రియ | 483 |
| సిగ్గువడ | ఆహిరినాట | 355 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| సిగ్గువడి | లలిత | 158 |
| సెలవినవ్వుల | నాదరామక్రియ | 414 |
| సేయవయ్యా నీకు | దేసాళం | 371 |
| సేయవయ్యా నీవు | కన్నడగౌళ | 122 |
| సేసవెట్టవయ్యా | బౌళి | 353 |
| సేసినట్టి | దేవగాంధారి | 248 |
| సోబానఁబాడేము | లలిత | 40 |

# 3-వ అనుబంధము

## సందిగ్ధపదసమీక్ష

[తాళ్లపాకకవులవాఙ్మయములో అపూర్వపదరాశి గొప్పది. ప్రత్యేకముగ ఈపని గొప్పగ సాగవలసియున్నది. దాని-కుపస్కారకముగ, ఈ సంపుటములో నాదృష్టికి వచ్చినకొన్ని-పదములను లఘువుగ చర్చించితిని నిఘంటువుల కెక్కనివీ, ఎక్కినా అన్యార్థములందు ప్రయోగింపబడినవీ, వ్యాకరణమును పట్టిచూచేవి, ఇతరభాషానిఘంటుప్రసిద్ధములుమాత్రమే ఇందు చర్చింపబడినవి.]

1. అవుఁదున: – (పాట. 116)

అరసున్నతోకూడిన యీపదము తెలుగునిఘంటువులలో కానరాదు. "అవుడల = అవుడలికె, అవుడలు, అవుడ్ల, అవుడ్లు, అవుడ్డ, అవుడ్ల Caster-oil plant. Ricinus communis,, ఇత్యాదిగా కిట్టెల్. ఆముదపుచెట్టు అను నర్థములో 'అవుండ్ల' అనుపదమే 'అవుఁదు' గా మనతెలుగున మారినదేమో ఆనాటి కర్ణాటాంధ్ర భాషలసంబంధముతో మనకిది సంక్రమించినదేమో? 'అవుండ్ల' శబ్దము 'ఆమండ' శబ్దభవమా? అనిపించుచున్నది.

"అథైరండె హస్తపర్ణోఽప్యలంబకః
దువుః పంచాఙ్గులశ్చంచు రామండ స్తరుణోఽంబుకః
గంధర్వహస్తో రువుకో వాతఘ్నోవ్యాఘ్రపుచ్ఛకః"
— అని వైజయంతి.

"గంధర్వహస్తకోఽమండ ఆమండో వ్యాఘ్రపుచ్ఛకః"
ఇతి 'తారపాలః' అని అమరసుధ.

"అమందః ఆమందః అనియు కలదు"
— అని గురుబాలప్రబోధిక.

మకారము, వకారమగుట సహజమే. ఇక్కడ 'అముదము' కావచ్చు. ఆయిందెము, ఆందెము అనియూ వ్యవహారము నేటికినీ కలదు.

2. కొండవేలు: (పాట 156)

వ్యవసాయదారుడు దుక్కి దోకి కొటారుచేసి గాదెలు నింపినతర్వాత కడపట సిద్ధించెడిఫలముగా ప్రకరణమునుబట్టి తెలియుచున్నది. వ్యవసాయదారులసాంకేతికపదమా? అని పించుచున్నది. నిఘంటులలోకానరాలేదు. కొత్తపంట వచ్చిన-వెంటనే, 'కొండవేలుపు' నకు నివేదించేపద్ధతి, వ్యావహారిక ములో 'కొండవేలు' అయియుండవచ్చు. అట్టిది ఇంకేదైనా కావచ్చు.

3. గద్దెము: (పాటలు 95; 168)

గద్దెము See కద్దాయము అని బ్రౌణ్యము, "Compulsion, force: Exaction, forcing people to pay the price set upon articles. వడ్లగద్దాయము, ఉప్పుకద్దాయము ......" ఇత్యాదిగా చూపియున్నది. అదే ఇక్కడ సరిపడవచ్చు.

4. గోటారించి: (పాటలు. 142; 149)

బాధపెట్టు, పైకొను, అను నర్థములలో, గోడాడించు, శబ్దము వ్యవహారములో నున్నది. ఇదే 'గోదాడు' శబ్దముగా నిఘంటువులలో నున్నది. ఈయర్థములోనే 'గోటారించు' శబ్దము 'గోటాడించు' అని కొన్ని ప్రాంతములలో కలదు. అదియే ఇది కావచ్చు.

5. చూపరి: (పాట 409.)

ఈ పదము, చూచువాడు, చూడబడువాడు, చూడదగువాడు ఇత్యాది అర్థములలో ప్రసిద్ధము. కాని ఇక్కడ ప్రకరణమును బట్టి "చూరగా రాలేపోడి" అనే అర్థముగా కానవచ్చుచున్నది. అన్నమయ్య చాలస్వతంత్రుడు.

6 జాతులు: (పాట. 355)

ఈ పదము మామూలు అర్థములలోకాక, ప్రకరణమును బట్టి 'సైగలు, ఎగతాళి,– ఇత్యాది అర్థములుగలదిగా తోచుచున్నది.

7 బుగంధించు: (పాట 341)

ఇది అపురూపమైనపదము. 'పువు + గంధించకుండునా' అనుపదములసంగ్రహరూపముగా తోచుచున్నది. ప్రకరణమును బట్టి 'వాసనకొట్టదా?' అని చెప్పవచ్చు.

8. ముమ్మదము: (పాట 336)

మూడు + మదములు = ముమ్మదము,

'ముమ్మఱమునకు' రూపాంతరముగనో, వ్యావహారికముగనో వాడినట్లున్నది. లేక రూప - యౌవన - అభిజాత్యమదములు మూడుగానీ, కాయిక - వాచిక - మానసికములగు మూడు మదములుగానీ కావచ్చు.

9. వానగుంటలు: (పాట 45)

నేడు 'ఓమనగుంటలు' అని వ్యవహారములో, నిఘంటువులలో నున్నపదమునకు, అన్నమయ్యనాడు ఆసీమలో వ్యావహారికరూపముగా కానవచ్చుచున్నది. అర్థమూ అదే.

10. వైతాళాలు: (పాట 169)

వైతాళికశబ్దముయొక్క రూపాంతరముగా 'వైతాళ' శబ్దమును గ్రహించి వాడినట్లున్నది. సమయమునకుదగిన-మాటలు, పొగడ్తలు - ఇత్యాదులు దాని అర్థము కావచ్చు.

N. B: - గత సంపుటము (26) లో వివరింపవలసిన పదములురెండే యగుటచే అక్కడ వ్రాయలేదు వాని వివరణమిది.

1. మాఁజితే :- (పాట 85, 26 సంపుటము)

'మాఁగు' ధాతువునకు రూపాంతరమాః అభిపించుచున్నది.

2. వీడు :- (పాట 182, 26 సంపుటము)

ఈ శబ్దమునకు 'త్యాగము' అను నర్థము కలదుగానీ "చాలించరే జోలి వీడుచదివేవేళ" అనుసందర్భమును బట్టి కన్యా-దానముఅనునర్థమున ప్రయోగించినట్లున్నది. నేటి చదివింపు లను కొందరు చెప్పిరికానీ, అది ప్రాచీనసంప్రదాయముకాదు.

42894

T.T.D. Religious Series No - 553 Price Rs. 27-00

తిరుమల తిరుపతి దేవస్థానములు
ధర్మ ప్రచార పరిషత్

Printed & Published by Shri M.K.R. Vinayak, I.A.S., Executive Officer,
Tirumala Tirupathi Devasthanams and Printed at Triveni Offset Printers,
Machilipatnam. Ph: 23888